ముహూర్తం

శ్రీ విళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్యమాసం; తిథి: శుద్ధ త్రయోదశి, మ.3.36 వరకు అనంతరం చతుర్దశి; నక్షత్రం: మృగశిర ఉ.8.41 వరకు అనంతరం ఆరుద్ర; అమృతకాలం: రా.10.10 నుండి 11.45 వరకు; వర్జ్యం: సా.4.40 నుండి 6.11 వరకు; దుర్ముహూర్తం: ఉ.6.00 నుండి 7.36 వరకు; రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు; యమగండం: మ.1.30 నుండి 3.00 వరకు

Estd. 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!



సంపుటి:57 • సంచిక:274 • శనివారం 19 జనవరి 2019 • హైదరాబాద్ • పేజీలు:12+4 • వెల: 5.00 • Published from:Hyderabad|Karimnagar|Nizamabad|Suryapet|Vijayawada|Guntur|Rajahmundry|Visakhapatnam|Tirupati |Kurnool|Anantapur|Nellore

ప్రతిపక్షాలు ఏకతాటిపైకి వస్తున్నాయ్!



ఆంధ్రప్రభ INDIA AHEAD

- ఈసారి ప్రాంతీయ శక్తులదే కీలకపాత్ర
- దేశం ఫెడరల్ రాజ్యం వైపు నడుస్తోంది
- ఏ కూటమిలో చేరను.. ఉనికిని కాపాడుకుంటా
- సమస్యల ఆధారంగా మద్దతిస్తా
- క్షేత్రస్థాయిలో ప్రజలతో కలిసి నడుస్తున్నా
- రాజ్యసభకు కాదు.. ప్రత్యక్ష ఎన్నికల్లో గెలుస్తా
- ఆంధ్రప్రభ-ఇండియా ఎ హెడ్ జాతీయ ఆంగ్ల చానెల్‌కి ప్రకాష్‌రాజ్ ఇంటర్వ్యూ

3 లో

"తెలంగాణ శాసనసభను నూతన సంప్రదాయాలతో నడిపించడం ద్వారా అసెంబ్లీ స్పీకర్ పదవికి పోచారం శ్రీనివాసరెడ్డి పరిపక్వతను తెస్తారని నా ప్రగాఢ విశ్వాసం. ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు అభినందిస్తున్నా. సభను ఉమ్మడి కుటుంబం లాగా నడిపించాలని ఆకాంక్షిస్తున్నా. ఆయన క్రమశిక్షణ, పట్టుదల, అంకితభావం అందరికి స్ఫూర్తిదాయకం కావాలి."

- అసెంబ్లీలో సీఎం కేసీఆర్



సాగునీటికి సమగ్ర వ్యూహం

- ఈ నెల్లోనే పాలమూరు-రంగారెడ్డి, డిండి పనులు పరిశీలిస్తా
- సాగునీటి ప్రాజెక్టుల సమీక్షా సమావేశంలో సీఎం కేసీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రభుత్వం చేపట్టిన నీటి పారుదల ప్రాజెక్టుల పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని తెలంగాణ సీఎం కేసీఆర్ ఆదేశించారు. రాష్ట్రం లో 1.25 కోట్ల ఎకరాలకు సాగు నీరు అందించేందుకు రూ.2.25 లక్షల కోట్ల అంచనా వ్యయంతో ప్రాజెక్టులను చేపట్టిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. సాగు నీటి ప్రాజెక్టుల పనులపై సీఎం కేసీఆర్ శుక్రవారం రాత్రి ఆయా శాఖల అధికారులతో ప్రగతి భవన్‌లో ఉన్నతస్థాయి సమావేశం 3వ పేజీలో...



తెరాసలో చేరిక సందర్భంగా ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌తో వంటేరు ప్రతాపరెడ్డి మర్యాదపూర్వక భేటీ

కోల్‌కతాలో నేడే ర్యాలీ

- వెళ్లరాదని కేసీఆర్ నిర్ణయం
- మమత ఫోన్
- ర్యాలీకి ఆహ్వానం

8

కారెక్కిన వంటేరు

9

ఫిబ్రవరి 11 నుంచి బడ్జెట్ సెషన్?

- కొత్త పథకాల ఊసు లేకుండా ఓటాన్ అకౌంట్

ఆంధ్రప్రభ,హైదరాబాద్: శాసనసభ బడ్జెట్ సమావేశాలకు ముహూర్తం కుదిరిందా? కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టనున్న ఓటాన్ అకౌంట్‌బడ్జెట్, త్వరలో రానున్న లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్‌ను దృష్టిలో పెట్టుకుని ఫిబ్రవరి 11నుండి శాసనసభ బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ యోచిస్తున్నారా? తాజాగా టిఆర్‌ఎస్ వర్గాల్లో జరుగుతున్న చర్చ ప్రకారం వీటికి ఔననే సమాధానం వినిపిస్తోంది. ఫిబ్రవరి ఆఖరులో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ముందుగానే బడ్జెట్ సమావేశాలు ముగించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. గత ఏడాది మార్చిలో బడ్జెట్ సమావేశాలు జరగ్గా, ఈసారి పూర్తి బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం, అంచనాలు లేకపోవడంతో తెలంగాణ 3వ పేజీలో...



స్పీకర్ స్థానంలో పోచారం . సీఎం కేసీఆర్, ఉత్తమ్, ఈటల అభినందనలు

పోచారం ఏకగ్రీవం

- అభినందనలతో ముంచెత్తిన సభ
- సీఎం-స్పీకర్ ఇద్దరూ రైతుబిడ్డలే : కేటీఆర్

2 లో

భూములు, బంగారం క్రయ విక్రయాలపై ఐటీ చెక్!

- ఎన్నికల్లో ధన ప్రవాహ నియంత్రణే లక్ష్యం
- రిజిస్ట్రేషన్‌కు, మార్కెట్ ధరకు భారీ వ్యత్యాసం
- మిగిలినదంతా నల్లధనమే
- టిక్కెట్ల కోసం మధ్యతరగతి పోటీ
- ఐటీ చెక్‌తో భీ.ఫారమ్ వచ్చినా కేంద్రం నిర్ణయంతో భారీ షాక్

(అమరావతి, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

దేశవ్యాప్తంగా భూములు, బంగారు ఆభరణాల క్రయవిక్రయాలపై ఆదాయపన్ను శాఖ నిఘా పెంచాలని కేంద్రం నిర్ణయించింది. ఇందుకోసం ఇప్పటికే మౌఖిక ఆదేశాలు జారీ అయినట్లు విశ్వసనీయ సమాచారం. ఎన్నికల్లో ధన ప్రవాహాన్ని వీలైనంతగా తగ్గించాలని మోడీ ప్రయత్నించారు. ఇందుకోసం పెద్దనోట్లను రద్దు చేశారు. ఆర్థిక లావాదేవీల్లో డిజిటలైజేషన్ ప్రవేశపెట్టారు. దీంతో నల్లధనం అదుపులోకొచ్చిందని భావించారు. అయితే గతకొంతకాలంగా ఎన్నికల్ని దృష్టిలో పెట్టుకుని సాధారణ, మధ్యతరగతి కుటుంబీకులు కూడా పోటీ కోసం ఉబలాటపడుతున్నారు. వివిధ పార్టీల్లో టికెట్ల కోసం వెంపర్లాడుతున్నారు. ఎమ్మెల్యే టికెట్ ఇస్తే 10కోట్లు, ఎమ్పికైతే 50కోట్ల వరకు ఖర్చు చేసేందుకు పార్టీ నాయకుల 7వ పేజీలో...

సీఎల్పీ నేతగా భట్టి విక్రమార్క

ప్రజా సమస్యలపై పోరాడతా

- ఆంధ్రప్రభ ఇంటర్వ్యూలో భట్టి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను శాసనసభ వేదికగా పోరాడి ప్రజలకు న్యాయం చేసేలా కృషి చేస్తానని కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. పార్టీ శాసనసభ్యులు, శాసనమండలి సభ్యుల సమన్వయంతో ముందుకు సాగుతానని చెప్పారు. రాష్ట్రంలోని పార్టీ శ్రేణులను 9వ పేజీలో...



డ్రంకెన్ డ్రైవ్‌లో చిక్కితే.. ఉద్యోగం ఊడినట్టే!

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మద్యం సేవించి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టు బడ్డారా... ఇక మీ ఉద్యోగం ఊడినట్టే. మోతాదుకు మించి మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడి కేసు నమోదైతే జైలుకు వెళ్లడంతో పాటు సదరు వాహన చోదకుడు పనిచేసే కార్యాలయానికి నగర పోలీసులు లేఖలు రాస్తూ సదరు ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ నగర పరిసర ప్రాంతాలతో పాటు ఫైనాన్షియల్ జిల్లాలోని సాఫ్ట్‌వేర్ సంస్థల్లో పనిచేస్తున్న వారు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు దొరికితే వారి వివరాలను సేకరించి వెంటనే వారు పనిచేసే కార్యాలయాలకు లేఖలు రాసి ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. హైదరాబాద్ నగరంతో పాటు 3వ పేజీలో...





చరిత్ర సృష్టించారు!

కోహ్లీ సేన కమాల్

- ఆస్ట్రేలియా గడ్డపై తొలిసారిగా ద్వైపాక్షిక వన్డే సిరీస్ హస్తగతం
- 2-1 తేడాతో గెలుపు
- ఇప్పటికే టెస్ట్ సిరీస్ కైవసం



వివరాలు 12లో...

ఒడిశాలో కంటివెలుగు

రూ.680 కోట్ల నిధులతో సునేత్ర పథకం

- తెలంగాణ ప్రభుత్వమే ఆదర్శమన్న సీఎం నవీన్‌పట్నాయక్
- సీఎం కేసీఆర్‌వన్నీ వినూత్న కార్యక్రమాలేనని ప్రశంసలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని అమలు చేస్తున్న అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పొరుగు రాష్ట్రాలు సైతం పోటీపడి ఈ పథకాలను తమ రాష్ట్రాల్లో ప్రారంభించేందుకు బారులు తీరుతున్నారు. కేసీఆర్ ప్రారంభించిన రైతుబంధు, రైతు బీమా పథకాలను ఇప్పటికే ప్రధాని నరేంద్రమోడీ అధ్యయనం చేసి జాతీయ స్థాయిలో ఈ తరహా పథకాన్ని అమలు చేసేందుకు వ్యూహం రచిస్తుండగా, తాజాగా ఒడిశా ప్రభుత్వం తెలంగాణలో అమలు చేసిన కంటి వెలుగు పథకాన్ని తమ రాష్ట్రంలో ప్రారంభించేందుకు సిద్ధమైంది. ఇందుకు ఒడిశా ప్రభుత్వం రూ.680 కోట్లను ఈ పథకానికి కేటాయించినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. కంటి వెలుగు పేరును ఒడిశా రాష్ట్రంలో 'సునేత్ర'గా నామకరణం చేశారు. గత మూడు మాసాలుగా నిర్విఘ్నంగా సాగుతున్న కంటి వెలుగు పథకంలో ఇప్పటికే వేలాది మంది ప్రజలు తమ నేత్రాలను పరీక్షించుకోవడంతో పాటు శస్త్ర చికిత్స అవసరమని భావిస్తే రోగులను స్థానికంగా ఉన్న 7వ పేజీలో...

పోచారం స్పీకర్‌గా... ఆ పదవికే పరిపక్వత

- మీ కృషితో రైతుబంధుకు ఐరాస ప్రశంస
- ఉమ్మడి కుటుంబం నడిపారు.. సభను కూడా అలాగే నడపండి
- పోచారం లక్ష్మీపుత్రుడు.. పేరును సార్థకం చేశారు ● కేసీఆర్ ప్రశంసలు



పోచారం ఏకగ్రీవం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా పోచారం శ్రీనివాసరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్పీకర్ పదవికి శ్రీనివాసరెడ్డి ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేయగా, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు, కాంగ్రెస్ సభ్యులు భట్టి విక్రమార్క, అబ్రహం, ఎంఐఎం సభ్యుడు అహ్మద్ బలాల, తెరాస సభ్యులు అజ్మీరా రేఖా నాయక్, టి.శ్రీనివాస యాదవ్‌లు బలపరిచారు. ఆ ఒక్క నామినేషన్ సక్రమంగా ఉండడంతో శ్రీనివాసరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్‌ఖాన్ శుక్రవారం శాసనసభలో ప్రకటించారు. అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్, పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, సభ్యులు ఈటల రాజేందర్, అహ్మద్ బలాల పోచారంను అధ్యక్షస్థానం వరకు తోడ్కొని వెళ్ళారు. ఆ తర్వాత ప్రొటెం స్పీకర్ శ్రీనివాసరెడ్డికి బాధ్యతలు అప్పగించి ఆయన అధ్యక్ష స్థానం నుంచి తప్పుకున్నారు. అనంతరం పోచారం శ్రీనివాసరెడ్డిని అభినందిస్తూ ముఖ్యమంత్రితో సహా అన్ని పక్షాల సభ్యులు ప్రసంగించారు. స్పీకర్ ఏకగ్రీవంగా ఎన్నిక య్యేందుకు సహకరించిన పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమా ర్ రెడ్డి, ఎంఐఎం, భాజపాలకు సీఎం కేసీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. సభ వాయిదా పడిన అనంతరం ముఖ్యమంత్రి స్పీకర్ చాంబర్‌కు వెళ్ళి శాలువా కప్పి అభినందించారు. శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్, శాసనసభ్యులు తన్నీరు హరీష్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, టి.రాజయ్య, గంగుల కమలాకర్‌రావు తదితరులు శ్రీనివాసరెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

హైదరాబాద్, ఆంధ్రప్రభ: శాసనసభ స్పీకర్‌గా పోచారం శ్రీనివాసరెడ్డి నూతన సంప్రదాయాలతో అధ్యక్ష పదవికి పరిపక్వత సాధిస్తారని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఆశాభావం వ్యక్తంచేశారు. ఉమ్మడి కుటుంబానికి నేతృత్వం వహించి అందరిదీ ఒకే మాటగా కలిసి మెలిసి ఉంటున్న కుటుంబంలాగా శాసనసభను కూడా అదే రీతిలో నడిపించాలని ఆయన కోరారు. శాసనసభ స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన పోచారం శ్రీనివాసరెడ్డిని ముఖ్యమంత్రి అభినందించారు. శ్రీనివాసరెడ్డి క్రమశిక్షణ, పట్టుదల, అంకితభావం ఇతర సభ్యులకు స్ఫూర్తిదాయకం కావాలని, సభను హుందాగా నడిపిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.

సింగిల్ విండో చైర్మన్‌గా రాజకీయాల్లోకి ప్రవేశించిన పోచారం అనేక సవాళ్ళను అధిగమిస్తూ, ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ ఆరుసార్లు శాసనసభ్యుడిగా ప్రజల మద్దతు కూడగట్టగలిగారని ముఖ్యమంత్రి కొనియాడారు. తాను కూడా సింగిల్ విండో చైర్మన్ తర్వాత నేరుగా ఎమ్మెల్యే అయ్యానని కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర వ్యవసాయ మంత్రిగా రైతు సంక్షేమం కోసం ఆయన గొప్ప నిర్ణయాలు తీసుకుని పెనుమార్పులు తెచ్చారని ప్రశంసించారు. ఆయన కాలుమోపిన గడియలు మంచివని, రాష్ట్ర రైతులకు మంచి జరిగిందని కొనియాడారు. రైతుబంధు, రైతు బీమా, వ్యవసాయ యాంత్రీకరణ, గ్రీన్‌హౌస్, పాలీహౌస్‌ల ఏర్పాటులో పోచారం కీలకపాత్ర పోషించారని కేసీఆర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధు పథకానికి ఐక్యరాజ్య సమితి (ఐరాస) నుంచి ప్రశంసలు అందుకున్నామని చెప్పారు.



ఈ రైతుబంధు పథకాన్ని తాము కూడా అమలు చేస్తున్నామని ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ కూడా చెప్పారని, ఇప్పుడు పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా అమలుకు ప్రయత్నిస్తున్నారని కేసీఆర్ చెప్పారు. అనేక రాష్ట్రాలు రైతుబంధు పథకాన్ని పరిశీలిస్తున్నాయని ఆయన అన్నారు. పోచారానికి లక్ష్మీపుత్రుడు అని తాను పేరు పెట్టానని, పేరుకు తగ్గట్టుగా ఆయన రైతు సంక్షేమానికి అహర్నిశలు కృషిచేసి సంపద పెంచారన్నారు. వ్యవసాయ రంగంలో ఆయన తెచ్చిన మార్పులు దేశ రైతాంగానికి స్ఫూర్తిగా ఉంటాయని కేసీఆర్ కొనియాడారు.

పోచారం ఇంటి పేరు పరిగె అని, కానీ ఆయన స్వగ్రామం పేరే ఇంటి పేరుగా మారిందని, ఇలాంటి వ్యక్తి తమ వాడిగా ఉన్నందుకు ఆ గ్రామస్తులు కూడా ధన్యులని అన్నారు. వినయశీలురుగా, వివాదరహితంగా రాజకీయాలు నెరిపిన వ్యక్తిగా ఆయన పేరుగాంచారని కేసీఆర్ అన్నారు. వచ్చే నెలలో 70వ వసంతంలో అడుగిడుతున్న పోచారం అత్యున్నత పదవి అలంకరించనున్నారని ఆయన అన్నారు.

1969లో విద్యార్థిగా ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారని, అనేక రకాలుగా నలిగిపోయి ఇంజనీరింగ్ విద్య మధ్యలోనే మానేశారని ముఖ్యమంత్రి చెప్పారు. నిజాం పాలన మాదిరిగానే శ్రీనివాసరెడ్డి కుటుంబంలో కూడా ఆస్తులు కరిగిపోయాయని, వంద ఎకరాల భూమి కుంచించుకుపోయిందని చెప్పారు. రాజకీయాల్లో ఉన్నత విలువలు పాటించినందునే ఆయన ఈ స్థాయికి వచ్చారని కేసీఆర్ ప్రశంసించారు.

తెలుగుదేశంపార్టీ శాసనసభ్యుడిగా రాజీనామా చేసి తెరాసలో చేరి ఉప ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిచారని గుర్తుచేశారు. విలక్షణమైన, సంప్రదాయమైన కుటుంబం నుంచి వచ్చారని, ఉమ్మడి కుటుంబానికి అర్థం చెప్పారని కేసీఆర్ అన్నారు. అలాగే మా అందరినీ సభలో ముందుకు నడిపించాలని, మీ రాజకీయ ఘట్టంలో ఈ రోజు ఉజ్వలమైనదని ఆయన అన్నారు. వ్యవసాయ మంత్రిగా కర్తవ్య నిర్వహణలో విజయం సాధించారని, శాసనసభలో నూతన సంప్రదాయాలతో పరిపక్వత సాధించాలని కేసీఆర్ కోరారు.

సీఎంగా, స్పీకర్‌గా ఇద్దరూ రైతు బిడ్డలే

- రైతు సంక్షేమానికి పోచారం ఎనలేని కృషి
- తెరాస శాసనసభ్యుడు కేటీఆర్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: సీఎంగా చంద్ర శేఖరరావు, శాసనసభ స్పీకర్‌గా పోచారం శ్రీనివాసరెడ్డి ఇద్దరూ రైతు బిడ్డలేనని, ఈ స్థాయిలో ఇద్దరూ ఉండడం గర్వకారణమని తెరాస శాసనసభ్యుడు కేటీ రామారావు అన్నారు. తెలంగాణలో రెండవ హరిత విప్లవానికి వ్యవసాయ మంత్రిగా శ్రీనివాసరెడ్డి ఎనలేని సేవలు అందించారని గుర్తుచేశారు. 17వేల కోట్ల రుణమాఫీ, 58 లక్షల మందికి రైతుబంధు, 38 లక్షల మందికి రైతుబీమా, 24 లక్షల మందికి ఉచిత విద్యుత్ అందించడంలో ఆయన పాత్ర ఎంతో కీలకంగా ఉందని కొనియాడారు. స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరెడ్డిని ప్రశంసిస్తూ కేటీ రామారావుతో పాటు పలువురు ఎమ్మెల్యేలు శుక్రవారం శాసనసభలో మాట్లాడారు.

వ్యవసాయ పరిశోధనలకు ఊతం ఇవ్వడంతో మీ హయాంలోనే వ్యవసాయం పండుగలాగా మారిందని కేటీఆర్ అన్నారు. ప్రతిపక్షాల ప్రశ్నలన్నింటినీ నోట్‌బుక్‌లో రాసుకుని ప్రతి ప్రశ్నకు సమాధానం ఇచ్చేవాడని ఆయన గుర్తుచేశారు. ఇది మాకు ఆదర్శంగా, స్ఫూర్తిదాయకంగా ఉంటుందన్నారు. ప్రశ్నలు అడిగిన వారు సభలో లేనపుడు సమాధానం ఎందుకు చెప్పుతారని తాను ఓసారి అన్నానని, దానికి పోచారం స్పందిస్తూ సభలో లేకున్నా టీవీల ముందుకు కూర్చుని ఈ సమాధానాలు చూస్తుంటారని చమత్కరించారని అన్నారు. పోచారం అనుభవం, చిత్తశుద్ధి, కార్యదీక్ష ఈతరం శాసనసభ్యులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని కేటీఆర్ అన్నారు.

వ్యవసాయ మంత్రిగా ఆదర్శం: గండ్ర




కాంగ్రెస్ సభ్యుడు గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ, రైతు బిడ్డగా రైతు సమస్యలు తెలిసిన మీరు గతంలో వ్యవసాయ మంత్రిత్వశాఖను నిర్వహించిన తీరు ఎంతో ఆదర్శమని అన్నారు. రైతు సమస్యలపై ఎంతో కృషి చేశారని అన్నారు. మీలో ఒదిగి ఉండే స్వభావం ఉందని, సభకు గౌరవం తేవాలని ఆయన ఆకాంక్షించారు. అధికార, ప్రతిపక్షాలను సమదృష్టిలో చూడాలని, ప్రభుత్వాలు నిర్ణయాలు చేస్తుంటే వాటిలో ఉండే లోపాలను ప్రతిపక్షాలు ఎత్తి చూపుతాయని వెంకటరమణారెడ్డి అన్నారు. స్పీకర్ వ్యవస్థకు గౌరవం ఎక్కువగా ఉంటుందని, ఈ సభను హుందాగా నడిపించి వన్నె తేవాలని ఆయన కోరారు.

మంత్రిగా ఎంతో గౌరవం: హోంమంత్రి



హోంమంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ, వ్యవసాయశాఖ మంత్రిగా దేశంలోనే గౌరవం అందుకున్నారని అన్నారు. మీ పనితీరుతో వ్యవసాయ రంగం అద్భుతమైన ప్రగతి సాధించిందని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన ప్రతి కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో అమలుచేసి సత్ఫలితాలు సాధించారన్నారు.

జనంలోంచి విజయాలు : ఈటల



తెరాస సభ్యుడు ఈటల రాజేందర్ మాట్లాడుతూ, తమలాంటి వారు తెలంగాణ ఉద్యమంతో గెలిచారని, కానీ పోచారం జనంలోంచి విజయాలు సాధించారని అన్నారు. గ్రామాల అభివృద్ధికి వ్యవసాయ శాఖ ఎంతో ముఖ్యమని సీఎం చెప్పేవారని, అందుకు తగ్గట్టుగానే శ్రీనివాసరెడ్డి ఫలితాలు చూపించారని చెప్పారు. వ్యవసాయ, అనుబంధ రంగాలను ప్రోత్సహించి ఆదాయం పెంచారని, వ్యవసాయం అంటే పండుగ అని చేసి చూపించారని రాజేందర్ అన్నారు.

ఉద్యమకారులకు గౌరవం: హరీష్‌రావు



తెలంగాణ ఉద్యమకారుడు అసెంబ్లీకే సభాపతి కావడం ప్రతి ఉద్యమకారుడికి దక్కిన గౌరవంగా తెరాస సభ్యుడు హరీష్‌రావు అభివర్ణించారు. 69 ఏళ్ళలో 29 ఏళ్ళ వారిగా పనిచేసే వారని, అనేక స్థాయిల్లో, హోదాల్లో అనుభవం గడించారని అన్నారు. గత నాలుగున్నరేళ్ళలో రాష్ట్ర రైతులకు స్వర్ణయుగం లాంటిదని హరీష్‌రావు చెప్పారు. శ్రీనివాసరెడ్డి తన కారునే ఒక ఆఫీస్‌గా పెట్టుకున్నారని, ప్రయాణంలోనే ఫైళ్ళు చూడడం, అధికారులతో మాట్లాడేవారని ఆయన చెప్పారు. దేశంలోని అసెంబ్లీలకు ఆదర్శంగా ఈ సభను నడిపించాలని హరీష్‌రావు కోరారు.

అసలు సిసలైన రైతు : శ్రీధర్‌బాబు



కాంగ్రెస్ సభ్యుడు డి.శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, రైతు నాయకుడిగా శ్రీనివాసరెడ్డి వస్త్రధారణ అసలుసిసలైన రైతులాగే ఉన్నారని అన్నారు. అందుకే ఆయనకు వ్యవసాయ మంత్రి పదవి వరించిందని, మీరు రైతులకు న్యాయం చేస్తారని ముఖ్యమంత్రి విశ్వసించారని ఆయన అన్నారు.

వ్యవసాయాన్ని పండుగ చేశారు: పద్మ



వ్యవసాయ రంగాన్ని పండుగలా చేశారని, అలాగే సభను కూడా గౌరవంగా నడిపిస్తారని తెరాస సభ్యురాలు పద్మా దేవేందర్‌రెడ్డి ఆశాభావం వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి ఆలోచనలను అమలుచేసి రైతులకు అండగా నిలిచారని అన్నారు. ఎస్ఎల్‌బీసీలో బ్యాంకర్లను నేరుగా ప్రశంసిస్తూ ప్రతిపక్ష నాయకుడిలా వ్యవహరించేవారన్నారు.

ఎమ్మెల్యేగా మాధవరం ప్రమాణ స్వీకారం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: కూకట్‌పల్లి ఎమ్మెల్యే, తెరాస సభ్యుడు మాధవరం కృష్ణారావు శుక్రవారం శాసనసభ్యుడిగా ప్రమాణం చేశారు. గురువారం సభకు హాజరుకాని వారిచేత శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయించేందుకు ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్‌ఖాన్ పిలిచారు. మాధవరం కృష్ణారావు తెలుగులో ప్రమాణం చేశారు. శాసనసభలో మరో నలుగురు సభ్యులు ప్రమాణ స్వీకారం చేయాల్సి ఉంది. ఇందులో ఎంఐఎం సభ్యులు అక్బరుద్దీన్ ఓవైసీ, జాఫర్‌ఖాన్, తెదేపా సభ్యుడు సండ్ర వెంకటవీరయ్య, భాజపా సభ్యుడు రాజాసింగ్ ఉన్నారు.





కేసీఆర్ ప్రధాని కావడం ఖాయం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: దేశానికి కెసీఆర్ ప్రధాన మంత్రి కావడం ఖాయ మని టిఆర్ఎస్ ఎమ్మెల్యే ఎ. జీవన్ రెడ్డి జోస్యం చెప్పారు. భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్‌లకు ధీటుగా ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు దిశగా ముందుకెళ్తున్నామని ఆయన చెప్పారు. ఇప్పటికే ఫ్రంట్ ఏర్పాటుపై ఇతర రాష్ట్రాలలోని కొందరి నేతలతో సంప్రదింపులు కూడా జరిపామన్నారు. ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ కెటీఆర్, జగన్ కలిస్తే ఆంధ్రా టిడిపి నేతలు బెంబేలెత్తిపోతున్నారని ఆక్షేపించారు. ఏదో భూకంపం వచ్చినట్లు టిడిపి నేతలు మాట్లాడుతున్నారని అన్నారు. గబ్బిలాల మాదిరిగా తెలంగాణ నాయకులు ఆంధ్రాపై పడ్డారని టిడిపి నేతలు వ్యాఖ్యానించడం సమంజసం కాదన్నారు. అసలు గబ్బిలాల మాదిరిగా తెలంగాణ మీద పడింది టిడిపి నేతలు కాదా? అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వం పథకాలను చంద్రబాబు కాపీ కొడుతున్నారని విమర్శించారు. చంద్రబాబు మతిభ్రమించి మాట్లాడుతున్నారన్నారు.

శాసనసభను ఆదర్శంగా తీర్చిదిద్దుదాం

స్పీకర్ పోచారం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ శాసనసభాపతిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు సీఎం కేసీఆర్, విపక్షాలు, సభ్యులకు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత సభలో తొలిసారిగా మాట్లాడారు. శాసనసభాపతి పదవి అత్యంత కీలకమైందని, సంక్లిష్టమైందని, సభా నిర్వహణలో అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు.

ఒకరిపై ఒకరు నిందలు వేసుకోవడం, సభకు అంతరాయం కలిగించడం గౌరవప్రదం కాదని, ప్రజల ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా సభను నిర్వహించకుందామని కోరారు. అధికారపక్షం సంయమనంతో ప్రతిపక్షం సహనంతో వ్యవహరించాలని అన్నారు. విధి నిర్వహణలో నియమబద్ధంగా, న్యాయబద్ధంగా వ్యవహరిస్తానని హామీ ఇచ్చారు. ప్రజాహితమే ధ్యేయంగా పని చేస్తానని, నిష్పక్షపాతంగా వ్యవహరిస్తానని పేర్కొన్నారు.



పోచారం నా గురువు: జాజుల



స్పీకర్ శ్రీనివాస్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతూ మాట్లాడిన ఎల్లారెడ్డి ఎంఎల్ఏ జాజుల సురేందర్ మాట్లాడుతూ, తనకు రాజకీయ గురువు అని పేర్కొంటూ తన గెలుపునకు శ్రీనివాస్‌రెడ్డి కృషిని ఎప్పుడూ మరునని అన్నారు. దీనిపై స్పీకర్ శ్రీనివాస్‌రెడ్డి వివరణ ఇస్తూ గతంలో జాజుల సురేందర్ టీడీపీలో తనతో కలిసి పని చేశా.

రైతు బిడ్డ రాజయ్యాడు : కొప్పుల



రైతు కుటుంబంలో జన్మించి నిరంతరం రైతు సంక్షేమం కోసం పాటుపడ్డ శ్రీనివాస్‌రెడ్డి స్పీకర్ పదవిని అలంకరించడంతో రైతే రాజయ్యాడని కొప్పుల అన్నారు. ఏ పదవిని చేపట్టినా పూర్తి న్యాయం చేకూర్చిన శ్రీనివాస్‌రెడ్డి స్పీకర్ పదవికి న్యాయం చేస్తారు.

పదవికే వన్నె : తలసాని



స్పీకర్ స్థానంలో శ్రీనివాస్‌రెడ్డిని ఎంపిక చేయడంతో పదవికే వన్నె తెచ్చినట్లయిందని తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. పదవి ఏదైనా నిబద్ధతతో పని చేయడం శ్రీనివాస్‌రెడ్డి నైజమని అన్నారు.

మా నాన్న క్లాస్‌మేట్ : బిగాల



స్పీకర్ స్థానాన్ని అధిష్టించిన శ్రీనివాస్‌రెడ్డిని తాను బాబాయ్ అని పిలుస్తానని, తన తండ్రి, శ్రీనివాస్‌రెడ్డిలు క్లాస్‌మేట్ లు కాబట్టి తనకు ఎప్పటి నుంచో పరిచయం ఉందని గణేష్ బిగాల అన్నారు. సొసైటీ చైర్మన్ నుంచి రాజకీయ జీవితాన్ని మొదలు పెట్టిన శ్రీనివాస్‌రెడ్డి అంచలంచెలుగా ఎదిగారు.


రైతు.. రాజులా కూర్చున్నట్లుంది : గాదరి

స్పీకర్ స్థానాన్ని శ్రీనివాస్‌రెడ్డి అలంకరించడంతో రైతు వచ్చి రాజులా కూర్చున్నట్లుందని గాదరి కిషోర్ అన్నారు.



శ్రీనివాస్‌రెడ్డి నుంచి తాను చాలా నేర్చుకున్నానని, ఆయన వద్ద నేర్చుకున్న ఎన్నో విషయాలు తన ఉన్నతిని దోహదం చేస్తున్నాయన్నారు. ఎప్పుడూ ఎవరినీ నొప్పించకుండా తాననుకున్న పనిని నెరవేర్చడంలో శ్రీనివాస్‌రెడ్డి దిట్ట అని అన్నారు.

పోచారం మా జిల్లా వాసి : గంపా



స్పీకర్ స్థానాన్ని అధిరోహించిన శ్రీనివాస్‌రెడ్డి తన జిల్లాకు చెందిన వారు కావడం తనకు గర్వకారణమని, రాజకీయ నేతగా పోచారం జిల్లాకే కాకుండా రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచారని, ఆయన జీవితం ఎంతో మందికి స్ఫూర్తి దాయకమన్నారు.

ఉద్యమ స్ఫూర్తి నింపిన వ్యక్తి : షిండే

వయసుతో నిమిత్తం లేకుండా తనకు అప్పగించిన పనిని నిబద్ధతతో పూర్తి చేయడంతో పాటు పూర్తి స్థాయిలో న్యాయం చేసే తత్వం కలిగిన శ్రీనివాస్‌రెడ్డి స్పీకర్‌గా నియమితులవడం సభకు హుందాతనాన్ని తీసుకు వస్తుందని హన్మంత్ షిండే అన్నారు.



రైతు పదానికి నిదర్శనం : ఎర్రబెల్లి



అందరూ రైతుల గురించి, రైతుల సంక్షేమం గురించి మాట్లాడినప్పటికీ రైతు అంటే ఎలా ఉండాలో శ్రీనివాస్‌రెడ్డిని చూస్తే అర్థమవుతుందని ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు.

వైఎస్ ఆదేశంతో పోటీ చేశా : బాజిరెడ్డి



శ్రీనివాస్‌రెడ్డి అంటే తలకెంతో గౌరవమని, గతంలో వైఎస్ ఆదేశంతో గతంలో ఒక సారి బాన్సువాడలో పోటీ చేసి ఓడించడం జరిగిందన్నారు.

అయినప్పటికీ తననెప్పుడూ ఆధరించారన్నారు. సభానియమాలన్నీ తెలిసిన అనుభవజ్ఞుడికి స్పీకర్ పదవిని కట్టబెట్టడంతో సభ హుందాతనం మరింత పెరిగింది.

మంత్రిగా ఆకట్టుకున్నారు : అజయ్



వ్యవసాయ మంత్రిగా పని చేసిన శ్రీనివాస్‌రెడ్డి తనను ఆకట్టుకు న్నారని, సభలో తానడిగిన ప్రశ్నకు కూలంకషంగా సమాధానం ఇవ్వడంతో పాటు గణాంకాలను తెలిపి తనను మంత్ర ముగ్ధులను చేశారన్నారు. స్పీకర్ పదవిని అప్పగించాలన్న సీఎం కేసీఆర్ నిర్ణయం సరైందేనని అన్నారు.



రాజ్‌భవన్‌లో గవర్నర్ దంపతులతో స్పీకర్ పోచారం కుటుంబ సభ్యులు

కాలికి దెబ్బతాకింది... అందుకే విశ్రాంతి

ఆంధ్రప్రభతో ఎమ్మెల్యే సాయన్న



కంటోన్మెంట్, ప్రభన్యూస్: తన కాలు వేలుకు దెబ్బ తగలడంతో ఎన్నికల అనంతరం విశ్రాంతిలో ఉన్నానే తప్ప తనకు ఎలాంటి సర్జరీలు కాలేదని కంటోన్మెంట్ ఎమ్మెల్యే జి సాయన్న తెలిపారు. శుక్రవారం ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితమైన వీల్‌చేర్‌పై సభకు వచ్చిన సాయన్న అనే కథనంపై ఆయన స్పందించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తాను ఓ బస్తీలో పాదయాత్ర చేస్తుండగా పోటురౌతు తగిలి తన కాలు వేలుకు గాయమైందని, ఎలాంటి ఇన్‌ఫెక్షన్ కాకుండా ఉండాలని వైద్యుల సూచన మేరకు తాను గత కొన్ని రోజులుగా విశ్రాంతి తీసుకుంటు గురువారం వీల్‌చేర్‌పై అసెంబ్లీకి వచ్చాను తప్ప తనకు ఆరోగ్య పరమైన సమస్యలు, శస్త్రచికిత్సలు కాని, మరేమి సమస్యలు లేవని ఆంధ్రప్రభకు ఆయన వివరించారు.

ఫిబ్రవరి11 నుంచి బడ్జెట్ సెషన్?

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం తరుపున ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టాలని కేసీఆర్ నిర్ణయించారు. వారంరోజుల పాటు ఈ సమావేశాలు జరిగే అవకాశం ఉందని వినిపిస్తోంది.

మంత్రులతోనా.. ఇలాగేనా?

ప్రస్తుత సమావేశాలు నిర్వహించిన తరహాలోనే బడ్జెట్ సమావేశాలు కూడా నిర్వహించే అవకాశం ఉందా? పార్టీవర్గాల్లో చర్చ జరుగుతున్నట్లు ఫిబ్రవరి 5న మంత్రివర్గ విస్తరణ ఉంటుందా అన్న ఉత్కంఠ నెలకొంది. మంత్రివర్గ విస్తరణ జరిగితే ఆరు నుండి ఎనిమిది మందితో మినీక్యాబినెట్‌ను ఏర్పాటుచేయవచ్చని, శాసనసభ వ్యవహారాలు, ఆర్ధికశాఖ ఇతరులకు అప్పగించవచ్చని చర్చ జరుగుతోంది. ఎమ్మెల్సీల ఎన్నిక, లోక్‌సభ ఎన్నికల తర్వాత విస్తరణ జరపాలనుకుంటే బడ్జెట్ ఎవరు ప్రవేశపెడతారు? శాసనసభ వ్యవహారాలు ఎవరు చూస్తారు? ఇలాంటి అంశాలన్నీ ఆసక్తి కలిగిస్తున్నాయి.

కొత్త పథకాల ఊసులేకుండా..

లక్షకోట్లతో ఓటాన్ అకౌంట్ బడ్జెట్

- పద్దుల వారీ చర్చలు లేకుండానే...
- ఆమోదం కోసమే ద్రవ్య వినిమయ బిల్లు
- శాఖలవారీగా అంచనాల చేరిక
- సీఎం తుదిరూపు ఇచ్చాకే సమావేశాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ కొత్త పథకాలు, పనులకు నిధుల కేటాయింపు లేకుండానే ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను రూపొందించేందుకు ప్రభుత్వం సిద్దమవుతోంది. మధ్యంతర బడ్జెట్‌తో వేతనాలు, పాలనపరమైన ఇబ్బందులను దూరం చేసేలా పాత పద్దులతోనే మూడు నుంచి ఆరు నెలల పాటు ఓటాన్ బడ్జెట్ అమలయ్యేలా అసెంబ్లీలో ప్రవేశపెట్టనెంది. శుక్రవారంతో శాఖల వారీగా ప్రతిపాదనలు అందడంతో సీఎం నేరుగా ఒక్కో శాఖపై సమీక్షించి తుది రూపం ఇవ్వనున్నారు. ఆ తర్వాత వారం రోజులపాటు అసెంబ్లీని సమావేశపర్చి ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌పై చర్చించి ద్రవ్య వినిమయ బిల్లుకు ఆమోదం తెలిపేలా కసరత్తు చేస్తున్నారు. అయితే పద్దులన్నీ గత ఆర్ధిక యేడాదివే ప్రతిఫలిస్తాయని, కానీ వీటిపై పద్దుల వారీగా చర్చకు అవకాశం ఉండదని ఆర్ధిక శాఖ వర్గాలు చెప్పాయి. తొలిరోజు బడ్జెట్ ప్రవేశపెట్టి అనంతరం సభ్యుల అధ్యయనం కోసం సభను వాయిదా వేయాలని, రెండు రోజులపాటు చర్చించి చివరిరోజు ద్రవ్య వినిమయ బిల్లుకు ఆమోదం తెలపడంద్వారా ప్రభుత్వ కార్యకలాపాలకు ఆటంకాలు లేకుండా చూడాలని ప్రాథమికంగా నిర్ణయించారు. ఈమేరకే శాఖల వారీగా ప్రతిపాదనలు సేకరించి ఆర్ధిక శాఖ ఉన్నతాధికారులు సమీక్షలు పూర్తిచేశారు.

హామీల అమలు ఇప్పుడే కాదు...

కొత్త పథకాలు, హామీలకు ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో స్థానం దక్కే అవకాశం లేదని సమాచారం. మొత్తంగా ఈ బడ్జెట్ ఆరు నెలలకాలానికిగానూ రూ. 1లక్ష కోట్లకు మించే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రధానంగా ఇరిగేషన్ ప్రాజెక్టులకు రుణసేకరణకే ప్రాధాన్యతనివ్వాలని, అదేవిధంగా రైతు రుణమాఫీ, సంక్షేమ పించన్లను రెండింతలకు పెంచాలన్న నిర్ణయం కూడా ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో అమలయ్యే అవకాశాలు చాలా స్వల్పమని అధికారవర్గాలు అంటున్నాయి. ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు, పించన్లకే ఏటా దాదాపుగా రూ. 24వేల కోట్లు వ్యయం చేయాల్సి వస్తోంది. తాజాగా వేతన సవరణ అమలులోకి వస్తే ఈ మొత్తం పెంచిన దామాషాలో భారం మరింత పెరగనుంది. 1 శాతం పెరిగినా రూ. 300కోట్ల మేర అధిక వ్యయం మోయాల్సి వస్తుంది. అదే 15 శాతం మేర పెచినట్లయితే దాదాపు రూ. 4300కోట్ల అదనపు భారం సర్కార్‌పై పడే అవకాశాలు స్పష్టంగా ఉన్నాయి. వ్యవసాయ రుణాలు రూ. 1లక్షల లోపు మాఫీ చేయాలన్న హామీని అమలు చేయాల్సి వస్తే ఏక మొత్తంలో రూ. 18వేల కోట్ల నిధి అవసరమవనుంది. ఇక రైతు బంధు పథకానికి గతేడాది ఎకరాకు రూ. 4వేల చొప్పున రెండు విడతల్లో రూ. 12వేల కోట్లు ఖర్చు చేశారు. ఇప్పుడు ఈ మొత్తం రూ. 10వేలకు పెంచాలని సర్కార్ హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలో 2019-20లో ఇది రూ. 15వేల కోట్లకుపైగా చేరనుంది. ప్రస్తు ఆర్ధిక ఏడాదిలో రాబడి అంచనా రూ. 1,13,083కోట్లుగా ఉంది. ఇప్పటివరకు వచ్చింది రూ. 90 వేల కోట్లేనని ఆర్ధిక శాలు చెబుతోంది. 2016-17లో రూ. 1లక్ష కోట్ల రాబడి అంచనాలో రూ. 81, 900 కోట్లు మాత్రమే ఖజానాకు చేరింది. నిరుద్యోగ భృతి వంటి హామీల అమలుకు ప్రభుత్వం కొంత సమయం తీసుకునే అవకాశాలున్నాయి. బడ్జెట్‌లో తాజా హామీలపై నిధుల కేటాయింపుకు ఇప్పటికిప్పుడు ఎటువంటి ఆశాజనక పరిస్థితులు లేవని రాష్ట్ర ఆర్ధిక పరిస్థితి స్పష్టం చేస్తోంది.

వ్యయాల ఆధారంగానే తదుపరి చర్యలు...

ఇక ప్రస్తుతం ప్రభుత్వం చేస్తున్న వ్యయాలు 2019-20లో కూడా అదే తీరులో పెరగనున్నాయి. రానున్న మూడు లేదా ఆరు మాసాల తర్వాతైనా పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టుకోవాల్సిందే. ఏప్రిల్, మే నెలల్లో పార్లమెంట్ ఎన్నికలు పూర్తయిన తర్వాత కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. ఆ తర్వాత ప్రవేశపెట్టే రాష్ట్ర పూర్తిస్థాయి సమగ్ర బడ్జెట్‌లో సాగునీటి పారుదల శాఖకు రూ. 26వేల కోట్లు, పెట్టుబడి మద్దతు పథకానికి రూ. 16 వేల కోట్లు, బీసి ప్రత్యేక అభివృద్ధి నిధి కింద రూ. 20వేల కోట్లు, మిషన్ భగీరథ వంటి బృహత్తర కార్యక్రమాలకు భారీగా నిధులను కేటాయించాల్సి ఉంటుంది. రైతుబంధుకు రూ. 15వేల కోట్లు, రైతు రుణమాఫీకి రూ. 23వేల కోట్లు, జీతాలు, పించన్లకు రూ. 30వేలకోట్లు, ఆసరా పించన్లకు రూ. 10వేలకోట్లు, నిరుద్యోగ భృతికి రూ. 3వేలకోట్లు, ఉచిత విద్యుత్‌కు రూ. 5వేలకోట్లు, సబ్సిడి బియ్యానికి రూ 3వేల కోట్లకుపైగా వెచ్చించాల్సి రావొచ్చు. స్థూలంగా చూస్తే 2019-20 పూర్తిస్థాయి బడ్జెట్‌లో సంక్షేమ, అభివృద్ధి రంగాలకు నిధుల వ్యయం పెరగనుంది.

రూ.500 కోట్లు రుణం కావలెను

- ఆర్ధిక సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం సంప్రదింపులు
- కేంద్ర సాయం కోసం ప్రతిపాదనలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్ర ఆర్ధిక వనరులు మెరుగ్గానే ఉన్నప్పటికీ అత్యవసర అవసరాలకు రుణమే తక్షణ మార్గమని ఆర్ధిక శాఖ వర్గాలు ప్రభుత్వానికి నివేదించినట్లు సమాచారం. రైతు బంధు బకాయి నిధులు రూ.500కోట్లమేర చెల్లింపులకు తక్షణం రుణమే ఆవశ్యకమి భావించిన ఆర్ధిక శాఖ తాజాగా ఢిల్లీలోని ఒక ఆర్ధిక సంస్థను ఆశ్రయించనుంది. ఈ మేరకు ఆర్ధిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు త్వరలో ఢిల్లీకి వెళ్లనున్నారు. రైతుబంధుతోపాటు పించన్ల మొత్తం పెంపు, నిరుద్యోగ భృతి, రుణమాఫీ వంటివాటికి నిధుల సమీకరణ తప్పనిసరికానుంది. అయితే ఓటాన్ అకౌంట్ బడ్జెట్ నేపథ్యంలో వీటి అమలు మూడునుంచి ఆరు నెలలు వాయిదా వేసే అవకాశం ఉంది. ఆ తర్వాత వీటికి నిధులు తప్పనిసరి కానున్నాయి. అయితే ప్రస్తుతానికి పెండింగ్ రైతుబంధుకు మాత్రం తక్షణం రూ.500కోట్ల అవసరం నెలకొంది. ఈ అత్యవసర పరిస్థితిని అధిగమించేందుకు ఆర్ధిక సంస్థలనుంచి అప్పుల సేకరణకు ఆర్ధిక శాఖ ప్రయత్నాలు ఆరంభించింది. రబీ సీజన్‌లో 50లక్షల మంది రైతులకుగానూ రూ. 4724కోట్లను వారి ఖాతాలకు బదలీ చేశారు. అయితే ఇదే సీజన్‌లో కొత్తగా చేరిన 2.28లక్షల మంది రైతులకు, మిగిలిపోయిన 1.82 లక్షల మందికి రూ. 500కోట్లు పెండింగ్‌లో పడ్డాయి. దీంతో ఈ మొత్తం చెల్లింపులు ఇప్పుడు తప్పనిసరి.

మరోవైపు కేంద్రంతో కొట్లాడి మరీ ఎక్కువ మొత్తంలో రాష్ట్రానికి నిధులను సాధించేలా ప్రభుత్వం కసరత్తు వేగవంతం చేసింది. ఫిబ్రవరి 1న కేంద్ర తన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. ఇందులో రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలోని హామీలను అమలు చేసేలా కేంద్రంపై ఒత్తిడి తేనున్నారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కాళేశ్వరం, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ప్లాంట్, గిరిజన, ఉద్యానవన యూనివర్సిటీలకు భారీగా సాయం కోరేందుకు సన్నద్ధమవుతోంది.

2018-19లో మిషన్ భగీరథకు రూ. 19,205కోట్లు, కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ. 10వేల కోట్, మిషన్ కాకతీయకు రూ. 5వేల కోట్లు, రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి రూ. 5వేల కోట్లు, బయ్యారం స్టీల్ ప్లాంట్‌కు రూ. 3వేల కోట్లు, ఎయిమ్స్‌కు రూ.3వేల కోట్లను కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. రాష్ట్రం నుంచి వచ్చిన విజ్ఞప్తులను కేంద్రం పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో తాజా బడ్జెట్‌లోనైనా సాధ్యమైనంతమేర ఎక్కువ నిధులను సాధించేలా కసరత్తు చేస్తున్నారు.



ప్రతిపక్షాలు ఏకతాటిపైకి వస్తున్నాయ్!

బెంగళూరు సెంట్రల్ నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయబోతున్న నటుడు ప్రకాష్‌రాజ్.. తాను ప్రజల దగ్గరకు నడుచుకుంటూ వెళ్లి వారి సమస్యలతోనే తాను ఎన్నికల ప్రణాళిక తయారు చేయనున్నట్టు చెబు తున్నారు. తనకు ఎవరు మద్దతిచ్చినా..తాను ఎవ్వరి మద్దతు తీసుకున్నా అది బహిరంగంగానే ఉంటుం దంటున్నారు. తాను రాజ్యసభ ద్వారా పార్లమెంటులోకి వెళ్లేకన్నా ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ప్రజలిచ్చిన విజయంతోనే రాజకీయాల్లో రాణించాలని అనుకుంటున్నా నన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలే కీలక పాత్ర పోషించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని అభిప్రాయపడుతున్నారు. తాను మాత్రం ఏ కూటమిలోనూ చేరకుండా తన ఉనికిని కాపాడుకుంటూనే సమస్యల ఆధారంగా మద్దతు ఇవ్వాలనుకుంటున్న ట్టు చెబుతున్నారు. ఆయన శుక్రవారం ఆంధ్రప్రభ-ఇండియా ఎ హెడ్ జాతీయ చానెల్‌కు సుదీర్ఘ ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇందులో ఆయన తన రాజకీయ భావి కార్యాచరణను వెల్లడించారు.

- రాజ్యసభకు అవకాశాలున్నా వద్దనుకున్నా..
- ఫెడరల్ ఫ్రంట్‌కే అవకాశముంది
- రుణమాఫీతో ఏం జరుగుతుంది?
- ప్రతి సంవత్సరం రుణమాఫీ చేయగలమా?
- వ్యవసాయ రంగంలో మౌలిక సౌకర్యాలను కల్పించాలి!
- బెంగళూరు సెంట్రల్‌లో పుట్టా, పెరిగా, చదువుకున్నా...
- ఎంపీగా గెలిచినా జీతం సరిపోకపోవచ్చు..
- ఖర్చుల కోసం ఒకటి రెండు సినిమాలు చేస్తా...



న్యూఢిల్లీ: **ప్ర:** మీరు బెంగళూరులోనే పోటీ చేయాలని ఎందుకు ఎంచుకున్నారు?

జ: బెంగళూరు సెంట్రల్ నా సొంత నియోజవర్గం. అక్కడే పుట్టా.. బాల్యమంతా అక్కడే గడిచింది. శాంతి నగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో చదివా. కాలేజీ చదువు ఇక్కడే పూర్తి చేశా. ఆ తరువాత దశాబ్దం పాటు నాటక రంగంలో ఉన్నా. ఇదే నియోజవర్గంలో సాహితీ ప్రియులతో ఎంతో కాలంగా సాన్నిహిత్యం ఉంది. సినిమాల్లోకి ప్రవేశించడానికి ముందు వరకు ఇక్కడే ఉన్నాను. బెంగళూరు సెంట్రల్ నియోజక వర్గం గురించి నాకు అణువణువూ తెలుసు. ఇక్కడే నా బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు ఉన్నారు. క్లాస్‌మేట్లు ఇక్కడే ఉన్నారు. చిన్నపిల్లాడి నుంచి ఇక్కడే ఎదిగిన నన్ను ఎరిగిన ప్రజలూ ఇక్కడే ఉన్నారు. బెంగళూరు సెంట్రల్ పరిధి నాలుగున్నర కిలోమీటర్ల వ్యాసార్థంలో ఉంటుంది. ఇక్కడ నాలుగు లక్షల మంది తమిళులున్నారు. రెండు లక్షల మంది తెలుగు వారున్నారు. లక్షల్లో మలయాళీలు, హిందీ ప్రజలు ఉన్నారు. కన్నడ మాట్లాడే వారు అధిక సంఖ్యలో ఉన్నారు. దీన్ని నిజానికి మినీ ఇండియా అంటారు. ఈ నియోకవర్గం గురించి నాకు బాగా తెలుసు.

ప్ర: మీరు బీజేపీని తీవ్రంగా విమర్శిస్తుంటారు. బీజేపీ చేసే రాజకీయాలను మీరు పూర్తి స్థాయిలో వ్యతిరేకిస్తుంటారు. ఇప్పుడు మహాకూటమి ఆలోచనల కారణంగా బీజేపీకి కూడా కొన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో మీ పాత్ర ఎలా ఉండబోతోంది?

జ: ఈసారి ప్రాంతీయ శక్తులు కీలకంగా మారు తున్నాయి. ఇప్పుడు ఇండియా ఫెడరల్ రాజ్యం వైపుగా వెళుతున్నట్లు అనిపిస్తుంది. అది ఇప్పుడు అవసరం కూడా. రాష్ట్రాలకు మొండి చేయి చూపుతున్న పరిస్థితుల్లో కేసీఆర్, మమతా బెనర్జీ, రాహుల్‌గాంధీ, డీఎంకే.. ఇలా ప్రతి ఒక్కరూ.. ఈ దిశగా ఆలోచించడానికి, ఏకతాటిపైకి రావడానికి మొదట బీజేపీకి కృతజ్ఞతలు తెలపాలి. నేను ఈ విషయంలో కొంత వేచి చూసే ధోరణిని అవలంభిస్తున్నాను. అదే సమయంలో దేశానికి ఏది అవసరమో దాని వైపుగా ఉండాలని అనుకుంటున్నాను. ఒక స్వతంత్ర్య అభ్యర్థిగా నేను ఏ కూటమిలో చేరకుండా నా ఉనికిని కాపాడుకుంటూ.. సమస్యల ఆధారంగా మద్దతివ్వాలని భావిస్తున్నా. ఏ విధాన నిర్ణయమైనా ప్రజల కోణంలో ఉందా లేదా అనే నేను చూస్తాను. రాజకీయాల్లో కొనసాగడానికి ఏ పార్టీలోనో భాగంగా ఉండాలని అనుకోవడం లేదు.



ప్ర: మనమిప్పుడు మారుతున్న కాలంలో ఉన్నాం. ఫెడరల్ ఫ్రంట్ సాకారమయ్యే అవకాశముంది. ఇప్పుడు విధానపరమైన అనేక సమస్యలున్నాయి. ఈ దృష్టిలో ఏ విధానపరమైన అంశానికి ప్రాధాన్యత ఇస్తారు? మీ రాష్ట్రానికి లేదా మీ నియోజక వర్గానికి సంబంధించిన ఏ సమస్య ఒక రాజకీయ నాయకుడిగా ప్రధానంగా మీ దృష్టిలో ఉంది?

జ: ఇవాళ అనేక సమస్యలు న్నాయి. అయితే మనం ఎలాంటి దృక్పథంతో చూస్తామన్నది ముఖ్యమైంది. మోడీగారు వచ్చినప్పుడు మేము ఆయనకు వ్యతిరేకంగా లేం. ఆయన ఉద్యోగాలు ఇస్తామని చెప్పారు. అయితే ఆ సమస్యను పూర్తిగా అర్థం చేసుకోలేదు. రైతులకు తమ అకౌంట్లలో రూ.15 లక్షలు వేస్తామన్నారు. నల్లధనాన్ని నిర్మూలిస్తామన్నారు. ఉన్న వారు, లేనివారి మధ్య అంతరాన్ని తొలగిస్తామన్నారు. అప్పుడు ఆయన అసలు సమస్యలను అర్థం చేసుకున్నారని అనుకున్నాం. అయితే తరువాత మాత్రం మోడీ అబద్దాలు చెబుతున్నారని తెలిసిపోయింది. ఆయన ఆర్థిక విధాన నిర్మాత కాదు. ఆయన కేవలం తన మాటలనే నమ్మారు. మనం ఏ సమస్యనైనా ఎలా పరిష్కరించాలి? రుణమాఫీ గురించి తీసుకుంటే, వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉన్నప్పుడు రైతులకు ఊరట ఇవ్వాలి. ఇప్పుడు చేస్తాం. వచ్చే సంవత్సరం కూడా రుణమాఫీ చేయగలవమా? ఓట్లు రావడానికి రుణమాఫీ చేయాలని ఎంపీలు భావిస్తారు. అయితే అన్ని చోట్లా శీతల గిడ్డంగుల ఏర్పాటు గురించి ఆలోచిస్తున్నారా? క్రాప్ కాలనీలను ఏర్పాటు చేసే విషయం పట్టించు కుంటున్నారా? రైతులకు ఆత్మగౌరం కలిగించే విషయం ఆలోచిస్తున్నారా? వ్యవసాయమంటే వర్షాల గురించే కాకుండా రైతుల్లో అవగాహన పెంచడం, ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించడం వంటి కోణాల్లో ఆలోచించాల్సి ఉంది. ప్రతి సమస్యనూ ఈ విధంగానే చూడాల్సి ఉంటుంది. ఉదాహరణకు.. ప్రభుత్వ పాఠశాలలను తీసుకుంటే.. అక్కడ అందిస్తున్న ఆహారం చెత్తగా ఉంది. రెండు వేల రూపాయల భత్యానికి వండిపెట్టే మహిళలకు ఆ మొత్తం సరిపోతుందా? వారికి ఉద్యోగ భద్రత కూడా లేదు. అలాంటప్పుడు.. ఎంతో కొంత మిగిల్చుకుందామని వారు చూస్తారు కదా? సమస్యలను మనం విభిన్న దృక్కోణంలో చూడాలి. పౌరులకు కూడా బాధ్యత ఉంటుంది. రోడ్లు వేస్తున్నారంటే.. అవి మన డబ్బులతో అన్న విషయం పౌరులు కూడా గుర్తించాలి. ప్రభుత్వం రోడ్డు వేస్తే.. దాని బాగోగుల గురించి పౌరులే సర్టిఫికెట్ ఇవ్వాలి.

ప్ర: మీరు చెబుతున్న అంశాలు నిజంగా తీవ్రమైనవే. అయితే ఎన్నికల సమయంలో రాజకీయాలు చేస్తారు. విశ్వాసాలపై ప్రచారాలు జరుగుతాయి. భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతాయి. రామమందిర్‌లాగా, శబరిమల కీలక ప్రచార అంశం అవుతుందా?

జ: రామమందిరంలాగానే శబరిమల కూడా ప్రచార అంశం అవుతుంది. ప్రజల సెంటిమెంట్లు ఉన్నాయి. అయితే అదే సమయంలో శబరిమల అంశాన్ని రాజకీయం చేయడానికి సువర్ణ అవకాశమొచ్చిందని కేరళ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అనడంలో అర్థమేంటి? అన్ని రాజకీయపార్టీలూ ఈ అంశాన్ని రాజకీయం చేయాలని భావిస్తున్నాయి. అయితే దీన్నుంచి వారు ఎంత రాజకీయ లబ్ది పొందుతారు? సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందంటే.. అదే తుది తీర్పు. నేను మహిళా సాధికారతకు, సమానత్వానికి ప్రాధాన్యత ఇస్తాను. అయితే ఈ తీర్పును అమలు చేయడానికి కేరళ సీఎం మరింత సమయం తీసుకోవాల్సి ఉంది. మరిన్ని జాగ్రత్తలు తీసుకొని ఉంటే బాగుండేది. ఈ విషయమే నేను విమర్శించా. అలా కాకుండా ఆయన చేసింది కరెక్టే అనే అంటాను. ఈ వ్యవహారాన్ని ఏ పార్టీ అయినా హైజాక్ చేయడం సాధ్యమవుతుందా? ఇక అయోధ్య విషయానికొస్తే.. అక్కడ రామమందిరం అవసరముందా? మీరు కెమెరాలు తీసుకొని అయోధ్య వెళ్లి అక్కడ వీధులు, స్కూళ్లు, తాగునీటి పరిస్థితి చూడండి. పారిశుద్ధ్యం ఎలా ఉందో గమనించండి. కరసేవకులు కూచున్న ప్రాంతాల పరిస్థితులు ఎలా ఉన్నాయో చూడండి. కోట్లాది రూపాయలు వ్యర్థంగా పోతున్నాయి. రామరాజ్యం గుడిలో ఉందా? లేదా రామరాజ్యం నగరంలో ఉందా? రామరాజ్యం, రామ మందిరం రాజకీయాలు లక్నో, ఢిల్లీలోని ఏసీ రూముల్లో రూపొందుతున్నాయి. ఈ విషయాన్ని పౌరులుగా మనం గుర్తించకపోతే నష్టపోతాం.

ప్ర: రాజ్యసభకి తేలిగ్గా వెళ్లే మార్గం ఉండగా కూడా మీరు లోక్‌సభ ఎన్నికల్లో ఎందుకు పోటీ చేస్తున్నారు?

జ: అలా నేను రాజ్యసభకి వెళితే అది ఎవరి విజయం అవుతుంది. రాజకీయపార్టీ నాకు రాజ్యసభ సీటు ఇవ్వవచ్చు. నేను పని చేయాలి. ప్రజలతో మాట్లాడాలి. ప్రజలకు, నాకు మధ్య అనుసంధానం కుదరాలి. అప్పుడే విజయం సాధించినట్లు. అప్పుడు అది ప్రజా విజయం అవుతుంది. ఏ రాష్ట్రంలో ఏ పార్టీలో అయినా నేను కోరుకుంటే చేరగలను. ఆ విధంగా రాజ్యసభ సీటు వచ్చే అవకాశం కూడా ఉంది. అప్పుడు అది ఎవరి విజయం అవుతుంది? దాని వల్ల ఏ అభివృద్ధి జరుగుతుంది?

ప్ర: మీ కార్యాచరణ ఎప్పటి నుంచి ప్రారంభిస్తారు? మీ పూర్తి స్థాయి బృందాన్ని ఎప్పుడు ఏర్పాటు చేస్తారు?

జ: ఈ ఇరవై తేదీన 8 వాహనాల్లో ఎనిమిది అసెంబ్లీ నియోజ వర్గాల్లో పర్యటిస్తాం. అక్కడే ప్రజా ఎన్నికల ప్రణాళికలో అంశాలను జనం దగ్గర నుంచి స్వీకరిస్తాం. రానున్న పది రోజుల పాటు నియోజకవర్గమంతా పర్యటిస్తా. నా నిర్ణయంపై ప్రజలు ఎలా వ్యాఖ్యానిస్తారో, ఎలా స్పందిస్తారో తెలుసుకుంటా. మాదేమీ పెద్ద రాజకీయపార్టీ కాదు. ప్రజల వద్దకు నడుచుకుంటూ వెళ్లి వారి అభిప్రాయాలను తెలుసుకుంటాం. తొలి దశలో ఇలాంటి కార్యక్రమాల్లో బిజీగా ఉంటా. ఆప్పటికే రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించే అవకాశం కూడా ఉంది.

ప్ర: మీరు ఎవరి నుంచి అయినా మద్దతు తీసుకొనే అవకాశముందా? కాంగ్రెస్ పార్టీ లేదా ఇతర పార్టీల సపోర్టు ఉంటుందని భావిస్తున్నారా?

జ: నాకు ఎవరైనా మద్దతు ఇవ్వడం అనేది బహిరంగంగానే ఉంటుంది.

సాగునీటికి సమగ్ర వ్యూహం



(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర రైతులకు సాగునీరు అందించడంకన్నా మించిన ప్రాధాన్యత మరొకటి లేదని ప్రాజెక్టుల నిర్మాణానికి నిధుల కొరత అడ్డంకే కాదని వెనువెంటనే గుత్తేదార్లకు బిల్లులు చెల్లిస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో నిర్మిస్తున్న ప్రాజెక్టులకు ఇప్పటి వరకు రూ.77,777 కోట్లను ఖర్చు చేసినట్టు కేసీఆర్ చెప్పారు. భూ సేకరణ, ప్రత్యామ్నాయ అడవుల పెంపకం, ఆర్‌ఆర్ ప్యాకేజీలకు మరో రూ.22వేల కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసిందని చెప్పారు. అన్ని కలిపితే ఇప్పటి వరకు మొత్తంగా రూ.99,643 కోట్లను ఖర్చు చేయడం జరిగిందన్నారు. ఈ ఏడాది మార్చి నాటికి మరో రూ.7వేల కోట్లకుపైగా ఖర్చు వుతుందని అంచనా వేస్తున్నట్టు కేసీఆర్ పేర్కొన్నారు. దీంతో ఈ ఆర్ధిక సంవత్సరం వరకు రూ.1.07 లక్షల కోట్లకుపైగా ప్రాజెక్టులకు ఖర్చవుతుందని పేర్కొన్నారు. గోదావరి, కృష్ణా బేసిన్‌లలోని ప్రాజెక్టులతో పాటు మిషన్ కాకతీయ పనులకు మరో రూ.1.17 లక్షలకోట్లు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నట్టు చెప్పారు. వచ్చే ఐదేళ్లలో ఈ నిధులన్నింటినీ ఖర్చు పెట్టి ప్రాజెక్టులను పూర్తిచేస్తామని గతంలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని 1.25 కోట్ల ఎకరాలకు సాగునీరు అందించడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ లక్ష్య సాధనకు అధికారులు, ఇంజనీర్లు, ఆయా నిర్మాణ సంస్థలు కృషి చేయాలని కోరారు. ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను గుర్తించి వెనువెంటనే నిధుల విడుదలకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేసీఆర్ స్పష్టంచేశారు. సమైక్య రాష్ట్రంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నీటి పారుదల ప్రాజెక్టులు ఓ తమాషాగా (జోక్) మా రాయని చెప్పారు. ఎన్నికల సమయంలో ప్రాజెక్టుల పేర్లు చెప్పి ఓట్లు అడుక్కోవడమే తప్ప ప్రాజెక్టులను నిర్మించి నీళ్ళివ్వలేదని చెప్పారు. అత్యధిక వర్షపాతం, పుష్కలమైన నీటి లభ్యత ఉన్న ఆదిలాబాద్ జిల్లా చరిత్రను మార్చాలని, తమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టులను నిర్మించాల్సిందేనని స్పష్టంచేశారు. తమ్మిడ్డిహట్టి బ్యారేజీని నిర్మించి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని స్పష్టంచేశారు. సిర్పూర్ కాగజ్‌నగర్ నియో జకవర్గంలోని 56,900 ఎకరాలకు, ఆసిఫాబాద్‌లో 38,830, చెన్నూరులో 31,500, బెల్లంపల్లిలో 72, 770 ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని కోరారు. తమ్మి డిహట్టి వద్ద బ్యారేజీ నిర్మించి 20 టిఎంసీల నీటిని వినియోగించుకోవడానికి కేంద్ర జల వనరుల సంఘం (సీడబ్ల్యూసీ) అంగీకారం తెలిపిందని చెప్పా రు. ఈ నీటిని సద్వినియోగం చేసుకుని ఉమ్మడి ఆదిలాబాద్ రైతులకు సాగునీరు అందించేందుకు సమగ్ర ప్రణాళికలను, వ్యూహాలను రూపొందిం చాలని కోరారు. ఈ జిల్లాలో పారే పెద్దవాగుకు నీటి ప్రవాహం ఎక్కువగా ఉంటుందని చాలా నియోజక వర్గాల ద్వారా ఈ నీరు పారుతుందని చెప్పారు. ఈ పెద్దవాగు నీటిని వినియోగించుకోవడానికి అవస రమైన నిర్మాణాలను చేపట్టాలని కూడా ఆయన అధి కారులను కోరారు. పెనుగంగ ప్రాజెక్టుపై నిర్మిస్తున్న చనాకా-కొరటా ప్రాజెక్టు పనుల్లో వేగాన్ని పెంచాలని, కుప్టి రిజర్వాయర్ నిర్మాణానికి సత్వరమే టెండర్లను ఆహ్వానించి పనులను ఆరంభించాలని కేసీఆర్ ఆదేశించారు. తమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మాణం, చనాకా- కొరటా ప్రాజెక్టు, పెద్దవాగు ప్రాజెక్టుల నీటిని సద్వి నియోగం చేసుకోవడం ద్వారా ఆదిలాబాద్ జిల్లాలో అత్యధికంగా సాగునీరు అందుబాటులోకి వస్తుందని చెప్పారు. మిగిలిన భాగానికి కాళేశ్వరం ప్రాజెక్టుల ద్వారా నీరు పారుతుందని పేర్కొన్నారు. కాళేశ్వరం, సీతారామ, దేవాదుల ప్రాజెక్టుల ద్వారా గోదావరి బేసిన్‌లో తెలంగాణకు ఉన్న వాటాను పూర్తిగా వినియోగించుకోవాలని ఆదేశించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పనులను ఇటీవల స్వయంగా పరిశీలించానని నీటి పారుదలశాఖ అధికారులు, పదవీ విర మణ చేసిన ఇంజనీర్లు ఈ ప్రాజెక్టు పనులను అధ్య యనం చేశారని పేర్కొన్నారు. గోదావరి బేసిన్‌లో ప్రాజెక్టుల నిర్మాణానికి సంబంధించి చేయాల్సిన పనులపై తనకు పూర్తి అవగాహన వచ్చిందని దీంతో ఈ నెలాఖరులోగా కార్యాచరణ ఖరారు చేస్తానని చెప్పారు. ఈ నెలలోనే తాను పాలమూరు- రంగా రెడ్డి, డిండి ప్రాజెక్టు పనులను పరిశీలిస్తానని చెప్పారు. కృష్ణా బేసిన్ ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేయడానికి అవసరమైన కార్యాచరణను కూడా ఈ నెలలోనూ రూపొందిస్తానని చెప్పారు. వర్షాకాలం వరకు ప్రాజెక్టు పనులు వేగంగా పూర్తి చేయడానికి అవకాశం ఉందని వెంటనే కార్యరంగంలోకి దిగాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల ద్వారా వచ్చే నీటిని మొట్టమొదట చెరువులకు మళ్ళించాలని కోరారు. ఈ ఏడాది కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా అటు మిడ్‌మానేరు నుంచి ఎస్‌ఆర్‌ఎస్‌పి వరకు, ఇటు మల్లన్నసాగర్ వరకు నీరు అందుతుందని చెప్పారు. అలా వచ్చిన నీటిని మొదట చెరువులను నింపేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ప్రాజెక్టు కాల్వలపై తూములను నిర్మించి చెరువులకు నీరు మళ్ళిం చాలని కోరారు. చెరువులకు ఫీడర్ ఛానల్ లేకపోతే కొత్తగా కాల్వను తవ్వాలని ఆదేశించారు. ఎస్‌ఆర్ ఎస్‌పి రెండో దశ వరకు చెరువులను నింపాలని ఆదేశించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో చిక్కితే.. ఉద్యోగం ఊడినట్టే!

(మొదటిపేజీ తరువాయి)

ఔటర్ రింగ్‌రోడ్డులో తరచూ జరుగుతున్న ప్రమాదాలకు కారణం మద్యం సేవించి వాహనాలు నడపడమేనని పోలీసులు రాస్తున్న లేఖల్లో పేర్కొంటున్నారు. నగరంలోని సైబరాబాద్, రాచకొండ, హైదరాబాద్, నగర పోలీస్ కమీషరేట్ల పరిధుల్లో పోలీసులు తరచూ రాత్రివేళల్లో మద్యం తాగి వాహనాలు నడిపే వారిని పట్టుకునేందుకు డ్రంక్ అండ్ డ్రైవ్ పేరుతో తనిఖీలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవల జరుగుతున్న వాహన తనిఖీల్లో మహిళలే ఎక్కువ సంఖ్యలో మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడుతున్నారు. కొన్ని సందర్భాల్లో పోలీసులతో వాహన చోదకులు వాగ్వాదానికి దిగుతుండగా మరికొన్ని సందర్భాల్లో వాహనాలను వదిలేసి పారిపోతున్న సంగతి తెలిసిందే. ముఖ్యంగా బహుళజాతి సంస్థలు, సాఫ్ట్‌వేర్ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు వారాంతపు రోజులైన శుక్ర, శని, ఆదివారాల్లో పబ్‌లు, బార్లకు వెళుతూ మద్యం సేవించి రాత్రివేళల్లో వాహనాలను నడుపుతూ ఇళ్ళకు చేరుతున్నారని కొన్ని సందర్భాల్లో మోతాదుకు మించి మద్యం సేవించడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తద్వారా వారి విలువైన ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని పోలీసులు చెబుతున్నారు. ఒకసారి పోలీసులకు పట్టుబడి కేసు నమోదైన తర్వాత కూడా రెండోసారి మద్యం సేవించి వాహనాలు నడపకూడదన్న విషయాన్ని మరిచిపోయి కొందరు అదే పనిగా మద్యం సేవిస్తూ రాత్రివేళల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పోలీసులు అంటున్నారు. పట్టుబడిన ప్రతి సందర్భంలోనూ కౌన్సెలింగ్ నిర్వహించి మద్యం సేవించి వాహనాలు నడపడంవల్ల జరిగే అనర్థాలను చెబుతున్నా కొందరు ఆ అంశాలను పెడచెవిన పెట్టి వ్యవహ రిస్తున్నారని పోలీసులు అంటున్నారు.

సైబరాబాద్ పోలీస్ కమీషనర్ పరిధిలో ఇటీవల ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మద్యం సేవించి వాహనం నడుపుకుంటూ వెళుతున్న సమయంలో మాదాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పర్వతనగర్‌లో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి సదరు ఉద్యోగిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. సదరు ఉద్యోగి శేర్లింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని గచ్చిబౌలి, హైటెక్‌సిటీ ప్రాంతంలో ఎబిక్స్ సాఫ్ట్‌వేర్ సంస్థలో పనిచేస్తున్నట్టు ఆయన వద్ద దొరికిన గుర్తింపు కార్డుతో బయటపడింది. ఈ విషయాన్ని సైబరాబాద్ ట్రాఫిక్ ఏసీపీ సదరు ఉద్యోగి పనిచేస్తున్న సంస్థ మానవ వనరుల విభాగానికి లేఖ రాస్తూ మీ సంస్థలో పనిచేస్తున్న సదరు ఉద్యోగి వంద ఎంఎల్‌కు మించి మద్యం సేవించారని ఇలా చేయడం నిబంధనలకు విరుద్ధమని ఆ లేఖలో పేర్కొన్నారు. అతిగా మద్యం సేవించి వాహనాలు నడపడంవల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటిని కట్టడం చేసేందుకే వాహనాలను తనిఖీ చేస్తూ మద్యం సేవించిన వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని పేర్కొన్నారు. ఉన్నత స్థాయిలో ఉన్నవారు సైతం ఇలా మద్యం సేవించి వాహనాలు నడపడంవల్ల జరిగే అనర్థాలను తెలుసుకోలేకపోతున్నారని బాధ్యతగల పౌరులు ఇలా చేయడం సబబేనా అంటూ ఆ లేఖలో సదరు డీసీపీ ప్రస్తావించారు. పోలీసులు పంపించిన లేఖలను ఆయా సంస్థల మానవ వనరుల విభాగం నోటీసు బోర్డులో ప్రకటించడంతో పాటు కొందరు ఉద్యోగుల జీతాలలో కోత విధిస్తున్నట్టు తెలుస్తోంది. మరికొందరికి పదోన్నతులు కల్పించకుండా చర్యలు తీసుకుంటు న్నాయని, కొందరినైతే ఏకంగా ఉద్యోగాల నుంచే తొలగిస్తున్నట్టు తెలుస్తోంది. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ఒకటికి మించి ఎక్కువసార్లు పోలీసులకు చిక్కితే ఇతర ప్రాంతాలకు కూడా బదిలీ చేస్తున్నట్టు సమాచారం. సైబరాబాద్ పోలీస్ కమీషరేట్ పరిధిలోనే కాకుండా నగరంలోని మిగతా రెండు కమీషనరేట్ల పరిధుల్లో ఇలా పోలీసులకు పట్టుబడిన వారి చిరునామాలకు, పనిచేసే సంస్థలకు లేఖలు రాస్తున్నట్టు సమాచారం. ఒక వేళ మైనర్లు మద్యం తాగిన మైకంలో పోలీసులకు చిక్కితే తల్లిదండ్రులపై కూడా కొన్ని సందర్భాల్లో కేసులు నమోదు చేస్తున్నట్టు సమాచారం. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా మద్యం తాగి వాహనాలు నడిపే మైనర్లపై కేసులు నమోదు చేస్తూ న్యాయస్థానం ముందు వారిని పోలీసులు ప్రవేశపెడుతున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. ఇటీవల ఓ మహిళా వైద్యురాలు మద్యంమత్తు వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడింది. ఆమె సదరు పోలీసులతో వాగ్వాదానికి దిగి రచ్చరచ్చ చేయడంతో జూబ్లీహిల్స్ పోలీసులు ఆమెపై కేసు నమోదుచేసి కటకటాల వెనక్కు పంపారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

శనివారం 19 జనవరి 2019

హమ్మయ్య! ఆస్తానా నుంచి సీబీఐకి విముక్తి!

సిబిఐ స్పెషల్ డైరక్టర్ రాకేష్ ఆస్తానాను ఆ సంస్థనుంచి తప్పించి పౌరవిమాన యాన శాఖ భద్రతా విభాగానికి బదిలీ చేయడంతో ఆ సంస్థకు వివాదాల నుంచి విముక్తి కలిగింది..ఈ చర్య కేంద్రం ముందే తీసుకుని ఉంటే ఆ సంస్థ వ్యవహారాలు రచ్చ కెక్కి ఉండేవి కావు .ప్రభుత్వం ప్రతిష్ఠ దెబ్బతిని ఉండేది కాదు. ఇప్పుడు కూడా గత్యంతరంలేకనే ఆస్తానాను కేంద్రం బదిలీ చేసింది. తనపై నమోదు అయిన అవినీతి కేసును ఢిల్లీ హైకోర్టులో ఆస్తానా సవాల్ చేసినా ప్రయోజనం. లేకపోవడంతో ఆయనను ఇంకా వెనకేసుకొస్తే ప్రభుత్వం ప్రతిష్ఠ మరింత మంటగలిసిపోతుందనే వెరపుతోనే కేంద్రం ఈ చర్య తీసుకుని ఉండవచ్చు. ఆస్తానా సిబిఐ ప్రత్యేక డైరక్టర్‌గా నియమితులు కావడానికి బిజేపీ జాతీయాధ్యక్షునికి సన్నిహితుడు కావడమే ఆయన ప్రత్యేక అర్హత. ఆయన ఆ పదవిని చేపట్టిన నాటి నుంచి అప్పటి సిబిఐ డైరక్టర్ అలోక్ వర్మకు వ్యతిరేకంగా లాబీయింగ్ చేశారు. అలోక్ వర్మను డైరక్టర్ పదవి నుంచి తప్పించి ఆ పదవిలోకి తాను పదోన్నతి పొందాలని ప్రయత్నించారు. మాంసం వ్యాపారి ఖురేషీ వద్ద మనీ ల్యాండరింగ్ కేసులో మూడున్నర కోట్ల రూపాయలు లంచం తీసుకున్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆస్తానా,అలోక్ వర్మపై అవినీతి ఆరోపణలతో ఎదురు దాడి చేశారు. అయితే అలోక్ వర్మ ఆస్తానాపై ఆరోపణలకు ప్రాథమిక సాక్ష్యాధారాలు ఉన్నందున దర్యాప్తునకు ఆదేశించారు.ఆస్తానాపై దర్యాప్తు చేపట్టిన డిఐజి మనీష్ కుమార్ సిన్హాను నాగపూర్ కి బదిలీ చేయించారు. ఆస్తానా అవినీతిని కప్పిపుచ్చడానికి తీసుకున్న నిర్ణయాలన్నీ మోడీ ప్రతిష్ఠను దెబ్బతీశాయి. ఆస్తానా అమిత్ షా కి మాత్రమే కాదు,మోడీకి కూడా అస్మదీయుడే. సిబిఐని పూర్వపు ప్రభుత్వాలు తమ అదుపు ఆజ్ఞలలో ఉంచుకునేందుకు ప్రయత్నించినప్పటికీ, ఇంత బహిరంగంగా ఏ ప్రభుత్వమూ కూడా జోక్యం చేసుకోలేదు.ఇందుకు ప్రధాన కారణం అమిత్ షాయే.తనను నమ్మి ఉన్నత పదవిలో కూర్చోబెట్టిన మోడీకి చెడ్డపేరు వచ్చేట్టు చేసింది అమిత్ షాయేనని సీబీఐ వర్గాలే కాకుండా, రాజకీయవర్గాలు ఆరోపించాయి.మనీష్ సిన్హా ఏకంగా కేంద్ర మంత్రి హరిభాయ్ పార్థీభాయ్ చౌదరిపైనే తీవ్రమైన ఆరోపణలు చేశారు. మంత్రికి కూడా ముడుపులు అందాయన్న ఆ ఆరోపణను కేంద్రం పట్టించుకుని ఉండి ఉంటే తమ ప్రభుత్వంపై ఒక్క అవినీతి ఆరోపణ కూడా రాలేదంటూ పదే పదే ఊదరగొడుతున్న మోడీ బండారం బయటపడి ఉండేది.పార్థీభాయ్ చౌదరి గుజరాత్‌కి చెందిన వారే కావడం గమనార్హం.అమిత్ షా, ఆస్తానా, పార్థీభాయ్ చౌదరి అంతా గుజరాత్ కి చెందిన వారే. మూడున్నర కోట్ల రూపాయల ముడుపులను గూడుపుఠాణీగా అందరూ కలిసి పంచుకున్నారన్న ఆరోపణలు కూడా వచ్చాయి.అయితే మోడీకి ఈ ముడుపులతో నేరుగా సంబంధం లేకపోయినా,ఈ మొత్తం వ్యవహారం అంతా ఆయన కనుసన్నల్లోనే జరిగింది.అయినా ఆయన ఆయన పట్టించుకోలేదన్న ఆరోపణలు కూడా వచ్చాయి. ఆస్తానాకూ,అలోక్ వర్మకూ రాజీ కుదిర్చేందుకు కేంద్ర విజిలెన్స్ కమిషనర్ కేవీ చౌదరి మధ్యవర్తిత్వం వహించారు.ప్రధానమంత్రి సూచన పైనే ఆయన రంగంలోకి దిగి ఉంటారు. .అయితే ఆస్తానాతో రాజీకి వర్మ అంగీకరించకపోవడంతో ఆయనను కేంద్రం సెలవుపై పంపింది. కేంద్రం చర్యను వర్మ సుప్రీంకోర్టులో సవాల్ చేయగా, సర్వోన్నత న్యాయస్థానం ఆయనకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది.దాంతో విధిలేని పరిస్థితిలో వర్మను సిబిఐ డైరక్టర్ గాతిరిగి నియమించింది. అయితే ,డైరక్టర్ ఎంపిక కమిటీ మళ్ళీ వర్మను అగ్నిమాపక శాఖ ఐజిగా బదిలీ చేసింది. ఈ మొత్తం వ్యవహారాన్ని పరిశీలిస్తే ఆస్తానాను రక్షించడం కోసమే కేంద్రం ఈ చర్యలను తీసుకున్నట్టు స్పష్టం అవుతోంది. జనవరి 31వ తేదీన రిటైర్ కావల్సిఉన్న అలోక్ వర్మను సెలవు పై పంపడాన్ని సుప్రీంకోర్టు తప్పు పట్టడం కేంద్రానికి మొమ్మాటికీ ఎదురు దెబ్బే.మోడీ శిష్యుడు అమిత్ షా వల్లే ప్రభుత్వానికి ఇంతటి ఘోర అవమానం కలిగింది. సిబిఐ పై మీడియాలో వచ్చిన వరుస కథనాలు ఆ సంస్థ విశ్వసనీయతను దెబ్బతీశాయి.. అంతేకాక, అలోక్ వర్మపై ఆస్తానా చేసిన ఆరోపణలకు ఆధారాలు లేవని జస్టిస్ సిక్రీ జరిపిన దర్యాప్తులో తేలింది. సిక్రి పేరును కామన్వెల్త్ ట్రిబ్యునల్‌కు సూచించడం ద్వారా ఆయనను ప్రసన్నం చేసుకోవడానికి ప్రభుత్వం ప్రయత్నించింది.అయితే, ఆ ప్రతిపాదనను జస్టిస్ సిక్రీ తోసి పుచ్చి, వర్మపై ఆరోపణలకు ఆధారాలు లేవని నిక్కచ్చిగా స్పష్టం చేశారు..

ఆస్తానా వ్యవహారాన్ని ఎంత కప్పిపుచ్చాలని కేంద్రం ప్రయత్నిస్తున్నా, ఢిల్లీ హైకోర్టుఆదేశాలు ఆయనకు తీవ్రనిరాశ కలిగించాయి. తనపై దాఖలైన ఎఫ్ ఐఆర్‌ను కొట్టి వేయాలని కోరుతూ ఆస్తానా దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టి వేస్తూ చేసిన వ్యాఖ్యలు ఆస్తానానూ,ఆయన సమర్ధిస్తున్న అమిత్ ,షానూ మరింత ఇబ్బంది పెట్టేవిగా ఉన్నాయి ,ఆస్తానాను విచారించడానికి, అవసరమైతే అరెస్టు చేయడానికి అనుమతులు అవసరం లేదని జస్టిస్ వజిరీ స్పష్టం చేశారు. అమిత్ షాకు ప్రత్యక్ష ప్రమేయం ఉండటం వల్లనే ఆయన ఇంత బహిరంగంగా ఆస్తానాను వెనకేసుకొస్తున్నారనీ, వీరిద్దరి సాన్నిహిత్యం గుజరాత్ నుంచి ప్రారంభమైందనీ, ఆస్తానా వల్ల ప్రభుత్వం కూడా ఊబిలో కూరుకుని పోయే ప్రమాదం ఉండటం వల్లనే ఆయనను సిబిఐ నుంచి తప్పించి ఉండవచ్చు.

చరిత్రలో ఈరోజు

యాపిల్ లీసా విడుదల



జనవరి 19, 1983న యాపిల్ కంపెనీ తొలిసారిగా వాణిజ్య ప్రయోజనాల కోసం ఆపిల్ లీసా అనే కంప్యూటర్‌ను మార్కెట్‌లోకి విడుదల చేసింది. ఇందులో గ్రాఫిక్స్ చేయడానికి వీలైన జీయూఐ ఇంటర్‌ఫేజ్ కూడా ఉండడం విశేషం. ఆ రోజున యాపిల్ లీసా కంప్యూటర్ ఖరీదు 9,995 అమెరికన్ డాలర్లుగా ఉంది. నేటితో డాలర్ విలువతో పోలిస్తే అది 20 వేల డాలర్లకు పై మాటే. అంత ఖరీదైన యాపిల్ లీసా కంప్యూటర్ మార్కెట్‌లో విజయం సాధించలేకపోయింది. యాపిల్ లీసా కంప్యూటర్ హార్డ్ డిస్క్ సామర్థ్యం అయిదు ఎంబీగా ఉండడం నేటి తరాన్ని ఆశ్చర్యానికి గురి చేస్తుంది. ధర ఎక్కువగా ఉండడం, పనితీరు చప్పగా ఉండడం, ముట్టుకుంటే విరిగిపోయేంత బలహీనంగా ఉండే ఫ్లాపీ డిస్కులతో వినియోగదారులను ఆకట్టుకోలేక పోయింది. అయినా ప్రపంచ వ్యాప్తంగా యాపిల్ లీసా పర్సనల్ కంప్యూటర్లు లక్ష వరకు అమ్ముడు పోయాయి. తక్కువ విక్రయాలున్నా.. అత్యధిక ధర కారణంగా యాపిల్ కంపెనీకి ఒక బిలియన్ డాలర్ల ఆదాయం లభించింది. ఈ లాభాల కారణంగానే తరువాత ఈ రంగంలో సంక్షోభం ఏర్పడ్డా.. యాపిల్ కంపెనీ బతికి బట్ట కట్టింది. యాపిల్ లీసా అభివృద్ధిని 1978లో మొదలు పెట్టారు. లీసా మార్కెట్‌లోకి రావడానికి ఒక ఏడాది ముందు అంటే 1982లో స్టీవ్ జాబ్స్ ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకొని మెకంతోష్‌లో చేరారు. లీసా కన్న తక్కువ స్థలంలో ఎక్కువ సామర్థ్యంతో, తక్కువ ధరతో మెకంతోష్ మార్కెట్‌లోకి రావడంతో లీసా అధ్యాయం ముగిసింది. లీసాను అభివృద్ధి చేయడానికి యాపిల్ కంపెనీ చేసిన ప్రయత్నాలు పెద్దగా ఫలించలేదు.


పునెలో ఓషో తుదిశ్వాస



ప్రపంచవ్యాప్తంగా శిష్యులను సంపాదించుకున్న ఆచార్య రజనీశ్ జనవరి 19, 1990న పునెలో తుదిశ్వాస విడిచారు. డిసెంబర్ 11, 1931న మధ్యప్రదేశ్‌లోని రైసెన్ జిల్లాలో జన్మించిన రజనీశ్‌కి తల్లిదండ్రులు పెట్టిన పేరు చంద్ర మోహన్ జైన్. బాబులాల్, సరస్వతి జైన్ దంపతుల్లో పదకొండో సంతానమైన బాబులాల్ తన ఏడో ఏట వరకు అమ్మమ్మ, తాతయ్యల వద్ద పెరిగాడు. స్కూళ్లో ఉన్నప్పుడే రజనీశ్ మంచి వక్తగా పేరొందాడు. జబల్పూర్‌లోని రెండు కాలేజీల్లో చదివిన రజనీశ్‌ను శిష్యులు ఓషోగా, భగవాన్‌గా పిలుచుకుంటారు. కాలేజీలో అధ్యాపకుల బోధనలతో విభేదించిన రజనీశ్ చదువును మధ్యలోనే ఆపేశారు.

చదువు మానేసిన తరువాత ఒక స్థానిక దినపత్రికలో సబ్ ఎడిటర్‌గా పార్ట్ టైమ్ ఉద్యోగం చేస్తూ.. జబల్పూర్‌లో నిర్వహించే మతపరమైన సమావేశాల్లో ప్రసంగించడం ప్రారంభించారు. ఆ తరువాత యూనివర్సిటీ ఆఫ్ సాగర్‌లో ఎమ్‌ఏ ఫిలాసఫీ చేశారు. భారతీయ మతాల్లోని మూఢ విశ్వాసాలను విమర్శిస్తూ, పెట్టుబడిదారీ విధానం, ఆధునిక శాస్త్ర ప్రయోజనాలపై దేశ వ్యాప్తంగా ఉపన్యాసాలు ఇచ్చేవారు. 1962లో ధ్యాన శిబిరాలను ప్రారంభించడంతో రజనీశ్ పేరు ప్రఖ్యాతులు పెరిగిపోయాయి. ధనిక వ్యాపార వర్గాల్లో రజనీశ్‌కి అనుచరులు పెరిగింది. 1966లో ఉపాధ్యాయ వృత్తిని వదిలేసి.. దేశంలోని ప్రధాన నగరాల్లో భారీ యెత్తున ధ్యాన సమావేశాలు నిర్వహించేవారు. 1970 తొలి నాళ్లలో రజనీశ్ వద్దకు విదేశీయులు రావడం మొదలు పెట్టారు. వారి ఆర్థిక సహాయంతో రజనీశ్ పూనె వద్ద స్థలం కొని ఆశ్రమం నిర్మించారు.

డీసీ వైపే ఎడిసన్ మొగ్గు



విద్యుత్ బల్బుల సృష్టికర్త థామస్ ఆల్వా ఎడిసన్ వాటిని వాణిజ్యపరంగా వినియోగంలోకి తీసుకొని రావడంలో ఎన్నో దశలు దాటాల్సి వచ్చింది. జనవరి 19, 1883 అమెరికాలోని న్యూ జెర్సీలోని రోజెల్లీ వీధిలో వైర్ల సహాయంతో తొలి ప్రామాణిక ఇన్‌కాండిసెంట్ ఎలక్ట్రిక్ వ్యవస్థ సేవలు మొదలయ్యాయి. దీంతో ఎడిసన్‌కి పోటీదారుల నుంచి విద్యుత్ యుద్ధం మొదలైందని చెప్పాలి. ఎడిసన్ డీసీ కరెంట్‌తో విద్యుత్ బల్బుల వ్యవస్థను నెలకొల్పితే.. ప్రత్యర్థులు ఏసీ కరెంటుతో మార్కెట్లోకి వచ్చారు. ఏసీ కరెంటుతో పలుచటి వైర్లతో తక్కువ విద్యుత్ నష్టంతో నాణ్యమైన సేవలందించడం మొదలవడంతో ఎడిసిన్ కంపెనీకి కష్టాలు మొదలయ్యాయి. డైరెక్ట్ కరెంటుతో మైలు లోపలి వినియోగదారులకే ఎడిసన్ కంపెనీ విద్యుత్ సరఫరా చేసేది. ఎడిసన్ ప్లాంట్‌కి కిలోమీటర్ పరిధిలోని గృహాలు, వీధులకే విద్యుత్ సరఫరా అయ్యేది. ఆపై ప్రాంతాలు చీకట్లో మగ్గి పోవాల్సి వచ్చేది. ఈ సమస్యలను ఏసీ కరెంటు తీర్చడంతో నెమ్మదిగా మార్కెట్ నుంచి డీసీ కరెంటు తప్పుకోవాల్సి వచ్చింది. పైగా ఎడిసన్ ఏసీ కరెంటు ప్రమాదమని, మృత్యువుతో సమానమని హెచ్చరించడం విశేషం. ఎంతో విశేష అనుభవం ఉన్న, అపార సృజనశక్తి ఉన్న ఎడిసన్ ఈ విషయంలో పూర్తిగా విఫలం కావడం వింతైన విషయమే. తన డీసీ కరెంటుకి ఉన్న పరిమితులను ఏసీ కరెంటు అధిగమిస్తున్నా.. ఏసీ కరెంటు ప్రాణాలను హరిస్తుందని ఎడిసన్ వాదించే వారు. చివరికి ఏసీ కరెంటు వినియోగంతోనే ప్రపంచవ్యాప్తంగా విద్యుదీకరణ సాధ్యమైందన్నది చరిత్ర!

సారథి కాదు.. వారధీ కాదు!



సార్వత్రిక ఎన్నికల వేళ... దేశ రాజకీయాల్లో పరిణామాలు రోజురోజుకు మారిపోతున్నాయి. నిన్నా మొన్నటి వరకు కలిసి ప్రయాణం సాగించిన పార్టీలు ఇప్పుడు ప్రత్యర్థులుగా మారుతున్నాయి. ప్రత్యర్థులుగా ఉన్న పార్టీలు మిత్రపక్షాలుగా మారిపోతున్నాయి. మొన్నటి కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల నాటి నుంచి నిన్న ఉత్తర్‌ప్రదేశ్‌లో ఎస్పీ-బీఎస్పీ మైత్రి వరకు పరిశీలిస్తే... ఇదే అవగతమవుతుంది. దేశ రాజకీయాల్లో అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీల నేతృత్వంలో జాతీయ స్థాయిలో ఎన్డీఏ, యూపీఏ పేరుతో కూటములు కొనసాగుతున్నాయి. అయితే తాజా రాజకీయ పరిణామాలు కాంగ్రెస్ పార్టీకి చేదు అనుభవాలు మిగిల్చాయి. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో అతితక్కువ స్థానాలు గెలుచుకున్న జేడీఎస్‌కు ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టి, కాంగ్రెస్-జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వం కొలువుదీరింది. ఈ ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ చూపిన చొరవే కారణం. బీజేపీని అధికారంలోకి రాకుండా అడ్డుకోవడమే లక్ష్యంగా కాంగ్రెస్, జేడీఎస్‌తో చేతులు కలిపింది. దీనికి జాతీయ స్థాయిలో ప్రధానంగా బీజేపీ వ్యతిరేక పక్షాలు హర్షం వ్యక్తం చేస్తూ... సంపూర్ణ మద్దతు తెలిపాయి. అదే ఒరవడి రానున్న వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లోనూ అమలుకు కాంగ్రెస్ యత్నిస్తుందని పలు ప్రాంతీయ పార్టీలు అభిలషించాయి. ఎన్నికలకు ముందే కాంగ్రెస్ పార్టీ ప్రాంతీయ పార్టీలతో పొత్తులు పెట్టుకుంటే మంచిదని భావించాయి. అయితే ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పెద్దన్న పాత్ర పోషించడంతో ప్రాంతీయ పార్టీలు తమదారి చూసుకున్నాయి. ఇందులో ప్రధానంగా మాయావతి, అఖిలేష్ నేతృత్వంలోని బీఎస్పీ, ఎస్పీలు మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో విడివిడిగా పోటీ చేయడంతో కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ తగలింది. ఆయా రాష్ట్రాల్లో అతిపెద్ద పార్టీగా కాంగ్రెస్ అవతరించడంతో అధికారంలోకి వచ్చింది తప్ప, ఘన విజయం సాధించలేదని చెప్పవచ్చు. అలాగే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలలో కూడా ఆ పార్టీ ఘోర పరాభవాన్ని ఎదుర్కొన్నది. తాజాగా ఉత్తర్‌ప్రదేశ్‌లో రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఎస్పీ- బీఎస్పీ చెరో 38 స్థానాల్లో పోటీ చేయ నున్నట్లు మాయావతి, అఖిలేష్ ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీకి రెండు స్థానా లు అమేథీ, రాయ్ బరేలీ కేటాయించాయి. కాంగ్రెస్ అంగీకరించక పోయినా, ఆ స్థానాల్లో తమ కూటమి పోటీ చేయదు, కాంగ్రెస్‌కు మద్దతిస్తున్నట్లు ప్రకటించారు. ఈ పరిణామాలు చూస్తుంటే... జాతీయ రాజకీయాలలో కాంగ్రెస్ ప్రాధాన్యత రెండో స్థానానికి పరిమితం కాబోతోందా? పరిస్థితులను గమనిస్తుంటే అలాగేఅనిపించక తప్పదు. నూటముప్పై ఏళ్లకు పైగా రాజకీయ చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీ స్వాతంత్ర్యానంతరం దేశంలో అత్యధికకాలం అధికారంలో ఉంది. మారుతున్న పరిస్థితుల దృష్ట్యా ఆ పార్టీ నెమ్మదిగా తన పూర్వ వైభవాన్ని కోల్పోతూ వస్తున్నది. ముఖ్యంగా 2014 ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీ పరాజయ పరాభవం నుంచి కోలుకుంటుందా? అన్న అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయితే ఈ నాలుగున్నరేళ్ల కాలంలో పార్టీ పుంజుకున్నది. ఇప్పటికీ కాంగ్రెస్ పార్టీ ఒంటరిగా ఎన్నికలలో పోటీ చేసి అత్య ధిక స్థానాలు గెలుచుకునే పరిస్థితి కనిపించడం లేదు. ఇందు కు ఇటీవలి కాలంలో జరిగిన పలు ఎన్నికలు నిదర్శనం. గుడ్డిలో మెల్ల చందాన ఐదు రాష్ట్రాల ఎన్నికలలో మూడు రాష్ట్రాలలో అధికారంలోనికి వచ్చినప్పటికీ.. కాంగ్రెస్ పార్టీ ఆయా రాష్ట్రాలలో పూర్తి ఆధిపత్యం సాధించిందని చెప్పలేని పరిస్థితి నెలకొంది. కర్నాటక అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా వ్యవహరించడంతో జేడీఎస్‌తో కలిసి సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉంది. అదే ఫార్ములాను జాతీయ స్థాయిలో అమలు చేసి బీజేపీని అధికారంలోకి రాకుండా దూరంగా ఉంచగలమని కాంగ్రెస్ భావిస్తున్నది. అయితే బీజేపీయేతర కూటమిలో కాంగ్రెస్‌కు అగ్రతాంబూలం ఇవ్వడా నికి ఆ కూటమి ఏర్పాట్లలో క్రియాశీలంగా వ్యవహ రిస్తున్న పార్టీలేవీ ముందుకు రావడం లేదు. బీఎస్పీ, ఎస్పీ, తృణమూల్, ఎన్సీపీ వంటి పార్టీలు కాంగ్రెస్ నేతృత్వంలో కూటమి ఆవిర్భావానికి ఇప్పటికీ సుముఖంగా లేవు. తెలంగాణ అనుభవం తరువాత ఏపీ సీఎం చంద్రబాబు కూడా కాంగ్రెస్‌కు కూటమిలో అగ్రతాంబూలం ఇచ్చే విషయంలో పునరాలోచనలో పడినట్లు కనిపిస్తున్నది. ఇటీవల చంద్రబాబు ఓ ఇంటర్వ్యూలో సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్‌తో సీట్ల సర్దుబాటు ఉండే అవకాశం లేదని చెప్పడమే ఇందుకు నిదర్శనం.

ఇటు చంద్రబాబు, అటు మమతాబెనర్జీ మాటలనుబట్టి చూస్తే జాతీయ స్థాయిలో బీజేపీయేతర కూటమి ఏర్పాట్లు కొనసాగుతాయి. ఆ కూటమిలో కాంగ్రెస్ కూడా భాగస్వామ్య పార్టీగా మాత్రమే ఉంటుంది. అయితే కూటమికి కాంగ్రెస్ నేతృత్వం వహించదు. ఈ షరతులు కాంగ్రెస్‌కు రుచించినా, రుచించకపోయినా.. కూటమిలో కొనసాగాల్సిన రాజకీయ అనివార్యతను ఇప్పుడు కాంగ్రెస్ ఎదుర్కొంటున్నదన్నది వాస్తవం. కర్నాటకలో ఎలాగైతే ముఖ్యమంత్రి పదవిని జేడీఎస్‌కు వదిలి సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండటం ద్వారా బీజేపీని రాష్ట్రంలో అధికారం చేపట్టకుండా అడ్డుకోవడంలో వ్యూహాత్మకంగా వ్యవహరించిందో.. జాతీయ స్థాయి కూటమిలో కూడా అలాగే భాగస్వామిగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాంగ్రెస్ అందుకు సంసిద్ధంగా ఉండటానికి ఆ పార్టీ సుముఖంగా ఉన్నట్లే కనిపిస్తున్నది. అందుకే ఇటీవల చెన్నైలో ఒక కార్యక్రమంలో డీఎంకే నాయకుడు స్టాలిన్ కూటమి ప్రధాని అభ్యర్థి రాహుల్‌గాంధీ అని ప్రకటించడం కూటమి నేతలలో కలకలం సృష్టించింది. స్వయంగా కాంగ్రెస్ సీనియర్ నేతలే అది స్టాలిన్ వ్యక్తిగత అభిప్రాయం మాత్రమేనని వివరణ ఇవ్వాల్సిన పరిస్థితి వచ్చింది. ఇక కూటమిలో కీలక భాగస్వాములుగా భావిస్తున్న ఎస్పీ, బీఎస్పీలు యూపీలో తాము కలిసి పోటీ చేస్తున్న విషయాన్ని ప్రకటిస్తూ కూటమి సీట్ల సర్దుబాటులో భాగంగా రాష్ట్రంలో కాంగ్రెస్‌కు కేవలం రెండు సీట్లు మాత్రమే కేటాయిస్తామని తేల్చేశారు. అదే విధంగా పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ కూడా ఆ రాష్ట్రంలో కాంగ్రెస్‌కు సీట్ల సర్దుబాటులో పెద్ద భాగం ఇచ్చే అవకాశాలు కనిపించడం లేదు.

తాజాగా ఏపీ సీఎం చంద్రబాబు కూడా తమ రాష్ట్రంలో కాంగ్రెస్‌తో సీట్ల సర్దుబాటులు అవకాశాలు పెద్దగా లేవని చెప్పేశారు. అంటే కూటమిగా కలిసి సాగినా కాంగ్రెస్‌ను భాగస్వామ్య పార్టీగా మాత్రమే గుర్తిస్తున్నాయి తప్ప తమ కూటమికి నేతృత్వం వహించేందుకు సుముఖత వ్యక్తం చేయడంలేదు. ఈ స్థితి అంగీకారయోగ్యం అయినా కాకున్నా సరిపెట్టుకోక తప్పని పరిస్థితుల్లో ప్రస్తుతం కాంగ్రెస్ ఉంది. అలా కాకుండా ఒంటరి పోరుకు సిద్ధపడితే ప్రస్తుత పరిస్థితిలో ఎలాంటి మార్పు ఉండబోదని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

• గొర్తి చంద్రశేఖర్

రాష్ట్రాలకు కొత్త రూపమివ్వాలి!

నైసర్గికంగా, జనాభా రీత్యా అతి పెద్దదైన ఉత్తరప్రదేశ్‌ని నాలుగు రాష్ట్రా లుగా విభజించాలని ఎనిమిదేళ్ళ క్రితం రాష్ట్ర ముఖ్యమంత్రిగా వ్యవహరించిన బహుజన సమాజ్‌పార్టీ అధ్యక్షురాలు మాయావతి ప్రతిపాదించారు.ఉత్తరప్రదేశ్ ని నాలుగు రాష్ట్రా లుగా --- పూర్వాంచల్ (తూర్పు యూపీ), పశ్చిమ ప్రదేశ్ (పశ్చిమ ఉత్తరప్రదేశ్), బుందేల్ ఖండ్ (దక్షిణ ఉత్తరప్రదేశ్), అవధ్ ప్రదేశ్ (మధ్య ఉత్తరప్రదేశ్),విభజించాలన్న ప్రతిపాదనను చేశారు.అంతకుముందు కూడా ఈ ప్రతిపాదన చర్చకు వచ్చింది. ఉత్తరప్రదేశ్ బ్రెజిల్ దేశంతో సమాన పరిమాణంలో ఉండగా, పుదుచ్చేరి వంటి కేంద్ర పాలిత ప్రాంతాలు మహానగరాల కన్నా తక్కువ విస్తీర్ణంలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రా లకు కొత్త రూపమివ్వాలన్న డిమాండ్ తెరమీదికి వచ్చింది.ఉత్తరప్రదేశ్ విభజనపై ఇప్పుడు చర్చ జరుగుతోంది. దేశంలో అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్ జనాభా 20 కోట్లు పైనే. ప్రపంచంలోనే అతిపెద్దది.ఈ శతాబ్దం మధ్యనాటికి రాష్ట్ర జనాభా 42 కోట్లకు పెరగవచ్చని అంచనా. దేశ జనాభాలో 16.5 శాతం మంది ఉత్తరప్రదేశ్ లోనే ఉన్నారు.2050 నాటికి వీరి శాతం 25 కి దగ్గరగా ఉండవచ్చు. అత్యంతాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎంత ఉపయోగించినా,పటిష్ఠమైన రాజకీయ నాయకత్వానికి పగ్గాలు అప్పగించినా రాష్ట్రంలో సక్రమంగా,సజావుగా పాలనను అందించడం అసాధ్యం.భౌగోళికంగా రాష్ట్రం చాలా పెద్దది.మారు మూల ప్రాంతాల నుంచి రాజధాని లక్నో చేరుకోవడం శ్రమతో కూడిన వ్యవహారం.రాష్ట్రంలో 75 జిల్లాలు ఉన్నాయి.820 పైగా బ్లాకులు ఉన్నాయి.52 వేలుపైగా గ్రామ పంచాయితీలు ఉన్నాయి.

వీటిల్లో అధికార వికేంద్రీకరణ ఎంత పటిష్ఠంగా అమలు జరిపినా సుపరిపాలన అందించడం సాధ్యం కాదు సువిశాలమైన ఉత్తరప్రదేశ్ పరిమాణంపై ఎంతో కాలంగా ఆందోళన వ్యక్తం అవుతోంది.1952 జూలై ఏడవ తేదీన ఆనాటి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ తన ప్రసంగంలో ఇలా పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్‌ని నాలుగు రాష్ట్రా లుగా చేయాలన్న ప్రతిపాదన ఏదైనా వస్తే వ్యక్తిగతంగానేను అంగీకరిస్తాను.అయితే, ఉత్తరప్రదేశ్ కి చెందిన మా మిత్రులకు అది ఆమోద యోగ్యం అవుతుందన్నది సందేహమే.అందుకు భిన్నంగా ఇతర రాష్ట్రా ల నుంచి మరి కొంత భాగాన్ని తమ రాష్ట్రంలో కలపాలని కోరతారు. భాషా ప్రయుక్త రాష్ట్రాలపై ఆలోచనలు అనే మకుటంతో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాసిన గ్రంథంలో ఉత్తరప్రదేశ్‌ని మూడు రాష్ట్రా లుగా విభజించాలని సూచించారు.ఇందువల్ల మూడు ప్రయోజనాలు ఉంటాయని పేర్కొన్నారు.ఒకటి పాలనా సామర్థ్యం పెరుగుతుంది

మెజారిటీ సామాజిక వర్గంచేతిలో అధికారం కేంద్రీకృతం కాకుండా చూడటం,మైనారిటీలు, బడుగు వర్గాల ప్రయోజనాలను కాపాడటం వంటి ప్రయోజనాలు ఒనగూరుతాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రా ల పునర్వ్యవస్థీకరణ కమిషన్ దక్షిణ భారతాన్ని న్యాయమైన రీతిలో పునర్వ్యవస్థీకరించలేదని అంబేద్కర్ తన గ్రంథంలో పేర్కొన్నారు. రాజకీయంగా ఎక్కువ పలుకుబడి కలిగిన ఉత్తరభారతాన్ని అసలు పట్టించుకోనే లేదని కూడా ఆయన స్పష్టం చేశారు.రాష్ట్రా ల పునర్వ్యవస్థీకరణ కమిషన్ ఉత్తరప్రదేశ్ పునర్వ్యవస్థీకరణకు సిఫార్సు చేయలేదని కూడా పేర్కొన్నారు.అయితే, కెఎం ఫణిక్కర్ తుది నివేదికలో తన అసమ్మతి పత్రాన్ని జోడించారు.భౌగోళికంగా పెద్దదైన ఉత్తరప్రదేశ్‌ని అలాగే విడిచి పెట్టడం పట్ల ఆందోళన వ్యక్తంచేశారు. మన రాజ్యాంగంలో ప్రధానమైన, మౌలికమైన బలహీనత ఏమిటంటే, ఒక యూనిట్‌నుంచి మరో యూనిట్‌కు అసాధారణమైన తేడా ఉండటం.ఆగ్రా రాజధానిగా కొత్త రాష్ట్రా న్నిఏర్పాటు చేయాలని సూచించారు.అనూహ్యమైన రీతిలో అతి పెద్ద పరిమాణం ఉత్తరప్రదేశ్‌లో సమర్థవంతమైన పాలనకు అడ్డంకిగా ఉంటుందని కూడా ఫణిక్కర్ పేర్కొన్నారు. అయితే, గోవింద్ వల్లభ పంత్ అప్పట్లో ఉత్తరప్రదేశ్ విభజన జరగకుండా ఒంటరిగా అడ్డుకోగలిగారు.అయితే, అదే సందర్భంలో ఉత్తరప్రదేశ్ పునర్వ్యవస్థీకరణకు తాను అడ్డంకి కాబోనని కూడా ఆయన స్పష్టం చేశారు.పాలనా పరంగా అవసరమైతే రాజ్యాంగంలోని 3వ అధికరణం ప్రకారం రాష్ట్ర శాసనసభ అనుమతి లేకుండానే విభజించవచ్చని ఆయన అన్నారు. విభజనకు రాష్ట్ర శాసనసభ అనుమతి అవసరం లేదనీ, ఏ రాష్ట్రం సరిహద్దులనైనా మార్చే సంపూర్ణాధికారం పార్లమెంటుకు ఉంది.అయితే, పార్లమెంటు ఆమోదించిన బిల్లును రాష్ట్ర పతి రాష్ట్ర శాసనసభ అభిప్రాయాలను తెలుసుకునేందుకు పంపవచ్చు. ఆంధ్రప్రదేశ్ ని అదే రీతిలో విభజించారు ఉత్తరప్రదేశ్ ని నాలుగు రాష్ట్రా లుగా --- పూర్వాంచల్ (తూర్పు యూపీ), పశ్చిమ ప్రదేశ్ (పశ్చిమ ఉత్తరప్రదేశ్), బుందేల్ ఖండ్ (దక్షిణ ఉత్తరప్రదేశ్), అవధ్ ప్రదేశ్ (మధ్య ఉత్తరప్రదేశ్),విభజించాలన్న ప్రతిపాదనను చేశారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో మెజారిటీ నిర్ణయానికి వ్యతిరేకంగా పార్లమెంటు ఉమ్మడి రాష్ట్రా న్ని విభజించగలిగినట్టే, భౌగోళికంగా,పరిమాణం పరంగా,జనాభా పరంగా పెద్దదైన ఉత్తరప్రదేశ్ విభజనకు అర్హమైనదే.ఈ విషయంలో జోక్యం తప్పు కాదు.భారతదేశంలో కొత్త రాష్ట్రా ల ఏర్పాటుకు డిమాండ్ వచ్చినప్పటికీ ఆ డిమాండ్ వాంఛనీయం కాకపోయినా, సాధ్యం కాకపోయినా సృజనాత్మకంగా ఆ సమస్యను పరిష్కరించింది.ఉదాహరణకు అసోంలో బోడోలాండ్ ప్రాదేశిక పాలకమండలిని ఏర్పాటు చేసింది.ఎనిమిదేళ్ళ తర్వాత పశ్చిమ బెంగాల్ లో గూర్ఖాలాండ్ ప్రాదేశిక పాలకమండలిని ఏర్పాటు చేసింది.

అసోం,జమ్ము,కాశ్మీర్, మణిపూర్, మిజోరం, త్రిపురలలో స్వతంత్ర ప్రతిపత్తి గల మండళ్ళు ఉన్నాయి.ఇవి పాలనా పరమైన సౌలభ్యం కోసం ఏర్పాటు చేసినవే. వీటి ఏర్పాటు వల్ల విభజన డిమాండ్లను కేంద్రం నిరోధించగలిగింది.రాష్ట్రా ల పునర్వ్యవస్థీకరణకు రెండో కమిషన్ ను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనకు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సుముఖతను వ్యక్తంచేస్తున్నాయి.అధికారంలోకి రాగానే దీని వల్ల పుట్టగొడుగుల్లా కొత్త సమస్యలు పుట్టుకొస్తాయని భయాన్ని వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రా ల పునర్వ్యవస్థీకరణకు రెండో కమిషన్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనపై వాయిదా వేయకుండా వెంటనే చర్చ జరగాలి.

• తేజోన్మయ్

పంచాయితీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోండి

భారత రాజ్యాంగంలో పంచాయితీరాజ్ వ్యవస్థనూ బలోపేతం చేయటానికి ప్రత్యేక అధికరణం చేర్చడం జరిగింది. గ్రామాలను స్వయంపాలిత ప్రాంతాలుగా తీర్చిదిద్దాలనే భావన ఉంది. గ్రామాలు దేశానికి వెన్నెముకవంటివి. గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుంది. అలాంటి గ్రామాలను పాలించే బాధ్యత సర్పంచ్ లకు కల్పించబడింది. నూతనంగా ఎంపికయ్యే సర్పంచ్‌లు కులాలకు అతీతంగా, రాజకీయాలకు అతీతంగా గ్రామాలనూ అభివృద్ధి చేయాలి. చదువుకొన్న యువతరం ముందుకు రావాలి. సర్పంచ్ ఎంపీటీసీ,జెడ్ పీటీసీ ఎన్నికల్లో పాల్గొని గ్రామాలను అభివృద్ధి చేయాలి. గ్రామస్థాయిలో ఉండే చట్టాలు పీసా చట్టం, 1/70చట్టం, తదితర చట్టలను అమలు చేయాలి. గ్రామాలఅభివృద్ధి ద్వారా పంచాయితీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేయాలి. చిన్న చిన్న పంచాయితీలనూ ఏకగ్రీవం చేయడం మూలంగా ప్రభుత్వం ఇచ్చే పారితోషికాలుకు అర్హత పొందుతాయి. . చాలా వరకు ఏజెన్సీ ప్రాంతంలో గ్రామపంచాయితీలను ఏకగ్రీవం చేయటం ద్వారా గ్రామ ప్రజల ఐక్యతను ఈ ప్రపంచానికి చాటి చెప్పినవాళ్ళు అవుతారు. అందువల్ల గ్రామపంచాయితీ ఎన్నికల్లో మహిళలు, రైతులు, విద్యార్థులు ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు ఉత్సాహంగా నామినేషన్లు వేసి ఎన్నికల్లో పాల్గొని మీ గ్రామాలనే మీరే అభివృద్ధి చేసుకోండి. ప్రతి 5సంవత్సరాల కొకసారి వచ్చే సువర్ణవకాశం యువతరానికి ఇదొక సదావకాశం. ఓటు హక్కును వినియోగించుకోండి గ్రామాలనూ అభివృద్ధి చేసుకోండి. గ్రామ అభివృద్ధికి పునాదులు వేయండి, దేశ అభివృద్ధికి బాటలు వేయండి. పంచాయితీ రాజ్ వ్యవస్థనూ బలోపేతం చేయండి. ఏజెన్సిలో చిన్న చిన్న పంచాయితీలనూ ఏకగ్రీవంగా ఎన్నుకోండి. ప్రభుత్వానికి భారం తగ్గించండి. గ్రామస్థాయిలో గ్రామపంచాయితీలకు అస్థిత్వం కల్పించండి. గ్రామ పంచాయితీలనూ గ్రామ సెక్రటేరియట్‌లుగా మార్చి గ్రామ ప్రజల సమస్యలు పరిష్కరించండి.

- పూకె రామకృష్ణ దొర

ఆదివాసుల ఆకాంక్షకు ప్రతిరూపం ములుగు జిల్లా

అడవి బిడ్డల ఆత్మనినాదపు ఆకాంక్షకు ప్రతిరూపం త్వరలో ఏర్పడనున్న జిల్లా ములుగు. ఆదివాసీ పోరాట ధరవనితలైన సమ్మక్క, సారక్కల సన్నిధిలో అటవీ జీవనం కొనసాగిస్తున్న ఆదివాసీ గిరిజనులు, మైదాన గిరిజన, గిరిజనేతరులకు కొత్తగా ములుగు జిల్లా ఏర్పాటుతో వారి కల నెరవేరబోతుంది. 2016, అక్టోబర్ 13న ఏర్పడిన జిల్లాల పునర్విభజనలో ములుగు ప్రాంతం జయశంకర్ భూపాలపల్లిలో కలిసి ఉంది. ఇందులో పూర్తిగా గిరిజనులు నివసించే రాజ్యాంగ పరమైన ఏజెన్సీ ప్రాంతాలు - ఏటూరునాగారం, మంగపేట, తాడ్వాయి, మణుగూరు, వెంకటాపురం, గోవిందరావు పేట, ములుగు మండలాలు ప్రస్తులం భూపాలపల్లిలో మిళితమై ఉన్నాయి. నూతన ములుగు జిల్లాలో చేరుతున్న మణగూరు, వెంకటాపురంలతోపాటు కొత్తగూడ, గంగారం మ ండలాలను తక్షణమే చేర్చాల్సిన చారిత్రక అవశ్యకత ఉందని ఆదివాసీ నాయకులు పోరాటం చేస్తున్నారు. సుమారు 28 వేల జనాభా కలిగిన ఉమ్మడి కొత్తగూడ మండలం వెనుకబడిన ఏజెన్సీ ప్రాంతం వీటితో పాటు ఆసియా ఖండంలోనే జాతర అతిపెద్ద గిరిజన జాతరగా పేరుగాంచినది మేడారం సమ్మక్క, సారక్కల జాతర ఆదివాసీ వీరవనితలైన వీరి పేర్లతో ములుగుకు నామకరణం జరిగితే బాగుంటుంది.

ఉమ్మడి వరంగల్‌లో వున్న కొత్తగూడ, గంగారం మండలాలు జిల్లాల పునర్విభనలో వీటిని మహబూబాబాద్ జిల్లాలో కొనసాగడం వల్ల సుమారు 100కి.మీ. దూరంలో వున్న గిరిజనులు రాక పోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రెండు మండలాకు జిల్లా కేంద్రం, రెవెన్యూ డివిజన్ మహబూబాబాద్ కావడం, శాసన సభా నియోజక వర్గం ములుగు 50కి.మీ దూరంలో ఉండటం, ఏకైక ఐ.టి.డి.ఏ కార్యాలయం మరో 100కి.మీ.దూరం గల ఏటూరునాగారం లో ఉండటం భౌగోళికంగా చెల్లాచెదురుగా, అస్తవ్యస్తంగా ఉంది., ప్రతీ రెండేళ్ళకొకసారి జరిగే మేడారం సమ్మక్క, సారక్క జాతర ఆరంభంపడి ఉంది. సుదూరమైన గంగారం మండలంలోని పూనుగొండ్ల నుంచి కోయజాతి వడ్డెలైన పెనక వంశీయులు సుమారు 50. కి.మీ.ల కాలినడకన పడిగిద్దరాజును తీసుకెళ్తారు. అదీ దట్టమైన అడవిలో రామారం, కర్లపల్లి, లక్ష్మీపురం మీదుగా ఒకరాత్రి బసచేసిన వడ్డెలు ఇబ్బందులనెదుర్కొంటూ మేడారానికి తీసుకెళ్తారు. సమ్మక్క భర్త ఉండేపూనుగొండ్ల గంగారం మండలంలో వున్నందున దాన్ని ములుగులో చేర్చక పోవడం అక్కడి ఆదివాసీలను వంచనకు గురిచేయడమే ఇలా సమ్మక్క పడిగిద్ద రాజులు గల ప్రాంతాలను జిల్లాల పేరుతో విడిపోతే భార్యాభర్తాలను వేరుచేయడం లాంటిదే కాదు ఆదివాసిల వారసత్వాన్ని చుట్టరికాన్ని ఆచార సాంప్రదాయాలను ఆటంక పరచడమే అవుతుంది.

- గుమ్మడి లక్ష్మీనారాయణ

7989134271



23 నుంచి సాహితీ ఉత్సవాలు

• పర్యాటక శాఖ కార్యదర్శి వెంకటేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సాహిత్యం, కళలు పరిరక్షణలో భాగంగా హైదరాబాద్ సాహితీ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు పర్యాటక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం చెప్పారు. ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో 9వ హైదరాబాద్‌సాహితీ ఉత్సవాల సమావేశాలు జరుగుతాయన్నారు. ఈ సదస్సులో సాహిత్యం, కళలకు సంబంధించి వర్క్‌షాప్, ప్రదర్శనలు, లఘు చిత్రాలు, చర్చాగోష్ఠి వంటి కార్యక్రమాలను నిర్వహిస్తామని ఆయన చెప్పారు. శుక్రవారం సచివాలయంలో మీడియా ప్రతినిధుల సమావేశంలో వెంకటేశం మాట్లాడారు.. సాహితీ ఉత్సవాల్లో చైనా నుంచి ఎనిమిది మంది, ఆస్ట్రేలియా నుంచి ఎనిమిది మంది ప్రతినిధులు పాల్గొంటారని ఆయన తెలిపారు. అలాగే గుజరాత్ సాహిత్య పరిషత్ నుంచి ప్రతినిధులు హాజరవుతారని ఆయన తెలిపారు. మహాత్మాగాంధీ 150వ జయంతి పురస్కరించుకుని గాంధీపై తీసిన సినిమా ప్రదర్శనతో పాటు ఆయన ఆదర్శభావాలపై చర్చించడం జరుగుతుందన్నారు.

విదేశీ విద్యానిధికి 42 మంది ఎస్సీ విద్యార్థుల ఎంపిక

• ఎస్సీ అభివృద్ధి శాఖ సంచాలకుడు కరుణాకర్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్రంలో 42 మంది ఎస్సీ విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించడానికి అంబేద్కర్ విదేశీ విద్యానిధి పథకానికి ఎంపిక చేసినట్టు ఎస్సీ అభివృద్ధి శాఖ సంచాలకులు కరుణాకర్ తెలిపారు. విదేశాల్లో ఉన్నత విద్య చదవడం కోసం ఎస్సీ విద్యార్థులు 48 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. శుక్రవారం నిర్వహించిన ఇంటర్వ్యూలో 45 మంది పాల్గొన్నారని వారిలో 42 మందిని ఎంపిక చేసినట్టు కరుణాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. విదేశీ విద్యానిధికి ఎంపికయిన వారు ఇంజనీరింగ్ మేనేజ్‌మెంట్, అగ్రికల్చర్ సైన్సెస్, మెడిసిన్, నర్సింగ్, సోషల్‌సైన్సెస్, హ్యూమానిటీస్‌లో పీజీ, ఆపై కోర్సులు చదవడానికి వారికి రూ. 20 లక్షలు ఆర్థిక సాయం చేయనున్నట్టు తెలిపారు. వారికి విమాన ప్రయాణ ఖర్చులతోపాటు, వీసా ఖర్చులు ఇవ్వనున్నట్టు తెలిపారు. శుక్రవారం నిర్వహించిన ఇంటర్వ్యూలో ఎస్సీ కులాల అభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా పాల్గొన్నారని తెలిపారు.

నిరుద్యోగ బీసీ యువతకు ఉచిత శిక్షణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని వెనుకబడిన తరగతుల్లో(బీసీ)ని నిరుద్యోగ యువతకు వివిధ రంగాల్లో ఉచితశిక్షణను ఇవ్వనున్నట్టు బీసీ స్టడీ సర్కిల్ డైరక్టర్ తెలిపారు. ఇందుకు సంబంధించిన శిక్షణను అపోలో వారి మెడ్‌స్కిల్స్, స్టెప్ సంస్థ ద్వారా హోటల్ మేనేజ్‌మెంట్, జీఎంఆర్ వారి ద్వారా ద్విచక్ర వాహనాల రిపేరు, సోలార్ టెక్నిషియన్, హౌస్ వైరింగ్ తదితర అంశాలపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు బీసీ స్టడీ సర్కిల్ డైరక్టర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 25 లోపు సంబంధిత స్టడీ సర్కిల్స్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఉచిత భోజన వసతితోపాటు, ఉద్యోగం కల్పించనున్నట్టు తెలిపారు.

ప్రాక్టికల్స్‌కు డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు: ఇంటర్ బోర్డు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఫిబ్రవరి 1 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షల్లో ఎక్కువ మార్కులు వేయడానికి విద్యార్థుల నుంచి అదనంగా డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని తెలంగాణ ఇంటర్ బోర్డు హెచ్చరించింది. ప్రాక్టికల్ పరీక్షల్లో ఎక్కువ మార్కులు వేయాలంటే డబ్బులు ఇవ్వాలని కొన్ని ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు, ప్రిన్సిపల్స్ కోరుతున్నట్టు ఫిర్యాదులు అందాయని ఇంటర్ బోర్డు కార్యదర్శి అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాక్టికల్ మార్కుల పేరుతో ఎవరైనా విద్యార్థుల నుంచి అదనంగా ఫీజులు వసూలు చేస్తే ఆయా కాలేజీల యాజమాన్యాలపైనా.. వసూలు చేసే ప్రిన్సిపాల్స్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. కాలేజీ యాజమాన్యాలు ప్రాక్టికల్ పరీక్షల కోసం అదనంగా ఫీజు కోరినట్టయితే సంబంధిత జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారికి ఫిర్యాదు చేయాలని, లేకపోతే బోర్డు కార్యాలయంలో ఉన్న హెల్ప్ లైన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.


ఏపీకి డిజిటల్ గ్రామ ప్రతినిధి అవార్డు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : మీ సేవ సర్వీసులను ప్రతి గుమ్మానికి తీసుకు వెళ్లినందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి విశిష్ట గుర్తింపు దక్కింది. ఇంటర్నెట్ అందుబాటులో లేని గ్రామాల్లో కూడా ప్రజలు ప్రభుత్వ డిజిటల్ సేవలను పొందడానికి చర్యలు చేపట్టినందుకుగానూ డిజిటల్ గ్రామ ప్రతినిధి అవార్డు లభించింది. శుక్రవారం న్యూఢిల్లీలోని హోటల్ లలిత్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవం కార్య క్రమంలో ఐఏఎంఏఐ మరియు టైమ్స్ నౌ ఈ పురస్కారాలను అందజేశాయి. ఆం ధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున మీసేవ డైరెక్టర్, ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్ అధికారి డాక్టర్ బి.సుందర్‌కు ఈ డిజిటల్ అవార్డు దక్కింది. ఆయన తరపున మీసేవ ప్రతి నిధులు సీఎస్‌సీ కన్సల్టెంట్స్ హిమబిందు, పీఎమ్‌యూ ఇంజనీర్ కుమారి లక్ష్మీ గౌతమి, ర్యామ్ ఇన్ఫో ఎండీ శ్రీనాథ్ రెడ్డి అవార్డును స్వీకరించారు. బెస్ట్ యూజ్ ఆఫ్ మొబైల్ ఫర్ సోషల్ అండ్ ఎకనమిక్ డెవలప్‌మెంట్ కేటగిరీలో ఏపీకి బంగారు మొమెంటో రావడం ఎంతో సంతోషాన్నిచ్చిందని మీ సేవ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

వచ్చే ఏడాది విద్యుత్ చార్జీల పెంపులేదు

• ఏపీ ఈఆర్‌సీ చైర్మన్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : వచ్చే ఏడాదికి కూడా ఏపీలో విద్యుత్ చార్జీల పెంపుదల లేదు. ఇప్పుడు అమల్లో ఉన్న చార్జీల టారీఫ్‌నే యథావిధిగా కొనసాగించనున్నట్టు ఏపీ ఈఆర్‌సీ వెల్లడించింది. శుక్రవారం సింగరేణి భవన్‌లోని ఏపీఈఆర్సీ కార్యాలయంలో వచ్చే ఏడాదికి డిస్కమ్‌లు ప్రవేశపెట్టిన ఏఆర్ఆర్ ప్రతిపాదనలపై నాలుగవ బహిరంగ విచారణ జరిగింది. ఈఆర్సీ ఛైర్మన్ జస్టిస్ అక్కినేని భవానీ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ కేటగిరిల విద్యుత్ వినియోగదారులు పాల్గొని తమ అభిప్రాయాలు వెలిబుచ్చారు. ఈ సందర్భంగా జస్టిస్ భవానీ ప్రసాద్ మాట్లాడుతూ వచ్చే ఏడాదికి కూడా ఇప్పుడున్న విద్యుత్ చార్జీలే కొనసాగుతాయన్నారు. వ్యవసాయరంగానికి ఉచిత విద్యుత్ అమలులో ప్రస్తుతం ఉన్న మూడు విద్యుత్ కనెక్షన్ల పరిమితి తొలగించాలన్న ఆలోచన ఏది లేదన్నారు. రైతులను ఇబ్బంది పెట్టాలన్నది ఈఆర్సీ అభిమతం కాదన్నారు. అయితే ఆదాయ పన్నులు కట్టేవారికి కార్పోరేట్ వ్యవసాయం చేసే కంపెనీలకు విద్యుత్ సబ్సిడీలు ఇవ్వాలనటంలో అర్థం ఉండదన్నారు. ఏపీ డిస్కమ్‌లకు ఇతర రాష్ట్రాల డిస్కమ్‌లతో పోలిక వద్దన్నారు. విద్యుత్ రంగంలో సమస్యలకు సంబందించి వినియోగదారులు డిస్కమ్ అధికారులపైన వ్యక్తిగత విమర్శలు చేయటం మంచిదికాదన్నారు. ఏదైనా వ్యవస్థ మెరుగుదలకు అవసరపడే సూచనలు ఇవ్వాలన్నారు. ఇటు వినియోగ దారులకు, అటు పంపిణీ సంస్థలకు ఉపయుక్తంగా ఉండే వాటినే పరిశీలన చేస్తామన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇద్దరి దుర్మరణం

• హైదరాబాద్‌లోని కాప్రాలో దుర్ఘటన • మరో ఎనిమిది మందికి గాయాలు





పేలుడు ధాటికి దెబ్బతిన్న ఇల్లు. గాయపడినమహిళ.

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మేడ్చల్ జిల్లా కాప్రాలో దుర్ఘటన చోటు చేసుకుంది. గ్యాస్ సిలిండర్ పేలి ఇద్దరు వ్యక్తులు దుర్మరణం పాలవ్వగా.. మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. మోహన్ లాల్ అనే వ్యక్తి ఇంట్లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఉదయం 7-30 గంటల సమయంలో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి భవనం గోడలు కూలిపోయాయి. పేలుడు ధాటికి ఇంటి గోడ శిథిలాలు తగలడంతో ఆ పక్కనే రోడ్డుపై వెళుతున్న రవి అనే వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇంటి యజమాని మోహన్‌లాల్ మృతి చెందారు. ఘటనలో మోహన్ లాల్ భార్య లీలా, ఇద్దరు పిల్లలు గోవింద్, నికిత్‌లకు తీవ్రగాయాలయ్యాయి. ఇదే ఘటనలో మరో ఐదు గురికి గాయాలయ్యాయి.

గ్యాస్ పేలుడు ధాటికి మోహన్‌లాల్ ఇల్లు కుప్పకూలడంతో పాటు చుట్టుపక్కల ఐదారు ఇళ్ల ఇంటిగోడలు దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. సమీపంలో ఉన్న లైఫ్‌లైన్ ఆసుపత్రి కిటికీ అద్దాలు పూర్తిగా ధ్వంసమవ్వగా, ఫర్నిచర్ కూడా దెబ్బతింది. పెద్ద మొత్తంలోనే ఆస్తినష్టం సంభవించినట్లు సమాచారం. సంఘటనా స్థలాన్ని రాచకొండ సీపీ మహేష్ భగవత్, ఇతర పోలీసు అధికారులు పరిశీలించారు. గాయాలపాలైన వారిని గాంధీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. భారీ పేలుడు సంభవించడంతో చుట్టుపక్కల వాళ్లతో పాటు సమీపంలోని ఆసుపత్రి రోగులు సైతం భయభ్రాంతులకు గురయ్యారు.

కాగా, పేలుడు ధాటికి దెబ్బతిన్న ఇంటిని జీహెచ్ఎంసీ సిబ్బంది కూల్చివేశారు. అయితే గ్యాస్‌లీక్ వల్లే ఈ పేలుడు సంభవించినట్లు ఫోరెన్సిక్ అధికారులు తేల్చి చెప్పారు. కంజెస్టడ్‌గా ఇల్లు ఉండటం వల్ల పేలుడు తీవ్రత పరిసర ప్రాంతాలకు సోకి ఉంటుందని ఆ కారణంగానే పక్కనే ఉన్న ఇళ్లతో పాటు సమీపంలోని ఆసుపత్రి అద్దాలు, ఫర్నిచర్ దగ్ధమై ఉంటాయన్నారు.

ఘటనాస్థలిని సందర్శించిన మేయర్ బొంతు

సిలిండర్ పేలుడులో మరణించిన మృతుడు రవి కుటుంబానికి రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా నగర మేయర్ బొంతు రామ్మోహన్ ప్రకటించారు. ఆపద్బంధు పథకం కింద మరో రూ.1 లక్ష సహాయాన్ని అందిస్తామని మేయర్ తెలిపారు. పేలుడు ప్రాంతాన్ని డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్‌తో కలిసి పరిశీలించారు. ప్రమాదంలో గాయపడిన వారిని మేయర్, డిప్యూటీ మేయర్ పరామర్శించారు.

కమ్యూనిస్టు యోధుడు నర్సింహయ్య కన్నుమూత



హైదరాబాద్/కర్నూలు బ్యూరో, ఆంధ్రప్రభ : సీపీఎం సీనియర్ నేత తెలకపల్లి నర్సింహయ్య (93) హైదరాబాద్‌లో శుక్రవారం కన్నుమూశారు. రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి ఆయన కుమారుడు. కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో, సీపీఎం బలోపేతానికి నర్సింహయ్య విశేష కృషి చేశారు. వారి మరణానికి సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్ర సంతాపాన్ని ప్రకటించింది. నర్సింహయ్య మృతదేహాన్ని పార్టీ సభ్యులు, శ్రేయోభిలాషుల సందర్శనార్థం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో మధ్యాహ్నం వరకు ఉంచారు. ఆయన మృతదేహానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్. వీరయ్య, జి. నాగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర కమిటీ సభ్యులు, ప్రజా సంఘాల నేతలు ఘనంగా నివాళులర్పించారు. నర్సింహయ్య మృతదేహానికి ఆదివారం కర్నూలులో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కమ్యూనిస్టు యోధుడు నర్సింహయ్య

నర్సింహయ్య పలు కమ్యూనిస్టు ఉద్యమాలలో కీలకపాత్ర పోషించారు. ఆయన స్టూడెంట్ ఉద్యమాల నుండి ఎన్నో ఉద్యమాలలో ప్రజల తరుపున పోరాటం చేశారు. నర్సింహయ్య కర్నూలు మండల పరిధిలోని గార్గేయపురం గ్రామంలో తెలకపల్లి రామయ్య, సరస్వతమ్మలకు జన్మించారు. గుంటూరు ఏసీ కాలేజిలో ఇంటర్ వరకు చదివారు. తర్వాత సహకార బ్యాంకులో ఉద్యోగం చేస్తూ ఆ తర్వాత కమ్యూనిస్టు ఉద్యమంపై ఆకర్షితుడై ఉద్యోగాన్ని వదలివేశారు. వివాహంఅనంతరం భార్య టిసి. లక్ష్మమ్మ కూడా కమ్యూనిస్టు మహిళా ఉద్యమం నిర్మాణంలో కీలకపాత్ర పోషించారు.1952లో కమ్యూనిస్టు సభ్యునిగా చేరిన నర్సింహాయ్య అప్పటి నుండి నేటి వరకు సుమారు 6 దశాబ్దాల పైగా కార్యకర్త స్థాయి నుండి క్రియాశీలకంగా పని చేశారు. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో నాటి తరం కమ్యూనిస్టు యోధుడు చంద్ర పుల్లారెడ్డి, మండ్ర సుబ్బారెడ్డి, ఎర్రగుడి ఈశ్వ రరెడ్డి, కర్నూలు సుంకన్న, పాణ్యం గఫూర్ వంటి నాయకులతో కలిసి పనిచేశారు. గార్గేయపురం, కేతవరం, తంగెడంచ, మడ్డెం వంటి గ్రామాలలో జరిగిన భూస్వామ్య వ్యతిరేక పోరాటాలలో క్రియాశీలకంగా పాల్గొన్నారు. 1956 ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో కర్నూలు జిల్లా సభ్యునిగా ఎన్నికయ్యారు. తర్వాత కాలంలో సీపీఎం ఏర్పడినప్పటి నుండి 1977 నుండి 2005 జిల్లా కమిటీ సభ్యునిగా, రాష్ట్ర కమిటీ సభ్యునిగా బాధ్యతలు నిర్వహించారు. 1964 లోనాటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పొలిటికల్ డిటెన్యూగా రాజమండ్రి, సికింద్రాబాద్ జైలులో నిర్బంధించబడ్డారు. 1975నుండి 1977 వరకు ఎమర్జెన్సీ కాలంలో రహస్యంగా కర్నూలు, కడప, అనంతపురం, మహబూబ్‌నగర్ జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమానికి కృషి చేశారు. రాయలసీమ, మహబూబ్ నగర్ జిల్లాలో ప్రజా వైద్యశాలను ప్రారంభించి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడంలో నర్సింహయ్య పాత్ర ఉంది. వీటితో పాటు ఆయిల్, రైస్‌మిల్ కార్మికులకు అండగా ఆదోని, నంద్యాల, ఆత్మకూరులో నిర్వహించిన ఉద్యమాలలో నర్సింహాయ్య కీలకపాత్ర పోషించారు. తాండలోని గిరిజనులకు అటవీ భూములపై హక్కుల కొరకు ఉద్యమాలు నిర్వహించడంలో ఈయన కృషి ఎనలేనిది. ముఖ్యంగా కరువు పీడిత గ్రామాలలో గంజి కేంద్రాలను పెట్టి ప్రజలను ఆదుకొనే ప్రయత్నం చేశారు.

పోలీసుల అదుపులో గంజాయి ముఠా

• 50 కిలోల గంజాయి, నగదు స్వాధీనం

హైదరాబాద్/గోషామహల్, ఆంధ్రప్రభ : అంతరాష్ట్ర గంజా స్మగ్లింగ్ గ్యాంగ్ గుట్టును హైదరాబాద్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రట్టు చేశారు. ఐదుగురు గ్యాంగ్ సభ్యులను అరెస్ట్ చేశారు. అరెస్టయిన నిందితుల వద్ద నుంచి 50 కేజీల గంజాయి, రూ.50,000 నగదుతో పాటు ఓ మోటార్ బైక్, ఐదు మొబైల్ ఫోన్‌లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఐదుగురు నిందితులలో ముగ్గురు ఒరిస్సాకు చెందిన వారు కాగా, ఇద్దరు హైదరాబాద్‌కు చెందినవారని అధికారులు తెలిపారు.

విశ్వసనీయ సమాచారంతో అధికారులు హనుమాన్ టెంపుల్, బలరామ్ గల్లీ ధూల్‌పేటలో ఇద్దరు నిందితులు దేవి ప్రసాద్ రాజ్ చౌదరి, రోహన్‌సింగ్‌లను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. మోటార్‌బైక్‌పై ఈ ఇద్దరు 20 కేజీల గంజాని ట్రాన్స్‌పోర్టింగ్ చేస్తున్నారు. ఇద్దరు నిందితులను అధికారులు విచారించగా ఒరిస్సాకు చెందిన సంజయ్ కుమార్ నాయక్ గంజాయి వ్యాపారాన్ని ఘట్‌కేసర్ అన్నోజిగూడ నుంచి నిర్వహిస్తున్నారని తెలిపారు. వారిచ్చిన సమాచారంతో అధికారులు ఘట్‌కేసర్ అన్నోజిగూడలోని ఇంటిపై దాడులు నిర్వహించి 30 కేజీల డ్రై గంజా, రూ.50 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఒరిస్సాకు చెందిన సంజయ్ కుమార్ నాయక్, సునామని నాయక్, సీతాఫల్‌మండి, సికింద్రాబాద్‌కు చెందిన కృష్ణకుమారిలను అరెస్టు చేశారు. ఒరిస్సా నుంచి గంజాయిని హైదరాబాద్‌కు తీసుకువచ్చి ఇక్కడ హోల్‌సేల్‌గా కిలో గంజాయి రూ.3000 నుంచి రూ. 3,500 వరకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఇందుకు సంబంధించి మరికొంతమంది గంజాయి రిసీవర్స్‌ని గుర్తించామని, వారిని కూడా పట్టుకుంటామని అధికారులు తెలిపారు. అరెస్టు చేసిన నిందితులతోపాటు స్వాధీనం చేసుకున్న సొత్తును తదుపరి విచారణ నిమిత్తం ధూల్‌పేట ఎక్సైజ్‌స్టేషన్ ప్రొహిబిషన్ ఎస్‌హెచ్‌ఓ కి అప్పగించారు. హైదరాబాద్ డీసీసి వివేకానందరెడ్డి సూచనల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ ఎన్.అంజిరెడ్డి పర్యవేక్షణలో సీఐ ఈ కేసును ఛేదించారు.

అంతర్రాష్ట్ర నేరగాళ్లు అరెస్టు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: భాగ్యనగరంలో ఆయుధాలు అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఇద్దరు అంతరాష్ట్ర నేరగాళ్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారంతో మల్కాజ్‌గిరి, ఎల్బీనగర్ ఎస్‌వోటీ పోలీసులు దాడులు నిర్వహించి మహారాష్ట్రకు చెందిన దత్తు వీరేష్ కోలి, శ్యాంసుందర్ భూమయ్య వడేపల్లిలను అదుపులోకి తీసుకున్నారు. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన జాంషీర్ అనే నిందితుడు పరారీలో ఉన్నాడు. అరెస్టయిన నిందితుల వద్ద నుంచి రెండు తుపాకీలు, రెండు రౌండ్ల బుల్లెట్లు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారని రాచకొండ సీపీ మహేష్ భగవత్ వెల్లడించారు.

బీసీలకు రాజ్యాధికారం ఎన్టీఆర్ ఘనతే!

• ఎన్టీఆర్ వర్ధంతి సభలో ఎల్. రమణ



ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళులు అర్పిస్తున్న బ్రహ్మణి, భువనేశ్వరి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో అధికార తెరాస ఇటీవల జరిగిన ఎన్నికల్లో వందలకోట్లు ఖర్చు చేసి తిరిగి అధికారంలోకి వచ్చిందని తెలుగుదేశం పార్టీ తెలంగాణ అధ్యక్షుడు ఎల్.రమణ తీవ్రస్థాయిలో ఆరోపించారు. తెదేపా వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు 23వ వర్ధంతిని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శుక్రవారం ఎన్‌టిఆర్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖరరెడ్డి, ప్రధాన కార్యదర్శులు బండ్రు శోభారాణి, బుచ్చిలింగం, మాజీ ఎమ్మెల్యే సీతా దయాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు సామ భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ ట్రస్టు మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించింది. ట్రస్టీ నారా భువనేశ్వరి ఈ శిబిరాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ, ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో రాజకీయాల్లోకి వచ్చిన ఎన్‌టిఆర్ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారన్నారు. తెలుగు జాతికి ఆయన ఎనలేని సేవ చేసి విశిష్ట గుర్తింపు తెచ్చారని ఆయనన్నారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు కూడా సిద్ధాంతాల కోసం ఆయన పనిచేశారని, ఆయన ఆశయ సాధనలో సత్ఫలితాలు వచ్చిన రోజే ఆయనకు నిజమైన నివాళి అన్నారు. దేశ రాజకీయాల్లో చెరగని ముద్రవేసి నేషనల్ ఫ్రంట్ ఛైర్మన్‌గా ప్రతిపక్షాలను ఒక్కటి చేశారని ఆయన చెప్పారు.

రావుల చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ, జాతీయ రాజకీయాల్లోనే కీలక పాత్ర పోషించిన ఎన్‌టిఆర్ రాష్ట్ర రాజకీయాల్లో నూతన ఒరవడి సృష్టించారన్నారు.

బండ్రు శోభారాణి మాట్లాడుతూ, ఏ ప్రభుత్వం వచ్చి నా ఎన్‌టిఆర్ మార్గం లోనే నడవాల్సి పరిస్థితి ఏర్పడిందని అన్నారు.

పేదలకు సేవ చేయడం మా అదృష్టం: బ్రహ్మణి

తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావుకు మనవరాలుగా పుట్టడం తన పూర్వజన్మ సుకృతమని నారా బ్రహ్మణి అన్నారు. బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బసవతారకం పేరుతో క్యాన్సర్ ఆసుపత్రిని నిర్మించి రోగులకు సేవలు అందించడం తమ కుటుంబం చేసుకున్న అదృష్టమన్నారు.

సామాన్యులను మంత్రులను చేశారు: మోత్కుపల్లి

సామాన్యులను మంత్రులను చేసిన ఘనత ఎన్‌టి రామారావుదేని మాజీమంత్రి మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. బడుగు బలహీన వర్గాలకు, పేదలకు ఒక వ్యవస్థను సృష్టించిన వ్యక్తి ఎన్‌టిఆర్ అని ఆయన కొనియాడారు. ఎన్టీఆర్ 23వ వర్ధంతి సందర్భంగా ఆయన నివాళులర్పించారు.

ఎన్టీఆర్ ట్రస్ట్ లెజెండరీ బ్లడ్ డొనేషన్ డ్రైవ్

మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు 23వ వర్ధంతి సందర్భంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో రక్తదాన శిబిరాలను నిర్వహించారు. శుక్రవారం ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో లెజెండరీ బ్లడ్ డొనేషన్ డ్రైవ్ పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఎన్టీఆర్ ట్రస్టు భవన్‌లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి భువనేశ్వరి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ బ్లడ్‌బ్యాంక్‌తో పాటు రెడ్‌క్రాస్, రోటరీ క్లబ్, లయన్స్ క్లబ్ బ్లడ్‌బ్యాంక్‌లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా నారా భువనేశ్వరి మాట్లాడారు.

నందిగామలో మహిళ హత్య

• ఆభరణాలు కాజేసి బండరాయితో చంపేశారు



నందిగామ, ప్రభ న్యూస్: దినసరి కూలీగా పనిచేసే సుమారు 40 సంవత్సరాల మహిళను గుర్తు తెలియని వ్యక్తులు ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను కాజేసి బండరాయితో మోది చంపిన సంఘటన రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలోని నందిగామ మండలకేంద్రంలో శుక్రవారం వెలుగుచూసింది. బాధితురాలి కుటుంబీకులు, పోలీసుల కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా, కోయిలకొండ మండలం ఆబండపట్నం గ్రామానికి చెందిన కొండ రాములమ్మ(40) కొన్ని సంవత్సరాలుగా రంగారెడ్డి జిల్లా, శంషాబాద్ మండలం ఆర్‌బినగర్‌లో నివాసముంటూ దినసరి కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తుండేది.. కూలీ పని నిమిత్తం వచ్చిన ఆమెకు గుర్తుతెలియని వ్యక్తులు మద్యం తాగించి ఒంటిపై ఉన్న చెవి కమ్మలు, గొలుసులు, మెట్టెలు, కడియాలు తీసుకెళ్లడమే కాకుండా ఆమె తలపై బండరాయితో మోది దారుణంగా హత్య చేశారు. నందిగామ శివారులో ఉన్న రిలయన్స్ పెట్రోల్ బంక్ పక్కన నిర్జల ప్రదేశంలో మహిళ శవం పడి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మహిళ ఒంటిపై ఉన్న దుస్తులు చిరిగి ఉండడంతో ఆమెపై అత్యాచారం జరిగినట్లు అనుమానిస్తున్నారు. పక్కనే మద్యం బాటిళ్లు, తడిసి ఉన్న టవల్, టిఫిన్ బ్యాగు పడి ఉన్నాయి. సంఘటన స్థలాన్ని రూరల్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ నర్సింహారెడ్డి పరిశీలించారు. మృతురాలు వద్ద లభించిన ఆధారాలతో ఆమె కుటుంబీకులకు సమాచారం అందజేశారు. మృతురాలి కుమారుడు కాసిం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు..

సెల్ బ్యాటరీ పేలి విద్యార్థికి గాయాలు



సాంబరాజు

రఘునాథపల్లి, ప్రభ న్యూస్ : జనగామ జిల్లా, రఘునాథపల్లి మండలంలోని అశ్వరావుపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న విద్యార్థి వద్ద సెల్‌పోన్ బ్యాటరీ పేలి తీవ్రగాయాల పాలయ్యాడు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మారెడ్డి వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మామిడాల లక్ష్మీశంకర్ తల్లిదండ్రుల కుమారుడు సాంబరాజు(రాజు) ప్రాథమిక పాఠశాలలో 3వ తరగతి విద్యార్థి. తన స్కూల్ బ్యాగులో పాత సెల్‌ఫోన్ బ్యాటరీ ఉండగా, నోట్‌బుక్ తీస్తుండగా ప్రమాదవశాత్తు ఆ బ్యాటరీ పేలినట్లు తెలిపారు. దీంతో రాజుకు చాతిపై, చేతికి గాయాలు కావడంతో వెంటనే జనగామ పిల్లల ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ప్రక్కన ఉన్న విద్యార్థులకు ఎలాంటి గాయాలు కాలేదని వారు పేర్కొన్నారు.

బతుకుదెరువు కోసం మూగజీవాల వలస



నల్గొండ(టౌన్), ప్రభ న్యూస్: బతుకుతెరువు కోసం మనుషులే కాకుండా మూగ జీవులు కూడా వలసపోతున్నాయి. తినడానికి మేత లేక వందల కిలోమీటర్ల దూరంలో తమ వలస ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. శ్రీశైలం వద్ద కంబాలపల్లి అడవుల నుండి సుమారు 500 ఆవులను నల్గొండ జిల్లా, చందంపేట మండలం కాసరాజుపల్లి, కంబాలపల్లి నుంచి నకిరేకల్ మీదుగా సూర్యాపేట జిల్లా కేంద్రానికి తరలించారు. శుక్రవారం నల్గొండ పట్టణం నుంచి వందలాదిగా ఆవులు వలస వెళ్తుండడంతో ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

నేరేడుగొమ్ముకు చిన్నారుల మృతదేహాలు



దేవరకొండ, ప్రభ న్యూస్ : గత నెల క్రిస్మస్ పండుగ ఏర్పాట్లలో అమెరికాలో చనిపోయిన ముగ్గురు యువకుల పార్థీవ దేహాలను వారి సొంత గ్రామమైన నల్గొండ జిల్లా, నేరేడుగొమ్ము మండలంలోని గుర్రపు తండాకు శుక్రవారం సాయంత్రం చేరుకున్నాయి. శనివారం ఆ ముగ్గురి అంత్యక్రియలు కూడా చేపట్టేందుకు అమెరికా బృందం కూడా చేరుకోనున్నారు. ఆ తండావాసుల బంధువుల ఆర్తనాదాలు, కన్నీటి పర్యంతాలు కొనసాగుతున్నాయి.

ఏసీబీ వలలో కోదాడ ఎస్ఐ

• లారీ యజమాని నుండి రూ.1.90 లక్షలు డిమాండ్



ఎస్ఐ మల్లేష్

కోదాడ, ప్రభ న్యూస్ : కోదాడ పట్టణ ఎస్సైన మల్లేష్ ఓ కేసు విషయంలో లక్ష 90వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఉమ్మడి నల్లగొండ జిల్లా ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం నవంబర్ నెలలో విజయవాడకు చెందిన లారీ యజమానులు వెంకటేశ్వరరావు, ప్రసాద్‌లు కర్ణాటక రాష్ట్రంలోని ఓ ప్రైవేట్ కంపెనీకి బొగ్గు సరఫరా చేస్తున్నారని బొగ్గులో నాణ్యత లోపించిందని కోదాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పట్టణ ఎస్సైగా ఉన్న మల్లేష్ వారిపై కేసు నమోదు చేసి లారీలను సీజ్ చేశారు. కాగా లారీ యజమానులు కోదాడ కోర్టును ఆశ్రయించగా లారీలను విడుదల చేయాలని ఇటీవల ఎస్సైన మల్లేష్‌ను ఆదేశించింది. కోర్టు ఆదేశాలను సైతం లెక్క చేయకుండా లారీలను వదిలిపెట్టాలంటే మూడు లక్షలు డిమాండ్ చేశాడని చివరకు లక్ష 90వేలకు బేరం కుదుర్చుకున్న లారీ యజమానులు ఏసీబీని ఆశ్రయించారు. ఇందులో భాగంగా బాధితుడు ఏసీబీ ఇచ్చిన డబ్బును శుక్రవారం ఎస్సైకి అప్పగించగా ఆ డబ్బును ఎస్సై కారులో పెట్టాడని వెంటనే తాము ఆ డబ్బును స్వాధీనం చేసుకొని ఎస్సైను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. ఈ దాడుల్లో ఏసీబీ అధికారులు రఘుబాబు, వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.

ఎన్ఐఏకు రికార్డులివ్వండి

• జగన్ కత్తి కేసులో సిట్‌కు కోర్టు ఆదేశం

అమరావతి, ఆంధ్రప్రభ: వైసీపీ అధినేత జగన్మోహన రెడ్డిపై విశాఖ విమానాశ్రయంలో జరిగిన కోడికత్తి దాడి కేసులో శుక్రవారం పలు కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. తగిన రక్షణ కోసం నిందితుడు శ్రీనివాసరావును విశాఖ లేదా రాజమండ్రి కేంద్ర కారాగారాలకు తరలించాలంటూ దాఖలైన ఫిటీషన్‌ను పరిశీలించిన ఎన్ఐఎ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి రాజమండ్రి తరలింపునకు ఆదేశించారు. ఇదే సమయంలో సిట్ అధికారులు కేసు దర్యాప్తులో తగిన విధంగా సహకరించడం లేదని, కేసు తాలూకు రికార్డులను అప్పగించాలంటూ ఎన్ఐఎ అధికారులు దాఖలు చేసిన మెమో విచారించిన న్యాయస్థానం ఎన్ఐఎకు అనుకూలంగా ఆదేశాలు వెలువరించింది. ఈ నెల 1న కేసు నమోదు చేసిన జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఎ) అధికారులు..కేసు విచారణలో భాగంగా ఈ నెల 12న నిందితుడు జనుపల్లి శ్రీనివాసరావు కోర్టు అనుమతితో కస్టడీకి తీసుకున్నారు. ఎన్ఐఎ కస్టడీ ముగియడంతో శుక్రవారం కోర్టులో శ్రీనివాసరావును హాజరుపరచగా రాజమండ్రి కేంద్ర కారాగారానికి తరలించారు. గురువారంతో కస్టడీ ముగియడంతో శుక్రవారం హైదరాబాద్ నుంచి శ్రీనివాసరావును తీసుకొచ్చి ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించిన ఎన్ఐఎ అధికారులు కోర్టులో హాజరుపరిచారు. కేసు విచారణ సందర్భంగా ఎన్ఐఎ ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి ఎ.రాధాకృష్ణనిందితుని యోగక్షేమాలు తెలుసుకున్నారు.



ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు

హైదరాబాద్‌లో ప్రారంభం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: చిరు వ్యాపారులకు ఆర్థిక సేవలు అందిస్తున్న ఫిన్ కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు శుక్రవారం హైదరాబాద్‌లో అడుగు వేసింది. ముంబై, ఢిల్లీ, కొచ్చి లాంటి ప్రముఖ నగరాల్లో ఇప్పటికే విజయవంతంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఈ బ్యాంకు 8 ముఖ్య మెట్రోపాలిటన్ నగరాల్లో విస్తరించిందని ఈ బ్యాంకు ఎండి రాజేశ్ యాదవ్ చెప్పారు. ఏపీలో 2007లో మైక్రో ఫైనాన్స్ కార్యకలాపాలు ప్రారంభించి, ఆ తర్వాత బ్యాంకుగా విస్తరించిందని చెప్పారు. తెలంగాణలో బిజినెస్ కరస్పాండెంట్ల ద్వారా లావాదేవీలు నిర్వహిస్తున్నామని శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన చెప్పారు. ఈ సమావేశంలో ఈ బ్యాంకును ఎన్‌జీవో స్థాయిలో ప్రారంభించిన డాక్టర్ దశరథరెడ్డి కూడా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రాజేష్ యాదవ్ మాట్లాడుతూ, హైదరాబాద్‌లో పూరి స్థాయి సర్వీస్ శాఖను ప్రారంభించంతో సేవింగ్స్, కరెంట్ ఖాతాలు, ఫిక్సిడ్ డిపాజిట్లు, ఎన్ఆర్ ఉత్పత్తులు, జీవిత బీమా, ఫండ్స్ బదిలీ, బిల్ పేమెంట్ తదితర సదుపాయాలతో సహా అన్ని బ్యాంకింగ్ సేవలు అందిస్తున్నట్లు యాదవ్ చెప్పారు. బంగారంపై, హౌసింగ్, ద్విచక్ర వాహనాలకు కూడా రుణాలు ఇస్తున్నామని ఆయన చెప్పారు. రానున్న కొద్ది నెలల్లో పూణె, ఎన్‌టిఆర్ ఢిల్లీ, భూపాల్ లాంటి నగరాల్లో కూడా బ్రాంచీలు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన చెప్పారు. ఈ విస్తరణ తర్వాత బ్యాంకు అసెట్ మేనేజ్‌మెంట్ రూ.10వేల కోట్లు ఉండాలని లక్ష్యంగా పెట్టు క న్నామని ఆయన చెప్పారు. ఈ మొత్తాన్ని డిపాజిట్ల ద్వారా సేకరించాలని భావిస్తున్నట్టు చెప్పారు. తమ బ్యాంకులో ప్రస్తుతం 14 లక్షల మంది ఖాతాదారులు ఉన్నారని, త్వరలో మరో 10 లక్షల ఖాతాలు ఈ ఏడాది ప్రారంభించేందుకు సేవలు విస్తరిస్తున్నామని అన్నారు.తమ బ్యాంకు చిన్నమొత్తాల్లో రుణాలు ఇవ్వడంలో ప్రఖ్యాతగాంచిందని రాజేష్ యాదవ్ చెప్పారు. తమ బ్యాంకుకు ప్రస్తుతం రూ.2,889 కోట్ల అసెట్స్ మేనేజ్‌మెంట్ ఉండగా, రూ.1445 కోట్ల రిటైల్ డిపాజిట్లు ఉన్నాయని ఆయన చెప్పారు. ఆర్థిక వ్యవస్థలో అవసరాలను గుర్తించి మాస్ రిటెయిల్, మైక్రో, స్మాల్ ఎంటర్‌ప్రైజెస్ సెగ్మెంట్లకు ఫిన్‌కేర్ ఎస్ఎఫ్‌బీ సేవలు అందిస్తోందని చెప్పారు. అలాగే మెట్రో, అర్బన్, సెమీ అర్బన్ ప్రాంతాల్లోని కస్టమర్ల బ్యాంకింగ్ అవసరాలను కూడా దృష్టిలో ఉంచుకుని రుణాలు ఇస్తున్నామని అన్నారు. డిసెంబర్ నాటికి 11 రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో 14 లక్షల మంది ఖాతాదారులతో లావాదేవీలు నిర్వహిస్తున్నారని రాజేష్ యాదవ్ చెప్పారు.



బాండ్ల ద్వారా రూ.2వేల కోట్లు సేకరించనున్న

ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్

When it's about money.. IIFL

హైదరాబాద్ : ఐఐఎఫ్ఎల్ హోల్డింగ్ లిమిటెడ్.. దాని అనుబంధసంస్థ ఇండియా ఇన్ఫోలైన్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్), నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ బాండ్ల ద్వారా రూ. 2,000 కోట్లు సేకరించడానికి రంగం సిద్ధం చేసింది. వ్యాపారాభివృద్ధికి, విస్తరణకు సేకరించిన నిధులను వినియోగిస్తుంది. కాగా పబ్లిక్ ఇష్యూ ఈ నెల 22 నుంచి ప్రారంభిస్తుంది. అన్ సెక్యూర్డ్ నాన్ కన్వర్టబుల్ డిబెంచర్ (ఎన్‌సీడీ)ల ద్వారా రూ.250 కోట్లు సేకరిస్తుంది. ఒక వేళ ఇష్యూ ఓవర్ సబ్‌స్క్రైబ్ అయితే రూ.1,750 కోట్ల వరకు తమ వద్ద అట్టిపెట్టుకుంది. గరిష్ఠంగా రూ.2వేల కోట్లు దాటదని ప్రకటనలో పేర్కొంది. బాండ్లపై అత్యధికంగా ఇండివ్యాడువల్స్‌కు 10.50 శాతం, ఇతర కేటగిరీ వారికి ఉదాహరణకు ఇన్సిస్టిట్యూషనల్ వారికి 10.35 శాతం వడ్డీరేటు గిట్టుబాటు అవుతుంది. బాండ్ల కాలపరిమితి 120 నెలలు. నెలవారి లేదా వార్షిక ప్రాతిపదికన వడ్డీ చెల్లిస్తుంది. ఇతర కేటగిరీలకు 39 నెలల నుంచి 60 నెలల కాలపరిమితి ఉంటుంది. రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ ఈ ఇష్యూకు ఏఏ/స్టేబుల్ రేటింగ్ ఇచ్చిందని, భద్రతకు అవకాశాలెక్కువ. రిస్కు తక్కువ అని ఐఐఎఫ్ఎల్ గ్రూపు సీఎఫ్ఓ ప్రబోద్ అగర్వాల్ ప్రకటనలో వివరించారు.



ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో

ఈసారి 50వ ర్యాంకు సాధిద్దాం

•వైబ్రెంట్ గుజరాత్‌లో ప్రధాని మోడీ

గాంధీనగర్ : కేంద్రంలోని తమ ఎన్‌డీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన పలు సంస్కరణల గురించి ప్రధాని నరేంద్రమోడీ ఇక్కడ జరుగుతున్న వైబ్రెంట్ గుజరాత్‌లో శుక్రవారం నాడు ప్రముఖంగా ప్రస్తావించారు. దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి ఇన్వెస్టర్లు భాగస్వాములు కావాలని కోరారు. తన ప్రభుత్వం తీసుకొచ్చిన పలు సంస్కరణలు... ప్రపంచబ్యాంకు సరళతర వాణిజ్యం (ఈజ్ ఆఫ్ డూయింగ్) ర్యాంకులో భారత్ గణనీయమైన పురోగతిని సాధించిందన్నారు. గత నాలుగేళ్లుగా తీసుకొచ్చిన పలు సంస్కరణల వల్ల ప్రస్తుతం భారత్ ఆర్థికంగా బలపడిందని.. గతంలో ఎన్నడూలేని విధంగా ఎలాంటి వ్యాపారానికైనా భారత్ సిద్ధంగా ఉందన్నారు. ప్రపంచబ్యాంకు ప్రకటించిన ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ గ్లోబల్ ర్యాంకులో ఏకంగా 65 స్థానానికి వచ్చినా తనకు మాత్రం సంతృప్తికరంగా లేదన్నారు. తన టీంను లేదా బృందాన్ని మరింత కష్టపడి వచ్చే ఏడాది నాటికి 50వ ర్యాంకును సాధించాలని కోరానన్నారు. వచ్చే ఏడాదికి ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో టాప్ 50 దేశాల సరసన భారత్ నిలవాలని తన లక్ష్యమని మోడీ అన్నారు.

స్థిరమైన వృద్ధిరేటు

తన ప్రభుత్వం స్థిరమైన వృద్ధిరేటు 7.3 శాతంతో దూసుకు పోతోందన్నారు. 1991 తర్వాత నుంచి ఈ స్థాయిలో వృద్ధిరేటును సాధించిన దాఖలాల్లేవన్నా రు. ద్రవ్యోల్బణం విషయానికి వస్తే సరాసరి 4.6 శాతానికి తీసుకొచ్చామన్నారు. 1991 నుంచి ఈ స్థాయిలో ద్రవ్యోల్బణం దిగిరాలేద న్నారు. వ్యాపారాలకు అడ్డం కిగా ఉన్న నిబంధనలను తొల గించడం పైనే ఫోకస్ పెడుతున్నట్లు మోడీ తెలిపారు. వైబ్రెంట్ గుజరాత్ సదస్సు లో చెక్ రిపబ్లిక్ ప్రధానమంత్రి అంద్రెజ్ బాబీస్, ఉజ్బెకిస్తాన్ ప్రెసిడెంట్ షావక్త్ మిజోవేవ్, డెన్మార్క్ ప్రధానమంత్రి లార్స్ లోక్కె రాస్‌ముస్సేన్‌లు విచ్చేశారు. పాకిస్తాన్‌నుంచి ఏ ఒక్క బృందం హాజరుకాలేదు.

ఈ సదస్సులో గుజరాత్‌కు చెందిన సూక్ష్మ చిన్న మధ్య తరహా వ్యాపారులు తమ ఉత్పత్తులను ప్రదర్శించ డానికి ప్రత్యేకంగా ట్రేడ్ షో ఏర్పాటు చేశారు. ఈ షోకు దేశయ, విదేశీ బయ్యర్లు 1,500 మంది వరకు వచ్చే అవకాశాలున్నాయని ప్రభుత్వ అధికార ప్రతినిధి తెలిపారు. నరేంద్రమోడీ గుజరాత్ ముఖ్య మంత్రిగా ఉన్నప్పుడు 2003లో వైబ్రెంట్ గుజరాత్ సదస్సుకు శ్రీకారుం చుట్టారు. భారత్‌లో పెట్టుబడులకు గుజరాత్ ను హబ్‌గా తీర్చిదిద్దేందుకు ఈ సదస్సును ఏర్పాటు చేశారు.

రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముఖేష్ అంబానీ ఈ- కామర్స్ రంగంలోకి ఎంట్రీ ఇచ్చి మార్కెట్ లీడర్లు.. అమెజాన్ డాట్‌కామ్, వాల్ మార్ట్.. ఫ్లిప్‌కార్ట్‌కు గట్టి సవాలు విసరబోతున్నారు. ముందుగా తన సొంత రాష్ట్రం గుజరాత్ లో ఆన్‌లైన్ షాపింగ్ ప్లాట్‌ఫాం ద్వారా 1.2 మిలియన్ రిటైలర్స్, స్టోర్ యజమానులకు సేవలందించనున్నారు. దీంతో పాటు రిలయన్స్ జియో టెలి కం సర్వీసులను కూడా వీటితో విలీనం చేసి రెండు అతి పెద్ద ఆన్‌లైన్ కంపెనీలకు పోటీ ఇవ్వబోతున్నారు. రిలయన్స్ జియో, రిలయన్స్ రిటైల్‌లు కలిసి సంయుక్తంగా కొత్త ఈ కామర్స్ ప్లాట్‌ఫాం ద్వారా గుజరాత్‌లో 12 లక్షలచిన్న రిటైలర్స్, షాప్ యజమానులకు సేవలందిస్తుందని రిల్ చైర్మన్ ముఖేష్ అంబానీ ఇక్కడ జరుగుతున్న వైబ్రెంట్ గుజరాత్ సదస్సులో శుక్రవారం నాడు మాట్లాడుతూ ఈ విషయం చెప్పారు. జియో సబ్‌స్క్రైబర్లు ప్రస్తుతం 280 మిలియన్‌లున్నారు. అదే సమయంలో అంబానీకి చెందిన రిలయన్స్ రిటైల్‌కు దేశవ్యాప్తంగా 10వేల ఔట్‌లెట్లున్నాయి. ఈ రెండు కలిసి జియో యాప్‌ద్వారా చిన్న చిన్న వ్యాపారు లను ఈ-కామర్స్ విభాగంలోకి రప్పిస్తారని రిలయన్స్ రిటైల్ ఎగ్జిక్యూటివ్ వి సుబ్రమణియన్ గురువారం నాడు రిల్ క్యూ3 ఫలితాలు విడుదల చేసినప్పుడు చెప్పారు. గత నెలలో భారత ప్రభుత్వం విదేశీ ఆన్‌లైన్ రిటైల్ అమ్మకాల నిబంధనలు కఠినతరం చేసింది. విదేశీ ఆన్‌లైన్ కం పెనీ....అదే కంపెనీకి దేశంలో తయారీప్లాంట్ ఉంటే ఆ కంపె నీకి చెందిన ప్రొడక్టులను విక్రయించడానికి కానీ, లేదా ఏదైనా కంపెనీలో భాగస్వామ్యం ఉన్నా ఆ వస్తువులను తమ ఆన్‌లైన్ ప్లాట్‌ఫాం ద్వారా విక్రయించడానికి వీల్లేకుండా నిబంధనలు తీసుకొచ్చింది. కొత్త నిబంధనల వల్ల అమెజాన్, వాల్‌మార్ట్ వ్యాపా రాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఫ్లిప్‌కార్ట్ ఆన్‌లైన్ సర్వీసెస్‌ను వాల్‌మార్ట్ 1600 కోట్ల డాలర్లకు టేకోవర్ చేసుకున్న విషం తెలి సిందే.. అయితే కొత్త ని బంధనలు విదేశీ ఆన్‌లైన్ కంపెనీలకు ఇబ్బందులకు గురిచేస్తే.. అదే సమయంలో స్థానిక ఆన్‌లైన్ కంపెనీలు ఉదాహరణకు రిలయన్స్ లాంటి కంపెనీలకు లబ్ధి చేకూరుతుంది. ఇదిలా ఉండగా అం బానీ ఈ - కామర్స్‌రంగంలో ఎంట్రీ ఇస్తున్నట్లు గత ఏడాది జులైలోనే ప్రకటించా రు.

పదేళ్లలో రూ.3 లక్షల కోట్లు పెట్టుబడులు

ఇదిలా ఉండగా ముఖేష్ అంబానీ ఇక్కడ జరుగు తున్న వైబ్రెంట్ గుజరాత్‌లో వచ్చే పదేళ్లలో వివిధ ప్రాజెక్టు లపై సుమారు రూ.3 లక్షల కోట్లు పెట్టుబడులు పెడుతామని హామీ ఇచ్చారు. ఈ పెట్టుబడులు ఎనర్జీ, పెట్రోకెమికల్స్, కొత్త టెక్నాలజీ, డిజిటల్ వ్యాపారాలపై పెడుతున్నట్లు ఆయన తెలిపారు. గుజరాత్ రిలయన్స్‌కు జన్మభూమి (పుట్టిన ఊరు) అలాగే కర్మభూమి (పనిచేసే) స్థలం అని.. పెట్టుబడులు పెట్టడానికి ముందుగా గుజరాత్‌కు పెద్దపీట వేస్తామని ఆయన ఇక్కడ జరుగు తున్న 9వ వైబ్రెంట్ గుజరాత్ గ్లోబల్ సదస్సులో మాట్లాడుతూ చెప్పారు. టెలికం రంగంలో వేలాది కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టినట్లు ఆయన తెలిపా రు. ఇప్పటి వరకు గుజరాత్‌లో సుమారు రూ.3 లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టామని, సుమారు పది లక్షల మం దికి ఉపాధి కల్పించా మన్నారు. వచ్చే దశాబ్ద కాలంలో పెట్టుబ డులు రెట్టింపు చేయడంతో పాటు ఉద్యోగావకా శాలన కూడా రెట్టింపు చేస్తామన్నారు. ప్రస్తుతం 5జీ నెట్‌వర్కు సిద్ధంగా ఉందని, దీంతో రిటైల్ డివిజన్ త్వరలోనే కొత్త ఈ-కామర్స్ ప్లాట్‌ఫాం ద్వారా చిన్న రిటైలర్లు, షాపుయజమానులతో పాటు కస్టమర్లకు సేవలందిస్తామన్నారు. అయితే ఎప్పటి నుంచి 5జీ సేవలు ప్రారంభి స్తామన్న విష యం మాత్రం ఆయన వెల్లడించలేదు.

దేశ వ్యాప్తంగా జి యోతో పాటు రిల యన్స్ రిటైల్‌కు 9,000 స్టోర్‌లున్నాయని అంబానీ తెలిపారు. కొత్తగా ఈ కామర్స్ ప్లాట్ ఫాం ప్రారం భించి గుజరాత్‌లోని 12 లక్షల చిన్న రిటైలర్లకు సేవలంది స్తామని ఆయ న వివరించారు. ఇటీవలే అంబానీ మాట్లాడుతూ.. జియో నెట్‌వర్కు ద్వారా ఈ-కామర్స్ రంగంలోకి ఎంట్రీఇవ్వ బోతున్నట్ల చూచా యిగా సంకేతాలిచ్చారు.



టాటాల లిథియమ్ బ్యాటరీ యూనిట్

వైబ్రెంట్ గుజరాత్ సదస్సులో టాటాగ్రూపు చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ మాట్లాడుతూ.. గుజరాత్‌లో లిథియమ్ ఇయాన్ బ్యాటరీ తయారీ యూనిట్‌లో పెద్దమొత్తంలో పెట్టుడులు పెడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ సదస్సులో మాట్లాడుతూ టాటా కెమికల్స్ షోడా యాష్ ఉత్పత్తి సామర్థ్యాన్ని ఏడాదికి మిలియన్ టన్నులకు పెంచుతున్నట్లు పేర్కొన్నారు. తమ గ్రూపునకు చెందిన కంపెనీలు టాటా కెమికల్స్, టాటామోటార్స్‌లు ఇక్కడ వ్యాపారాలు చేస్తున్నాయని, గుజరాత్ లో మరిన్ని పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తాని ఆయన అన్నారు. సనంద్‌లో టాటామోటార్స్ టిగోర్ఎలక్ట్రిక్‌కారుతో పాటు ఇతర హ్యాచ్‌బ్యాక్ కార్లు టియాగో, కాంపాక్ట్ సెడాన్ టిగోర్, నానోలను ఉత్ప త్తిచేస్తోందన్నారు. ఎలక్ట్రిక్ కార్ల తయారీ ప్లాంట్‌లో పాటు లిథియమ్ బ్యాటరీ ప్రాజెక్టులపై పెట్టుబడులు పెడతామన్నారు. టాటాలకు గుజరాత్ అత్యంత కీలకమైన రాష్ట్రమని గ్రూపు రెవెన్యూలో రూ.18వేలకోట్లు గుజరాత్ నుంచివస్తోందన్నారు. సుమారు 25వేల మంది ఉద్యోగులు తమ గ్రూపు కంపెనీల్లో పనిచేస్తున్నారన్నారు. అయితే కొత్త ప్రాజెక్టులపై ఎంత మొత్తం పెట్టుబడులు పెడుతామనే విషయం గురించి ఆయన స్పష్టత ఇవ్వలేదు.



చంద్రశేఖరన్

అదానీల పెట్టుబడులు రూ.55వేల కోట్లు

బిలియనీర్ గౌతమ్ అదానీ వచ్చే ఐదు సంవత్సరాల్లో గుజరాత్‌లో రూ.55వేల కోట్లు పెట్టుబడులు పెడుతున్నట్లు ఇక్కడ జరుగుతున్న వైబ్రెంట్ గుజరాత్‌లో ప్రకటించారు. ప్రాజెక్టుల విషయానికి వస్తే ప్రపంచంలోనే అతి పెద్ద సోలార్‌పార్కు, కాపర్ ప్లాంట్, సిమెంట్ యూనిట్, లిథియమ్ బ్యాటరీ తీయారీ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు. ఇదిలా ఉండగా అదానీ గ్రూపు గురువారం నాడు పెట్రోకెమికల్స్ వ్యాపారంలోకి ఎంట్రీ ఇస్తున్నట్లు ప్రకటించింది. జర్మనీకి చెందిన రసాయనాల కంపెనీ బాస్ఫ్ బాగస్వామ్యంలో రూ.16 కోట్లు పెట్టుబడులు పెడుతున్నట్లు తెలిపారు. వైబ్రెంట్ గుజరాత్‌లో గౌతమ్ అదానీ మాట్లాడుతూ.. గత ఐదేళ్ల కాలంలో గుజరాత్‌లో రూ.50వేల కోట్ల వరకు పెట్టుబడులు పెట్టినట్లు చెప్పారు.వచ్చే ఐదేళ్ల ఈ పెట్టుబడులు మరింత పెంచుతామన్నారు. వచ్చే ఐదేళ్ల పెట్టుబడుల గురించి ప్రస్తావిస్తూ.. ప్రపంచంలోనే అతి పెద్ద హైబ్రిడ్ పార్కును కావ్‌డాలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీనిపై రూ.30వేల కోట్లు పెట్టుబడులు అవసరం అవుతాయన్నారు. ముంద్రాలో 1జీడబ్ల్యు డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయడంతో పాటు మిలియన్ టన్నుల కాపర్ స్మెల్టింగ్, రిఫైనింగ్ ప్రాజెక్టులు, సిమెంట్ క్లింకర్ తయారీప్లాంట్ లక్‌పత్‌లో ఏర్పాటు చేయడం జరుగుతుందని, అలాగే లిథియమ్ బ్యాటరీ తయారీప్లాంట్ తదితరాలపై రూ.55వేల కోట్లు పెట్టుబడులు అవసరం అవుతాయని.. సుమారు 50వేల మందికి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఉపాధి కల్పిస్తామని అదానీ వివరించారు.



గౌతమ్ అదానీ

ఆదిత్యబిర్లా గ్రూపు పెట్టుబడులు రూ.15వేల కోట్లు

ఆదిత్య బిర్లా గ్రూపు వచ్చే మూడేళ్లలో గుజరాత్‌లో రూ. 15వేల కోట్లు పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చింది. గ్రూపు చైర్మన్ కుమారమంగళం బిర్లా మాట్లాడుతూ ఉన్న ప్లాంట్‌ల సామర్థ్యం పెంచుకోవడంతో పాటు కొత్త యూనిట్లను ఏర్పాటు చేస్తామని ఆయన అన్నారు. కంపెనీకి గుజరాత్‌లో టెక్స్‌టైల్స్ నుంచి కెమికల్స్, గనులు, మినరల్స్ వ్యాపారాలున్నాయి. ఇప్పటి వరకు గుజరాత్‌లో రూ.30వేల కోట్ల కంటే ఎక్కువ పెట్టుబడులు పెట్టనట్లు ల తెలిపారు. గుజరాత్‌లో మొత్తం 15 తయారీ యూనిట్లు న్నాయి. సుమారు 26వేల మంది ఉద్యోగులు పనిచేస్తు న్నార న్నారు.



విప్రో ఊపేసింది!

క్యూ3 లాభం రూ.2,544కోట్లు బోనస్, డివిడెండ్



బెంగళూరు : ఐటి సేవల దిగ్గజం విప్రో డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో సత్తా చాటింది. అంచనాలకు మించి లాభాలను ఆర్జిం చింది. క్యూ3లో నికరలాభం ఏడాది ప్రాతిపదికన చూస్తే ఏకంగా 31.8 శాతం వృద్ధితో రూ.2,544.5 కోట్లు ఆర్జించింది. కంపెనీ బోర్డు బోనస్ షేర్లను ప్రకటించింది. మూడు షేర్లుఉన్న వాటాదారుడికి ఒకషేరు బోనస్ ఇవ్వడానికి బోర్డు అంగీకరించినట్లు కంపెనీ బీఎస్ఈకి సమాచారం అందించింది.

ఇక నికరలాభం విషయానికి వస్తే గత ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.1930.1 కోట్లు ఆర్జించింది. విప్రో రెవెన్యూ విషయానికి వస్తే 10.17 శా తం పెరిగి రూ.15,059.5 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.13,669 కోట్లని వెల్లడించిం ది.

వ్యూహాత్మంగా పెట్టిన పెట్టుబడులు, దీంతో పాటు క్లయింట్లతో ఉన్న బలమైన సంబంధాలు.. క్లయింట్లు కూడా కొత్త టెక్నాలజీపై పెద్దమొత్తంలో వ్యయం చేయడంతో ఉదా హరణకు అత్యాధు నిక టెక్నాలజీకి ... క్లయింట్లు డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్‌కు మారిపోతున్నాయి. దీంతో కంపెనీలు కొత్త టెక్నాలజీపై పెద్దమొత్తంలో వ్యయం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని వివరణ ఇచ్చింది. మొత్తానికి డిసెంబర్ త్రైమాసికం సంతృప్తిని మిగిల్చిపోయిందని విప్రో సీఈవో, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అబిదలీ నీముచ్‌వాలా చెప్పారు.

ఐటి సేవల సెగ్మెంట్ రెవెన్యూ 2,046.5 మిలియన్ డాలర్లు రూ.14,555 కోట్లు.. ఏడాది ప్రాతిపదికనచూస్తే 1.8 శాతం పెరిగింది. మార్చి చివరి నాటికి ఐటి సేవల ద్వారా రెవెన్యూను 2,047 మిలియన్‌ల నుంచి 2,088 మిలియన్‌లకు పెంచుకోవాలని చూస్తోంది. రెవెన్యూలో ఫ్లాట్‌గా లేదా రెండు శాతం వృద్ధి సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. బోనస్ ఇష్యూ గురించి ప్రస్తావిస్తూ.. 1:3 నిష్పత్తిలో ఉంటుంది. రూ.2 ముఖ విలువ కలిగిన షేరుపై అంటే వాటాదారుడి వద్ద మూడు షేర్లు ఉంటే ఒకషేరు బోనస్‌గా ఇస్తుంది. అయితే వాటాదారుల అనుమతి తర్వాతనే ఇది అమల్లోకి వస్తుందని బీఎస్ఈకి సమాచారం అందించింది. ఇదిలా ఉండగా మధ్యంతర డివిడెండ్ షేరు పై రూ.1గా ప్రకటించింది. జనవరి 30, 2019 న రికార్డుతేదీగా ప్రకటించింది. ఆ రోజు రికార్డులో పేరున్న వారికి డివిడెండ్ దక్కుతుందని కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది.

ఇండియన్ మేడ్

బీఎండబ్ల్యు బైక్‌ల హవా

న్యూఢిల్లీ : బీఎండబ్ల్యు మోటార్రాడ్ జర్మనీకి చెందిన లగ్జరీకార్ల తయారీ కంపెనీ బీఎండబ్ల్యు గ్రూపు అనుబంధ సంస్థ. ఇండియన్ మేడ్ జీ 310ఆర్ జీ310 జీఎస్ మోడల్స్ అత్యధికంగా అమ్ముడుపోయే టాప్ 5 బైక్‌లలో గతేడాది స్థానం దక్కించుకున్నట్లు ఒక ప్రకటనలో తెలిపింది. కాగా శుక్రవారంనాడు మరో రెండు కొత్త మోడల్స్ బీఎండబ్ల్యు ఆర్ 1250జీఎస్, బీఎండబ్ల్యు ఆర్ 1250 జీఎస్ అడ్వెంచర్‌ను దేశీయ మార్కెట్లో విడుదల చేసింది. గత ఏడాది జీ310ఆర్, జీ 310 జీఎస్ మోడల్స్‌ను 24,363 యూనిట్లు విక్రయించింది. కాగా ఈ బైక్‌లను 2017లో దేశీయ మార్కెట్లో విడుదల చేసింది. ప్రపంచవ్యాప్తంగా చూస్తే టాప్ ఐదు మోడల్స్‌లో భారత్‌లో తయారు చేస్తున్న ఈ బైక్‌లు కూడా అత్యుత్తమ అమ్మకాల్లో స్థానం దక్కించుకున్నాయి. గతేడాది భారత్‌లో మార్కెట్లో 2,187 యూనిట్లు విక్రయించగా.. ప్రపంచవ్యాప్తంగా 165,566 యూనిట్లు విక్రయించింది. 2017తో పోల్చుకుంటే 0.9 శాతం పెరిగింది. 2020 నాటికి ప్రపంచవ్యాప్తంగా 2లక్షల యూనిట్లు విక్రయించాలని కంపెనీ లక్ష్యంగాపెట్టుకుంది. శుక్రవారం విడుదల చేసిన బీఎండబ్ల్యు ఆర్ 1250 జీఎస్, బీఎండబ్ల్యు ఆర్ 1250 జీఎస్ అడ్వెంచర్ మోడల్ ధరలు వరుసగా రూ.16.85 లక్షల నుంచి రూ.21.95 లక్షలుగా నిర్ణయించింది.



టయోటా కొత్త కెమ్రీ హైబ్రిడ్

ధర రూ.36.95 లక్షలు



న్యూఢిల్లీ : టయోటి కిర్లోస్కర్ ఇండియా శుక్రవారం నాడు కొత్త వెర్షన్ కెమ్రీ హైబ్రిడ్‌ను దేశీయ మార్కెట్లో విడుదల చేసింది. దీని ప్రారంభ ధర రూ.36.95 లక్షలని ప్రకటించింది. టయోటాతో భాగస్వామ్యంలో ఈ కొత్త కారును బెంగళూరు ప్లాంట్‌లో అసెంబ్లింగ్ చేస్తోంది. పర్యావరణానికి అనుకూలంగా ఉండే విధంగా ఆ దిశగా అడుగులు వేస్తున్నామని టికెఎం మేనేజింగ్ డైరెక్టర్ మజాకజా యోషిమురా ఇక్కడ చెప్పారు. ప్రభుత్వం కర్బన ఉద్గారాలను అరికట్టేందుకు ఎలక్ట్రిక్ కార్ల వైపునకు మళ్లుతోందని.... దానికి తగ్గట్టు తాము కూడా హైబ్రిడ్ కార్లపై ఫోకస్ పెడుతున్నట్లు ఆయన తెలిపారు. కొత్త కెమ్రీ హైబ్రిడ్ భద్రతతో పాటు కర్బన ఉద్గారాలను దృష్టిలోఉంచుకొని రూపుదిద్దామని ఆయన వివరించారు. హై బ్రిడ్ టెక్నాలజీలో తాము గ్లోబల్ లీడర్లమని ఆయన అన్నారు. కాగా ఆటో కంపెనీలు కూడా పర్యావరణానికి అను కూలంగా ఉండే వాహనాల వైపు దృష్టిపెడుతోందన్నారు. ఫీచర్ల విషయానికి వస్తే కొత్త జనరేషన్ హైబ్రిడ్ కెమ్రీ 2.5 లీటర్ పెట్రోల్ ఇంజిన్‌తో పాటు ఎలక్ట్రిక్‌మోటార్‌ను బిగించామని, లీటరుకు ఇంధన సామర్థ్యం 23.27 లీటర్లు ఇస్తుందని టీకెఎం డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ రాజా అన్నారు. దేశంలో హైబ్రిడ్ కార్లను ప్రోత్సహించేందుకు తమ వంతుకృషిచేస్తామన్నారు. ఫోర్త్ జనరేషన్ హైబ్రిడ్ సిస్టమ్‌కు అడ్వాన్స్డ్ నికెల్ మెటల్ హైడ్రైడ్ బ్యాటరీలను వినియోగిస్తున్నా మన్నారు. ఫీచర్ల విషయానికి 9 ఎయిర్‌బ్యాగ్‌లు, ఫ్యూయెల్ కటాఫ్ సెన్సింగ్, బ్రేక్ హోల్డ్ ఫంక్షన్‌లాంటివి అందుబాటులో ఉంచినట్లు కంపెనీ ఒక ప్రకటనలో వివరించింది. ప్రపంచ వ్యాప్తంగా 100 దేశాల్లో ఈ కారును విక్రయిస్తున్నారు. ఇప్పటి వరకు 19 మిలియన్‌ల యూనిట్లు విక్రయించింది. దేశీయ మార్కెట్లో 2002లోవిడుదల చేసింది. ఇప్పటి వరకు 11వేల యూనిట్లను విక్రయించింది.

ఎల్‌టీఐ లాభం రూ.375 కోట్లు

LARSEN & TOUBRO

న్యూఢిల్లీ : లార్సన్ అండ్ టర్బో ఇన్ఫోటెక్ (ఎల్‌టిఐ) డిసెం బర్‌తో ముగిసిన త్రైమాసికంలో ఏకీకృత నికరలాభంలో 32.8 శాతం వృద్ధితో రూ.375.5 కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.282.8 కోట్లని ఒక ప్రకటనలో వెల్లడించింది. రెవెన్యూ విషయానికి వస్తే 31.3 శాతం పెరిగి రూ.2479.9 కోట్లకు ఎగబాకగా..క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.1,883.8 కోట్లని తెలిపింది. త్రైమాసికం ప్రాతిపదికన చూస్తే నికరలాభం 6.2 శాతం క్షీణించి రూ.400.3 కోట్లు దిగిరాగా.. రెవెన్యూ మాత్రం 6.1 శాతం పెరిగి రూ.2,331.2 కోట్లని పేర్కొంది. డాలర్ ప్రాతిపదికన చూస్తే 346.9 మిలియన్ డాలర్లకు చేరగా..ఏడాది క్రితంతో పోల్చుకుంటే 18.2 శాతం పెరిగింది.

మెరిసిన రిల్ గ్లోబల్ మార్కెట్లు అనుకూలమే

స్వల్పలాభాలతో గట్టెక్కింది

ముంబై : స్టాక్ మార్కెట్లు శుక్రవారం నాడు స్వల్పలాభాలతో గట్టెక్కాయి. గ్లోబల్‌మార్కెట్ల నుంచి అనకూలమైన సంకేతాలు వెలువడ్డా దేశీయ మార్కెట్లు మాత్రం ఒడిదుడుకులతో కొట్టుమిట్టాడాయి. చివరకు 12.53 పాయింట్ల లాభంతో 36,386.61 వద్ద, నిఫ్టీ 1.75 శాతం పెరిగి 10,906.95 వద్ద ముగిశాయి. మొత్తానికి ఈ వారం సూచి 378.77 పాయింట్ల లాభపడితే, నిఫ్టీ మాత్రం 112 పాయింట్లు లాభపడింది. బీఎస్ఈలో అత్యధికంగా లాభపడిన షేరు మాత్రం రిలయన్స్ ఇండస్ట్రీస్ ఏకంగా 4.43 శాతం పుంజుకుంది. క్యూ2లో మంచి ఫలితాలను ప్రకటించడమే దీనికి ప్రధాన కారణం. లాభపడిన ఇతర షేర్ల విషయానికి వస్తే కొటక్ బ్యాంకు, హెచ్‌సీఎల్, ఓఎన్‌జీసీ, ఏషియన్ పెయింట్స్, వేదాంత, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, బజాజ్‌ఫైనాన్స్, మారుతి, టీసీఎస్ షేర్లు 1.41 శాతం వరకు లాభపడ్డాయి. నష్టపోయిన వాటిలో సన్‌ఫార్మా అగ్రస్థానంలో ఉంది. ఏకంగా 8.58 శాతం క్షీణించింది. వీటితో పాటు భారతి ఎయిర్‌టెల్, యాక్సిస్ బ్యాంకు, ఎస్ బ్యాంకు, ఐటీసీ, టాటామోటార్స్, పవర్‌గ్రిడ్ షేర్లు 6.42 శాతం వరకు నష్టపోయాయి. మార్కెట్ నిపుణుల అంచనా ప్రకారం ఫార్మ షేర్లు, బలహీనపడుతున్న రూపాయి సూచిని కిందికి లాగాయని చెబుతున్నారు. గు రువారం విదేశీ ఫోర్టుపోలియో ఇన్వెస్టర్లు రూ.842.13 కోట్ల షేర్లనుకొనుగోలు చేస్తే.. దేశీయ సంస్థాగత మదుపరులు రూ.727.46 కోట్లు షేర్లు విక్రయించినట్లు స్టాక్ మార్కెట్ గణాంకాలనుబట్టి తెలుస్తోంది. గ్లోబల్ వాణిజ్య ఉద్రిక్తలు, ఆర్థిక మాంద్యం ఏర్పడే అవకాశాలున్నట్లు వార్తలు రావడంతో ఇన్వెస్టర్లలో సెంటిమెంట్ బలహీనపడిందని మార్కెట్ పండితులు అభిప్రాయపడుతున్నారు. డాలర్ మారకంతో రూపాయి పది పైసలు క్షీణించి 71.13 మార్కుకు ఇంట్రాడేతో దిగివచ్చింది. బ్రెంట్ క్రూడాయిల్ ఫ్యూచర్ 0.98 శాతం పెరిగి 61.78 బ్యారెల్ చేరింది. గ్లోబల్ మార్కెట్ల విషయానికి వస్తే ఆసియాతో పాటు యూరోపియన్ మార్కెట్లు లాభాలతో ముగిశాయి.



సన్‌ఫార్మా షేరు మాడిమసైంది: సన్‌ఫార్మా షేర్లు శుక్రవారం నాడు అమ్మకాల ఒత్తిడికి గురైంది. కంపెనీపై తాజాగా కొత్త కొత్త ఆరోపణలురావడంతో దీని షేరు బీఎస్ఈలో ఏకంగా 8 శాతం క్షీణించింది. మార్కెట్ క్యాపిటలైజేషన్ సుమారు రూ.8,735 కోట్లు ఆవిరైంది. బీఎస్ఈలో దీని షేరు 8.52 శాతం క్షీణించి రూ.390.75 మార్కుకు దిగివచ్చింది. ఇంట్రాడేలో ఏకంగా 12.11శాతం నష్టపోయి రూ.375.40 మార్కుకు పడిపోయింది. రూ. 93,751.44 కోట్లకు దిగివచ్చింది.

ఒడిశాలో కంటివెలుగు

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేర్పిస్తూ ఆ పనిని పూర్తి చేస్తున్నారు. దృష్టిలోపం ఉన్న పక్షంలో ఉచితంగా కంటి అద్దాలను ఇవ్వడంతో పాటు అవసరమైన ఔషధాలను కూడా రోగులకు అం దజేస్తున్న సంగతి తెలిసిందే. ఒడిశా రాష్ట్రానికి చెందిన వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు తెలంగాణలో అమలు చేస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని అధ్య యనం చేయడంతో పాటు ఇక్కడి అధికారులతో సంప్రదించి పూర్తిస్థాయిలో సమాచారం సేకరించారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ కూడా ఈ పథకం అమలుకు సంబంధించిన అంశా లను అధికారులతో సమావేశమై వివరాలు సేకరిం చినట్టు తెలుస్తోంది. ఇటీవల సీఎం కేసీఆర్ జాతీయ స్థాయిలో ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటులో భాగంగా ఒడిశా వెళ్ళి నవీన్ పట్నాయక్‌ను కలిసిన సందర్భం లోనూ ఈ కంటి వెలుగు పథకంపై కేసీఆర్‌తో ఆయన వివరాలు తెలుసుకుని తమ ప్రభుత్వం కూడా ఈ పథకాన్ని అమలు చేస్తుందన్న విషయాన్ని చెప్పినట్టు సమాచారం. ఇందుకు ప్రభుత్వం అవలంబించిన విధి విధానాలను కేసీఆర్ నవీన్ పట్నాయక్‌కు తెలిపారని అక్కడి అధికారులు చెబుతున్నారు. కంటి వెలుగు పథకం విజయవంతం కావడంతో కేసీఆర్ త్వరలోనే ముక్కు, చెవి, గొంతు సంబంధించిన పరీక్షలను రాష్ట్రవ్యాప్తంగా జరిపించాలన్న నిర్ణయా నికి వచ్చారు. రాష్ట్రంలో నివసించే ప్రతి పౌరుడి ఆరోగ్య వివరాలను (హెల్త్ ప్రొఫైల్) కంప్యూటర్లలో పొందుపరిచి వారికి పూర్తిస్థాయిలో చికిత్స జరిపించే బాధ్యతను ప్రభుత్వం భజస్కందాలపై వేసుకోవాలని ప్రతిపా దించింది. ఇప్పటికే ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా హృద్రోగులు, ఇతర జబ్బులతో బాధ పడుతున్న పేద వర్గాలను ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పెద్దఎత్తున ఆదుకుంటున్న సంగతి తెలిసిందే. ఒడిశా రాష్ట్రంలో నివసించే ప్రతి పౌరుడికి నేత్ర పరీక్షలు జరిపించాలని అక్కడి ప్రభుత్వం నిర్ణయించింది. 2023 సంవత్సరం నాటికి కంటి జబ్బులతో బాధపడే వారి సంఖ్యను పూర్తిగా తొలగిం చాలన్న ధ్యేయంతో ఒడిశా రాష్ట్రం ఈ నూతన సునేత్ర పథకానికి శ్రీకారం చుట్టినట్టు సీఎం నవీన్ పట్నాయక్ వివరించారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో ఉన్న ప్రజలందరికీ వైద్య చికిత్సలు జరిపిస్తామని, పేద, ధనిక, దళితులు, అగ్రవర్ణాలు అన్న తేడా లేకుండా ప్రతి ఒక్కరి నేత్రాలను పరీక్షించే బాధ్యతలను ప్రభు త్వం తీసుకుంటుందని ఆయన ఇటీవల నిర్వహించిన మీడియా సమావేశంలో చెప్పారు. అవసరమైన వారికి క్యాటరాక్ శస్త్ర చికిత్స కూడా జరిపిస్తామని ఇందుకు రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. తెలంగాణ తరహాలోనే అవసరమైన రోగులకు ఉచి తంగా



ఫైల్‌ఫోటో

కంటి అద్దాలు పంపిణీ చేసేందుకు ఒడిశా ప్రభు త్వం కూడా చర్యలు చేపట్టిందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి పాఠశాల, కళాశాల, విశ్వవిద్యాల యాల్లో విద్యా సంవత్సరం ఆరంభంలో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటుచేసి విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహిస్తామని ఇది నిరంతర కార్యక్రమమని సీఎం చెప్పారు. విద్యార్థులను పరీక్షించడంతో పాటు అక్కడి కక్కడే వారికి కంటి అద్దాలను కూడా ఇస్తామన్నారు. మొదటి ఐదు సంవత్సరాలకు రూ.680 కోట్లను ఈ పథకం కింద ఖర్చు పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వైద్యుల పరీక్షల్లో రోగులు తీవ్రమైన ఇబ్బందులతో బాధ పడుతుంటే వారిని వెంటనే స్థానికంగా ఉన్న నేత్ర వైద్యశాలలకు లేదా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వారికి శస్త్ర చికిత్సలు జరి పించేలా కార్యక్రమాలు రూపొందించినట్టు ఆయన చెప్పారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రాథ మిక ఆరోగ్య కేంద్రాలు, డివిజన్ స్థాయిలో పనిచేస్తున్న సబ్ డివిజనల్ ఆసుపత్రులు, జిల్లా స్థాయిలో పనిచేసే ఆసుపత్రులతో పాటు రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలల్లో సునేత్ర పథకం అమలుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు ఒడిశా వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి పీకే మహేంద్ర చెప్పారు. ఈ పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం అమలు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని అధ్యయనం చేశాకే తమ రాష్ట్రంలో ఈ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించినట్టు ఆయన చెప్పారు. ఈ పథకం అమలుతో ప్రజలు తాము పడుతున్న నేత్ర సమస్యల నుంచి బయటపడతారన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తంచేశారు. తెలంగాణ ప్రభుత్వం ముఖ్యం గా సీఎం కేసీఆర్ ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టు కుని భావితరాలకు ఎటువంటి ఇబ్బంది రాకుండా ఉండాలన్న ధ్యేయంతో కంటి వెలుగు పథకానికి శ్రీకారం చుట్టినట్టుగా తాము భావిస్తున్నట్టు ఆయన వివరించారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఈ పథకం జాతీయ స్థాయిలోనే గొప్ప ఆదరణ పొందిం దని, మిగతా రాష్ట్రాలు కూడా ఈ పథకం అమలుకు ముందుకు రాక తప్పని పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. కంటి వెలుగు కార్యక్రమమే కాకుండా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు పెట్టుబడి పథకం, రైతు బీమా, కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్స్, ధరణి, దళితులకు మూడెకరాల భూమి, పెన్షన్ల పెంపు వంటి కార్యక్రమాలు మన్నన పొందడంతో పాటు అన్ని రాష్ట్రాలు ఈ తరహా కార్యక్రమాల అమలుకు ముందుకు వస్తున్నాయని వివరించారు. ఇంటింటికి మంచినీరు అందిం చాలన్న లక్ష్యంతో సీఎం కేసీఆర్ ప్రారంభించిన మిషన్ భగీరథ పథకాన్ని నీతి ఆయోగ్ ప్రశంసించడంతో పాటు కేంద్రంలోని జల వనరులశాఖ అధికారుల బృందం రాష్ట్రంలో పర్యటించి ఈ పథకంపై అధ్యయనం చేసిన సంగతి తెలిసిందే. చెరువుల్లో పూడికను తొలగించి తద్వారా పొలాలకు నీరందిం చాలన్న లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన మిషన్ కాకతీ య పథకానికి కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జై కొట్టిన సంగతి తెలిసిందే.

భూములు, బంగారం క్రయ విక్రయాలపై ఐటీ చెక్!

(మొదటిపేజీ తరువాయి)

వద్ద ధీమా వ్యక్తం చేస్తున్నారు. దీంతో సాదాసీదా వ్యక్తులకు్కాడా ఇంతపెద్దమొత్తంలో నగదు ఎలా సమకూరుతోందన్న అంశంపై నిఘా బృందాలు దృష్టిపెట్టాయి. వీటి అధ్యయనంలో విభ్రాంతికర అంశాలు వెలుగుచూశాయి. పెద్దనోట్ల రద్దు తర్వాత భూముల క్రయవిక్రయాలు తగ్గుముఖం పట్టాయని తొలుత భావించారు. రికార్డుల ప్రకారం చేస్తూ తగ్గలేదు సరికదా పెరిగింది. అంతేకాదు.. భూముల మార్కెట్ విలువ కూడా అనూహ్యంగా వృద్ధి చెందింది. వ్యవసాయానికి తప్ప పరిశ్రమలు, వ్యాపారానికి ఏమాత్రం అనుకూలంకాని భూములు విలువ ఎకరం మూడ్నుంచి నాలుగుకోట్లు పలికినట్లు వెల్లడైంది. వాస్తవానికి భూముల రిజిస్ట్రేషన్ విలువ మాత్రం 15 నుంచి 25లక్షల లోపే ఉంది. దీంతో ఈ మొత్తాన్ని నల్లధనం నుంచి చెల్లించినట్లుగా భావిస్తున్నారు. అలాగే బంగారం కొనుగోళ్ళు కూడా పెద్దెత్తున జరిగినట్లు గుర్తించారు. బిస్కట్లే కాకుండా ఆభరణాల రూపంలో కూడా నగదు భారీగానే చేతులు మారినట్లు నిఘా వర్గాలకు తెలిసొచ్చింది. ఇదే విషయాన్ని కేంద్రం దృష్టికి ఇవి తెచ్చాయి. సార్వత్రిక ఎన్నికల్లో ధన ప్రవాహాన్ని షీలైనంతగా అరికట్టే లక్ష్యంతో ఉన్న కేంద్రం ఈ లక్ష్యసాధన కోసం భూముల క్రయవిక్రయాల్ని కఠినతరం చేయాలని భావించింది. ఈ బాధ్యతను ఆదాయపన్ను శాఖకప్పగించింది. గతంలో సంపద పన్ను అమల్లో ఉండేది. ఈ చట్టం మేరకు అతితక్కువ విలువ చూపిన ఆస్తుల్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకునే వెసులుబాటుండేది.



వీటిని మార్కెట్లో విక్రయించి చూపిన ధర పోను మిగిలిన సొమ్మును ప్రభుత్వం తన ఖాతాలో జమ చేసుకునేది. అయితే ఇప్పుడా చట్టం అమల్లో లేదు. దీంతో భూముల కొనుగోలు, అమ్మకాలపై గట్టి నిఘా ఏర్పాటు చేసింది. వివిధ పార్టీల్లో సీట్లు పొంది కోట్లకు కోట్లు వ్యయం చేసి ఏదోవిధంగా ప్రజాప్రతినిధులైతే అక్రమంగా, అడ్డగోలుగా దోచేయెచ్చన్న ఆలోచనకు చెక్‌పెట్టింది. ఇక సీట్లు పొందినా నిధులు సమకూర్చుకోవడం చాలా కష్టం. రిజిస్ట్రేషన్ విలువను మాత్రం లెక్కల్లో చూపి మూడ్నాలుగుకోట్లకు భూములు విక్రయించి ఆ నల్లడబ్బును విచ్చలవిడిగా ఎన్నికల్లో ఖర్చు చేసి అవసరమైతే ఓట్లు కొనుగోలు చేసి గద్దెనెక్కాలన్న ఆశావహులకు కేంద్ర నిర్ణయంతో షాక్ తగలనుంది.



మౌలిక సదుపాయాలపై దృష్టి

● రైల్వే బోర్డు చైర్మన్ వినోద్‌కుమార్ యాదవ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రయాణికుల ఆకాంక్షలను తీర్చే క్రమంలో మౌలికసదుపాయాల అభివృద్ధిపై భారతీయ రైల్వే దృష్టిసారించిందని రైల్వే బోర్డు చైర్మన్ వినోద్‌కుమార్ యాదవ్ చెప్పారు. దక్షిణ మధ్య రైల్వేలో అద్భుతమైన పనితీరు వలన అనేక విజయాలను జోన్ సాధించిందని ఆయన తెలిపారు. పరివర్తనా పథంలో జోన్ తీసుకున్న చొరవలు భారతీయ రైల్వేలోని ఇతర జోన్లకు ఆదర్శంగా నిలిచిందన్నారు. శుక్రవారం రైలు నిలయంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ ఆర్. కె. కులశ్రేష్టి, జోన్‌లోని అన్ని విభాగాల ఉన్నతాధికారులు, అన్ని డివిజన్ల డీఆర్ఎంలతో వినోద్‌కుమార్ యాదవ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే అధికారుల అసోసియేషన్ వినోద్ కుమార్ యాదవ్‌ను సన్మానించింది. అనంతరం మజ్దూర్ యూనియన్, ఎంప్లాయిస్ సంఘం, ఎస్సీ అండ్ ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్, ఓబీసీ అసోసియేషన్ ప్రతినిధులు రైల్వేబోర్డు చైర్మన్‌ను కలిసి వినతి పత్రాలు సమర్పించారు.

మార్చి చివరికి ఉద్యాన వర్శిటీ



హై దరాబాద్,ఆంధ్రప్రభ : ములుగులో ప్రతిపాదించిన కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం భవన నిర్మాణాలను మార్చి చివరి నాటికి పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి సి.పార్థసారధి అధికారులను ఆదేశించారు. శుక్రవారం వ్యవసాయ వర్శిటీ నిర్మాణ పనుల పురోగతిపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ పనుల్లో జాప్యం సహించేది లేదన్నారు. వచ్చే నెల చివరినాటికి పనులు పూర్తిచేసి భవనాలు అప్పగించాలని ఇంజనీర్లను ఆదేశించారు. పరిపాలన భవనం, ల్యాండ్‌స్కేప్ ప్రణాళికను పూర్తి చేయాలన్నారు. ప్రయోగశాలలు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఉండేలా చూసేందుకు విశ్వవిద్యాలయ అధికారులు , నిపుణులు శాస్త్రవేత్తలతో సంయుక్త కమిటీని ఏర్పాటు చేశారు. రాష్ట్రప్రభుత్వం రైతులకోసం చేపడుతున్న వ్యవసాయ , ఉద్యాన పథకాలకు పరిశోధనాత్మక మేధోమధనంతో శాస్త్రీయ సలహాలు అందిచాలని శాస్త్రవేత్తలను కోరారు. ప్రతిసాగుభూమిలో అత్యంత అనువైన పంటలసాగుకు కాలనీల ఏర్పాటు కోసం సర్వేలు చేయాలని , దీంతో సాగు పెట్టుబడి ఖర్చులు తగ్గి రైతులకు పంటల సాగు లాభదాయకంగా ఉంటుందన్నారు. ఉద్యాన విశ్వవిద్యాలయం రూపొందించిన వార్షిక కేలండర్‌ను ఈ సందర్భంగా పార్ధసారధి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు డా.ఎం.విజయతోపాటుగా డా.భగవాన్ , డా.రవీందర్ రెడ్డి , కిరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన వీఆర్‌వో అభ్యర్థులు 3 రోజుల్లో సర్టిఫికెట్స్ సమర్పించాలి

టీఎస్‌పీఎస్‌సీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: గ్రామ రెవిన్యూ అధికారులు(వీఆర్‌వో) పోస్టుకు ఎంపికయిన అభ్యర్థులు ఇప్పటి వరకు సర్టిఫికెట్లను సమర్పించని వారు 3 రోజుల్లో అన్ని సర్టిఫికెట్లను సమర్పించాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ స్పష్టం చేసింది. ఎంపికయి కుల, నాన్ క్రిమీలేయర్, విద్యార్హత సర్టిఫికెట్లు సమర్పించని వారి వివరాలు కమిషన్ వెబ్‌సైట్‌లో ఉన్నాయని వారందరూ 3 రోజుల్లో సర్టిఫికెట్లను సమర్పించాలని కమిషన్ డిప్యూటీ కార్యదర్శి శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు.

పాఠ్యాంశంగా యోగా



● మాజీ మంత్రి కడియం శ్రీహరి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: యోగా, మార్షల్ ఆర్ట్స్‌ను పాఠ్యాంశంగా రూపొందించే ప్రయత్నం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందని మాజీమంత్రి కడియం శ్రీహరి చెప్పారు. కేంద్ర ప్రభుత్వం యోగా, మార్షల్ ఆర్ట్స్‌ను పాఠ్యాంశంగా ప్రవేశపెట్టే చట్టం తీసుకురానుందని తెలిపారు. ఆ చట్టం వస్తే దానిని అమలుచేయడంలో తెలంగాణ రాష్ట్రం ముందుంటుందని ఆయన చెప్పారు. శుక్రవారం గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 36వ భారత జాతీయ కరాటే చాంపియన్ షిప్ -2019 పోటీలను శ్రీహరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రంలో మార్షల్ ఆర్ట్స్, యోగాను ప్రోత్సహించే ఆలోచనలో ఉన్నారని చెప్పారు. మార్షల్ ఆర్ట్స్ స్వీయ రక్షణ, శరీరక దృఢత్వాన్ని కాపా డటంలో ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమం లో సినీనటుడు సుమన్, సాండిల్ వుడ్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ రవీందర్, జపాన్ కరాటే అసోసియేషన్ మేనేజింగ్ డైరెక్టర్ సిహాన్ వై ఒగురా, జపాన్ కరాటే అసోసియేషన్ ఇండియా చీఫ్ ఇన్‌స్ట్రక్చర్ ఆనంద్ రత్న తదితరులు పాల్గొన్నారు.

ఐఎంవోలో నారాయణ క్లీన్‌స్వీప్

● అంతర్జాతీయ స్థాయిలో మొదటి ర్యాంక్: పి.సింధూర నారాయణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్(ఐఎంవో) ఫలితాల్లో నారాయణ విద్యార్థులు చాంపియన్లుగా నిలిచారని నారాయణ విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి సింధూర నారాయణ తెలిపారు. సైన్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ ఢిల్లీ వారు ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఐఎంవో 2018-19 మొదటి దశ ఫలితాల్లో నారాయణ అంతర్జాతీయ ర్యాంకులను సొంతం చేసుకున్నారని తెలిపారు. 14 దేశాల్లో 3, 4, 5. 6 తరగతుల వారికి నిర్వహించిన పరీక్షలో అంతర్జాతీయ స్థాయి మొదటి 10 ర్యాంకుల్లో 2633 ర్యాంకులను సొంతం చేసుకున్నారు. టాప్-50 ర్యాంకుల్లో 5888 ర్యాంకులను, టాప్-100 ర్యాంకుల్లో 7673 ర్యాంకులను సాధించారని సింధూర నారాయణ తెలిపారు.

మార్చి 30వరకు గీతం దరఖాస్తులు

● ఏప్రిల్ 10 నుంచి 22వరకు పరీక్షలు


హైదరాబాద్, ఆంధ్రప్రభ: గీతం డీమ్డ్ యూనివర్సిటీలో బీటెక్, ఎంటెక్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. దరఖాస్తులను మార్చి 30 వరకు స్వీకరించనున్నట్టు వర్సిటీ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్ శివప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలను ఏప్రిల్ 10 నుంచి 22 వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు. యూనివర్సిటీలో 9 బీటెక్ కోర్సులతోపాటు 7 ఎంటెక్ కోర్సులు కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. జేఈఈ మెయిన్స్‌తోపాటు ఎంసెట్‌లో అత్యుత్తమ ర్యాంకర్లకు ఫీజులో రాయితీ ఇవ్వనున్నట్టు చెప్పారు. తెలంగాణలో నాగోల్, సికింద్రాబాద్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, వరంగల్ పట్టణాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని వీటితోపాటు దేశ వ్యాప్తంగా 50 పట్టణాల్లో కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

అయేషా కేసులో వేగం పెంచిన సీబీఐ

● సత్యంబాబు, కోనేరు సతీష్‌ను విచారించిన అధికారులు

● పోలీసులు బలవంతంగా నేరం మోపారు: సత్యంబాబు

అమరావతి, ఆంధ్రప్రభ: సంచలనం సృష్టించిన బిఫార్మసీ విద్యార్థిని ఆయేషా మీరా హత్య కేసు విచారణను సీబీఐ వేగవంతం చేసింది. గతంలో ఆయేషా కేసులో నిందితునిగా పోలీసులు అరెస్టు చేయడంతో హైకోర్టు నిర్ధోషిగా విడుదల చేసిన పిడతల సత్యంబాబు, ఆరోపణలు ఎదుర్కొన్న గూడవల్లి మాజీ సర్పంచి, మాజీ ఉప ముఖ్యమంత్రి కోనేరు రంగారావు మనవడు కోనేరు సతీష్‌ను శుక్రవారం సిబీఐ అధికారులు విచారించి వివరాలు నమోదు చేశారు. ఇదే సమయంలో ఆయేషా మీరా హత్యకు గురైన పశ్చిమ ఇబ్రహీంపట్నంలోని అప్పటి శ్రీదుర్గా హాస్టల్ భవనాన్ని పరిశీలించడంతో పాటు గుంటూరు జిల్లా తెనాలిలో ఉంటున్న ఆయేషా మీరా తల్లిదండ్రులను కలిసి మరికొన్ని వివరాలను కూడా సిబీఐ అధికారులు సేకరించనున్నారు. రెండు వేర్వేరు బృందాలుగా విడిపోయి విచారణ చేపట్టారు. కృష్ణాజిల్లా నందిగామ మండలం అనాసాగరం గ్రామానికి వెళ్లిన సిబీఐ బృందం 10గంటలకు పైగా సత్యంబాబును విచారించింది. అప్పట్లో పోలీసుల అరెస్టు తదితర వివరాలతో పాటు బ్యాంకులో నగదుపై సిబిఐ అధికారులు ఆరా తీశారు. విచారణ సమయంలో కుటుంబ సభ్యులు మినహా ఇతరులను సత్యంబాబు



ఇంటి వద్దకు అనుమతించలేదు. అప్పటి పోలీసు అధికారులు తనను బెదిరించి ఆయేషా కేసులో అక్రమంగా ఇరికించినట్లు అధికారుల విచారణలో సత్యంబాబు చెప్పినట్లు తెలిసింది. ఆమె హత్యకు ముందు పెయింటింగ్ పనుల నిమిత్తం తాను వేరే ప్రాంతానికి వెళ్లాలని, కొద్ది రోజుల తర్వాత పోలీసు అధికారులు అదుపులోకి తీసుకొని తల్లి, చెల్లిని చంపుతామని బెదిరించి కేసులో నిందితునిగా చేర్చారని పేర్కొన్నాడు. పోలీసులు బెదిరించడంతో భయపడిన తాను నిందితునిగా అంగీకరించానే తప్ప ఆయేషా హత్యతో తనకు ఏ విధమైన సంబంధం లేదని, అసలు హత్య జరిగిన హాస్టల్ పోలీసులు తీసుకెళ్లే వరకు తనకు తెలిదని సత్యంబాబు పేర్కొన్నట్లు తెలిసింది. తాను జైలులో ఉన్న సమయంలో చేసిన పనికి రూ.30వేలు బ్యాంకు ఖాతాలో జమ కాగా బయటకు వచ్చిన తర్వాత అప్పులు తీర్చానని అధికారుల ఎదుట సత్యంబాబు పేర్కొన్నాడు. ఆయేషా మీరా కేసుకు సంబంధించి అప్పట్లో పోలీసులు వ్యవహరించిన తీరు, ఏయే ప్రాంతాల్లో తనను విచారించిందీ వంటి అన్ని వివరాలను సిబీఐ అధికారులకు పూసగుచ్చినట్లు వివరించినట్లు బంధువుల సమాచారం. ఇదిలా ఉండగా విజయవాడ రూరల్ మండలంలోని కోనేరు సతీష్ ఇంటికి కొందరు సిబిఐ అధికారులు సాయంత్రం వెళ్లి విచారించారు. ఆయేషా హత్య సమయంలో సతీష్ ఎక్కడున్నారు? హత్య జరిగిన తర్వాత హాస్టల్‌కు ఎందుకు వెళ్లారు? హాస్టల్ నిర్వాహకులతో సతీష్‌కు ఉన్న సంబంధాలపై ఆరా తీసినట్లు తెలిసింది. హాస్టల్ నిర్వాహకులతో ఉన్న పరిచయం కారణంగానే విషయం తెలిసి అక్కడకు వెళ్లినట్లు అధికారుల విచారణలో సతీష్ చెప్పినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే తనపై ఆయేషా కుటుంబ సభ్యులు ఆరోపణలు చేశారని ఆయన పేర్కొన్నట్లు తెలిసింది. తనపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో అప్పట్లో పోలీసులు విచారించిన విషయం, పలుమార్లు విచారణకు తాను ఏ విధంగా సహకరించిందీ, ఇందుకు సంబంధించిన ఆధారాలు సిబిఐ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. విచారణ వివరాలు చెప్పేందుకు సీబీఐ అధికారులు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తామేమీ చెప్పలేమని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా వీరిద్దరి విచారణ పూర్తి కావడంతో శనివారం ఆయేషా మీరా హత్యకు గురైన పశ్చిమ ఇబ్రహీంపట్నంలోని అప్పటి శ్రీదుర్గా హాస్టల్‌ను పరిశీలించనున్నారు. ఇదే సమయంలో మరో బృందం తెనాలి వెళ్లి ఆయేషా తల్లి దండ్రుల స్టేట్‌మెంట్ రికార్డు చేయనుంది. వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న అప్పటి ఆయేషా సహ విద్యార్థులను కూడా విచారించనున్నట్లు అధికారులు చెపుతున్నారు.

ఆహార లభ్యతలో స్వయం సమృద్ధి

● భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి డైరెక్టర్ జనరల్ త్రిలోచన్ మహాపాత్ర

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆహారలభ్యతలో భారత దేశం స్వయం సమృద్ధి సాధించిందని భారతీయ వ్యవసాయ పరిశోధనమండలి డైరెక్టర్ జనరల్ డాక్టర్ త్రిలోచన్ మహాపాత్ర అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్, విలువల జోడింపు, వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా చేసే అంశాలపై పరిశోధనలు చేయాలని ఆయన సూచించారు. జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కార్నెల్



విశ్వవిద్యాలయం, సిఐఐలు సంయుక్తంగా అగ్రివిజన్ సదస్సు శుక్రవారంతో ముగిసింది. ఎనిమిది అంశాలపై ఈ సదస్సులో పాల్గొన్న శాస్త్రవేత్తలు, రైతులు, పరిశ్రమల ప్రతినిధులు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా మహాపాత్ర మాట్లాడుతూ ఒకప్పుడు ఆహారధాన్యాల్ని భారతదేశం దిగుమతి చేసుకోవల్సిన పరిస్థితి ఉండేదని, కానీ నేడు ఉత్పాదకతలు పెరిగి ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించగలిగామన్నారు. రైతులకి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడానికి కృషి జరగాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి కూడా తమ ముందు ఇదే లక్ష్యాన్ని ఉంచారని ఆయన చెప్పారు.

పాడిపరిశ్రమలో సమ్మెలు నిషేధం

హై దరాబాద్,ఆంధ్రప్రభ : పాడి పరిశ్రమ రంగంలో సమ్మెలను ఆరు నెలల పాటు నిషేధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.నిత్యావసర సేవల చట్టం 1971 కింద డెయిరీ , పాల సరఫరాల వ్యవస్థలో సమ్మెలపై ఆరు నెలల పాటు నిషేదం విధిస్తూ పశుసంవర్ధక, డెయిరీ, మత్స్య పరిశ్రమలశాఖ కార్యదర్శి సందీప్ సుల్తానియా ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు.

ఆటా నూతన అధ్యక్షుడిగా పరమేష్ భీమిరెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : అమెరికా తెలుగు అసోసియేషన్ (ఆటా) 2019-2020 నూతన అధ్యక్షుడిగా పరమేశ్ భీమిరెడ్డి ఎన్నికయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లా పోతిరెడ్డిపల్లికి చెందిన పరమేశ్ 1992లో ఆటా సంస్థలో సభ్యత్వం తీసుకుని వివిధ హోదాల్లో పనిచేశారు. అలాగే పాలమూరు ఎన్నారై ఫోరంతో పాటు అనేక సంస్థల్లో బోర్డ్ ఆఫ్ ట్రస్టీగా బాధ్యతలను నిర్వహించారు.

బీసీ సంక్షేమ శాఖను యథావిధిగా కొనసాగించాలి

● సీఎస్‌కు తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం విజ్ఞప్తి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: 1972 నుంచి ప్రత్యేకంగా కొనసాగుతున్న బీసీ సంక్షేమ శాఖను యధావిధిగా కొనసాగించాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. రాష్ట్రంలోని వివిధ సంక్షేమ శాఖల విలీనం చేయాలనే ప్రభుత్వ ఆలోచన సరైంది కాదని సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. రాష్ట్ర జనాభాలో సగానికిపైగా ఉన్న బీసీల కోసం ప్రత్యేకంగా బీసీ సంక్షేమ శాఖ కొనసాగించాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ మేరకు జాజుల బీసీ సంఘం నేతలు ఈ నిరంజన్, కనకల శ్యామ్ కురుమ, జాజుల లింగం గౌడ్, బత్తిని రాజు, రాజు, శ్రీరామ్ తదితరులతో కలిసి శుక్రవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషిని కలిసి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, వికలాంగులు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖలు వేర్వేరుగా కొనసాగుతున్నాయని జాజుల గుర్తు చేశారు. ఇప్పుడు కొత్తగా అన్ని సంక్షేమ శాఖలను ఒకే గొడుగు కిందకు తీసుకురావాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోందని ఇది సరైంది కాదని అన్నారు. బీసీల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ఇబ్బంది కలుగుతుందని పేర్కొంటూ 1972లోనే సాంఘిక సంక్షేమ శాఖ నుంచి తొలగించి ప్రత్యేకంగా బీసీ సంక్షేమ శాఖను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. 1975లో రూ. 2 కోట్లు కేటాయించి ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి మంత్రిని కేటాయించారని గుర్తు చేశారు. రాష్ట్రంలో పరిపాలనా సౌలభ్యం కోసం ఉన్న 10 జిల్లాలను 31 జిల్లాలు చేసిన నేపథ్యంలో వేర్వేరుగా ఉన్న సంక్షేమ శాఖలను విలీనం చేయడం సరికాదన్నారు. బీసీలకు జాతీయ స్థాయిలో ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్ కేంద్రానికి లేఖ రాసి... ఇప్పుడు రాష్ట్రంలో ఉన్న బీసీ సంక్షేమ శాఖను ఇతర శాఖలో విలీనం చేస్తామని చెప్పడం సరికాదన్నారు. ఈ ఆలోచనను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

యూపీకి రాహుల్, సోనియా

అమేథి (ఉత్తర్‌ప్రదేశ్): కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ సొంత నియోజవర్గాలు అమేథి, రాయ్‌బరేలీ లలో 23-24 తేదీల్లో పర్యటించనున్నారు. రాయ్‌బరేలీ నియోజకవర్గంలో నిర్వహించే మీటింగ్‌కు యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ హాజరవు తారు.

పొత్తు ఫైనల్... సీట్ల సర్దుబాటు తరువాయి



లక్నో: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీఎస్‌పీ, ఆర్ఎల్‌డీతో పాటు చిన్న పార్టీలతో పొత్తు ఫైనల్ అయ్యిందని సమాజ్ వాది పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ తెలిపారు. రాష్ట్రంలో బలమైన శక్తిగా అవతరించడమే ప్రధాన లక్ష్యం అని అన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో కూటమి ఏర్పాటు చూసి బీజేపీ తమపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారని తెలిపారు. తమ పార్టీ ఉత్తర్‌ప్రదేశ్‌పై ఎక్కువ దృష్టి సారిస్తుందని, కాంగ్రెస్‌తో పొత్తు ఉండబోదని మరోసారి యాదవ్ స్పష్టం చేశారు. ఆర్ఎల్‌డీ కోరుకుంటున్న మథుర, బగ్‌పత్ నియోజకవర్గాలు ఇస్తామని, పార్టీ కూడా ఇదే ఆశిస్తున్నదని, కూటమి విషయంలో ఎలాంటి మనస్పర్థలు లేవని అన్నారు.

కాంగ్రెస్‌తో పొత్తు ఉండదు!

న్యూఢిల్లీ: కాంగ్రెస్‌తో పొత్తు పెట్టు కోబోమని ఆమ్ ఆద్మీ పార్టీ స్పష్టం చేసింది. ఢిల్లీ, పంజాబ్‌తో పాటు హర్యానాలోని అన్ని స్థానాల్లో తమ అభ్యర్థులను బరిలోకి దించుతామని ఆప్ నేత గోపాల్ రాయ్ తెలిపారు. బీజేపీకి వ్యతిరేకంగా వెళ్లే విషయంలో కాంగ్రెస్‌తో జత కట్టేది లేదన్నారు. మూడు రాష్ట్రాల్లో ఆప్‌కు మంచి పట్టు ఉందని, కూటమిలో చేరకుండా ఒంటరిగా లోక్‌సభ ఎన్నికల బరిలో దిగుతామని అన్నారు. గతంలో కాంగ్రెస్‌తో కలిసి పని చేయాలని భావించామని, కానీ ప్రస్తుత పరిస్థితుల్లో ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నట్టు తెలిపారు. మమతా బెనర్జీ, ఎంకే స్టాలిన్, చంద్రబాబు నాయుడు, ఫరూఖ్ అబ్దుల్లా వంటి నేతల సూచనల ఆధారంగా కాంగ్రెస్‌తో పొత్తుపై ఆలోచిస్తామని అన్నారు.

36 ఎందుకు కొనాల్సి వచ్చింది..?

న్యూఢిల్లీ: దేశ రక్షణ విషయంలో మోడీ ప్రభుత్వం రాజీపడు తోందని, ఏయిర్ ఫోర్స్‌కు 126 రాఫెల్ యుద్ధ విమానాలు అవసరం ఉండగా, కేవలం 36 మాత్రమే ఎందుకు కొనుగోలు చేయాల్సి వచ్చిందో సమాధానం చెప్పాలని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఆర్థికశాఖ మంత్రి చిదంబరం డిమాండ్ చేశారు.గతం కంటే ఎందుకు ఒక్కో విమానంపై ఎక్కువ డబ్బులు చెల్లించాల్సి వచ్చిందో చెప్పాలని మరో కాంగ్రెస్ నేత జ్యోతిరాదిత్య సింధియా ట్విట్టర్ వేదికగా ప్రశ్నించారు.

బీజేపీకి మాజీ ఎంపీ రాజీనామా

బీహార్: బీజేపీ మాజీ ఎంపీ ఉదయ్ సింగ్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. బీహార్‌లోని పూర్ణియా లోక్ సభ నియోజక వర్గం నుంచి 2004, 2009లో వరుసగా రెండుసార్లు ఎంపీగా ప్రాతినిధ్యం వహించిన ఉదయ్. ప్రధాని నరేంద్ర మోడీ కన్నా రాహుల్ గాంధీకి ప్రజాదరణ పెరుగు తోందని అన్నారు. బీజేపీలో ఉన్న సమయంలో కూడా తానెప్పుడూ కాంగ్రెస్ ముక్త్ భారత్ నినాదాలను అంగీకరించలేదని ఉదయ్ అన్నారు.

దావోస్ పర్యటన రద్దు

వాషింగ్టన్: అమెరికాలో కొనసాగుతున్న షట్‌డౌన్ నేపథ్యంలో అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తమ ప్రతినిధి బృందం స్విట్జర్లాండ్, దావోస్ పర్యటనను రద్దు చేశారు. యూఎస్, మెక్సికో సరిహద్దులో వివాదాస్పద గోడ నిర్మాణానికి డెమొక్రాట్లు నిధుల అనుమతికి అంగీకరించకపోవటంతో అమెరికాలో షట్‌డౌన్ కొనసాగుతోంది. ఐదు రోజుల డబ్ల్యూఈఎఫ్ సమావేశం ఈ నెల 21 నుంచి స్విట్జర్లాండ్ రిసార్ట్ నగరం దావోస్‌లో ప్రారంభం కానుంది.

ట్రంప్ సలహా కమిటీలో భారతీయ అమెరికన్



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో కీలక నిర్ణయం తీసుకునే యోచనలో ఉన్నారు. ప్రముఖ భారతీయ అమెరికన్, ఆర్థిక నిపుణుడు ప్రేమ్ పరమేశ్వరన్‌ను ట్రంప్ తన అధ్యక్ష సలహా కమిటీలోకి తీసుకోనున్నట్లు సమాచారం. పరమేశ్వరన్ సేవలను వినియోగించుకునే యోచనలో ట్రంప్ ఉన్నట్లు వైట్‌హౌస్ వర్గాలు తెలియజేశాయి. ఆసియా అమెరికన్లు, పసిఫిక్ ఐలాండర్లతో అమెరికా అధ్యక్ష సలహా కమిషన్‌లో మొత్తం 12 మంది సభ్యులుండగా.. భారతీయ అమెరికన్ ప్రేమ్ ఒక్కరే ఆ కమిటీలో ఉండటం విశేషం. 1968లో అమెరికాలో జన్మించిన ప్రేమ్ పరమేశ్వరన్ గ్రూప్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్, ఇరోస్ ఇంటర్నేషనల్ ఉత్తరఅమెరికా కార్యకలాపాల అధ్యక్షుడు. సేవా భావంతో మెలిగే పరమేశ్వరన్ కొలంబియా బిజినెస్ స్కూల్‌లో ప్రేమ్ పరమేశ్వరన్ ఫ్యామిలీ స్కాలర్ షిప్‌ను ప్రారంభించారు.

ఆకలితో అలమటిస్తున్న ఉద్యోగులు

వాషింగ్టన్: అమెరికాలో షట్‌డౌన్ కారణంగా ఆ దేశమంతా ఆర్థిక కార్యకలాపాలు స్థంభించిపోయాయి. దాదాపు 8లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు విధులకు దూరమయ్యారు. జీతభత్యాలు అందక అల్లాడిపోతున్న ఉద్యోగస్థులపై దేశవ్యాప్తంగా దాతృత్వం వెల్లువెత్తుతోంది. జోస్ ఆండ్రెన్ అనే ప్రముఖ చెఫ్ మరికొంతమంది చెఫ్‌లతో కలిసి వాషింగ్టన్‌డీసీలోని పెన్సిల్వేనియా కూడలిలో థింక్ ఫుడ్ ల్యాబ్ అండ్ ఆండ్రెస్ పేరిట ఓ కేఫేను ఏర్పాటు చేసి ఉద్యోగులకు ఉచితంగా భోజనం అందిస్తున్నారు.

భారత్-అమెరికా క్షిపణి చర్చలు

వాషింగ్టన్: భారతదేశంతో ద్వైపాక్షిక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంచుకునే దిశగా క్షిపణి రక్షణ సహకారంపై యూఎస్ చర్చించిందని పెంటగాన్ తెలిపింది. అమెరికా- ఇండోపసిఫిక్ వ్యూహంలో న్యూఢిల్లీ ఒక కీలక అంశం అని పెంటగాన్ నిర్ధారించింది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విడుదల చేసిన 81పేజీల మిసైల్ డిఫెన్స్ రివ్యూ నివేదికను పెంటగాన్ ప్రకటించింది.

నేడే మమత ర్యాలీ

- కోల్‌కతాకు క్యూ కట్టిన నేతలు
- బెంగాల్ వేదికగా బీజేపీకి హెచ్చరికలు

కోల్‌కత నుంచి ఆంధ్రప్రభ ప్రతినిధి స్వరూప పొట్లపల్లి:

దేశ రాజకీయాల్లో ఒక మహత్తర ఘట్టానికి వేదిక సిద్ధమైంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని వ్యతిరేకిస్తూ జట్టుకట్టిన విపక్ష రాజకీయ పార్టీలు భారీస్థాయిలో బలప్రదర్శనకు సిద్ధమయ్యాయి. బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ కోల్‌కతలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు హాజరయ్యేందుకు పలు రాజకీయ పార్టీల అధినేతలు క్యూ కట్టారు. యునైటెడ్ ఇండియాగా నామకరణం చేసిన ఈ సభ కోసం నగరంలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌ను సిద్ధం చేశారు. సీఎం మమతా బెనర్జీ స్వయంగా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. తృణమూల్ పార్టీ శ్రేణుల కథనం ప్రకారం ఏకంగా 40 లక్షల మంది జనాన్ని సభకు సమీకరించి తరలించాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. బ్రిగేడ్ మైదానంలో భారీ వేదికతో పాటు నలుదిక్కులా వాచ్ టవర్లను కూడా నిర్మించారు. వేదిక చుట్టూ ఉన్న స్థలాన్ని వివిధ విభాగాలుగా వర్గీకరిస్తూ బ్యారికేడ్లను ఏర్పాటు చేశారు. మీడియా ప్రసార సాధనాలు, ఓబీ వ్యాన్లను నిలిపి ఉంచేందుకు ఒక బ్లాకు కేటాయించగా, వీవీఐపీ వాహనాల రాకపోకలు, పార్కింగ్ కోసం స్టేజి వెనుక భాగాన్ని కేటాయించారు. అలాగే స్టేజి ముందు భాగంలోనూ బ్లాకులుగా విభజించి బ్యారికేడ్లను అమర్చారు.

ప్రతిపక్షాల ఐక్యతారాగం వినిపించేందుకు మమత ఆహ్వానాన్ని అందుకున్న పలువురు నేతలు కోల్‌కత్తా చేరుకున్నారు. మాజీ ప్రధాన మంత్రి, జనతాదళ్ (ఎస్) అధినేత హెచ్.డీ దేవెగౌడ శుక్రవారం మధ్యాహ్నం గం. 3.30 సమయంలో కోల్‌కత్తా చేరుకున్నారు. ఆ వెంటనే యూపీ మాజీ సీఎం, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ చేరుకున్నారు. జార్ఖండ్‌కు చెందిన హేమంత్ సోరెన్, అరుణాచల్‌ప్రదేశ్ మాజీ సీఎం గెగాంగ్ అపాంగ్ మధ్యాహ్నానికే



మమతా బెనర్జీతో మాజీ ప్రధాని హెచ్.డి. దేవెగౌడ భేటీ

కోల్‌కత చేరుకోగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు రాత్రికి చేరుకున్నారు. బాబుతో పాటు రాష్ట్ర ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు, కళా వెంకట్రావు, రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్ర కుమార్, ఢిల్లీలో ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి కంభంపాటి రామ్మోహన రావు తదితరులు కూడా కోల్‌కత చేరుకున్నారు. చాలా మంది నేతలు శుక్రవారం రాత్రికే కోల్‌కత చేరుకునేలా ప్లాన్ చేసుకోగా, కొందరు నేతలు శనివారం ఉదయం వచ్చేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. కోల్‌కత చేరుకున్న నేతలు నగరంలోని వేర్వేరు స్టార్ హోటళ్లలో బస చేశారు. వారిని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మర్యాదపూర్వకంగా వెళ్లి కలుసుకున్నారు. ఈ ర్యాలీకి గతంలో బీజేపీ ప్రభుత్వంలో కేంద్ర మంత్రులుగా పనిచేసి, ప్రస్తుతం మోడీని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న యశ్వంత్ సిన్హా, అరుణ్ శౌరితో పాటు సామాజిక ఉద్యమకారులు హార్థిక్ పటేల్, జిగ్నేష్ మేవానీ కూడా హాజరుకానున్నారు. బీజేపీ తిరుగుబాటు నేత శత్రుఘ్న సిన్హాకూడా ఈ వేదిక పంచుకోనున్నారు.

దూరంగా తటస్థ పార్టీలు...

మమతా బెనర్జీ ఆహ్వానం అందినప్పటికీ కొన్ని రాజకీయ పార్టీలు ఈ సభకు దూరంగా ఉన్నాయి. ముఖ్యంగా దేశంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు సమాన దూరంలో ఉంటున్న బిజూ జనతాదళ్ (బీజేడీ) అధినేత, ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ హాజరుకావడం లేదు. అలాగే దేశంలో జాతీయ పార్టీలను వ్యతిరేకిస్తూ ప్రాంతీయ పార్టీలతో ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్న తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) అధినేత, తెలంగాణ రాష్ట్ర సీఎం కే. చంద్రశేఖర్ రావు కూడా హాజరుకావడం లేదు. ఈ సభలో కాంగ్రెస్ వేదిక పంచుకుంటున్న సందర్భంగా హాజరు కావడం లేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

విపక్ష నేతలకు స్వాగత తోరణాలు

కోల్‌కత్తాలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి నగరంలోకి వెళ్లే మార్గంతో పాటు పలు ఇతర ప్రధాన రహదారులు విపక్ష నేతల ఫ్లెక్సీలతో నిండి పోయాయి. హాజరయ్యే ప్రతి నేతకూ విడివిడిగా ఆహ్వానం పలుకుతూ ముద్రించి న ఫ్లెక్సీలను డివైడర్లు, విద్యుత్తు స్తంభాలపై ఏర్పాటు చేశారు. దారిపొడవునా తృణమూల్ కాంగ్రెస్ జెండాలతో నింపేశారు. దీంతో కోల్‌కత్తా నగరంలో రాజకీయ పండుగ వాతావరణం నెలకొంది.

ఇంట్లో విరోధులు.. వీధిలో మిత్రులు

భారతీయ జనతా పార్టీని ఓడించి నరేంద్ర మోడీని మరోసారి ప్రధాని కాకుండా అడ్డుకునే క్రమంలో విబేధాలు మరచి చేతులు కలపాలని విపక్షాలు నిర్ణయించుకున్నప్పటికీ, ఆచరణలో అది సాధ్యపడే వాతావరణం కనిపించడం లేదు. మమతా బెనర్జీ పిలుపు మేరకు సభకు హాజరవుతున్న రాజకీయ పార్టీలు వేదికపై చేతులు కలిపేందుకు సిద్ధపడినా, ఆయా రాష్ట్రాల్లో కత్తులు దూస్తూనే ఉన్నారు. ముఖ్యంగా బలప్రదర్శనకు వేదిక ఏర్పాటు చేసిన మమతా బెనర్జీతో తీవ్రమైన రాజకీయ విబేధాలు, వైరం కలిగిన సీపీఐ(ఎం), సీపీఐలు ఈ సభకు దూరంగా ఉన్నాయి. దీంతో సుదీర్ఘ చరిత్ర కలిగిన జాతీయ పార్టీలుగా ఉన్న కమ్యూనిస్టులే చేతులు కలపకపోవడం విమర్శలకు తావిస్తోంది. మరోవైపు అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కు, కాంగ్రెస్‌కు మధ్య దూరం పెరిగింది. పంజాబ్, ఢిల్లీ రాష్ట్రాల్లో కత్తులు దూస్తున్న వాతావరణమే కనిపిస్తోంది. తాజాగా పరస్పర విమర్శలు కూడా చేసుకుంటున్నారు. అయితే మమత సభలో మాత్రం చేతులు కలిపేందుకు సిద్ధమయ్యారు. కేవలం బీజేపీని ఓడించాలన్న ఏకైక ఉమ్మడి లక్ష్యం కోసం మాత్రమే ఈ రెండు పార్టీలు ఇంట్లో విరోధుల్లు వీధిలో మిత్రులు అన్న చందంగా వ్యవహరిస్తున్నాయి.

మమత ఆహ్వానం మేరకు...

01. హెచ్.డీ. దేవెగౌడ, కుమారస్వామి - జనతాదళ్ (ఎస్)
02. నారా చంద్రబాబు నాయుడు - తెలుగుదేశం
03. అఖిలేష్ యాదవ్ - సమాజ్‌వాదీ పార్టీ
04. సతీష్ మిశ్రా - బహుజన్ సమాజ్‌పార్టీ
05. ఎం.కే. స్టాలిన్ - డీఎంకే
06. మల్లికార్జున ఖర్గే, అభిషేక్ మను సింఘ్వీ - కాంగ్రెస్
07. అరవింద్ కేజ్రీవాల్ - ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)
08. ఫరూఖ్ అబ్దుల్లా, ఒమర్ అబ్దుల్లా - నేషనల్ కాన్ఫరెన్స్
09. తేజస్వి యాదవ్ - ఆర్జేడీ
10. శరద్ పవార్ - నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ)
11. అజిత్ సింగ్, జయంత్ చౌదరి - ఆర్.ఎల్.డీ
12. యశ్వంత్ సిన్హా - కేంద్ర మాజీ మంత్రి
13. శరద్ యాదవ్
14. శత్రుఘ్న సిన్హా - బీజేపీ తిరుగుబాటు నేత
15. గెగాంగ్ అపాంగ్ - అరుణాచల్ ప్రదేశ్ మాజీ సీఎం
16. అరుణ్ శౌరి - కేంద్ర మాజీ మంత్రి
17. హేమంత్ సోరెన్
18. జిగ్నేష్ మేవానీ - గుజరాత్ ఎమ్మెల్యే, సామాజిక ఉద్యమకారుడు
19. హార్థిక్ పటేల్ - పాటిదార్ ఉద్యమకారుడు
20. లల్దువాహ్మా - మిజోరాం ప్రతిపక్ష నేత

మమత నేతృత్వం.. రాహుల్ సంఘీభావం

టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ నేతృత్వం వహిస్తున్న ప్రతిపక్షాల బలప్రదర్శనకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మద్దతు ప్రకటించారు. ఈ మేరకు ఆయన ఓ లేఖ విడుదల చేశారు. దేశంలోని విపక్షాలన్నీ ఏకమై బలమైన శక్తిగా రూపుదిద్దుకుంటున్నాయని పేర్కొన్నారు. మోడీ సర్కారు మోసపూరిత వాగ్దానాలు, అసత్యాలతో జనాలు విసిగిపోయి కోపం, నిరాశలో మునిగిపోయారని లేఖలో వ్యాఖ్యానించారు. ప్రస్తుత భారతదేశం రేపటి గురించి ఆందోళన చెందుతోందని, ఇప్పుడు ప్రతిపక్షాల ఐక్యతను చూసి ఆశలు చిగురిస్తున్నాయని పేర్కొన్నారు. కులం, మతం, ప్రాంతం, ఆర్థిక హోదాలతో సంబంధం లేకుండా దేశంలోని ప్రతి ఆడ, మగ, చిన్నా, పెద్దా అందరినీ ఈ విపక్ష కూటమి గౌరవిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. బీజేపీ, మోడీ కలిసి ప్రజాస్వామ్యాన్ని, సామాజిక న్యాయాన్ని, లౌకిక వాద సిద్ధాంతాలను నాశనం చేశారని లేఖలో దుయ్యబట్టారు. వాటి పరిరక్షణ కోసం ప్రతిపక్షాలన్నీ ఏకమవుతున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున పార్టీ సీనియర్ నేతలు మల్లికార్జున ఖర్గే, అభిషేక్ మను సింఘ్వీలు హాజరుకానున్నారు.




మమతా బెనర్జీని మర్యాదపూర్వకంగా కలిసిన స్టాలిన్, అఖిలేష్

కేసీఆర్‌కు మమత ఫోన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ శనివారం కోల్‌కతాలో తలపెట్టిన భారీ ప్రదర్శనకు తాను హాజరు కాలేనని తెరాస అధినేత, తెలంగాణ సీఎం కేసీఆర్ స్పష్టంచేశారు. తాను నిర్వహిస్తున్న భారీ ప్రదర్శనకు రావాలని మమతా బెనర్జీ శుక్రవారం మధ్యాహ్నం కేసీఆర్‌కు ఫోన్‌చేసి ఆహ్వానించారు. కాంగ్రెస్ సహా దేశవ్యాప్తంగా ఉన్న వివిధ జాతీయ, ప్రాంతీయ పార్టీలకు చెందిన దాదాపు 20 మందికిపైగా కీలక నేతలు ఈ ప్రదర్శనలో పాల్గొంటున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఆయా పార్టీల నేతలు కోల్‌కతాకు చేరుకోగా, తెదేపా జాతీయ అధ్యక్షుడు, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం రాత్రి ప్రత్యేక విమానంలో ప్రయాణించి కోల్‌కతాకు చేరుకున్నారు. అయితే కాంగ్రెస్, చంద్రబాబు పాల్గొంటున్న ఈ ప్రదర్శనకు దూరంగా ఉండాలని కేసీఆర్ నిర్ణయించుకున్నట్టు తెరాస వర్గాలు తెలిపాయి. భాజపా, కాంగ్రెస్ పార్టీలు లేని ఫెడరల్ ఫ్రంట్‌ను ఏర్పాటు చేసేందుకు కేసీఆర్ జాతీయ స్థాయిలోని ఆయా రాజకీయ పక్షాల నేతలతో సమాలోచనలు జరుపుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఆయన ఈ దిశగా ప్రయత్నాలు ప్రారంభించారు. మమతా బెనర్జీని రెండు దఫాలు కలిసి నూతన కూటమిపై మంతనాలు జరిపారు. ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, మాజీ ప్రధాని దేవెగౌడ, కర్నాటక ముఖ్యమంత్రి కుమారస్వామి, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్‌తో పాటు వివధ రాష్ట్రాల ప్రాంతీయ పార్టీల నేతలతో కేసీఆర్ సమాలోచనలు జరుపుతున్నారు. ఇటీవలె వైకాపా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డితో తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ బృందం హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి వెళ్ళి చర్చ జరిపింది. ఈ నేపథ్యంలో కోల్‌కతాకు వెళ్ళరాదని కేసీఆర్ నిర్ణయించుకున్నట్టు చెబుతున్నారు. రాజకీయాల్లో గుణాత్మక మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్‌ను ఏర్పాటుచేసే పనిలో నిమగ్నమయ్యారు.

కుమారకు ఢోకాలేదు

- అంతా కాంగ్రెస్ వెంటే
- 5 ఏళ్ల పాటు సంకీర్ణ ప్రభుత్వానిదే..
- మాజీ సీఎం సిద్ధ రామయ్య
- సీఎల్పీకి నలుగురు ఎమ్మెల్యేలు డుమ్మా
- నోటీసులు జారీ



బెంగళూరు: కర్నాటకలో సంకీర్ణ ప్రభుత్వ పాలనకు ముప్పు లేదని కర్నాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ చీఫ్ దినేష్ గుండు రావు అన్నారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడే వారి జాబితాను సిద్ధం చేయడం జరిగిందని, సొంత ఎమ్మెల్యేలతో పాటు ప్రతిపక్ష పార్టీ సభ్యులు కూడా సంకీర్ణ ప్రభుత్వంలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. సంకీర్ణ ప్రభుత్వమే ఐదేళ్ల పాటు పాలన అందిస్తుందని, బీజేపీ ఎన్ని జిమ్మిక్కులు చేసినా సర్కార్‌ను అస్థిరపర్చలేదని తేల్చి చెప్పారు.

నలుగురు ఎమ్మెల్యేలు గైర్హాజరు

విధానసౌధలో 3.30 నిమిషాలకు జరిగిన సీఎల్పీ సమావేశానికి నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టారు. అసెంబ్లీలో తమ బలం ఎంత ఉందో నిరూపించుకునేందుకు గాను సీఎల్‌పీ సమావేశం నిర్వహించింది. నలుగురు సభ్యులు హాజరుకాకపోయినప్పటికీ సంకీర్ణ ప్రభుత్వాన్ని కొనసాగించగల సత్తా కుమార స్వామికి ఉందని తేలింది. బీజేపీ మాత్రం తమ అందరు ఎమ్మెల్యేలను హర్యాణ, గుర్గాంలోని ఓ హోటల్‌లో పెట్టారని, దీనిపై ఎంతో జాలి వేస్తోందని కేపీసీసీ చీఫ్ దినేష్ గుండు రావు అన్నారు. కేపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఈశ్వర్ ఖాంద్రే మాట్లాడుతూ.. చించోలి ఎమ్మెల్యే ఉమేష్ యాదవ్ బీజేపీలో చేరుతున్నట్టు వార్తలు వచ్చాయని, అతనితో స్వయంగా మాట్లాడినట్టు తెలిపారు. సీఎల్‌పీ సమావేశానికి కాంగ్రెస్ సీనియర్ నేత మల్లికార్జున్ ఖర్గే, సిద్ద రామయ్య, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో పాటు రాష్ట్ర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని అస్థిరపర్చలేరు: కుమార స్వామి

బీజేపీ ఆపరేషన్ కమల్ పేరుతో ఎమ్మెల్యేలను తమవైపు మళ్లించుకోవడానికి ప్రయత్నిస్తోంది. ఏం చేసినా ప్రభుత్వాన్ని అస్థిరపర్చలేరు. కేసీ వేణుగోపాల్‌తో రాష్ట్ర పాలనపై చర్చించడం జరిగింది. ఆపరేషన్ కమల్ గురించి నాకేం బాధలేదు. ఇది యడ్యూరప్ప విధి. రెండు రోజుల పాటు అందుబాటులో ఉండటం లేదన్నారు. కోల్‌కతాలో ర్యాలీలో పాల్గొనడంతో పాటు కొన్ని వ్యక్తిగత కార్యక్రమాలు ఉన్నాయి. 224 మంది ఎమ్మెల్యేల్లో అసెంబ్లీలోకి బీజేపీకి 104 బలం ఉంటే, కాంగ్రెస్‌కు 79, జేడీఎస్‌కు 37, బీఎస్‌పీ 1, కేపీజేపీ 1, ఇండిపెండెంట్ 1 ఉన్నారు. బీఎస్‌పీ సంకీర్ణ ప్రభుత్వానికి మద్దతు ప్రకటించింది. ఇద్దరు స్వతంత్ర ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకున్నారు. వారు బీజేపీలోకి వస్తారని యడ్యూరప్ప ప్రకటించారు.

మేం బాధ్యులం కాదు: యడ్డీ

కాంగ్రెస్-జేడీ(ఎస్) మధ్య నెలకొన్న గందరగోళానికి మేం బాధ్యులం కాము. ఎంతో చరిత్ర ఉన్న రెండు పార్టీలు ఒకరితో ఒకరు కలిసి ముందుకు వెళ్లాలి. బీజేపీపై వస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నాం. బీజేపీ వెంట 104 మంది ఉన్నారు. ఇప్పుడు కర్నాటకలోని 20 లోక్‌సభ స్థానాలపై దృష్టి పెడుతున్నాం. దాని కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. వారు సీఎల్‌పీ సమావేశం పెట్టుకుంటే మేం ఏం చేయాలి..? మా ఎమ్మెల్యేలను కాపాడుకోవడం మా బాధ్యత. హోటల్‌లో తమ ఎమ్మెల్యేలను పెట్టామనడంలో వాస్తవం లేదని అన్నారు.

సుప్రీం జడ్జీలుగా దినేష్, ఖన్నా ప్రమాణస్వీకారం



న్యూఢిల్లీ: జస్టిస్ దినేష్ మహేశ్వరి, జస్టిస్ సంజీవ్ ఖన్నాలు శుక్రవారం సుప్రీం కోర్టు జడ్జిలుగా ప్రమాణ స్వీకారం చేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గోగోయ్ సమక్షంలో వీరిద్దరూ ప్రమాణ స్వీకారం చేశారు. వీరిద్దరితో కలిపి సుప్రీం కోర్టులో జడ్జిల సంఖ్య 28కి చేరు కొంది. సుప్రీంకోర్టులో 31మంది జడ్జిలు ఉండవచ్చు. దినేష్ మహేశ్వరి కర్ణాటక హైకోర్టు జడ్జిగా పనిచేయగా, సంజీవ్ ఖన్నా ఢిల్లీ హైకోర్టు జడ్జిగా పనిచేశారు. జస్టిస్ సంజీవ్ ఖన్నాను సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమించ డంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. కొలీజియం సిఫార్సుల మేరకే కేంద్రప్రభు త్వం ఈ నిర్ణయం తీసుకొన్నప్పటికీ ఆయన విషయంలో సీనియార్టీని పాటించలేదం టూ న్యాయ మూర్తితోపాటు మాజీ న్యాయమూర్తులు, బార్ కౌన్సిల్ నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి.




భద్రతాదళాలపై గ్రెనేడ్ దాడులు

శ్రీనగర్: జమ్ముకాశ్మీర్లో భద్రతాదళాలపై ఉగ్రవాదులు రెండుచోట్ల గ్రెనేడ్లతో దాడికి పాల్పడ్డారు. శుక్ర వారం ఉగ్రవాదులు శ్రీనగర్‌లోని లాల్‌చౌక్ ఏరియాలో గ్రెనేడ్లతో దాడిచేశారని మొత్తం రెండు ప్రాంతాల్లో గ్రెనేడ్లతో దాడికి యత్నించారని పోలీసులు తెలిపారు. అయితే ఈ దాడుల్లో ఎటువంటి ప్రాణనష్టం జరగ లేదని తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం సెంట్రల్ రిజర్వ్ ఫోర్స్(సీఆర్‌పీఎఫ్) బంకర్‌పై గుర్తు తెలియని ఉగ్రవాదులు గ్రెనేడ్ విసిరారని పోలీస్ అధికారి ఒకరు తెలిపారు. అయితే గ్రెనేడ్ రోడ్డుపక్కన పడి పేలిపో వటంతో ప్రమాదం తప్పిందన్నారు. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదని రోడ్డుపక్కన నిలిపిఉంచిన కారు పాక్షికంగా దెబ్బతిందని పోలీస్ అధికారి మీడియాకు తెలిపారు. ఇరవై నాలుగు గంటల వ్యవధిలో జమ్ము వేసవి రాజధాని శ్రీనగర్‌లో రెండుసార్లు దాడి చేశారన్నారు. మరోదాడి దక్షిణ కాశ్మీర్లోని సోపియా న్ జిల్లాలో జరిగిందని ఈ గ్రెనేడ్ దాడిలో పేలుడు కారణంగా ఎటువంటి ఆస్తినష్టం, ప్రాణనష్టం జరగలేదని ఆయన తెలిపారు. మరో పదిరోజుల్లో రిపబ్లిక్ డే ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో ఈ దాడులు జరిగాయని పోలీసులు తెలిపారు.కాగా గురువారం పోలీస్ సిబ్బందిపై ఉగ్రవాదులు గ్రెనేడ్ విసరడంతో ముగ్గురు పోలీసులు గాయపడ్డారని తెలిపారు.

వారికి రక్షణ కల్పించండి: సుప్రీం

న్యూఢిల్లీ: శబరిమల అయ్యప్ప ఆలయంలోకి ప్రవేశించిన మహిళలు ఇద్దరు బిందు, కనకదుర్గకు రక్షణ కలిపించాలని శుక్రవారం సుప్రీంకోర్టు కేరళ ప్రభుత్వాన్ని ఆదేశించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగొయ్, జస్టిస్ ఎల్ఎన్ రావు, జస్టిస్ దినేశ్ మాహేశ్వర్‌తో కూడిన సుప్రీం ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. కాగా కోజీకోడ్ జిల్లా కోయిలాండీకు చెందిన కాలేజ్ లెక్చరర్, సీపీఎం కార్యకర్త బిందు(42), మలప్పురం జిల్లా అంగడిపురానికి చెందిన సివిల్ సప్లయ్‌స్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగిని కనకదుర్గ (44) ఇద్దరు జనవరి 2న శబరిమల పుణ్యక్షేత్రంలోని అయ్యప్పస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలోకి ప్రవేశించినందుకు తమకు బెదిరింపులు వస్తున్నాయని, ప్రాణహాని ఉంది కనుక రక్షణ కలిపించాలని కోరుతూ ఈ ఇద్దరు మహిళలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ అంశంపై విచారణ చేసిన దేశ సర్వోన్నత న్యాయస్థానం బిందు, కనకదుర్గకు రక్షణ కలిపించాలని కేరళ ప్రభుత్వాన్ని ఆదేశించింది.

పైలెట్లు కావలెను..!



న్యూఢిల్లీ: మానవ సహిత అంతరిక్ష మిషన్‌లో భాగంగా ప్రయోగించే 'గగన్‌యాన్' వ్యోమగాములు పైలెట్‌లు అవుతారని ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) శాస్త్రవేత్తలు శుక్రవారం ప్రకటించారు. ఎలాంటి పేర్లు వెల్లడించకూడదనే నిబంధన మేరకు తమకు తగినంత అనుభవం ఉన్న వారు అవసరం అని, దీని కోసం ప్రయత్నాలు చేస్తున్నామని ఇస్రో శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ సందర్భంగా ఇస్రో చైర్మన్ కె.శివన్ మాట్లాడుతూ.. గగన్‌యాన్ మిషన్ ప్రాజెక్టులో వ్యోమగాముల ఎంపికలో భారతీయ వైమానిక దళంతో పాటు ఇతర ఏజెన్సీలు కీలకం కానున్నాయని అన్నారు. డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ కూడా ప్రధాన పాత్ర పోషిస్తుందని భావిస్తున్నట్టు మరో ఇస్రో శాస్త్రవేత్త అభిప్రాయపడ్డారు. ముందుగా డిసెంబర్ 2020లో మానవ రహిత 'గగన్‌యాన్' యాత్రను ప్రారంభించే ఆలోచనలో ఉన్నామని ఇస్రో చైర్మన్ శివన్ తెలిపారు. రెండో మానవ రహిత మిషన్‌ను జులై 2021లో, అంతిమంగా మూడో మానవ సహిత గగన్‌యాన్‌ను డిసెంబర్ 2021లో చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు.



జమ్మూ కాశ్మీర్‌లో భారీ హిమపాతం

- ముగ్గురు మృతి... ఏడుగురు గల్లంతు

శ్రీనగర్: జమ్మూ కాశ్మీర్లో భారీ హిమపాతం ధాటికి ట్రక్‌లో ప్రయాణిస్తున్న ముగ్గురు మృతి చెందారు. ఈ ఘటనలో గల్లంతైన మరో ఏడుగురి ఆచూకీ లభ్యం కాలేదని అధికారులు మీడియాకు తెలిపారు. జమ్ము కాశ్మీర్లోని లడక్ ప్రాంతంలోని ఖార్దంగ్ లా ప్రాంతంలో మంచుశిఖరాలు విరిగిపడి భారీ హిమపాతం ట్రక్‌పై పడటంతో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా మరో ఏడుగురు గల్లంతయ్యారని శుక్రవారం అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బీఆర్ఓ) అధికారులు మాట్లాడుతూ ఖర్దంగ్ లా ప్రాంతంలో 10మందితో వెళుతున్న ట్రక్‌ను శుక్రవారం ఉదయం 7గంటల ప్రాంతంలో హిమపాతం ఢీకొట్టిందని తెలిపారు. దీంతో మంచుదిబ్బలో కూరుకుపోయిన ట్రక్ నుంచి ప్రయాణికులను రక్షించేందుకు పోలీసులు, ఆర్మీ, స్టేట్ డిసాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్‌డీఆర్ఎఫ్) సంఘటన ప్రాంతానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారని బీఆర్ఓ అధికారులు తెలిపారు. అవలాంచీ ప్రాంతం నుంచి ముగ్గురి మృతదేహాలు ఇప్పటివరకు లభ్యమయ్యాయని, గల్లంతైనవారి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయని బీఆర్వో అధికారి తెలిపారు.

ఢిల్లీలో నిర్ణయాత్మకశక్తిగా తెరాస

- కారెక్కిన వంటేరు
- పార్లమెంట్ ఎన్నికల్లోనూ అసెంబ్లీ ఫలితాలే పునరావృతం
- కేసీఆర్‌పై చంద్రబాబు అక్కసుతో మాట్లాడుతున్నారు
- సెటిలర్స్ అంతా కేసీఆర్‌కే జైకొట్టారు
- వంటేరు ప్రతాప్‌రెడ్డి చేరిక హర్షదాయకం
- తెలంగాణ భవన్‌లో టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో టీఆర్ఎస్‌ను పదహారుకు పదహారు స్థానాల్లో గెలిపిస్తే ఢిల్లీ రాజకీయాలను శాసించే నిర్ణయాత్మకశక్తిగా టీఆర్ఎస్ అవతరిస్తుందని, మనం అనుకున్న స్థాయిలో అభివృద్ధి జరగాలంటే కేంద్రప్రభుత్వాన్ని శాసించాల్సిన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్రసమితి వర్కింగ్‌ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. సీఎం కేసీఆర్‌పై గజ్వేల్‌లో పోటీచేసి ఓడిన కాంగ్రెస్‌పార్టీ రాష్ట్రనాయకులు వంటేరు ప్రతాపరెడ్డి ఆపార్టీని వీడి శుక్రవారం గులాబీతీర్థం పుచ్చుకున్నారు. ఆయనకు గులాబీకండువా కప్పి సాదరంగా టీఆర్ఎస్‌లోకి ఆహ్వానించిన కేటీఆర్ ఈసందర్భంగా మాట్లాడారు. కొన్నిగంటల వ్యవధిలో వేలాదిగా అభిమానులను, కార్యకర్తలను తీసుకొచ్చిన వంటేరు ప్రతాపరెడ్డి అన్నకు కృతజ్ఞతలు. 2009లో నేను టీఆర్ఎస్‌లోకి రావాలని ప్రతాప్‌ను ఆహ్వానించా. మొత్తంమీద పదేళ్ళతర్వాత అయినా ప్రతాప్‌రెడ్డి టీఆర్ఎస్‌లోకి రావడం ఆనందాన్నిస్తోంది. గజ్వేల్‌కు ఎలా నిధులవరదపారుతుందో.. ఎంత అభివృద్ధి జరిగిందో ప్రజలకు తెలుసు. కోటిఎకరాల తెలంగాణ మాగాణంకావాలని కేసీఆర్ పెట్టుకున్న కల త్వరలో నెరవేరబోతోంది. కేసీఆర్ నేతృత్వంలోనే బంగారు తెలంగాణ సాధ్యమవుతుందని ప్రజలు అఖండవిజయాన్ని కట్టబెట్టారు. 2018ఎన్నికల్లో 47నుండి 50శాతం ప్రజలు టీఆర్ఎస్‌కు ఓట్లేశారు. ఓడిపోయిన చోట కూడా ట్రక్కుగుర్తు వల్ల చాలా స్వల్పతేడాతో ఓడిపోయాం. ఆసిఫాబాద్‌లో 180ఓట్లతేడాతో ఓడాం. 75శాతం స్థానాలను టీఆర్ఎస్‌కు ప్రజలు కట్టబెట్టారు. మనం అనుకున్నస్థాయిలో అభివృద్ధి జరగాలంటే కేంద్ర ప్రభుత్వాన్ని మనం శాసించాలి. రేపటిరోజున 16పార్లమెంట్ స్థానాలు గెలవాలి. దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌పార్టీకి తనకు తానుగా 100కుపైగా స్థానాలు వచ్చే అవకాశం లేదు. ఏ రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీ ఒంటరిగా పోటీచేసే పరిస్థితి లేదు. ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ఒక్క ఛత్తీస్‌గడ్‌లో మాత్రమే కాంగ్రెస్‌కు ఆధిక్యం వచ్చింది. బీజేపీ అంటే బిల్డప్‌పార్టీనే. ప్రధాని సహా బిజెపి సీఎంలు ప్రచారం చేసినా 103అసెంబ్లీస్థానాల్లో డిపాజిట్ కూడా రాలేదు. ఈసారి కూడా పార్లమెంట్ ఎన్నికల్లో అసెంబ్లీ ఫలితాలే పునరావృతం అవుతాయ్ అని కేటీఆర్ అన్నారు.

ఏపీకి వ్యతిరేకంగా వ్యవహరించలేదు

తాము ఎన్నడూ ఏపీకి వ్యతిరేకంగా వ్యవహరించలేదని కేటీరామారావు అన్నారు. అన్నదమ్ముల్లా విడిపోదాం.. అభివృద్ధిలో కలిసి ఉందామనే తాము ఉద్యమ సమయంలోనూ చెప్పామన్నారు. ఇక్కడి సీమాంధ్రులు కేసీఆర్‌కి ఓటేసి గెలిపించారంటేనే వాళ్ళని తాము ఎలా గుండెల్లో పెట్టి చూసుకున్నామో అర్థం అవుతుందన్నారు. కేసీఆర్ పై, టీఆర్ ఎస్‌పై అక్కసుతో చంద్రబాబు మాట్లాడుతు న్నార న్నారు. తన అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికే కేసీఆర్‌పై అభాండాలు వేస్తున్నారని, ఆంధ్ర ప్రజలు దీనిని గమనించాలన్నారు. తమకు, బిజెపికి సంబంధం ఏంటని, బిజెపిని చిత్తుచిత్తుగా ఓడించింది తాము కాదా అని కేటీఆర్ అన్నారు. జాతీయ స్థాయిలో నాన్ కాంగ్రెస్, నాన్ బిజెపి నినాదంతో దేశరాజకీయాలను శాసించేదిశగా టీఆర్ఎస్ ప్రయాణిస్తున్నదన్నారు. తెలం గాణలో కోపం వచ్చినా, ప్రేమ వచ్చినా ఆగదని ఆ తర్వాత అంతా మంచిగ కలిసుంట మన్నా రు. రాష్ట్ర అభివృద్ధి కోసం అందరం కలిసి పనిచేద్దామన్నారు.

కేసీఆర్ ఎలాంటిబాధ్యత అప్పగించినా పనిచేస్తా: వంటేరు

తనను 2009నుండి టీఆర్ఎస్‌లోకి రావా లని కేటీఆర్ ఆహ్వానిస్తున్నారని, ఇపుడు సీఎం ఆహ్వానం మేరకు గజ్వేల్ నియోజ కవర్గ అభివృద్ధి కోసం టీఆర్ఎస్‌లో చేరానని వంటేరుప్రతాపరెడ్డి ప్రకటించారు. సీఎం కేసీఆర్ తీసుకున్న సంక్షేమ పథకాలకే ప్రజలు బ్రహ్మరథం పట్టి టీఆర్ఎస్‌ను అత్యధికస్థానాల్లో గెలిపించాలన్నారు. తాజా అసెంబ్లీ ఎన్నికల్లోనూ కేసీఆర్ తనపై ఘన విజయం సాధించారని, కేసీఆర్ నిర్ణయమే సరైనదని తన నిర్ణయం తప్పని ప్రజలు భావించా రన్నారు. అభివృద్ధి,సంక్షేమపథకాలే టీఆర్ఎస్‌ను గెలిపించాయన్నారు. మల్లన్నసాగర్, వేములఘాట్ ప్రజలు కూడా టీఆర్ఎస్‌కే ఓటువేయడంతో తాను చేసిన ఉద్యమం తప్పని భావిస్తున్నానన్నారు. కేసీఆర్ తనకు ఎలాంటి బాధ్యత అప్పగించినా శక్తివంచనలేకుండా పనిచేస్తానన్నారు. కార్య క్రమంలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, టూరిజం కార్పోరేషన్ ఛైర్మన్ భూపతిరెడ్డి, ఎలక్షన్‌రెడ్డి, పార్టీ నాయకులు తక్కళ్ళపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఏనుగురవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌తో వంటేరు భేటీ

సీఎం కేసీఆర్‌ను టీఆర్ఎస్‌లో చేరిన అనంతరం వంటేరుప్రతాప్‌రెడ్డి ప్రగతి భవన్‌లో కలిశారు. గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధి కోరుకుని టిఆర్ఎస్‌లో చేరిన ప్రతాప్‌రెడ్డిని ఈ సందర్భంగా కేసీఆర్ అభినందించారు.

కార్యక్రమంలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీలు ఫారూఖ్‌హుస్సేన్, బాలసాని లక్ష్మీనారాయణ, నాయకులు ఎలక్షన్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, ఎడ్మకిష్టారెడ్డి తదితరులున్నారు.

రాష్ట్రాల బలోపేతానికే కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్

రాష్ట్రాల బలోపేతానికే కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ తీసుకొచ్చారు. కాంగ్రెస్, బిజెపి రెండింటికీ మ్యాజిక్‌ఫిగర్ సాధించే అవకాశం లేదు. కాంగ్రెస్, బిజెపితో పొత్తులేదని ఎస్పీ, బిఎస్పీ ప్రకటించాయి. ఒడిస్సా సీఎం నవీన్‌పట్నాయక్ కూడా బిజెపి, కాంగ్రెసేతర పార్టీకే మద్దతు అంటున్నారు. వైసీపీ అధ్యక్షుడు జగన్ కూడా కేంద్రం లో మనమే చక్రంతిప్పేలా ఉండాలని అంటున్నాడు. ప్రాంతీయపార్టీలు ఏకమై ఢిల్లీని శాసించే స్థాయికి ఎదగాలి. ఢిల్లీలో నిర్ణయాత్మకశక్తిగా టీఆర్ఎస్ మార బోతోంది. చంద్రబాబు సోనియాను ఎన్నోమాటలు అని ఇపుడు సిగ్గులేకుండా కాంగ్రెస్‌తో జట్టుకట్టారు. దేశంలో గుణాత్మక మార్పుకోసం కేసీఆర్ దేశవ్యాప్తం గా తిరిగి అందరిమద్దతు కూడగడుతున్నారు. నాలుగున్నరేళ్ళు మోడీతో సంసారం చేసిన చంద్రబాబు ఇపుడు బయటకు వచ్చి తన చేతగానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకు ఇతరులను బూచిగా చూపెట్టే ప్రయత్నం చేస్తున్నారు.

వరంగల్ మేయర్ ఎంపికపై కేటీఆర్ కసరత్తు

- ఎమ్మెల్యేల అభిప్రాయాలు సేకరణ
- నిర్ణయం ప్రకటించనున్న సీఎం కేసీఆర్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: వరంగల్ మేయర్ ఎంపికకోసం సీఎం కేసీఆర్ ఆదేశాలతో టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీరామారావు కసరత్తు ప్రారంభించారు. గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పోరేషన్ పరిధిలోని ఐదుగురు శాసనసభ్యులు, శాసనమండలి విప్ పల్లా రాజేశ్వరరెడ్డితో అసెంబ్లీ వాయిదా పడిన వెంటనే టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో కేటీఆర్ ప్రాథమిక చర్చలు జరిపారు. మేయర్ నన్నపనేని నరేందర్ వరంగల్ తూర్పు నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో కొత్తమేయర్ ఎంపిక అనివార్యమైంది. వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, వర్ధన్నపేట ఎమ్మెల్యే ఆరూరి రమేష్, వరంగల్ ఈస్ట్ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ ఈ భేటీలో పాల్గొన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితో సమావేశం నుండే కేటీఆర్ ఫోన్‌లో మాట్లాడారు. ఇలాంటి సమావేశాలతో ఇంకా మరికొంతమంది అభిప్రాయాలు తీసుకుని పార్టీ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్‌కు నివేదించి వరంగల్ మేయర్ అభ్యర్థిపై తుదినిర్ణయం తీసుకుంటామని కేటీఆర్ సమావేశంలో తెలిపారు. వరంగల్ మేయర్ పదవి కోసం ప్రధానంగా ఐదుగురి పేర్లు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.


కేటీఆర్‌తో పీఆర్‌టీయూ నేతల భేటీ

- నల్గొండ- ఖమ్మం- వరంగల్ ఎమ్మెల్సీపై చర్చ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: త్వరలో ఖాళీకానున్న వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గం అభ్యర్థిత్వంపై చర్చించేందుకు పిఆర్‌టియు నేతలు శుక్రవారం సాయంత్రం టిఆర్ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావును కలిశారు. టిఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో నేతలు అభ్యర్థిత్వంపై చర్చించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇక్కడ ఎమ్మెల్సీగా పూలరవీందర్ వ్యవహరిస్తుండగా, పిఆర్‌టియుకు సంబంధించి మరికొందరు నేతలు కూడా పోటీపడుతుండడంతో భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. ఎమ్మెల్సీలు పూలరవీందర్, జనార్ధన్‌రెడ్డిలతో పాటు పిఆర్‌టియు నేతలు కేటీఆర్‌ను కలిసి అభ్యర్థిత్వంపై, విజయంపై చర్చించినట్లు తెలుస్తోంది. పరిస్థితిని పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌కు నివేదిస్తానని ఈ సందర్భంగా కేటీఆర్ చెప్పినట్లు తెలుస్తోంది. ఇప్పటికే కరీంనగర్ ఉపాధ్యాయనియోజకవర్గానికి సంబంధించి మండలిచీఫ్‌విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి అభ్యర్థిత్వంపై ఏకాభిప్రాయం వ్యక్తం కాగా నల్లగొండ నియోజకవర్గానికి సంబంధించి కూడా ఒక నిర్ణయానికి వచ్చి కేసీఆర్ త్వరలోనే ప్రకటిస్తారని చెబుతున్నారు.


ఎన్నికలను బహిష్కరించిన గ్రామ ప్రజలు

ఇందల్వాయి, ప్రభన్యూస్ : నిజామాబాద్ జిల్లా, తిర్మన్‌పల్లి, గంగారాం తాండ గ్రామాల్లో ఎన్నికలను బహిష్కరించారు. గ్రామస్థులందరూ కూడి ఒక్క నామినేషన్ కూడా వేయకూడదని శుక్రవారం నిర్ణయించుకున్నారు. కొత్తగా ఇందల్వాయి మండలం ఏర్పాటు తర్వాత గ్రామాల విభజన జరిగింది. ఇందల్వాయి మండలానికి చెందిన తిర్మన్‌పల్లి గంగారాం తాండ గిరిజన గ్రామాలు ఏర్పాటు చేశారు. కానీ అధికారులు గ్రామాల రెవెన్యూ సరిహద్దులు సరిచేయక పోవడంతో ఇందల్వాయి, తిర్మన్‌పల్లి గ్రామస్థులు కొత్తగా ఏర్పాటు చేసిన గిరిజన గ్రామాలకు చెందిన గంగారాం తాండ గ్రామపంచాయతీ విషయంలో ప్రజల మధ్య గొడవలు చోటుచేసుకుంటున్నాయి. రెవెన్యూ సరిహద్దులు చూపాలని ఎన్నిసార్లు ప్రజాప్రతినిధులు, అధికారులను కలిసినా ఫలితం శూన్యమన్నారు. ఇంతలోనే గ్రామపంచాయతీ ఎన్నికలు వచ్చాయి. ఇరు గ్రామాల ప్రజలు తమ గ్రామాల సమస్య పరిష్కారం అయ్యేవరకు ఎన్నికల్లో ఎవరూ నామినేషన్ వేయకుండా గ్రామస్థులు గ్రామపంచాయతీ ముందే వంటావార్పు నిర్వహించి నిరసన తెలిపారు. ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. అధికారులు వెంటనే రెవెన్యూ సరిహద్దులు చూపాలని డిమాండ్ చేశారు. సాయంత్రం 5 గంటల వరకు ఏ ఒక్కరు కూడా నామినేషన్ లేనందున ఎన్నికల అధికారులు వెనుదిరిగారు.



పైరవీలతో పదవులిస్తే పార్టీకి నష్టం

- కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: కాంగ్రెస్ పార్టీలో కష్టపడే వారికి గుర్తింపు లేదని, పార్టీ పదవుల విషయంలో పైరవీలు, లాబీయింగ్ చేసే వారికే పట్టం కడుతు న్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే తూర్పు జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్ర వారంనాడు సీఎల్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లా డారు. పార్టీ పదవుల విషయంలో లాబీయింగ్‌కు ఢిల్లీ పెద్దలు ఫుల్‌స్టాఫ్ పెట్టాలని, అప్పుడే రాష్ట్రంలో కాంగ్రెస్‌కు మంచి రోజులు వస్తాయని అన్నారు. ఢిల్లీ చుట్టూ ప్రద క్షిణలు చేసే వారికి ప్రాధాన్యత ఇవ్వొద్ద న్నారు. కుల మతాలకు సంబం ధం లేకుండా రాజకీయాలు రా వా ల్సిన అవస రం ఉందన్నారు. తెలంగాణలో జరిగే రాజ కీయ పరిణామా లు ఏఐసీసీ అధ్య క్షుడు రాహుల్ గాంధీకి తెలియనీయడం లేదని జగ్గారెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు.

'చే' జారుతున్న నేతలు

- కాంగ్రెస్‌ను వీడి కారెక్కుతున్న నాయకులు
- పీసీసీ నాయకత్వం భరోసా కల్పించకపోవడమే కారణమంటున్న నేతలు
- ఇదే స్థితి కొనసాగితేపార్టీ మనుగడకు పెనుముప్పు అంటున్న కేడర్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోరపరాజయం తర్వాత పార్టీకి ఒక్కొక్క నేత గుడ్ బై చెబుతున్నారు. ఇప్పటికే ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్సీలు టీఆర్ఎస్‌లో చేరగా.. శుక్రవారం మరో కీలకనేత హస్తానికి టాటా చెప్పారు. ఒక వైపు పార్లమెంట్ ఎన్నికలు ముంచుకొస్తుంటే.. మరో వైపు కాంగ్రెస్ నేతలు పార్టీని వీడుతుండటంతో కేడర్‌లో కలవరం మొదలైంది. ఈ ముగ్గురు నేతల బాటలో మరెందరున్నారోననే భయం ఆ పార్టీ నేతలను వెంటాడుతోంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన కొన్ని రోజులకే ఎమ్మెల్సీలు ఆకుల లలిత, సంతోష్‌కుమార్ ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షంలో గులాబీ గూటికి చేరారు. ఇకసీఎం కేసీఆర్‌పై గజ్వేల్ నియోజక వర్గం నుంచి రెండు సార్లు పోటీ చేసి ఓడిపోయిన వంటేరు ప్రతాప్‌రెడ్డి హస్తానికి గుడ్ బై చెప్పడం సంచలనంగా మారింది. టీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వంటేరు ప్రతాప్‌రెడ్డి ఎన్నో ఉద్యమాలు చేయడమే కాకుండా.. సీఎం కేసీఆర్‌కు గట్టిగానే ఢీ కొన్నారు. 2014లో టీడీపీ నుంచి పోటీ చేసిన వంటేరు ప్రతాప్‌రెడ్డి కేసీఆర్‌కు గట్టిపోటీనే ఇచ్చారు. ఆ తర్వాత టీడీపీకి రాజీనామా చేసి గతేడాది ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రెండోసారి కూడా సీఎం కేసీఆర్‌పైన పోటీ చేసిన వంటేరు ఓడిపోయారు.

టీడీపీలో ఉన్నప్పుడు వంటేరు ప్రతాప్‌రెడ్డిపైన కేసులు నమోదు కావడంతో జైలుకు సైతం వెళ్లారు. ఆ సమయంలో టీడీపీ నేతలు కూడా సరిగా స్పందించలేదని అప్పట్లోనే విమర్శలు వచ్చాయి. ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరినప్పటికి కూడా అదే పరిస్థితి ఉందని ఆయన తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో పోలీసులు ఎంతో అరాచకం చేయడమే కాకుండా ఇంట్లో సోదాలు నిర్వహించి భయబ్రాంతులకు గురిచేసినా రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం నుంచి స్పందన కరువైందని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఎన్నికల సమయంలో ఆర్థికంగా చేయుతనివ్వడంలో పార్టీ వివక్షత చూపిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

సీఎం అభ్యర్థిపైన పోటీ చేస్తున్నందున పార్టీ ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉండేదని, కాంగ్రెస్ మాత్రం తమకేమి పట్టనట్లుగానే వ్యవహరించిందని చెబుతున్నారు. ఆర్థికంగా నష్టపోయిన వారికి కొంతమేరకైనా భరోసా కల్పించాల్సిన బాధ్యత తీసుకుంటే బాగుండేదనే అభిప్రాయం వ్యక్తమవు తోంది. వంటేరు ప్రతాప్ రెడ్డి మాదిరి గా విజయం సాధించిన ఎమ్మెల్యేలు ఇబ్బందుల్లో ఉన్నారనే చర్చ జరుగు తోంది. ఇప్పటికైనా పార్టీ నేతలు తమ తీరును మార్చుకోకపోతే ఇబ్బందులు తప్పవని ద్వితీయ శ్రేణి నాయ కత్వం ఆందోళన వ్యక్తం చేస్తున్నది.

ఎన్నికల్లో పార్టీ ఓటమికి గల కారణాలపై తూతూ మంత్రంగానే సమీక్షలు చేశారని, లోతుగా అధ్యయనం చేయడం లేదని సొంత పార్టీ నేతల నుంచి విమర్శలు వినిపిస్తూనే ఉన్నాయి. ఇకపోతే సీఎల్పీ నేత ఎంపిక విషయంలోనూ రాజకీయాలు నడిపిస్తున్నారని అంటున్నారు. రాష్ట్రంలోని వాస్తవ రాజకీయ పరిస్థితులను అధిష్టానానికి చేరనీయక పోవడమే ఇందుకు కారణమని వాదన వినిపిస్తోంది. ప్రజల్లో పట్టున్నవారిని పక్కనపెట్టి.. సొంత కోటరీని ఏర్పాటు చేసుకోవడంతోనే కాంగ్రెస్‌కు ఈ దుస్థితికి కారణమని అంటున్నారు. ఇప్పటికైనా పీసీసీ నాయకత్వం మేల్కొనకపోతే మరింత నష్టం జరిగే ప్రమాదం ఉందని అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రైతులకు మేలు చేస్తా!

- రాష్ట్రపౌరసరఫరాల కార్పొరేషన్ చైర్మన్ మారెడ్డి



సీఎం కేసీఆర్‌ను కలిసిన మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: స్వతహాగా రైతు బిడ్డనైన తనకు రైతు కష్టాలు తెలుసునని, అలాంటి రైతులకు మేలు చేసే విధంగా శాయశక్తులా కృషి చేస్తానని రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ చైర్మన్‌గా మారెడ్డి శ్రీనివాసరెడ్డి స్పష్టంచేశారు. ఎర్రమంజిల్‌లోని సివిల్ సప్లయీస్ భవన్‌లో రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్‌గా మారెడ్డి శ్రీనివాసరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్, తెరాస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావులకు శ్రీనివాసరెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రమాణస్వీకారోత్సవంలో హోంమంత్రి మహమూద్ అలీ, పౌర సరఫరాల శాఖ కమిషనర్ అకున్ సబర్వాల్, మాజీ మంత్రులు టి.హరీశ్‌రావు, జగదీష్‌రెడ్డి, నాయిని నర్సింహారెడ్డి, తలసాని శ్రీనివాసయాదవ్, శాసన సభ్యులు యాదయ్య, గాదరి కిశోర్ కుమార్, గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, ఫైళ్ల రాజశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ రాజేశ్వరరెడ్డి, జీహెచ్ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్, టీఆర్ఎస్ పార్టీ రాష్ట్రప్రధాన కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి పాల్గొని అభినందనలు తెలియజేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేసి, మంచి పేరు తీసుకురాగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. పౌరసరఫరాల శాఖలో ప్రక్షాళన కొనసాగుతోందని, మరింత మెరుగైన రీతిలో శాఖను మారెడ్డి శ్రీనివాసరెడ్డి తీర్చిదిద్దగలరని పేర్కొన్నారు. మారెడ్డి శ్రీనివాసరెడ్డికి అభినందనలు తెలిపిన వారిలో రాష్ట్ర పోలీసు హౌసింగ్ బోర్డు చైర్మన్ కోలేటి దామోదర్ కూడా ఉన్నారు.




ఏపీలో ఐఏఎస్, ఐపీఎస్‌ల పదవీవిరమణ వయస్సు పెంపు?

అమరావతి, ఆంధ్రప్రభ : అఖిల భారత సర్వీసులైన ఐఏఎస్, ఐపిఎస్ అధికారుల పదవీ విరమణ వయస్సును 60 నుండి 62కు పెంచాలని కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం నిర్ణయించినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ విషయంపై కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ ఇప్పటికే ప్రతిపాదనలను కేంద్ర ఆర్థిక శాఖకు పంపినట్లు సమాచారం. అఖిల భారత సర్వీసుల్లో 'గ్రూప్ -ఏ' పదవులు కేవలం 3 శాతం మాత్రమే ఉన్నందున ఈ పోస్టుల్లో ఉన్న అధికారుల పదవీ విరమణ వయసును పెంచినందువల్ల కేంద్ర ఖజానాపై పెద్దగా భారం పడబోదని అధికార వర్గాలు చెబుతున్నాయి.

కేసీఆర్‌కు తీన్‌మార్!

- ఒకటిస్తే... నేడు మూడు గిఫ్టులిస్తా
- సత్తెనపల్లిలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో చంద్రబాబు




అమరావతి, ఆంధ్రప్రభ: సీనియర్ మోడీ, కోడికత్తి మోడీ తో కలిసి రాష్ట్రంలో కులాల మధ్య చిచ్చుపెడుతూ రిటర్న్ గిఫ్ట్ ఇస్తా అంటున్న కేసీఆర్‌కు తిరిగి ఒకటికి మూడు గిఫ్ట్‌లను ఇస్తానని ఏపీ సీఎం చంద్రబాబు హెచ్చ రించారు. శుక్రవారం స్వర్గీయ నందమూరి తారక రామారావు 23వ వర్ధంతి సందర్భంగా గుం టూరు జిల్లా సత్తె నపల్లిలో రాష్ట్ర శాసన సభ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాద్ ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన 36 అడుగుల ఎన్‌టీఆర్ భారీ క్యాంస్య విగ్రహాన్ని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. ప్రధాని మోడీతో బాగున్నంత వరకు తెలంగాణ సీఎం కూడా తమతో బాగు న్నాడని, ఎప్పుడైతే మోడీని విభేదించామో అప్పటి నుంచి ఏపీపై కక్షకట్టాడని ధ్వజమెత్తారు. తెలంగాణలో సెంటిమెంట్‌ను ఉపయోగించి లబ్ధిపొందిన కేసీఆర్ ఏపీలో కులాల మధ్య చిచ్చుపెడుతూ లబ్ధిపొందేందుకు కుట్రలు చేస్తున్నాడని, అభివృద్ధిలో పోటీ పడలేక గద్దల్లా రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించేందుకు ప్రయత్నాలు చేయడం సిగ్గుచేటన్నారు. తెలుగుజాతి కలిసి ఉండాలని ఆకాంక్షించానని, కానీ కేసీఆర్ ఆంధ్ర రాష్ట్ర ప్రజలను, నాయకులను అసభ్య పదజాలంతో దూషిస్తూ ఎప్పటికప్పుడు అక్కసు వెళ్లగక్కుతూనే ఉన్నాడని మండిపడ్డారు. సీనియర్ మోడీ, తెలంగాణ మోడీ, కోడికత్తి మోడీలు ఏకమై చేస్తున్న రాజకీయ కుట్రలను సమర్థవంతంగా తిప్పికొడతామని ధీమా వ్యక్తం చేశారు.

ప్రజా సమస్యలపై పోరాడతా

(మొదటిపేజీ తరువాయి)

సన్నద్ధం చేసి లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక సీట్లను సాధించడమే లక్ష్యంగా పని చేస్తానని ఆయన శుక్ర వారం రాత్రి ఆంధ్రప్రభకు ఇచ్చిన ప్రత్యేక ఇంట ర్వ్యూలో చెప్పారు. సీఎల్‌పీ నేతగా తనను నియమించిన పార్టీ జాతీయ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి ఆయన ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణలో రెండోసారి శాసనసభ కొలువుదీరిన ఈ తరుణంలో తనకు సీఎల్పీ నేత వంటి కీలక పదవిని పార్టీ అప్పగించడం నిజంగా తాను అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. ఈ ఐదేళ్ళు అహర్నిశలు కృషిచేసి కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకువచ్చేలా కృషి చేస్తానని చెప్పారు. ఇటీవలె మూడు రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగురవేసిందని వచ్చే ఐదేళ్ళు రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేసి తెలంగాణలోనూ అధికారంలోకి వచ్చేలా వ్యూహం రచిస్తామని చెప్పారు. శాసనసభలో, బయట ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలుసుకోవడంతో పాటు వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. పార్టీలోని సీనియర్ల సలహాలు, సూచనలు తీసుకుని ప్రజల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తానని భట్టి పేర్కొన్నారు. సీఎల్పీ పదవికి పార్టీ శాసనసభ్యు లందరూ తన పేరును సిఫారసు చేశారని అందుకే పార్టీ అధినాయకత్వం తనకు ఈ పదవిని కట్టబెట్టిందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో పార్టీ పరాజయంపై కూడా సీఎల్పీగా తనకున్న పరిమితులకు లోబడి సమీక్షనిర్వహిస్తామని చెప్పారు. పార్టీలో ఇప్పటికే ఈ అంశంపై అధ్యయనం జరుగుతోందని, ఓటమికి గల కారణాలను పార్టీ అన్వేషిస్తోందని చెప్పారు. అతిపిన్న వయసులో తనకు కీలకమైన సీఎల్పీ పదవి వరించడం దీన్ని తాను ఒక సవాల్‌గా తీసుకుని పని చేస్తానని మిగతా ఎమ్మెల్యేల సహాయ, సహకారాలు తనకు ఎల్లప్పుడూ ఉంటాయన్న ధీమా తనకు ఉందని చెప్పారు. సీఎల్పీ నేతగా తనను ఎంపిక చేయడంతో తనపై బాధ్యత మరింత పెరిగిందని చెప్పారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసేలా శాసనసభ వేదికగా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని చెప్పారు.



సామాన్య కార్యకర్త నుంచి.. సీఎల్పీ నేత వరకు


దళిత సామాజిక వర్గానికి చెందిన మల్లు భట్టి విక్ర మార్క కాంగ్రెస్ పార్టీలో అంచెలంచెలుగా ఎదుగుతూ తెలంగాణలో ప్రధాన ప్రతిపక్ష నేతగా అవకాశం దక్కించుకున్నారు. చాల మంది సీనియర్ సభ్యులు సీఎల్పీ పదవి కోసం పోటిపడినప్పటికి.. చివరకు భట్టికే అవకాశం కల్పించింది. కాగా భట్టి విక్రమార్క ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మూడోసారి ఖమ్మం జిల్లా మదిర అసెంబ్లీ నుంచి ఎన్నికయ్యారు. పార్టీలో కూడా వివిధ పదవులను చేపట్టారు. 2009లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మొదటి సారిగా ఎమ్మెల్యేగా ఎన్నికైన భట్టి విక్రమార్క.. వరుసగా మూడు పర్యాయాలు అదే అసెంబ్లీ నియోజక వర్గం నుంచి విజయం సాధిం చారు. కాగా 2007లో ఖమ్మం జిల్లా స్థానిక సంస్థల నుంచి ఎమ్మెల్సీగా విజయం సాధించారు. ఇక పార్టీ లోను పలు కీలక పదువులనే నిర్వహించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్నికల ప్రచార కమిటి చైర్మన్‌గాను, అంతకు ముందు టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గాను పని చేశారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం: వీహెచ్

సీఎల్పీ నేతగా భట్టి విక్రమార్కను నియమించిన ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీకి ఏఐసీసీ కార్యదర్శి వి. హనుమంతరావు కృతజ్ఞతలు తెలిపారు. దళితసామాజికవర్గానికి చెందిన భట్టికి సీఎల్పీ పదవి అప్పగించి సామాజిక న్యాయం పాటించారని ఆయన తెలిపారు.

సీఎల్పీనేతగా భట్టి విక్రమార్క

- రాహుల్ ఆదేశాల మేరకు గెహ్లాట్ ప్రకటన



హైదరాబాద్, ఆంధ్రప్రభ : కాంగ్రెస్ శాసన సభాపక్ష నేతను ఆ పార్టీ అధిష్టానం ఎట్టకేలకు ప్రకటించింది. సీఎల్పీ నేత పదవి మదిర ఎమ్మెల్యే, దళిత సామాజిక వర్గానికి చెందిన మల్లు భట్టి విక్రమార్కను వరించింది. ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఆదేశాల మేరకు ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అశోక్ గెహ్లాట్ భట్టిని సీఎల్పీనేతగా నియమిస్తున్నట్లు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఈ పదవిని టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, జగ్గారెడ్డితో పాటు పలువురు నేతలు ఆశించారు. అయినప్పటికి కాంగ్రెస్ అధిష్టానం మాత్రం భట్టి విక్రమార్క వైపే మొగ్గు చూపింది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను కాంగ్రెస్ అధిష్టానం రాష్ట్రానికి పంపించి పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, సీనియర్లతో పలు దఫాలుగా సమావేశాలు నిర్వహించారు. సీఎల్పీ నేత ఎంపిక విషయంపై విడి విడిగా అభిప్రాయ సేకరణ చేసిన వేణుగోపాల్.. ఎమ్మెల్యేల అభిప్రాయాలను రాహుల్‌గాంధీకి నివేదించారు. చాలా మంది ఎమ్మెల్యేలు తమకు అవకాశం కల్పించాలని కోరుతూనే ఎవరికి అవకాశం కల్పించినా సముచితమేనంటూ వివరించారు. కొంత మంది ఎమ్మెల్యేలు మాత్రం తమకు అవకాశం ఇవ్వండి లేదంటే భట్టి విక్రమార్కను ఎంపిక చేసినా అభ్యంతరం లేదంటూ చెప్పారు. చివరకు ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని ఏకవాఖ్య తీర్మానం చేస్తూ అధిష్టానానికి పంపించారు. కాగా ఈ పదవి కోసం చాలా మంది నేతలు ఢిల్లీలో లాబీయింగ్ చేశారని కూడా కాంగ్రెస్ వర్గాలు పేర్కొన్న విషయం తెలిసిందే. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి అవకాశం ఇవ్వాలన్న నిర్ణయానికి అనుగుణంగా ఆయనకు ఈ పదవి దక్కింది. అంతే కాకుండా శాసన సభా వ్యవహారాలపైన భట్టికి పట్టు ఉండటంతో సీఎల్పీ నేతగా అవకాశం దక్కించుకున్నారు.

పదిలమేనా?

ప్రధాని నియోజకవర్గంలో ఏమంటున్నారు..



రిజర్వేషన్లుసరే.. ఉద్యోగాలు ఏవీ?.. అగ్రవర్ణ పేదలకు మంచి జరుగుతుందా?

10 %

●బీజేపీకి అగ్రవర్ణాల ఓట్లు పడవు ●మోడీపై కోపంగా వారణాశి బ్రాహ్మణులు ●ముస్లింల్లోనూ బీజేపీపై ఆగ్రహం ఉంది..●లంచం ఇవ్వకుండా ఉద్యోగం ఇస్తారా? ●వారణాశిలో 10 శాతంపై భిన్నాభిప్రాయాలు

న్యూఢిల్లీ: అగ్రవర్ణ పేదలకు విద్యా, ఉద్యోగాల్లో పది శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం, చేసిన చట్టం సరిగ్గానే ఉందా? ఈ రిజర్వేషన్ల పరిధిలోకి రావడానికి విధించిన ఆదాయ పరిమితి కరెక్టేనా? పది శాతం కోటాపై దేశ వ్యాప్తంగా చర్చలు జరుగుతున్నాయి. ప్రధానమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాశి నియోజక వర్గంలో ప్రజలేం అనుకుంటున్నారు? మోడీ ప్రభుత్వ చర్యను అగ్రవర్ణాలు మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నాయి. గ్రామాల్లో తొంభై శాతం అగ్రవర్ణాలు కడుపుకి ఇంత తినడమే కష్టంగా మారిందని, ఇందులో అతిశయోక్తి లేదని వారణాశిలోని ఒక ప్రభుత్వ ఉద్యోగి చెప్పారు. అగ్రవర్ణాల్లో పుట్టడమే శాపమా అని తన పిల్లలు తనను అడుగుతున్నారని వాపోయాడు. ప్రభుత్వ చర్యతో కనీసం కొంతమంది యువత అయినా లబ్ధి పొందుతారనే వాదన వినవచ్చింది. ఇది కేవలం ఎన్నికల జిమ్మిక్కనే వారూ లేకపోలేదు. అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వం నిజాయితీగా తలపోసి ఉంటే గతంలోనే ఎందుకు చేయలేదనే ప్రశ్నలూ వినవచ్చాయి.అగ్రవర్ణ పేదలకు పదిశాతం రిజర్వేషన్ల కల్పనపై సీనియర్ సిటిజన్లు సానుకూలంగా స్పందిస్తుంటే, యువతరం మాత్రం దాని వల్ల పెద్దగా ఉపయోగం లేదనే అభిప్రాయాలను వ్యక్తం చేయడం విశేషం. కేంద్ర ప్రభుత్వం కల్పించిన పది శాతం రిజర్వేషన్లు అమల్లోకి రావడానికి చాలా కాలం పడుతుందని, కోర్టుల్లో కేసులు వేస్తారని, అవి తేలేసరికి తాము ముసలివారమవుతామనే భావన వ్యక్తం చేశారు.వారణాశిలోని స్థానిక కాలేజీ ప్రిన్సిపాల్ గయా సింగ్ ఈ పది శాతం రిజర్వేషన్లపై మాట్లాడుతూ ఎన్నికల ప్రయోజనాల కోసమే ఈ రిజర్వేషన్లు కల్పించారని, దీని వల్ల పెద్దగా ఒరిగేదేమీ ఉండదని నిరాశ వ్యక్తం చేశారు. మోడీ చర్యను పొగిడేవారు కూడా ఉంటారన్నారు. జనరల్ కోటాలో రిజర్వేషన్లు కల్పించడానికి ఇంత వరకు దేశంలో ఏ పార్టీకీ, ఏ రాజకీయ నాయకుడికి ధైర్యం లేకుండా పోయిందనే భావనా వ్యక్తమవుతోంది. అగ్రవర్ణాల్లోని పేదలకు కేంద్ర ప్రభుత్వ చర్య ఎంతో ఉపయోగపడుతుందని పలువురు అభిప్రాయపడ్డారు. పది శాతం రిజర్వేషన్లపై వారణాశిలోని ఒక విద్యార్థి మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మంచిదేనన్నారు. పరిస్థితులు మన చేతుల్లో లేనప్పుడు ఇలాంటి రిజర్వేషన్ల వలన అగ్ర పేదలకు మంచే జరుగుతుందన్నారు.

ఎన్నికల ముందు అయితేనేం?

బీజేపీ ప్రభుత్వం ఎన్నికల ముందే రిజర్వేషన్లు ప్రకటించిందనే విమర్శలకు అర్థం లేదనే వాదనా వినిపించింది. దేశంలో ఏడాది పొడువునా ఎప్పుడూ ఏదో ఒక ఎన్నిక జరుగుతూనే ఉంటుందని, ఎన్నికలు ఉన్నాయని ప్రభుత్వాలు ఏ నిర్ణయాలూ తీసుకోకూడదని అనలేం కదా అని చౌరాసియా అనే బీజేపీ నేత అన్నారు.

అగ్రవర్ణ పేదలకు మరో కష్టం?

ఈ పదిశాతం రిజర్వేషన్లు మరికొంత ముందు వచ్చి ఉంటే తనకు ఢిల్లీ కాలేజీలో సీటు దొరికేదని సమీర్ మిశ్రా అనే విద్యార్థి బాధ పడ్డారు. రూ.8 లక్షల నిబంధన కారణంగా ఆ మాత్రం సంపాదించే వారి పిల్లలకు మంచి విద్యా బోధన లభిస్తుందని వారితో పేదలు ఎలా పోటీ పడతారని ప్రశ్నించారు. ఈ నిబంధన అగ్రవర్ణాల్లో నిరుపేదలకు అడ్డంకిగా మారుతుందన్నారు.

ఇప్పుడు మీరు, మేమూ ఒకటే..!

10 శాతం కోటా వల్ల ఉపయోగాలపై వారణాశిలో విపరీతంగా చర్చ జరుగుతోంది. రిజర్వేషన్ల ద్వారా సీటు పొందిన వారిని అగ్రవర్ణ విద్యార్థులు ఎగతాళి చేస్తుంటారని, ఇప్పుడు వారు అలా ప్రవర్తించే అవకాశం లేకుండా పోయిందని వారణాశిలో న్యూట్రిషన్ సైన్స్‌లో పీహెచ్‌డీ చేస్తున్న రియా కుష్వాహ అన్నారు. ఈ రోజుల్లో అసలు ఉద్యోగాలే లేవని, రిజర్వేషన్లు ఇచ్చినంత మాత్రాన ఉపయోగం ఏంటనే ప్రశ్న కూడా పలు వర్గాల్లో వినిపించింది.

రిజర్వేషన్ల వల్ల వివక్ష పోవడం లేదు..

ఇక దళితులకు రిజర్వేషన్ల కారణంగా ఆయా వర్గాలకు సాంఘిక న్యాయం ఇప్పటికీ జరగడం లేదని ఎస్పీ నాయకుడి వద్ద డ్రైవర్‌గా పని చేస్తున్న వ్యక్తి ఆవేదన వ్యక్తం చేశారు. నగరాల్లో కన్నా గ్రామాల్లో కుల వివక్ష తీవ్రంగా ఉందన్నారు. కుల వివక్షను రిజర్వేషన్లు నిర్మూలించలేక పోయాయన్నారు. వివక్ష అంతరించనంత వరకు దళితులకు రిజర్వేషన్లు కొనసాగించాలన్నారు. దళిత రిజర్వేషన్ల వల్ల కూడా ఆ వర్గాల్లోని పేదలకు న్యాయం జరగడం లేదన్నారు. ఏ ఉద్యోగానికైనా లక్షల్లో లంచాలు అడుగుతున్నారని, డబ్బులున్న వారికే ఉద్యోగాలు దొరుకుతున్నాయన్నారు. ఇక బనారసీ చీరలు ఇస్త్రీ చేసి జీవించే రహమ్‌తుల్లా రిజర్వేషన్లపై పెదవి విరిచారు. అన్ని మతాల్లోని పేదలకు వర్తించే రిజర్వేషన్ల వల్ల ముస్లింలకు న్యాయం ఏమీ జరగదన్నారు. ముస్లింల పట్ల సమాజంలో వివక్ష కొనసాగుతోందని, తన కుమార్తెను బాగా చదివించినా.. రెండు లక్షలు లంచం ఇవ్వలేకపోవడం వల్ల ఇంట్లోనే కూచుందన్నారు. ఇక వారణాశిలోని అతి ప్రాచీన దేవాలయల్లో ఒకటైన సంకట్ మోచన్‌లో పూజారి కూడా ప్రభుత్వ నిర్ణయం వల్ల పెద్ద ఉపయోగం లేదన్నారు. వారణాశిలో పోటీ చేయడానికి ముందు ఇదే ఆలయంలో ప్రధాని మోడీ పూజలు చేశారని చెప్పారు. ప్రధాని మోడీ నుంచి వారణాశి ప్రజలు ఎంతో ఆశిస్తున్నారని చెప్పారు. పెద్దగా ఒరిగిందేమీ లేదని పెదవి విరిచారు. వారణాశిలోని బ్రాహ్మణులు మోడీ ప్రభుత్వంపై సంతృప్తిగా లేరని, కాంగ్రెస్ పార్టీ బ్రాహ్మణ అభ్యర్థిని నిలిపితే వారికి ముస్లిం ఓటర్లు కూడా మద్దతు ఇస్తారని, దీంతో మోడీకి ఈసారి గెలవడం కష్టమవుతుందన్నారు.

ఇక వారణాశిలో సమాజ్‌వాదీ పార్టీ నేతలు కూడా పది శాతం కోటాను సమర్థిస్తూనే, ప్రవేశపెట్టిన సమయమే సరైందని కాదనే వాదన వినిపించారు. ఎస్పీ-బీఎస్పీ కూటమిని చూసి బీజేపీ భయపడుతోందని, అందుకనే అగ్రవర్ణాల ఓట్ల కోసం ఈ రిజర్వేషన్లను తెచ్చారని ఆరోపించారు. విపక్షాలు బీజేపీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తాయని, దీంతో అగ్రవర్ణాల




ఎస్పీ-బీఎస్పీ కూటమిని చూసే...!


ఓట్లు తమకే పడతాయని భావించారని, అయితే దానికి భిన్నంగా జరగడంతో కమలనాథులు బిక్కమొహం వేశారని విమర్శించారు. వారణాశిలో ఓ పాఠశాల నడుపుతున్న బీఎస్పీ నాయకుడు అశోక్ ఆనంద్ మాట్లాడుతూ.. అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు కల్పించినంత మాత్రాన బీజేపీకి ఓట్ల రూపంలో కలిగే ప్రయోజనం ఏమీ ఉండదన్నారు. పేదలకు రిజర్వేషన్లు లభిస్తాయని, విద్యా వ్యవస్థను ఎలా మెరుగు పర్చుకోవాలో ఎవరూ ఆలోచించడం లేదన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం అందరికీ లభించాలన్నారు.

రైతుల పరిస్థితేంటి?

వారణాశి నగర శివారులో ఉండే దనియాల్‌పూర్ గ్రామాన్ని పండిట్ బస్తీ అంటారు. ఇక్కడి రైతులు ఆరు బయట ప్రశాంతంగా కూచొని పది శాతం రిజర్వేషన్లపై చర్చిస్తున్నారు. జనరల్ కోటాలో రిజర్వేషన్లు మంచే చేస్తాయని చెబుతున్నా, గత అనుభవాలను కూడా గుర్తు చేసుకున్నారు. తాము కొనే విత్తనాలు ఎంతో ఖరీదైనవని, యూరియా ఖరీదు కూడా తడిసి మోపెడవుతోందని, వ్యవసాయం చేయడం వ్యయప్రయాసలకు కారణమవు తున్నా ప్రతిఫలం చెప్పుకోదగ్గ స్థాయిలో ఉండడం లేదన్నారు. సీఎం యోగి ఆదిత్యనాథ్ పశువధశాలలను మూసేశారని, దీంతో నూ తమకు కష్టాలు వస్తున్నాయని వాపోయారు. ముసలి అయిన ఆవుల సంరక్షణ ఎంతో కష్టమని, వీటి కోసం గోశాలను ప్రతి గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసి ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు.



రిజర్వేషన్లే ఎత్తేస్తామన్నారు..




వారణాశిలోని ఒక ప్రభుత్వ పాఠశాల హెడ్మాస్టర్‌గా పని చేస్తున్న సుశీల్ పాండే మాటల్లో చెప్పాలంటే.. అసలు మొత్తానికే రిజర్వేషన్లను ఎత్తేస్తామని 2014లో బీజేపీ చెప్పేదని, అయితే 2019 నాటికి వీరు కూడా కొత్త రిజర్వేషన్లు తెచ్చారన్నా రు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోవడంతో అగ్ర వర్ణాల మనస్సు లు చూరగొనడానికి తాయిలంలాగా పది శాతం రిజర్వేషన్లు కల్పించారని విమర్శించారు. ఏడాదికి రూ.2.5 లక్షలు సంపాదిస్తున్నందుకే ఆదాయపు పన్ను కట్టేవారికి, ఏటా ఎనిమిది లక్షలు సంపాదించే వారికీ మధ్య పోలిక ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. అగ్రవర్ణాల్లో పేదలకు పది శాతం రిజర్వేషన్లు కల్పించడాన్ని సమర్థిస్తున్న వారు కూడా దీనికి వార్షికాదాయ పరిమితిని రూ.8 లక్షలుగా నిర్ణయించడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు.

రూ.8 లక్షలే.. అర్థం కావడం లేదు..

అగ్ర వర్ణాల పేదలకు పదిశాతం రిజర్వేషన్లపై స్కూళ్లలోనూ చర్చలు జరుగుతున్నాయి. దీనిపై పిల్లలు పెద్దవారిని ఎన్నో ప్రశ్నలు అడుగుతున్నారు. తమకు కూడా రిజర్వేషన్లు ఉంటాయని ఆరా తీస్తున్నారు. ప్రధాని సొంత నియోజవర్గం వారణాశిలో ఎక్కడ చూసినా.. పది శాతం రిజర్వేషన్లపై చర్చోపచర్చలు జరుగుతున్నాయి. వార్షికాదాయం రూ.8 లక్షలు పెట్టడంపై వాదనలు జోరందుకుంటున్నాయి. ఎనిమిది లక్షలు సంపాదించేవారిని పేదల కింద ఎలా గుర్తిస్తారనే ప్రశ్నలు ఎక్కువగా వినిపిస్తున్నాయి.





తొలి రాష్ట్రం గుజరాత్

గాంధీనగర్: ఈబీసీ రిజర్వేషన్లను అమలు చేసిన తొలి రాష్ట్రంగా గుజరాత్ రికార్డు సృష్టించింది. ఈబీసీ రిజర్వేషన్ల బిల్లుకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆమోదముద్ర పడి గెజిట్ విడుదల కాగానే అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ గుజరాత్ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. జనవరి 14,2019 నుంచి తమ రాష్ట్రంలో ఈబీసీ రిజర్వేషన్లు అమలు చేస్తున్నట్లు గుజరాత్ సీఎం విజయ్ రూపానీ ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా విద్యా సంస్థల్లో సీట్లు పెంచి.. రిజర్వేషన్లు అమలు చేస్తామన్నారు. ఇకమీదట విడుదల చేసిన ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్‌లలోనే ఈబీసీ రిజర్వేషన్లకు అనుగుణంగా ఆ కోటా ఉద్యోగాలను వెల్లడిస్తామన్నారు.



ఈబీసీ రిజర్వేషన్లకు యూపీ సర్కార్ ఆమోదం

లక్నో: అగ్రవర్ణ పేదలకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో 10శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈబీసీ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదముద్ర లభించి గెజిట్ విడుదలైన నేపథ్యంలో యూపీ రాష్ట్ర కేబినెట్ ఈ నిర్ణయం తీసుకుంది.124 రాజ్యాంగ సవరణ ప్రకారం ఆర్థికంగా వెనకబడిన వర్గాల వారికి 10 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు ఇటీవల లోక్‌సభ, రాజ్యసభ ఆమోదం తెలిపాయి.



మద్రాస్ హైకోర్టులో డీఎంకే పిటిషన్

చెన్నై: ఆర్థికంగా వెనకబడిన పేదలకు 10 శాతం రిజర్వేషన్ల కల్పించడాన్ని సవాల్ చేస్తూ డీఎంకే పార్టీ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. విద్య, ఉద్యోగ అవకాశాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధమని పేర్కొంటూ డీఎంకే పిటిషన్ దాఖలు చేసింది. రిజర్వేషన్లు పేదరిక నిర్మూలన పథకం కాదని.. సామాజికంగా వెనకబడిన వర్గాలను సమాజంలో గౌరవ ప్రదంగా జీవించేందుకు కల్పించేవని పేర్కొంది. ఆర్థికంగా వెనకబడిన వారిని గుర్తించేందుకు ఇప్పటికే క్రిమిలేయర్ విధానం అమలులో ఉండగా..కొత్తగా రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం లేదని డీఎంకే తన పిటిషన్‌లో వివరించింది. రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్లు 50 శాతాన్ని మించకూడదని పేర్కొంటూనే.. తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్లకు అక్కడి పరిస్థితులకు అనుగుణంగా చట్టం తెచ్చామని వెల్లడించింది.

తాయిలాలకు లక్ష కోట్లు

ఎన్నికల వేళ నజరానాలకు సిద్ధమైన మోడీ సర్కారు

●అన్నదాతపై వరాల జల్లులు! ●ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సెషన్‌లోనే ప్రకటించే ఛాన్స్ ●వడ్డీలేని రుణం.. రైతుబంధు దిశగా కసరత్తు ●ద్రవ్య లక్ష్యాలకు భంగపాటే అంటున్న నిపుణులు



న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ ఓటు బ్యాంక్ కోసం బీజేపీ వ్యూహాత్మకంగా ముందడుగు వేస్తోంది. వచ్చే ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రధాని మోడీ.. రైతు సంక్షేమానికి పెద్దపీట వేయాలని యోచిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం ప్రకటించే తాయిలాలకు లక్ష కోట్ల రూపాయలకుపైనే అసరమౌతాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈనేపథ్యంలో ప్రస్తుతం అమలౌతున్న పథకాల్లో చేసే అదనపు ఖర్చులను లోక్‌సభ ఎన్నికల తర్వాత చేస్తేనే మేలన్న భావనలో ప్రధాని ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల బీజేపీకి కంచుకోటలాంటి మూడు రాష్ట్రాల్లో (మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, రాజస్థాన్) అధికారాన్ని కోల్పోయిన నేపథ్యంలో పార్లమెంట్ ఎన్నికల్లో అలాంటి సీన్ రిపీట్ కాకుండా వ్యూహాత్మకంగా ముందుకెళ్లాలని బీజేపీ నేతలు భావిస్తున్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర రాకపోవడం.. మార్కెట్‌లో ధరలు పెరిగిపోవడం వంటి కారణాలే మూడు రాష్ట్రాల్లో బీజేపీకి చేదు అనుభవాన్ని మిగిల్చాయని నిపుణులు విశ్లేషించిన నేపథ్యంలో.. అన్నదాతకు భరోసా ఇస్తేనే ఎన్నికల్లో అనుకున్న ఫలితాలను రాబట్టవచ్చని మోడీ అండ్ టీం భావిస్తున్నట్లు తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో ప్రధాని మోడీ వైపు మెజారిటీ ప్రజలు నిలవొచ్చని ఒపీనియన్ పోల్స్ చెబుతున్నా.. అజేయుడైన మోడీని ఎదుర్కొనేందుకు ప్రతిపక్షాలన్నీ ఏకమౌతున్న తరుణంలో బీజేపీ కూడా వ్యూహాలకు పదును పెంచింది.


ఓటమి భయంతోనే జిమ్మిక్కులు

ఎన్నికల వేళ మోడీ ప్రభుత్వం ఓటు బ్యాంక్ కోసం జిమ్మిక్కులు చేస్తోందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.2016లో పాత పెద్దనోట్ల రద్దు, 2017లో జీఎస్టీ అమలు వంటి చర్యలే ప్రజలను తీవ్ర ఇబ్బందుల పాలు చేశాయని.. ఎన్నికల వేళ ప్రభుత్వం ప్రకటించిన నజరానాలు ఓటమి భయంతోనే అని కాంగ్రెస్ అధికార ప్రతినిధి గౌరవ్ వల్లభ్ ఆరోపించారు. గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోడీ ప్రభుత్వం ప్రజలకు తాయిలాలు ప్రకటిస్తే నమ్మేవారెవరూ లేరని మండిపడ్డారు.



లక్షకోట్లకు పైగా భారం

తెలంగాణలో అమలౌతున్న రైతు బంధు లాగే.. దేశ వ్యాప్తంగా ఉన్న రైతులకు కేంద్రప్రభుత్వం ప్రతీ హెక్టార్‌కు రూ.2000-4000 వరకు రైతుబంధు ఆర్థికసాయం ప్రకటిస్తే అది మరింత ఖర్చుతో కూడుకున్న పనే అయినా.. మంచి ఫలితాలివ్వొచ్చని ప్రభుత్వ వర్గాలు అంచనా వేస్తున్నాయి.. ఈ ఒక్క పథకం ద్వారానే ప్రభుత్వంపై లక్ష కోట్ల భారంపడొచ్చని చెబుతున్నాయి. రైతు లకు వడ్డీ లేని రుణాలివ్వడం.. వల్ల ఏడాదికి 12 వేల కోట్లు ఖర్చుఅవుతుందని అధి కారులు పేర్కొంటున్నారు. వడ్డీ లేని రుణాలే కాకుండా ప్రభుత్వం ప్రకటించిన ఇతర పథకాలకు 40 వేల కోట్లు ఖర్చు అవుతుందని అధికారవర్గాలు పేర్కొన్నా యి. పర్సనల్, కమర్షియల్ టాక్స్‌లపై రాయితీ ప్రకటించడం వల్ల రెవెన్యూ నష్టం రూ. 25 వేల కోట్లు కాగా.. జీఎస్టీశ్లాబుల్లో మార్పులు చేసి చిరు వ్యాపారులకు ఊరట నివ్వడం ద్వారా రూ.13వేల కోట్లు ప్రభుత్వంపై అదనపు భారం పడుతుందని పేర్కొంటున్నారు. ప్రభుత్వానికి అవసరమయ్యే నిధుల కోసం ఆర్బీఐ డివిడెంట్ కింద 40 వేల కోట్ల రూపాయలను ఈ ఏడాది మార్చి నాటికి అందించనున్నట్లు సమాచారం. ద్రవ్యలోటును మార్చి 2020 నాటికి 3.1 శాతానికి, 2021 నాటికి 3 శాతానికి తగ్గించాలని ప్రభుత్వం గతంలోనే ప్రకటించి నప్పటికీ.. లోక్‌సభఎన్నికల తాయిలాలతో అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలంటే మరోరెండేళ్లు ఆలస్యంకావచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.



రైతుకే పెద్దపీట

2019 లోక్‌సభ ఎన్నికలకు ముందే రైతు సంక్షేమానికి పెద్దపీట వేయాలని భావిస్తున్న మోడీ ప్రభుత్వం... వచ్చేనెల(ఫిబ్రవరి) 1 నుంచి ప్రారంభమయ్యే ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లోనే రైతులకు తాయిలాలు ప్రకటించే దిశగా కసరత్తు చేస్తోంది. రైతుల ఖాతాల్లోకి నేరుగా డబ్బు బదిలీ చేయడంతో పాటు వడ్డీలేని రైతు రుణాలను అందించాలని యోచిస్తోంది. ఇప్పటికే ఆదాయపు పన్ను పరిమితిని పెంచడం, జీఎస్టీలో మార్పుల ద్వారా చిరువ్యాపారులకు ఊరటనివ్వడం, అగ్రవర్ణాల్లోని పేదలకు విద్యా, ఉద్యోగ అవకాశాల్లో 10 శాతం రిజర్వేషన్లు (ఉన్నత విద్యాసంస్థల్లో సీట్ల పెంపు) కల్పించడం ద్వారా ఆయా వర్గాలకు చేరువయ్యే ప్రయత్నం చేసిన మోడీ సర్కారు..ఎన్నికలకు ముందు రైతుల కోసం సరికొత్త నజరానాలను ప్రకటించే యోచనలో ఉంది. లోక్‌సభ ఎన్నికలు మార్చి, ఏప్రిల్ నెలల్లో జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో అంతకుముందే తాయిలాలు ప్రకటించే మెజారిటీ ఓటు బ్యాంక్ రాబట్టవచ్చని బీజేపీ నేతలు భావిస్తున్నారు.బీజేపీ ఆర్థిక వ్యవహారాల అధికార ప్రతినిధి గోపాలకృష్ణ అగర్వాల్ రాయిటర్స్ మీడియా సంస్థతో మాట్లాడుతూ.. ఎన్డీఏ ప్రభుత్వం ఆర్థిక విధానాల విస్తరణ ద్వారా వృద్ధి రేటుకు మరింత ఊతమేర్పడి.. ద్రవ్యోల్బణంలో త్వరలోనే అదుపులోకి రావచ్చని పేర్కొన్నారు. 2017-18 ఆర్థిక సంవత్సరంలో భారత్ ద్రవ్యలోటు 5.9 లక్షల కోట్లు (జీడీపీలో 3.5 శాతం)గా ఉండగా.. ప్రస్తుత ఏప్రిల్ - మార్చి ఆర్థిక సంవత్సర జీడీపీలో ద్రవ్యలోటు 3.3 శాతమే ఉండేట్లు అవసరమైన చర్యలు తీసుకోవచ్చని తెలిపారు.. రైతు సంక్షోభాన్ని నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అగర్వాల్ మాట్లాడుతూ.. ఇందుకోసం విస్తృతమైన పాలసీ అవసరమని పేర్కొన్నారు. ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించేందుకు వృద్ధిరేటును పెంచాలి కానీ.. ద్రవ్యలోటు పరామితులను అధిగమించడం కాదు అని అన్నారు.



తెలంగాణ జాగృతి అంతర్జాతీయ యువజన సదస్సుకు హాజరయ్యేందుకు హైదరాబాద్ విచ్చేసిన సామాజిక కార్యకర్త అన్నా హజారేకు ఎంపీ కవిత స్వాగతం



అలహాబాద్: కుంభమేళాలో.. అయోధ్యలో నిర్మించతలపెట్టిన రామమందిరం నమూనా



న్యూఢిల్లీ: 'మణికర్ణిక' చిత్రం కథానాయిక కంగనారౌత్‌ను సన్మానిస్తున్న రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ దంపతులు, చిత్రంలో బీజేపీ అగ్రనేత ఎల్‌కే అద్వానీ



మాఊరు-మారాజ్యం

పల్లె పోరులో గులాబీ హవా



- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 245 పంచాయతీలు ఏకగ్రీవం • వరంగల్ రూరల్ జిల్లాలో 78 పంచాయతీలు • అత్యల్పంగా అర్బన్ జిల్లాలో 12 పంచాయతీలు

వరంగల్, ప్రభన్యూస్ బ్యూరో: గ్రామ పంచాయతీలలో టీఆర్ఎస్ పార్టీ హవా కొనసాగుతోంది. పోలింగ్ ప్రక్రియ మొదలు కాకముందే మెజారిటీ పంచాయతీలను టీఆర్ఎస్ పార్టీ ఏకగ్రీవంగా కైవసం చేసుకుంది. ఏకగ్రీవాలపై టీఆర్ఎస్ పార్టీతోపాటు ఇతర పార్టీలు కూడా దృష్టిసారిస్తున్నాయి. ఎన్నికల నిర్వహణ ఖర్చు లేకుండా ఏకగ్రీవం చేస్తే ప్రభుత్వం నుంచి పారితోషికం లభించనున్నది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1704 గ్రామ పంచాయతీలు ఉండగా వాటిని రెండు విడతలలో 245 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. మొదటి విడతలో 608 పంచాయతీలకుగాను 136 పంచాయతీలు ఏకగ్రీవం కాగా 472 పంచాయతీలకు పోలింగ్ జరుగనున్నది. రెండో విడతలో 538 పంచాయతీలకుగాను 109 పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం ఏకగ్రీవమైన పంచాయతీలకు పది లక్షల రూపాయల పారితోషికం ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ప్రభుత్వంతోపాటుగా స్థానిక ఎమ్మెల్యేలు ఏకగ్రీవమైన పంచాయతీలకు తమ నియోజకవర్గ అభివృద్ధి నిధి నుంచి మరో ఐదు లక్షల రూపాయల పారితోషికం ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యేలు ప్రకటించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి పంచాయతీల ఏకగ్రీవాలకు ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు. గ్రామాలలో ఎన్నికలంటే ఎక్కువగా పోటీ ఉంటుంది. అలాకాకుండా ప్రశాంతమైన వాతావరణం ఉండాలనే ఏకగ్రీవాలకు వెళ్తున్నారు. మూడో విడతలో కూడా మరో వంద పంచాయతీలు ఏకగ్రీవం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

అత్యధికంగా వరంగల్ రూరల్ జిల్లాలో ఏకగ్రీవాలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1704 పంచాయ తీలకుగాను 245 పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. వీటిలో వరంగల్ రూరల్ జిల్లాలో అత్యధికంగా 78 పంచాయతీలు ఏకగ్రీవంకాగా వరంగల్ అర్బన్ జిల్లాలో అత్యల్పంగా 12 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. వీటిలో మొదటి విడతలో 45 పంచాయతీలు, రెండో వితలో 33 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మొదటి విడతలో 33 పంచాయతీలు, రెండో విడతలో 7 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. మహబూబాబాద్ జిల్లాలో మొదటి విడతలో 31 పంచాయతీలు ఏకగ్రీవం కాగా రెండో విడత 41 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. జనగామ జిల్లాలో మొదటి విడతలో 18 పంచాయతీలు ఏకగ్రీవం కాగా రెండో విడతలో 26 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. వరంగల్ అర్బన్ జిల్లాలో మొత్తం 12 పంచాయతీలు ఏకగ్రీవం కాగా మొదటి విడతలో 10 పంచాయతీలు, రెండో విడతలో రెండే పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి.

220 పంచాయతీలలో గులాబీ జెండా

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 245 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం కాగా వాటిలో 220 పంచాయతీలలో టీఆర్ఎస్



నేతలు గులాబీ జెండాను ఎగురవేశారు. కాంగ్రెస్ పార్టీ ఏడు పంచాయతీలను గెలుచుకోగా బీజేపీ రెండు పంచాయతీలను గెలుచుకోగా ఆరు పంచాయతీలను స్వతంత్రులు గెలుచుకున్నారు. అయితే వీటిలో ఏకగ్రీవమైన పంచాయతీలన్నీ గ్రావాలలో పార్టీలకు అతీతంగా జరిగినవే. సర్పంచ్ టీఆర్ఎస్ పార్టీకి ఇస్తే ఉప సర్పంచ్ పదవి కాంగ్రెస్ పార్టీకి ఇలా కొన్ని పంచాయతీలను చేసుకున్నారు. కాని మెజారిటీ పంచాయతీలలో మాత్రం సర్పంచ్, ఉపసర్పంచ్ పదవులు టీఆర్ఎస్ పార్టీయే గెలుచుకుంది

నామినేషన్ తిరస్కరణపై ఆందోళన

ఏడు గంటలపాటు టవర్‌పై యువకుల నిరసన.. ఉద్రిక్తత



దంతాలపల్లి, ప్రభన్యూస్ : రెండ విడతలో జరుగుతున్న పంచాయితీ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థి నామినేషన్‌ను అక్రమంగా తిరస్కరించారని కోరుతూ శుక్రవారం యువకులు టవర్ ఎక్కి నిరసన తెలిపారు. జన గామ జిల్లా, దంతాలపల్లి మండలంలోని దాట్ల గ్రామా పంచాయతీలో కాంగ్రెస్ అభ్యర్థిగా కొమ్మునేని రవీందర్ ఈ నెల 12వ తారీఖున సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. రెండవ నామినేషన్ 13 వేశారు. కాగా 17న నామినేషన్ల ఉపసంహరణలో అధికారి సూచనల మేరకు రెండవ నామినేషన్ ప త్రాని ఉపసం హరించుకోవడం జరిగింది. మగ్గురు అభ్యర్థులు గ్రామంలో బరిలో ఉన్నట్లు అధికారులు ముగ్గురికి గుర్తులు కేటాయించిన తర్వాత రాత్రికి రాత్రే అక్రమంగా రవీందర్ నామినేషన్‌ను తిరష్కరించినట్లు తెలపడంతో శుక్రవారం రవీ దంర్‌మద్దతుదారులు ఆరుగురు యువకులు టవర్ ఎక్కి నిరసన తెలిపారు. ఉద యం 8 గంటల నుంచి సాయత్రం 3 గంటల వరకు యువకులు టవర్‌పై నిరసన తెలుపగా గ్రామస్తులు, మహిళలు పెట్రోల్ డబ్బాలతో రోడ్డుపై నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న తొర్రూర్ డిఎస్పీ మదన్‌లాల్, సిఐ చేరాలు, ఎస్సైలు సంఘ టన స్థలానికి చేరుకొన్ని ఆందోళనకారులకు నచ్చ చెపి ్పనప్పటికి శాంతిం చకపోవడంతో జిల్లా అధికారులకు సమాచరం అందించారు. సంఘటన స్థలానికి డీపీఆర్‌వో రంగాచారి, తొర్రూర్ ఆర్డీవో ఈశ్వరయ్యలు చేరుకొని మాట్లాడుతూ స్థానిక ఎన్నికల అధికారుల తప్పిదం వల్లే ఇలా జరిగిందని ఆ అధి కారులపై చర్యలు తీసుకొని అభ్యర్థిని బరిలో ఉంచడం జరుగుతుందని తెలుపడంతో శాంతించిన యువకులు టవర్ దిగి వచ్చారు.

నేటితో తొలి విడత ప్రచారం బంద్

హై దరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్రంలో జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవ పంచాయతీల సంఖ్య గణనీయంగా పెరుగుతూ వస్తోంది. తొలిదశ ఎన్నికలు జరగనున్న వాటిలో ఇప్పటికే 769 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలతోపాటు వార్డు స్థానాలు కూడా ఏకగ్రీవం అయ్యాయి.ఈ పంచాయతీల్లో సింగిల్ నామినేషన్ దాఖలు కావటంతో రిటర్నింగ్ అధికారులు వీటిలో పోటీ చేసిన అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించారు. రెండవ దశ ఎన్నికలు జరుగుతున్న పంచాయతీల్లో కూడా 788 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. అంతే కాకుండా రెండవధశలో ఎన్నికలు జరిగే వాటిలో 103117 వార్డు స్థానాలకు కూడా సింగిల్ నామినేషన్లు దాఖలు కావటంతో వీటిలో అభ్యర్థులు ఏకగ్రీంగా ఎన్నికైనట్టు ప్రకటించారు. రాష్ట్రంలో మొదటి దశ, రెండవ దశ ఎన్నికలు జరుగుతున్న గ్రామ పంచాయతీల్లో మొత్తం 1557 గ్రామ పంచాయతీలకు సర్పంచ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైట్టు అధికారులు వెల్లడించారు. ఇక మిగిలిన 7049 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ పదవులకు మొత్తం 22870మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు

44గంటల ముందే ప్రచారాలు సమాప్తం

రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారాలపై రాష్ట్ర ఎన్నికల సంఘం ఆంక్షలు విధించింది. పోలింగ్ సమయానికి 44గంటలు ముందుగానే ఎన్నికల ప్రచారాలు ముంగించాలని శుక్రవారం ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్ కువమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 21న ఎన్నికలు జరుగుతున్న తొలి విడుత గ్రామ పంచాయతీల్లో శనివారం సాయంత్రం 5గంటలకు, రెండవ విడుత పోలింగ్ జరిగే పంచాయతీల్లో 23న సాయంత్రం 5గంటలకు , చివరివిడుత పోలింగ్ జరిగే వాటిలో 28సాయంత్రం 5గంటలకు ఎన్నికల ప్రచారాలు ముగించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం తన ఆదేశాల్లో స్పష్టం చేసింది. అభ్యర్థులు టీవీలు , ఛానల్లు లేదా మైకులు , టాంటాం వంటి ఇతర పద్దతుల ద్వారా ఎటువంటి ఎన్నికల ప్రచారాలు చేయరాదని పేర్కొంది. నిబంధనలు అతిక్రమిస్తే పంచాయతీరాజ్ చట్టం 2018 ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

తొలి విడత పోలింగ్‌కు ఏర్పాట్లు

రాష్ట్రంలో తొలివిడత పోలింగ్ జరిగే గ్రామ పంచాయతీల్లో ఏర్పాట్లపై అధికారులు దృష్టిపెట్టారు. ఈ నెల 21న తొలివిడుతలో 3707 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలకు , 12202 వార్డు స్థానాలకు పోలింగ్ జరగనుంది. పోలింగ్ ఉదయం ఏడు గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం ఒంటిగంటకు ముగియనుంది. అదే రోజు రెండు గంటలకు ఓట్ల లెక్కింపు జరిపి ఫ లితాలు ప్రకటించనున్నారు. తొలివిడుతలో సర్పంచ్ పదవికి 12202మంది అభ్యర్థులు , 28976 వార్డు స్థానాలకు 70094మంది తమ రాజకీయ భవిష్యత్తును ఓటర్ల మందు పరీక్షకు పెడుతున్నారు.

అధికారపక్షం వైపే ఉమ్మడి రంగారెడ్డి

రంగారెడ్డి, ప్రభన్యూస్ : పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవాల పరంపర కొనసాగుతోంది. నువ్వా నేనా అన్నట్లు సాగుతున్నా చాలా పంచాయతీల్లో అందరూ ఏకమై పార్టీలకు అతీతంగా ఏకగ్రీవాలు చేసుకుంటున్నారు. ఏకగ్రీవం చేసుకుంటే ప్రభుత్వం రూ. 10 లక్షల నజరానా ఇస్తుండటం దానికితోడు స్థానిక ఎమ్మెల్యేలు మరో రూ. 10లక్షలు చెల్లించనుండటంతో ప్రజలు ఏకగ్రీవాల వైపు చూస్తున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 1184 గ్రామ పంచాయతీలకు గాను ఇప్పటికే వంద పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. ఇందులో 90కి పైగా పంచాయతీలు అధికార తెరాస ఖాతాలో వేసుకుంది. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఫలితాలు వస్తాయి. ఇందులో ఎలాంటి అనుమానం లేదు. ప్రస్తుతం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో అదే జరుగుతోంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో కొడంగల్, తాండూరు, పరిగి, వికారాబాద్, చేవెళ్ల, షాద్‌నగర్, కల్వకుర్తి (నాలుగు మండలాలు), మహేశ్వరం, రాజేంద్రనగర్, చేవెళ్ల మేడ్చల్ నియోజకవర్గాలకు సంబంధించి 1184 పంచాయతీలున్నాయి. ఇందులో రంగారెడ్డి జిల్లా పరిధిలో 47 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. మొదటి విడతలో 20 పంచాయతీలు, రెండవ విడతలో 21 పంచాయతీలు మూడవ విడ తలో 6 పంచాయకతీలు ఏకగ్రీవమయ్యాయి. వికారాబాద్ జిల్లా పరిధిలోని తాండూరు, కొడంగల్, వికారాబాద్, పరిగి నియో జకవర్గాల పరిధిలో 47 జీపీలు ఏకగ్రీవమయ్యాయి. రంగారెడ్డి జిల్లా పరిధిలోని షాద్‌నగర్, చేవెళ్ల, ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి (నాలుగు మండలాలు) పరిధిలో 47 పంచాయతీలు ఏక గ్రీవమయ్యాయి. హైదరాబాద్‌కు చేరువలో ఉన్న చేవెళ్ల నియో జకవర్గంలో ఆరు పంచాయతీలు ఏకగ్రీవం కావడం గమనార్హం.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో..

ఖమ్మం, ప్రభ న్యూస్ : రాష్ట్రప్రభుత్వం నిర్వహిస్తున్న పంచా యతీ ఎన్నికల్లో భాగంగా రెండవ విడత అయిన 7 మండలాల పరిధిలో ఉన్న 204 గ్రామపంచాయతీల్లో సర్పంచ్ లుగా పోటిచేస్తున్న అభ్యర్థులతోపాటు, ఆయా గ్రామాల్లో ఉన్న 1862 వార్డులకు నామినేషన్లు స్వీకరించారు. దీనిలో భాగంగా ఆయా గ్రామాల్లో 34 సర్పంచ్‌లు ఏకగ్రీవం కాగా, 296 వార్డులు సైతం ఏకగ్రీవం అయ్యాయి. ఇదిలా ఉండగా 170 సర్పంచ్ స్థానాలతోపాటు, మిగిలిన 1566 వార్డులకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

శివునిపల్లి బంద్ ప్రశాంతం

స్టేషన్‌ఘనపూర్, ప్రభన్యూస్ : శివునిపల్లి గ్రామ సర్పంచ్ పదవికి ఎస్టీ రిజర్వేషన్ కేటాయించడాన్ని నిరసిస్తూ జేఏసీ ఆధ్వర్యంలో 17రోజులుగా దీక్షలు చేపట్టారు. మూడో విడత నామినేష్ల ప్రక్రియ మొదలైనప్పటికి మూడోరోజు చివరి రోజైన శుక్రవారం వరకు కూడా సర్పంచ్ అభ్యర్థులు, వార్డు సభ్యులకు సంబంధించి ఏ ఒక్కరు కూడా నామినేషన్ వేయలేదు. ఈ నేపథ్యంలో శుక్రవారం బంద్ ప్రశాంతంగా జరిగింది.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 83 పంచాయతీలు ఏకగ్రీవం

కరీంనగర్, ప్రభన్యూస్ బ్యూరో : సర్పంచ్ ఎన్నికల్లో నాలుగు జిల్లాలు కలిపి రికార్డు బ్రేక్ సాధించాయి. 2013లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని 1207 పంచాయతీల్లో 59 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం కాగా తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తరువాత జరుగుతున్న పంచాయతీ ఎన్నికల్లో రెండు విడతల్లోనే రికార్డు బ్రేక్ సాధించాయి. కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాలలో 1211 పంచాయతీలు ఉండగా వీటికి మూడువిడతల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. రెండోవిడత నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం ముగి సింది. నాలుగు జిల్లాల్లో 52 పంచాయతీలు ఏకగ్రీవమైనాయి. మొదటి విడతలో 31 పంచాయతీలు కాగా రెండో విడతలో 52 మొత్తం రెండువిడతల్లో కలిపి 83 పంచాయతీలు ఏకగ్రీవమైనాయి. 2013లో జరిగిన ఎన్నికల్లో సాధించిన ఏకగ్రీవం కంటే 24 పంచాయతీలు అధికంగా ఏకగ్రీ వమైనాయి, మూడోదైన చివరి విడత నామినేషన్ల ఉపసంహరణ నాటికి ఏకగ్రీవ పంచాయతీల సంఖ్య సెంచరీ దాటే అవకాశాలు ఉన్నాయి. ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వం పదిలక్షల నజరానా ప్రకటించడం, టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ తన ఎమ్మెల్యే ఫంట్ నుంచి మరో 15 లక్షల రూపాయల నజరానాను ప్రకటించడంతో మిగితా టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడ ఇదే ప్రకటన చేయడంతో ఏకగ్రీవం వైపు పంచాయతీలు నడిచాయి. చాలా మట్టుకు కొత్తగా ఏర్పడ్డ తండాలు ఏకగ్రీవమైనాయి. ఏకగ్రీవ పంచాయతీల్లో రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాలు పోటీ పడుతున్నాయి. రెండు విడతల్లో కలిసి రాజన్న సిరిసిల్ల జిల్లాలో 29 పంచాయతీలు, జగిత్యాల జిల్లాలో 32 పంచాయతీల్లో సర్పంచ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనారు. కరీంనగర్ జిల్లాలో మొదటి విడతలో నాలుగు సర్పంచ్ స్థానాలు, రెండో విడతలో ఐదు పంచాయతీలు ఏకగ్రీవమైనాయి.

జగిత్యాల జిల్లాలో మొదటి విడతలో 10 పంచాయతీ స్థానాలు, రెండో విడతలో అత్యధికరాగ 22 పంచాయతీ స్థానాలు ఏకగ్రీవమైనాయి. పెద్దపల్లి జిల్లాలో మొదటి విడతలో నాలుగు పంచాయతీలు, రెండో విడతలో 9 పంచాయతీలు, కరీంనగర్ జిల్లాలో మొదటి విడతలో నాలుగు, రెండో విడతలో ఐదు పంచాయతీలు ఏకగ్రీవమైనాయి.

ఏకగ్రీవమా..ఎన్నికలా.. ఎన్నికల రద్దా?



జిల్లా పంచాయతీ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఆకుతోట నర్సయ్య.

జగిత్యాల, ప్రభన్యూస్ : గ్రామపంచాయితీ ఎన్నికల్లో భాగంగా జగిత్యాల జిల్లాలో అధికారులు మూడు విడతలుగా ఎన్నికలు నిర్వహించాలని షెడ్యూల్ విడుదల చేయగా, రెండో విడతలో భాగంగా జగిత్యాల జిల్లా, మల్లాపూర్ మండలంలోని మల్లాపూర్ మేజర్ గ్రామపంచాయతీలో సర్పంచ్ పదవికి వేలంపాట నిర్వహించినట్లు సమాచారం. నామినేషన్ ఉపసంహరించుకున్న అభ్యర్థికి రూ.5 లక్షలు, గ్రామంలోని ఓ ఆలయానికి రూ.15 లక్షల మొత్తాన్ని అందజేయడానికి ఒప్పందం కుదిరినట్లు సమాచారం. ఈనెల 11 నుంచి 13 వరకు నామినేషన్లను అధికారులు అభ్యర్థుల నుంచి స్వీకరించారు. కాంగ్రెస్ బలపరిచిన క్యాతం జీవన్‌రెడ్డి, తెరాస బలపరిచిన సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థులుగా గోపిడి రాజారెడ్డి, ఆక ుతోట నర్సయ్యలు సర్పంచ్‌లుగా నామినేషన్ పత్రాలను అధికారులకు అందించి నామినేషన్ వేశారు. అనంతరం 14న నామినేషన్ పత్రాల పరిశీలనలో భాగంగా ఉపసంహరణ ప్రక్రియ జరుగగా తెరాస అభ్యర్థి సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, స్వతంత్రులు గోపిడి రాజారెడ్డి, ఆకుతోట నర్సయ్యలు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ఈ తరుణంలో మల్లాపూర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్‌గా క్యాతం జీవన్‌రెడ్డి ఏకగ్రీవం అనుకుంటున్న సమయంలో స్వతంత్ర అభ్యర్థి అయిన ఆకుతోట నర్సయ్య ఎన్నికల నామినేషన్ కేంద్రానికి వచ్చి తనను అగ్రవర్ణాలు భయభ్రాంతులకు గురిచేసి నామినేషన్ ఉపసంహరణ చేయించారని, సర్పంచ్ పదవికి వేలం నిర్వహించారని ఆరోపిస్తూ ఎన్నికల రిటర్నింగ్ అధికారుల ఎదుట తన గోడును వెల్లబోసుకొని న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశాడు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా పంచాయతీ అధికారి నారాయణను గ్రామస్తులతో కలిసి తనకు న్యాయం చేయాలని లిఖితపూర్వకంగా కోరాడు. మల్లాపూర్ ప్రజలు మాత్రం సర్పంచ్ ఏకగ్రీవమా లేదా మళ్లీ ఎన్నికలు జరుగుతాయా లేదా ఎన్నికలను అధికారులు రద్దు చేస్తారా అనే అయోమయంలో ఉన్నారు. అధికారులు ఎలా స్పందిస్తారో వేచిచూడాలి.

పంచాయతీ ఎన్నికలపై సుప్రీంలో అప్పీలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: పంచాయతీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 22 శాతానికి తగ్గిస్తూ జారీ చేసిన ఆర్డినెన్స్‌ను రద్దు చేయాలని కోరుతూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం శుక్రవారం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్(ఎస్ఎల్‌పీ) దాఖలు చేసినట్టు సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య తెలిపారు. కేసుపై సోమవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బెంచ్ మీద వాదోపవాదాలు జరుగుతాయని చెప్పారు.

మంత్రివర్గ సమావేశం లేకుండా అసెంబ్లీలో ఆమోదం పొందిన పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించడం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంలో దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. రాష్ట్రంలో 56 శాతం ఉన్న బీసీలకు రిజర్వేషన్లను 22 శాతానికి తగ్గించడం మూలంగా బీసీలకు అన్యాయం జరుగు తుందన్నారు. బీసీలకు రిజర్వేషన్లు తగ్గించడంతో 1400 సర్పంచ్ పదవులతోపాటు... 18వేల వార్డు సభ్యుల పదవులు నష్టపో తున్నారని తెలిపారు. త్వరలో జరగబోయే ఎంపీటీసీ, జడ్‌పీటీసీ ఎన్నికల్లో కూడా ఇలాగే అన్యాయం జరిగే ప్రమాదం ఉంద న్నారు. జనాభా లెక్కలు శాస్త్రీయంగా ఉంటే రిజర్వేషన్లు 50 శాతం దాటిపెంచుకోవచ్చని సుప్రీంకోర్టు గతంలో తీర్పు చెప్పిందని గుర్తు చేశారు.

ఓటేసేందుకు బహ్రెయిన్ నుంచి హసకొత్తూర్‌కు



నిజామాబాద్, ప్రభ న్యూస్ బ్యూరో: డబ్బులతో ఓటు హక్కును అమ్ము కుంటున్న కొంద రు ప్రజాస్వామ్యా న్ని అపహాస్యం చేస్తుంటే... విద్యావంతులైన ఓ యువకుడు సొంత డ బ్బులను ఖర్చు చేసుకుని ఓటు హక్కును వినియో గించుకోవాలని సందేశాన్ని నేటి యువతకు ఇస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నాడు. ఓటు విలువ తెలిసిన సదరు యువకుడు జీవనోపాధి కోసం కన్న ఊరును వదిలి గల్ఫ్ దేశమైన బహ్రెయిన్‌కు వెళ్లాడు. ఆ యువకుడికి దేశ ప్రజాస్వామ్యం, కన్న ఊరు అంటే అపార గౌరవం. ఓటు విలువను ప్రజలకు గుర్తు చేసేలా కేవలం ఓటు వేయడానికే సొంత ఖర్చు భరించి స్వదేశానికి వస్తూ నేటి తరానికి స్ఫూర్తిని నింపుతున్న ఆ యువకుడే కోటగిరి నవీన్. ఉన్నత చదువులు చదివి బహ్రెయిన్ దేశంలో ఉద్యోగరీత్యా స్థిరపడ్డ కోటగిరి నవీన్ స్వస్థలం నిజామాబాద్ జిల్లా, కమ్మర్‌పల్లి మండలం హసకొత్తూర్ గ్రామం. ఓటు హక్కు వినియోగించుకోవడానికి స్వగ్రామానికి నవీన్ వస్తున్నాడని తెలిసి తోటి స్నేహితులు అభినందిస్తున్నారు. ఆయనకు ఓటు హక్కు వచ్చిన నాటి నుంచి తప్పకుండా ఓటు వేయడం బాధ్యతగా ఎంచుకున్నాడు. ప్రస్తుతం బహ్రెయిన్‌లో ఉన్న నవీన్ ఖర్చుకు వెనుకాడకుండా ఓటు హక్కును వినియోగించుకోవడానికి స్వంత గ్రామానికి వస్తుండడం అభినందనీయం.

ఉమ్మడి మెదక్ జిల్లాలో 186 పంచాయతీలు ఏకగ్రీవం

మెదక్, ప్రభన్యూస్ బ్యూరో : ఉమ్మడి మెదక్ జిల్లాల్లో గ్రామ పంచాయతీలు ఏకగ్రీవాల వైపు పయనిస్తున్నాయి. మొదటి, రెండవ విడతలో భాగంగా ఇప్పటి 186 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం కాగా, మూడో విడతలో ఈ సంఖ్య మరింత పెరిగి డబుల్ సెంచరీని దాటనుంది. గ్రామాలను ఏకగ్రీవం చేయడంలో అధికార టీఆర్ఎస్ పార్టీ సఫలం చెందిందనే చెప్పవచ్చు. ఉమ్మడి జిల్లాల్లోని మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో టీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇలాఖాలో చాలా వరకు టీఆర్ఎస్ పార్టీ మద్దతుదారులే ఏకగ్రీవంగా ఎన్నికవడం విశేషం. ఉమ్మడి జిల్లాల్లో 1615 గ్రామ పంచాయతీలు, 14,340 వార్డులకు గాను ఈనెల 21, 15, 30 తేదీలలో ఎన్నికలు నిర్వహించనున్నారు. అందులో భాగంగా మొదటి విడతలో 76 గ్రామాలు, రెండో విడ తలో 110 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. మూడో విడత నామినేషన్ల ఉపసంహరణ ఈనెల 21న ఉండడంతో ఏకగ్రీవ పంచాయతీల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

ఎమ్మెల్యేల కృషితో..

ఉమ్మడి జిల్లాల్లో గ్రామ పంచాయతీలన్నింటిని ఏకగ్రీవం చేయాలనే లక్ష్యంతో టీఆర్ఎస్ అధిష్టానం ఇదివరకే పార్టీశ్రేణులకు ఆదేశాలు ఇవ్వడంతో ఆ దిశగా స్థానిక ఎమ్మెల్యేలు, గ్రామస్థాయి నాయకులు చాలా వరకు గ్రామాల్లో ఏకగ్రీవాలు చేయడంలో సఫలీకృతులయ్యారు. మొదటి విడతలో భాగంగా ఉమ్మడి జిల్లాల్లో 76 పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. ఇందులో చాలా వరకు అధికార పార్టీకి చెందిన మద్దతుదారులే ఉండడం విశేషం. ఏకగ్రీవ పంచాయతీల్లో చాలా వరకు తండాలు కూడా ఉన్నాయి. అంతేగాకుండా పంచాయతీ ఏకగ్రీవం అయితే ప్రభుత్వం నిధులు వస్తాయని వాటివల్ల గ్రామాభివృద్ధి జరుగుతుందన్న భావనతో ఏకగ్రీవాల వైపు మొగ్గు చూపడం జరిగింది. ఇలావుండగా పట్టు విడవని ఆశావహులను ఒప్పించడంలో టీఆర్ఎస్ నాయకులు నానా తంటాలు పడ్డారు. రెండో విడతలో భాగంగా 110 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం కావడం విశేషం. ఇక్కడ కూడా పలు గ్రామాల్లో టీఆర్ఎస్ మంత్రాంగం పనిచేసింది. టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గ్రామ పంచాయతీలను ఏకగ్రీవం చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో ఉమ్మడి జిల్లాల్లోని టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గ్రామాల్లో పోటీ చేసే పోటీదారులతో చర్చలు జరిపి ఏకగ్రీవం చేసేందుకు కృషి చేశారు. అయినప్పటికీ కొన్ని గ్రామాల్లో ఆశావహులు పట్టువిడవక రంగంలో ఉన్నారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ నాయకులు చాలా గ్రామాల్లో పోటీ ఉండడానికి వెనుకంజ వేయడం జరిగింది. పార్టీ మనుగడ కోసం పోటీ చేసే ఆశావహులను ఒప్పించి వారికి ఉపసర్పంచ్ పదవులను కట్టబెట్టడంతో సర్పంచ్ స్థానాలను టీఆర్ఎస్ కైవసం చేసుకొని రాజకీయ ఒప్పందంతో పంచాయతీలను ఏకగ్రీవం చేశారు. ఏదేమైనా మూడో విడత ఉపసంహరణ తర్వాత 200 పైచిలుకు గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం కానున్నాయి.

అమెరికాను వీడి.. పంచాయతీకి చేరి



సంగారెడ్డి, ప్రభ న్యూస్ బ్యూరో : పల్లె ప్రజలకు సేవల చేయాలనే ఆలోచనతో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా అమెరికాను వదిలి సంగారెడ్డి జిల్లా, హత్నూర మండలం కాసాల గ్రామానికి చెందిన గౌరిరెడ్డి గారి శ్వేత అనిల్‌రెడ్డి సర్పంచ్ బరిలో నిలిచారు. శుక్రవారం పంచాయతీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తమకు ఉన్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉద్యోగం వదిలి గ్రామస్తులకు సేవ చేయడమే లక్ష్యంగా సర్పంచ్ స్థానానికి పోటి చేస్తున్నానని స్వదేశానికి తిరిగి వచ్చానని, బ్యాట్ గుర్తుకు ఓటు వేసి తమకు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని గ్రామస్తులను కోరారు. కాసాల గ్రామంలో ఐదుగురు గ్రామ పంచాయతీకి పోటి పడుతున్న కాసాల గ్రామాన్ని జిల్లాలోనే ఆదర్శంగా నిలుపుతానని, ఇప్పటి వరకు 12 అంశాలను విడుదల చేసి అభివ ృద్ధిపై ప్రజలకు వివరించారు. వార్డు సభ్యులతో కలిసి గ్రామా భివృద్ధిపై కమిటీలు వేసి గ్రామంలో డిజిటల్ గ్రంథాలయం, అంగన్‌వాడీలను కార్పోరేట్ స్థాయిలో తిర్చిదిద్దడమే లక్ష్యంగా అభివృద్ధి చేస్తానని ప్రచారం నిర్వహిస్తున్నారు. 12 సంవత్సరాలుగా అమెరికాలో ఉంటూ ఎంఎస్‌సి, బిఇడి పూర్తి చేశానని, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా విధుల్లో ఉండి వదిలేసుకొని పల్లె సేవలో భాగమై ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో కాసాల గ్రామానికి వచ్చానని శ్వేత గౌరిరెడ్డి అనిల్‌రెడ్డి అన్నారు.

క్రీడాప్రభ



ఆస్ట్రేలియా పర్యటనలో భారత్ ఓటమి చరిత్రకు ముగింపు పలికి కొత్త చరిత్రకు నాంది పలికింది. ఇప్పటివరకు ఆస్ట్రేలియాలో పర్యటించిన ఏ ఉపఖండ జట్టు సాధించని చరిత్రను కోహ్లీ సేన తన పేర రాసుకుంది. ఆస్ట్రేలియాను ఆస్ట్రేలియాలో ఓడించాలన్న లక్ష్యాన్ని కోహ్లీసేన సాధించింది. టెస్ట్ సిరీస్‌లో 2-1తో చారిత్రాత్మక విజయాన్ని అందుకున్న భారత్, మూడు మ్యాచుల వన్డే సిరీస్‌లో భాగంగా శుక్రవారం జరిగిన మూడో వన్డేలో గెలిచి వన్డే సిరీస్‌ను కూడా 2-1తో కైవసం చేసుకుని నవ చరిత్రను లిఖించింది. విరాట్ కోహ్లీ నేతృత్వంలోని భారత జట్టు ఆస్ట్రేలియాలో పర్యటించి మూడు ఫార్మాట్లలో ఒక్క సిరీస్ కూడా కోల్పోకుండా స్వదేశానికి తిరిగి వచ్చిన తొలి జట్టుగా రికార్డు సృష్టించింది. కోహ్లీసేన టీ20 సిరీస్‌ను 1-1తో డ్రా చేసుకోగా, టెస్ట్ సిరీస్‌ను 2-1తో వన్డే సిరీస్‌ను 2-1తో సొంతం చేసుకుంది.



కోహ్లీ సేన కమాల్

ఆసీస్ గడ్డపై తొలిసారిగా వన్డే సిరీస్ గెలుపు

- మూడో వన్డేలో ఏడు వికెట్ల తేడాతో విజయం
- సిరీస్ 2-1తో కైవసం
- కెరియర్ బెస్ట్ 6/42తో రాణించిన చాహల్
- దుమ్మురేపిన ధోనీ, కేదార్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాలో భారత్ మరో చిరస్మరణీయమైన సిరీస్ విజయాన్ని అందుకుంది. తొలిసారిగా ద్వైపాక్షిక వన్డే సిరీస్‌ను 2-1గెలుచుకుని భారత్ చరిత్ర సృష్టించింది. శుక్రవారం జరిగిన సిరీస్ నిర్ణాయక మూడో వన్డేలో కోహ్లీసేన సమష్టిగా రాణించి 7 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాపై గెలుపొందింది. యజ్వేంద్ర చాహల్ తన స్పిన్ మాయాజాలంతో ఆసీస్ బ్యాట్స్‌మెన్‌ను 230 పరుగులకే కట్టడి చేయగా.. అనంతరం లక్ష్య ఛేదనలో కోహ్లీ, ధోనీ, కేదార్ జాదవ్‌లు జట్టును విజయ పథాన నిలిపారు. భారత జట్టులో మహ్మద్ సిరాజ్ స్థానంలో బ్యాటింగ్ ఆల్ రౌండర్ విజయ్ శంకర్ జట్టులోకి వచ్చాడు. తొలి వికెట్‌గా రోహిత్ 9(17బంతులు, ఒక ఫోర్) పరుగులు చేసి సిడిల్ బౌలింగ్‌లో షువాన్ మార్ష్‌కు క్యాచిచ్చి వెనుదిరగగా, కోహ్లీ వచ్చి శిఖర్ ధావన్‌తో కలిసి స్కోరును ముందుకు పోనిచ్చాడు. స్కోరు 59వద్ద ధావన్ 23(46బంతులు) స్టొయినిస్ బౌలింగ్‌లో అతనికే క్యాచిచ్చి ఔట్‌కాగా ధోని క్రీజులోకి వచ్చాడు. తాను ఎదుర్కొన్న తొలి బంతికే ధోనీకి లైఫ్ దొరికింది. స్టొయినిస్ వేసిన బంతిని ఆన్ సైడ్‌లో షాట్ కొట్టగా బంతి వేగంగా బ్యాక్‌వార్డ్ పాయింట్‌దిశగా దూసుకుపోయింది అక్కడే ఉన్న మాక్స్‌వెల్ బంతిని పట్టుకొని జారవిడిచాడు. ఆసీస్ బౌలర్లు పకడ్బందీగా బంతులు వేయడంతో భారత్ స్కోరు నెమ్మదించింది. అడపా దడపా ఫోర్లు కొడుతూ కోహ్లీ-ధోనీలు స్కోరును ముందుకు పోనిచ్చారు. స్కోరు 113వద్ద రిచర్డ్‌సన్ బౌలింగ్‌లో కోహ్లీ 46(62బంతులు, ఫోర్లు-3) పరుగులు చేసి వికెట్ కీపర్‌కు క్యాచిచ్చి వెనుదిరగగా, కేదార్ జాదవ్ బ్యాటింగ్‌కు వచ్చాడు. మూడో వికెట్‌కు ధోనీ-కోహ్లీలు 54 పరుగులు జోడించారు. ధోనీ వన్డేలో 70వ అర్ధ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. ఈ సిరీస్‌లో వరుసగా మూడు అర్ధ సెంచరీలు చేసిన ఘనతను ధోనీ నమోదు చేసుకున్నాడు. 46 ఓవర్లు గడిచేసరికి భారత్ స్కోరు 198/3, విజయానికి 24 బంతుల్లో 33 పరుగులు చేయాల్సి ఉంది. 47వ ఓవర్లో ఆరు పరుగులే వచ్చాయి. ధోని తన వ్యక్తిగత స్కోరు 74వ వద్ద మరో లైఫ్ దొరికింది. స్టొయినిస్ వేసిన బంతిని ధోని డైవ్ చేయగా మిడ్ ఆఫ్ దిశగా గాల్లోకి లేచిన బంతిని ఫించ్ చేతులకు తాకి కిందపడింది. అదే అదనుగా రెండో పరుగు తీసి కేదార్ రనౌట్ ప్రమాదంనుంచి తృటిలో తప్పించుకున్నాడు. 48వ ఓవర్లో 13 పరుగులు పిండుకున్నారు. ఈ ఓవర్లోనే కేదార్ వన్డేల్లో తన నాల్గవ అర్ధ సెంచరీని 52 బంతుల్లో సాధించాడు. చివరి రెండు ఓవర్లలో 14 పరుగులు చేయాల్సి ఉన్న దశలో కేదార్ ఏడు, ధోని 5 ఒకవైడ్‌తో కలిపి 13 పరుగులు రావడంతో భారత్ గెలుపు ఖాయమై పోయింది. చివరి ఓవర్ రెండో బంతిని కేదార్ ఫోర్ కొట్టి విజయాన్ని అందించాడు. ధోనీ 87(114బంతులు, ఫోర్లు6), కేదార్ 61(57బంతులు, ఫోర్లు-7) పరుగులతో నాటౌట్లుగా ఉన్నారు. ధోనీ-కేదార్‌లు కలిపి 121 పరుగులు జట్టు స్కోరుకు జోడించారు. అంతకు ముందు టాస్ గెలిచిన భారత్ బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన ఆస్ట్రేలియా 48.4 ఓవర్లలో 230 పరుగులకు ఆలౌటయింది. ఆసీస్ బ్యాట్స్‌మెన్‌లో హాండ్స్‌కోంబ్ చేసిన 58(63బంతులు, ఫోర్లు-2) పరుగులే అత్యధికం. చాహల్ తన కెరియర్ బెస్ట్ బౌలింగ్‌ను నమోదు చేశాడు. 42 పరుగులకు 6 వికెట్లు తీశాడు. కెరియర్లో తొలి మ్యాచ్ ఆడుతున్న విజయ్ శంకర్ మీడియం పేస్ బౌలింగ్ చేసి 6 ఓవర్లలో వికెట్ లేకుండా 23 పరుగులిచ్చాడు. ఓపెనర్లు అలెక్స్ కేరీ, ఫించ్‌ల వికెట్లను భువనేశ్వర్ తీయగా, ఉస్మాన్ ఖవాజా, షువాన్ మార్ష్, హాండ్స్‌కోంబ్, మార్కస్ స్టొయినిస్, రిచర్డ్ సన్, ఆడం జంపా వికెట్లను చాహల్ పడగొట్టాడు. మాక్స్‌వెల్, స్టాన్‌లేక్ వికెట్లను షమీ దక్కించుకోగా పీటర్ సిడిల్ 10పరుగులతో నాటౌట్‌గా మిగిలాడు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డును చాహల్ దక్కించుకోగా, ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ అవార్డును ధోనీ పొందాడు.


ధోనీ 87*



విరాట్ కోహ్లీ

ఈ సిరీస్ గెలుపు జట్టు సమష్టి కృషి ఫలితమని కెప్టెన్ కోహ్లీ అన్నాడు. మూడో వన్డేలో చాహల్ బౌలింగ్‌లో అద్భుతంగా రాణించగా, బ్యాటింగ్‌లో ధోనీ, కేదార్‌లు రాణించాడన్నాడు. అంకితభావంతో ఆడే ఆటగాళ్లలో ధోని మేటి అని కెప్టెన్ కోహ్లీ ప్రశంసించాడు.అతనికి ఐదో నెంబర్ బ్యాటింగ్ స్థానం బాగా కుదురుతుందన్నాడు. ఈ విజయం అందించిన ఉత్సాహంతో న్యూజిలాండ్‌లో కూడా విజయం సాధిస్తామన్నాడు.

భారత జట్టుకు అభినందనల వెల్లువ

ఆస్ట్రేలియన్ కోచ్ జస్టిన్ లాంగర్

ధోనీ సూపర్ స్టార్ ఆట ఆడాడు ఎప్పటికి అతను గొప్ప ఆటగాడే. వన్డేల్లో పరుగుల ఛేదనలో అతను మాస్టర్ ఇన్నింగ్స్ ఆడాడు. అతని ఫిట్‌నెస్ అమోఘం. భారత్ సమష్టిగా రాణించి విజయం సాధించింది.

వీవీఎస్ లక్ష్మణ్

ధోనీ, కేదార్‌లు మంచి ఇన్నింగ్స్ ఆడారు. భారత్ వన్డే, టెస్ట్ సిరీస్‌లను గెలిచి విజయాలతో భారత్ తిరిగి వస్తోంది.

సచిన్ టెండూల్కర్

ఆస్ట్రేలియా టూర్‌ను భారత్ విజయాలతో ముగించింది. కేదార్ అద్భుతంగా రాణించి ధోనీతో కలిసి సాగాడు. ధోనీ స్టార్ ఇన్నింగ్స్ ఆడాడు.

అనుష్క శర్మ

ఇది చిరస్మరణీయమైన విజయం. ఈ పర్యటన నాకు మరిచిపోలేనిది. కోహ్లీని చూస్తే నా మనసు ఉప్పొంగుతోంది.

బీసీసీఐ

భారత్ అద్భుతంగా లక్ష్యాన్ని ఛేదించింది. కోహ్లీసేన పట్టుదలతో విజయాలను అందుకుంటోంది.

స్కోరు బోర్డు

ఆస్ట్రేలియా: అలెక్స్ కేరీ (సి) కోహ్లీ (బి) భువనేశ్వర్ 5, అరోన్ ఫించ్ ఎల్బీడబ్ల్యు (బి) భువనేశ్వర్ 14, ఉస్మాన్ ఖవాజా సి అండ్ బి చాహల్ 34, షువాన్ మార్ష్ స్టంప్డ్ ధోని (బి) చాహల్ 39, హాండ్స్‌కోంబ్ ఎల్బీడబ్ల్యు (బి)చాహల్ 58, మార్కస్ స్టొయినిస్ (సి)రోహిత్ (బి)చాహల్ 10, మాక్స్‌వెల్ (సి)భువనేశ్వర్ (బి)షమీ 26, జేయ్ రిచర్డ్‌సన్ (సి)కేదార్ (బి) చాహల్ 16, ఆడం జంపా (సి) విజయ్ శంక్ (బి) చాహల్ 8, పీటర్ సిడిల్ నాటౌట్ 10, స్టాన్‌లేక్ (బి) షమీ 0, ఎక్స్ట్రాలు 10, మొత్తం 230/10(48.4 ఓవర్లు)

బౌలింగ్: భువనేశ్వర్ 8-1-28-2, షమీ 9.4-0-47-2, విజయ్ శంకర్ 6-0-23-0, కేదార్ జాదవ్ 6-0-35-0, రవీంద్ర జడేజా 9-0-53-0, యజ్వేంద్ర చాహల్ 10-0-42-6

భారత్: రోహిత్ శర్మ (సి)షువాన్ మార్ష్ (బి) సిడిల్ 9, శిఖర్ ధావన్ సి అండ్ బి స్టొయినిస్ 23, కోహ్లీ (సి) అలెక్స్ (బి) రిచర్డ్‌సన్ 46, ధోని నాటౌట్ 87, కేదార్ జాదవ్ నాటౌట్ 61 ఎక్స్ట్రాలు 8 మొత్తం 234/3 (49.2 ఓవర్లు)

బౌలింగ్: రిచర్డ్‌సన్ 10-1-27-1, పీటర్ సిడిల్ 9-1-56-1, స్టాన్‌లేక్ 10-0-49-0, మాక్స్‌వెల్ 1-0-7-0, ఆడం జంపా 10-0-34-0, స్టొయినిస్ 9.2-0-60-1

నిశ్శబ్దాన్ని ఛేదిద్దాం..

పీవీ సింధు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : నిశ్శబ్దాన్ని ఛేదిద్దాం.. ధైర్యంగా ముందడుగు వేద్దామని బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు స్పష్టపర్చారు. హైదరాబాద్ సిటీ పోలీసు షీ టీమ్స్, సోరోప్టొమిస్ట్ ఇంటర్నేషనల్ సంయుక్త ఆధ్వర్యంలో పని ప్రదేశాలలో మహిళలపై సెక్సువల్ వేధింపులపై షౌట్ పేరిట ఒక రోజు వర్కషాప్‌ను శుక్రవారం హోటల్ తాజ్‌కృష్ణాలో నిర్వహించారు. ఆ కార్యక్రమంలో ఆమె మాట్లా డారు. మహిళలపై సెక్సువల్ వేధింపులే కాదు, భౌతికంగా, మానసికంగా కూడా వేధిం పులు ఉంటాయన్నారు. ఇటీవల మీటూ ఉద్యమం నిర్వహణ ద్వారా అవ గాహన పెరిగిందన్న విషయాన్ని ఆమె ఈ సందర్భంగా గుర్తు చేశారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుం టున్నారని, ఇంట్లోనే ఉండటం లేదని, పురుషులతో సమాన స్థాయిలో మహిళలు ఎదుగుతున్నారన్నారు. పరుషులు, మహిళలు సమాను లేనన్న విషయాన్ని గుర్తెరిగేలా చేయాల్సిన అవసరం ఉందన్నారు.

సెమీ ఫైనల్లో సైనా



కౌలాలంపూర్: మలేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్ మహిళల సింగిల్స్‌లో సెమీ ఫైనల్లోకి దూసుకెళ్లగా పురుషుల సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్ క్వార్టర్ ఫైనల్లో ఓడి టోర్నీనుంచి వైదొలిగాడు. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో సైనా మాజీ వరల్డ్ చాంపియన్ జపాన్ షట్లర్ నజోమి ఒకుహరాతో 48 నిమిషాలపాటు పోరాడి గెలిచింది. మ్యాచ్ ఆసాంతం హోరాహోరీగా సాగింది. ఏడో సీడ్ సైనా తొలి గేమ్ ప్రారంభంలో వెనకబడి అనంతరం 9-9తో సమానమైంది. ఒకుహరా వరుసగా ఆరు పాయింట్లు పొంది 15-9తో లీడ్ పొందింది. సైనా నిరాశపడకుండా సహనంతో ఆడుతూ నెమ్మదిగా ఒకుహరా లీడ్‌ను తగ్గిస్తూ 17-16తో ఆధిక్యాన్ని పొందింది. ఒకుహరా మళ్లీ స్కోరును 17-17తో సమానంగా చేసినప్పటికి సైనా మిగతా పాయింట్లను పొంది 21-18తో తొలి గేమ్‌ను గెలుచుకుంది. రెండో గేమ్‌లో సైనా 4-2తో ముందుకు సాగుతున్న సందర్భంతో ఒకుహరా వేగంగా పాయింట్లు సాధిస్తూ 8-5లీడ్‌ను పొందింది. బ్రేక్‌కు ముందు సైనా 11-9తో ఆధిక్యాన్ని సాధించింది. అనంతరం ఆటలో సైనా 14-12కు చేరుకోగా.. ఒకుహరా మళ్లీ విజృంభించి వరుసగా ఆరు పాయిం ట్లు పొంది 18-14కు చేరింది. ఈ సమయంలో సైనా మరోసారి తన పరిణి తిని చాటుతూ.. స్కోరును 19-19తో సమం చేసింది. ఈ సమయంలో ఒకుహరా తనకు లభించిన గేమ్ పాయింట్లను తనకు అనుకూలంగా మలచుకోలేకపోవడంతో.. సైనా దాన్ని తన మ్యాచ్ పాయింట్‌గా మలచుకుని సెమీస్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. ఒకుహరాతో మంచి మ్యాచ్‌ను ఆడాను. గెలిచినందుకు సంతోషంగా ఉంది.

అని సైనా ట్వీట్ చేసింది. 28 ఏళ్ల హైదరాబాద్ షట్లర్ 2017లో ఈ టోర్నీ టైటిల్‌ను సాధించింది. 2011లో రన్నరప్‌గా నిలిచింది. శనివారం జరిగే సెమీఫైనల్లో సైనా స్పెయిన్‌కు చెందిన కరోలినా మారిన్‌తో తలపడనుంది. మారిన్‌ను సైనా ఇటీవల10 సార్లు ఎదుర్కొనగా, ఐదుసార్లు గెలుపొందగా.. ఐదుసార్లు ఓటమి పాలయ్యింది. పురుషుల సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్ తన ప్రత్యర్థి నాలుగో సీడ్ కొరియాకు చెందిన సన్‌వాన్ హో చేతిలో ఓటమి చెందాడు. ఇటీవల ముగిసిన ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్‌లో ఓటమి ఎరగకుండా ముందుకు సాగి తన జట్టుకు టైటిల్ అందించడంలో తోడ్పడ్డ కిదాంబి శ్రీకాంత్ తొలి గేమ్‌లో 4-11తో వెనకబడ్డప్పటికి.. అనంతరం పుంజుకుని 23-21 తేడాతో గెలిచాడు. రెండో గేమ్‌లో 4-9తో వెనకబడి ప్రత్యర్థి లీడ్‌ను తగ్గించలేక 16-21తో ఓటమి పొందాడు. మూడో గేమ్‌లో 5-1తో ముందుకు సాగుతున్న సమయంలో నిర్లక్ష్యంగా ఆడి ప్రత్యర్థికి అవకాశమిచ్చాడు.

విజేతకు నగదు బహుమతి లేదా?



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాపై చారిత్రాత్మక వన్డే సిరీస్‌ను గెలిచిన భారత జట్టుకు సిరీస్ నిర్వాహక బోర్డు ఎలాంటి నగదు బహుమతిని ఇవ్వకపో వడంపై మాజీ క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ తప్పుబట్టాడు. నిర్వాహక బోర్డు ఈ సిరీస్ ద్వారా ఆర్జించిన రాబడిలో ఆటగాళ్లకు కూడా వాటా ఉంటుందని పేర్కొన్నాడు. మరోవైపు శుక్రవారం జరిగిన వన్డే మ్యాచ్‌లో ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు ద్వారా 500 అమెరికా డాలర్లను పొందిన కుల్దీప్ యాదవ్, ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ అవార్డు పొందిన ఎంఎస్ ధోని తనకు వచ్చిన 500 అమెరికా డాలర్లను చారిటి సంస్థకు విరాళంగా అందించారు. విజేతగా నిలిచిన భారత జట్టుకు కేవలం ఒక ట్రోఫీని బహూకరించారు. దీనితో గవాస్కర్ నిర్వాహకుల వైఖరిని తప్పుబడుతూ.. 'వన్డే సిరీస్ గెలిచిన భారత్‌కు నగదు బహుమతి ఏమీలేకుండా... ట్రోఫీ మాత్రమే ఇవ్వడం విచారకరం. నిర్వాహకులు టీవీ ప్రసార హక్కులను అమ్మి లెక్కలేనంత రాబడిని పొందుతున్నారు. విజేతలకు వారు ఎందుకు చెప్పుకోదగ్గ నగదును ఇవ్వరు. ఈ క్రీడలో పాలుపంచుకునే ఆటగాళ్లందరూ ఈ రాబడికి కారణం కదా..' అని అన్నాడు.

రౌండ్ 16లోకి షరపోవా

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్‌లో మారియా షరపోవా, డిఫెండింగ్ చాంపియన్ కరోలినా వోజ్నియాకి రౌండ్ 16లోకి ప్రవేశించగా, పురుషుల సింగిల్స్‌లో రఫెల్ నాదల్, రోజర్ ఫెదరర్ కూడా ముందుకు సాగుతున్నారు. రష్యాకు చెందిన షరపోవా 6-4, 4-6, 6-3తో రాడ్ లావెర్ అరెనాను ఓడించింది. తర్వాత రౌండ్లో షరపోవా ఆస్ట్రేలియాకు చెందిన అశ్లేగ్ బార్టితో తలపడనుంది. పురుషుల సింగిల్స్‌లో రెండో సీడ్ నాదల్ యువ ఆసీస్ ఆటగాడు అలెక్స్ డి మినౌర్‌ను 6-1, 6-2, 6-4 తేడాతో ఓడించాడు. నాదల్ తర్వాతి రౌండ్లో థామస్ బెర్డిచ్‌తో తలపడనున్నాడు. స్విస్ స్టార్ రోజర్ ఫెదరర్ అమెరికాకు చెందిన టేలర్ ఫ్రిట్జ్‌ను 6-2, 7-5, 6-2తో ఓడించాడు. తర్వాతి రౌండ్లో ఫెదరర్ గ్రీస్‌కు చెందిన స్టెఫానో టిసిటిసిపాస్‌తో తలపడుతున్నాడు.

Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

Lively
Interaction
For
Ever

ఆంధ్రప్రభ
lifepage2012@gmail.com
లైఫ్

శనివారం 19 జనవరి 2019

ర్యాప్!..యువతను ఉర్రూతలూగించే సంగీత శైలి. అందుకే ర్యాప్ సంగీతం అనగానే...అదేదో బాధ్యత లేని , బలాదూర్ తిరిగే యూత్‌కు సంబంధించిందనే అపోహ!.....కానీ అది జాత్యహంకారానికి వ్యతిరేకంగా ఎత్తిన నిరసన గళం అనీ.... జాతి వివక్షకు, నల్లజాతీయులంటే తెల్ల జాతీయులకు ఉన్న చులకనభావానికి వ్యతిరేకంగా.. తమ భావ ప్రకటనను వ్యక్తం చేసేందుకు... తమ జాతిలో చైతన్యం రగిలించేందుకు.. ఆఫ్రికన్-అమెరికన్ కళాకారులు ఎంచుకున్న అహింసా మార్గమని ఎందరికి తెలుసు? కాని ఇది అక్షర సత్యం. మన దేశంలో ర్యాప్ మ్యూజిక్ ప్రేమతో మొదలై సమాజంలోని కుళ్లును కడిగేందుకు .. రగులుతున్న యువ చైతన్యంగా మారింది. అమెరికాలో ర్యాప్ మ్యూజిక్ ఏ లక్ష్యంతో మొదలైందో దానినే స్ఫూర్తిగా తీసుకున్న మన యువతరం.... సామాజిక రుగ్మతలపై సమరం సాగిస్తోంది. ఇంగ్లీష్‌తో సహా దేశంలోని ఆయా ప్రాంతీయ భాషల్లో ర్యాపింగ్ చేస్తూ సూపర్ అనిపించుకుంటోంది. ఆ క్రమంలోనే మినీ ఇండియాగా పేరు పొందిన భాగ్యనగరంలో తెలుగు ర్యాపింగ్ ప్రాచుర్యంలోకి వచ్చింది. సామాజిక స్పృహ, మ్యూజిక్ అంటే ప్యాషన్ ఉన్న యువత దీనిని లక్ష్యసాధనకు మార్గంగా ఎంచుకుంటోంది. అసలు ర్యాప్ మ్యూజిక్ నేపథ్యం ఏంటి? ఎన్నో సంగీత ప్రక్రియలు ఉండగా యూత్ దీనిపట్లే ఎందుకు ఆకర్షితులవుతోంది? ర్యాపింగ్ యూత్ మనోభావాలేంటి? తదితర అంశాలతో ప్రత్యేక కథనం!



ర్యాప్...ఓ చైతన్య గీతం!

అమెరికన్-ఆఫ్రికన్ కళాకారుల.. అహింసా మార్గం ర్యాప్ మ్యూజిక్! | ఎలుగెత్తిన నిరసన గళం | యువతకు చైతన్య స్ఫూర్తి | విస్తరిస్తున్న తెలుగు ర్యాపింగ్

హిప్ హాప్ కొమ్మ..ర్యాప్!

అనేక విదేశీ సంగీత ప్రక్రియల్లో హిప్ హాప్ మ్యూజిక్ ఒకటి. 1970 దశకంలో ఆఫ్రికన్ అమెరికన్లు అభివృద్ధిచేసిన.. హిప్ హాప్ నుంచి పుట్టిన... రిథమ్ అండ్ పొయెట్రీ ప్రధానంగా సాగే సంగీత ప్రక్రియ ర్యాప్. నల్లజాతీయులు దీనిని అభివృద్ధి చేశారు. మొదట్లో వారికి మ్యూజిక్ పరికరాలు కొనే ఆర్థిక స్థోమత లేకపోవడంతో బీట్ బాక్సింగ్ (నోటితో మ్యూజిక్ పలికించడం) ద్వారా ర్యాపింగ్ చేసేవారు. తమ నిరసన గళం వినిపించేందుకు దీనిని ఓ అహింసామార్గంగా ఎంచుకున్నారు. 1979 వరకు దీనికి సరైన ప్రాచుర్యం లభించలేదు.. కారణం..200సంవత్సరాలు బానిస బతుకులు బతికిన ఆఫ్రికన్ అమెరికన్లకు వాటిని రికార్డు చేసే ఆర్థిక స్థోమత లేకపోవడం.. నల్లజాతీయుల సంగీత ప్రక్రియ కావడంతో ఇతర జాతీయుల మనసులు రంజింపచేయలేక పోవడం. అయితే తెల్లజాతీయుడైన ఎమినెన్ వంటివారు దీనిని ఆదరించడంతో ప్రస్తుతం హిప్ హాప్ సంగీతానికే కాదు దానినుంచి ఉద్భవించిన ర్యాప్ మ్యూజిక్ విస్తరించింది. ప్రపంచ వ్యాపితం అయింది. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా యువత గళాల్లో మార్మోగుతోంది. కొండకచో యువతకు ఈ సంగీతం లైఫ్ స్టైల్‌గా మారిపోయింది. ఈ మధ్యకాలంలోనే తెలుగు ర్యాపింగ్ అంతర్జాతీయ వేదికలపై ప్రదర్శనలిస్తోంది. తెలుగు సినిమాల్లో సందడి చేస్తోంది.

తెలుగు ర్యాపింగ్

ర్యాప్ మ్యూజిక్ పుట్టుక నుంచి అది ప్రాచుర్యంలోకి రావడం వరకు దాని నేపథ్యాన్ని గమనించినప్పుడు తెలుగు ర్యాపింగ్ అనేది అనతికాలంలోనే అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించిందని చెప్పడం అతిశయోక్తి కాదు. ఇటీవలి కాలంలో ర్యాప్ మ్యూజిక్ తెలుగు సినిమాల్లోనూ సందడి చేస్తోంది. పతంగ్ అనే ర్యాప్ సాంగ్‌తో రోల్ రైడర్ అలియాస్ రాహుల్ కుమార్, తెలుగు వీర పాటతో మ్యూజిక్ ప్రియుల మనసు దోచుకున్న ప్రణవ్ చాగంటి, అలాగే ఎంసీ యూనిక్ అలియాస్ హరీశ్, ఓం శ్రీపతి, రాం, సన్నీ అస్టిన్, పృధ్వీరాజ్ తదితరులు హైదరాబాద్ వేదికగా తెలుగులో ర్యాపింగ్ చేస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. తెలుగు యువతకు వీరు సరికొత్త స్ఫూర్తిని చైతన్యాన్ని అందిస్తున్నారు. తమ పాటల ద్వారా సమాజంలోని కుళ్లును,కుతంత్రాలను, అఘాయిత్యాలను ప్రశ్నిస్తున్నారు. తమ మ్యూజిక్ ప్యాషన్ ద్వారా తమకంటూ ఓ గుర్తింపు తెచ్చుకుంటున్నారు.

దేశంలోనే తొలిసారి: మేఘ్‌రాజ్

నేను పుట్టి పెరిగింది హైదరాబాద్‌లోనే.. నాన్నది గుల్బర్గా..అమ్మది హైదరాబాద్..డిడి కాలనీలో ఉంటాను. మాతాత స్వాతంత్ర సమరయోధులు. నాకు చిన్నప్పటి నుంచి మ్యూజిక్ అంటే ప్రాణం. డిగ్రీ మధ్యలో మానేసి సంగీతం అడుగులు వేశాను. 2000 నుంచే ర్యాపర్‌గా మారాను. 2007లో డినాక్స్ గ్రూప్ ఏర్పాటుచేసి..దేశవ్యాప్తంగా ర్యాపర్స్‌ను ఏకతాటిపైకి తెచ్చి..ముంబై,బెంగళూర్‌లలో ప్రదర్శనలు ఇచ్చాను. అదే దేశంలో మొదటి ర్యాపింగ్ గ్రూప్ మంచి రెస్పాన్స్ వచ్చింది. 2008లో దేసీ అనే ర్యాప్ మ్యూజిక్ ఆల్బమ్ విడుదలచేశాము. అప్పట్లో అదో రెవల్యూషన్. ర్యాప్ మ్యూజిక్ పెద్దగా జనాదరణను పొందని టైంలోనే యూట్యూబ్‌లో 30 లక్షల వ్యూస్ వచ్చాయి. 2010లో ఇండస్ ఘరానా పేరుతో గ్రూప్‌ను ఏర్పాటు చేసి, దేశీయ,విదేశీ ర్యాప్‌ను కలిపి ఆల్బమ్ విడుదల చేశాము. దానికి అంతర్జాతీయంగా మంచి గుర్తింపు లభించింది. ఎంటీవీలో,వీహెచ్ వన్ టీవీలో మాప్రదర్శన ఇచ్చే స్థాయికి ఎదిగాము. ఆ గుర్తింపుతో 2012లో బ్రేకప్ సినిమాకు మ్యూజిక్ చేసే అవకాశం లభించింది. అయితే ఇంగ్లీష్‌లో ర్యాపింగ్ చేస్తే తెలుగు వాళ్లకు పెద్దగా అర్థం కాదు. అందుకే తెలుగు ర్యాపింగ్ చేయడం మొదలు పెట్టాను. నేను తెలుగు,హిందీ, ఇంగ్లీష్‌లలో ర్యాపింగ్ చేస్తాను. ప్రస్తుతం ఇది కమర్షలైజ్ అయింది కానీ, సమాజంలో చైతన్యం కోసం మాత్రమే ఎక్కువగా ర్యాప్ మ్యూజిక్ వైపు అడుగులు వేశాను. మాలోని కళను ప్రదర్శించేందుకు ఇది మాకు దొరికిన మంచి సాధనం. పాటలు మేమే రాసుకుంటాం. కాబట్టి సమాజం పట్ల మాభావాలను ర్యాపింగ్ ద్వారా వ్యక్తపరుస్తాము. మేం చెప్పదల్చుకుంది ర్యాప్ మ్యూజిక్ ద్వారా సమాజానికి చెప్పే ఛాన్స్ దక్కినందుకు ఎంతో తృప్తిగా ఉంది. విదేశాల్లో మాదిరిగా వీధుల్లో ర్యాపింగ్ చేసే ఛాన్స్ లేదు. అందుకే ఆల్బమ్ తయారు చేస్తాము. యూట్యూబ్,సామాజిక మాధ్యమాల ద్వారా మా కళను ప్రదర్శిస్తున్నాము. రచయితలకు కలం పేరు ఉన్నట్లే ర్యాపర్లకు స్టేజ్ నేమ్స్ ఉంటాయి. నా స్టేజ్ నేమ్..మెగావాట్! సమాజంలోని రుగ్మతలను ఎత్తిచూపడానికి, ప్రజలను చైతన్య పరచడానికి యువతకు అందివచ్చిన చక్కని అవకాశం ఈ ర్యాప్ మ్యూజిక్!


మేఘ్‌రాజ్


ప్రణవ్

సులభంగా అర్థం అవుతుంది: హరీశ్

మాది హైదరాబాద్. తార్నాకలో ఉంటాము. నాన్న బిజినెస్ పర్సన్. అమ్మ ఎల్ఐసీలో బ్రాంచ్ మేనేజర్. నేను బీటెక్ చదివాను. ఇన్ఫోసిస్ కంపెనీలో నాలుగు సంవత్సరాలు పనిచేశాను. నాకు మ్యూజిక్ అనేది ప్యాషన్. నేను 9నుంచి ఇంగ్లీష్‌లో ర్యాపింగ్ చేసేవాడిని.. దాంతో ఉద్యోగం వదిలేసి ర్యాపర్‌గా మారాను. 2014 నుంచి తెలుగు ర్యాపింగ్ చేస్తున్నా. సినిమా పాటలు వింటే ప్రజలకు దాని ఉద్దేశ్యం అంతగా అర్థం కాదు. కాని ర్యాప్ సాంగ్ వింటే సులభంగా అర్థం అవుతుంది. యూత్ కు త్వరగా ఆకట్టుకుంటుంది. మ్యూజిక్‌లో వేరే ఆఫర్లు వచ్చినా వదిలేశాను. ర్యాప్ సాంగ్ వింటుంటే మన జీవితంలో ఒక పేజీని తిరగేసిన అనుభూతి కల్గుతుంది. ఎందుకంటే మేం పాడే పాటలు మన చుట్టు జరిగే సంఘటనల ఆధారంగానే రాసుకుంటాము. ర్యాప్ సాంగ్ అంటే మ్యూజిక్‌కు అనుకూలంగా వేగంగా మాట్లాడడమే. అందుకే సినిమా మ్యూజిక్‌తో పోల్చుకుని పాడడం కంటే ..మనకు నచ్చినట్లు, పదిమందికి అర్థం అయ్యేట్లు పాడడం మంచిది కదా. అందుకే తెలుగు ర్యాపింగ్ చేస్తున్నాను. ఉద్యోగం మానేసిన తర్వాత పూర్తిస్థాయిలో ర్యాపర్‌గా మారిపోయాను. నేను రెవల్యూషనరీ సాంగ్స్ వింటూ పెరిగాను. అందుకే నాపాటల్లో సామాజిక స్పృహ ఎక్కువగా ఉంటుంది. నేను చదువుకుంటున్న రోజుల్లోనే ర్యాప్ మ్యూజిక్ ప్రదర్శనలిచ్చాను. ఇప్పటి వరకు 8 ర్యాప్ మ్యూజిక్ ఆల్బమ్ విడుదల చేశాను. సంవత్సరానికి 15 నుంచి 20 ఈవెంట్లు చేస్తున్నాను. దీంతో ఉద్యోగాన్ని వదిలేశానన్న బాధలేదు. అమ్మానాన్నలు కూడా ఉద్యోగాన్ని వదిలేసినప్పుడు బాధపడలేదు. పైగా నీకు నచ్చిన రంగంలో రాణించమని ప్రోత్సహించారు. ఇతర సంగీతాలలో మాదిరిగా ర్యాప్‌కు ప్రిన్స్‌పుల్స్ అంటూ ఉండక పోవడం అనేది దీని పట్ల యూత్ ఆకర్షితులు కావడానికి ప్రధాన కారణంగా చెప్పవచ్చు. సమాజంలో జరిగిన సంఘటనలకు స్పందించి,వారికి తోచింది రాసుకుని...నచ్చినట్లు పాడుకోవచ్చు.

మ్యూజిక్ అంటే ప్రాణం: ప్రణవ్ చాగంటి

మాదిహైదరాబాద్. అంబర్ పేటలో ఉంటాము. నాన్న మెడికల్ రిప్రజెంటేటివ్. అమ్మ సాధారణ గృహిణి. మాది దిగువ మధ్యతరగతి కుటుంబం. నేను బీటెక్ పూర్తిచేసి తర్వాత మర్చంట్ నేవీ షిప్‌లో ఎలక్ట్రికల్ ఇంజనీర్‌గా పనిచేశాను. లక్షరూపాయల వరకు జీతం వచ్చేది. కానీ మ్యూజిక్ మీద ఉన్న మోజు, అమ్మానాన్నలకు దూరంగా ఉండడం ఇష్టంలేక.. ఉద్యోగం వదిలేశాను. చెన్నై వెళ్లి మ్యూజిక్ నేర్చుకున్నాను. మాది ఆర్థిక స్థిరత్వం లేని కుటుంబం కావడం, ఉద్యోగం వదిలేయడంతో బతుకు తెరువు కష్టంగా మారింది. అయినా మ్యూజిక్ ప్యాషన్‌ను వదులుకోలేను..అందుకే ముంబైలో పియానో నేర్పించడం ద్వారా ఉపాధి పొందాను. ఈనేపధ్యంలోనే ఢిల్లీలో నిర్భయ ఘటన దేశాన్ని కుదిపేసింది. నాకు ఎమోషన్స్ ఎక్కువ. ఆ సంఘటన నన్ను కదిలించింది. నిర్భయ అన్యాయం అనే పాట రాసాను. అప్పటికి కాని నేను రాయగలనని నాకు తెలువదు. ఆ తర్వాత శ్రీశ్రీ, సినారె,సిరివెన్నెల సాహిత్యం చదివాను. సామాజిక స్పృహతో పాటలు రాయడం మొదలు పెట్టాను. ఈ దశలోనే ర్యాప్ మ్యూజిక్‌పై దృష్టిసారించాను. ర్యాపింగ్ అంటే లయబద్ధంగా మాట్లాడడం. దీంతో నేను ర్యాపర్‌గా మారాను. ర్యాప్ సాంగ్స్ త్వరగా ప్రజల్లోకి వెళ్తాయి. 2014 నుంచి ర్యాపింగ్ చేస్తున్నాను. కాలేజ్‌లో ఈవెంట్లకు వెళతాను. ఇటీవల మలేషియాలో ప్రదర్శన ఇచ్చి వచ్చాను. నేను మర్చంట్ నేవీలో ఉద్యోగం చేస్తే నాకు ఎక్కువ జీతం వచ్చేది..నచ్చిన పని చేసిన తృప్తి మిగిలేది కాదు. ప్రస్తుతం నాకు నచ్చిన మ్యూజిక్ ఫీల్డ్‌లో ఉన్నాను..కాబట్టి ఆదాయం పెద్దగా లేకున్నా.. మానసికమైన సంతృప్తి మిగులుతుంది. మంచి గుర్తింపు..వేలాది మంది పొగడ్తలు. జీవితానికి ఇంతకన్నా ఏమి కావాలి చెప్పండి.

- చొల్లేటి వేంకటేశ్వరా చారి

సంపూర్ణ ఆరోగ్యం కోసం..!

సంపూర్ణ ఆరోగ్యం కోసం సమతులాహారం తీసుకోవడం చాలా ముఖ్యం.. కడుపారా భుజించినంత మాత్రాన ఆరోగ్యంగా ఉంటాం అనుకుంటే పొరపాటే. ఎందుకంటే మనం తీసుకునే రోజువారి ఆహారంలో ఉండే పదార్థాలు, వాటిలోని పోషకాలు మన ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. మనల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. నిత్యం ఓ ప్రణాళిక ప్రకారం ఆహారం తీసుకోగల్గితే రోగాలు మన దరిచేరవు..మనం ఆరోగ్యంగా ఉండవచ్చు. ఆరోగ్యవంతమైన జీవితం కోసం మనం తీసుకోవాల్సిన ఆహార పదార్థాలేంటో తెలుసుకుందాం!

☞ ఆరోగ్యకరమైన పోషక విలువతో కూడిన ఆహారం భుజిస్తే.. హెల్త్‌పరంగానే కాదు..శారీరకంగా కూడా ఫిట్‌గా ఉండవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. అంతేకాదు పోషక విలువలతో కూడిన డైట్ వల్ల రోగాలు దరిచేరవని, రోగనిరోధక శక్తి పెరుగుతుందని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. అందుకే మనం తాజా,సేంద్రియ ఉత్పత్తులు ఆహారం గా తీసుకోవడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది.

☞ అందరికి అందుబాటులో ఉండేది,నిత్యం మనం తీసుకునే ఆహారం లో చేర్చుకోవాల్సింది గుడ్డు. గుడ్డు బహుళ పోషక విలువలు కల్గి ఉంటుంది. ఇందులో ప్రొటీన్లు, ఎర్రరక్త కణాల అభివృద్ధికి దోహదంచేసే..బీ-2,బీ-12 తో పాటు ఇతర విటమిన్లు,న్యూట్రిన్‌లు ఇందులో సమృద్ధిగా లభిస్తాయి. గుడ్డు తినటం ద్వారా ఆరోగ్యకరమైన కొలెస్ట్రాల్ లభిస్తుంది. అందుకే రోజు ఆహారంలో ఒక గుడ్డును తీసుకోవడం ఉత్తమం.

☞ ఓట్‌మీల్..ఇది శరీరానికి అధికంగా ఫైబర్‌ను అందించే అల్పాహారం. దీనిని ఉదయం టిఫిన్‌గా తీసుకోవడం ద్వారా ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. ఓట్‌మీల్ బ్లడ్‌లో షుగర్ లెవల్స్‌ను నియంత్రిస్తుంది. ఓట్స్‌లను వెన్నతీసిన పాలు లేదా పెరుగులో కలిపి అల్పాహారంగా తీసుకుంటే ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది

☞ మనం తీసుకునే ఆహారంలో కాయధాన్యాలు ఉండేలా చూసుకోవాలి. ఇందులో ప్రొటీన్లు అధికంగా ఉంటాయి. పైగా చౌకగా లభిస్తాయి. కాయధాన్యాలు పోషకాలతో నిండి ఉంటాయి. ఇవి ఫైబర్‌ను కలిగి..త్వరగా జీర్ణమవుతాయి.

☞ పోషక పదార్థాలు విరివిగా ఉండే తాజా పండ్లను ఆహారంతో పాటు తీసుకోవడం ఉత్తమం. తాజా పండ్లలో కొవ్వు పదార్థాలు తక్కువగా ఉంటాయి. పొటాషియం, విటమిన్ -సి, డైటరీ ఫైబర్,ఫోలిక్‌యాసిడ్‌లు ఉంటాయి. అలాగే



ఫైబర్,విటమిన్లు, ఖనిజాలు, ఆమ్లజనకాలు ఉంటాయి. ఆరోగ్యానికి అద్భుతమైన మేలును కల్గిస్తాయి.అంతేకాదు బరువును కోల్పోవడానికి సహాయపడతాయి.అంతేకాదు రోజా పండ్లు తినడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది.



☞ కూరగాయలు ఆరోగ్యప్రదాయకాలు. ఇవి దీర్ఘకాలిక రోగాలను నియంత్రిస్తాయి. కూరగాయలలో కూడా ఫైబర్,ఆమ్లజనకాలు ఉంటాయి. ఫోలిక్ యాసిడ్, విటమిన్-ఏ,విటమిన్-కే, విటమిన్-బీ6,అలాగే బీటా- కెరోటిన్ వంట కెరోనాయిడ్స్‌తో పాటు ఆరోగ్యానికి మేలుచేసే విటమిన్లు ఉన్నాయి. వీటిని తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం పొందడమే కాకుండా శరీర బరువును తగ్గిస్తాయి.



ప్రేమ ఫలించాలంటే..!



ప్రేమ ప్రయాణం.. పెళ్లి అనే గమ్యం చేరేలోగా ఎన్నో మైలురాళ్లను అధిగమించాలి... అలవాట్లు,ఇష్టాయిష్టాలు.. తెలుసుకోవడం.. అభిరుచులను షేర్ చేసుకోవడం.. ఇలా ఎన్నో విషయాలు తెలుసుకుంటూ.. ఏకాభిప్రాయం కుదరని అంశాలపై చర్చించుకుని ఓ నిర్ణయానికి వస్తూ.. ప్రేమతో ముందుకు సాగాలి.అప్పుడే బంధం బలపడుతుంది. పెళ్లి వైపు అడుగులు వేస్తుంది., అయితే ఇద్దరు పెళ్లిచేసుకోవాలని నిర్ణయించుకున్నప్పుడు ,పెద్దలను ఒప్పించి పెళ్లిచేసుకోవాలి అనుకుంటారు..(పెద్దలను ఎదిరించి పెళ్లిచేసుకోవడం గురించి ప్రస్తావన ఇక్కడ అనవసరం) అలాంటి ప్రేమ జంటలు తమ గోల్ రీచ్ కావాలంటే వారివారి తల్లిదండ్రులతో మీట్ కావాలి. తప్పదుకదా..మీ ప్రియుడి లేదా ప్రియురాలి తల్లిదండ్రులను కలిసేందుకు వెళ్లే ముందు మీరు తప్పక తెలుసుకోవాల్సిన విషయాలు కొన్ని ఉన్నాయి.. అవేంటో ఇప్పుడు చూద్దాం!

☞ ప్రేమించుకుంది మేము... పెళ్లిచేసుకోవాల్సిందిమేము... .పేరెంట్స్ కాదు కదా। అనేధోరణి ఈ మధ్యప్రేమికుల్లో పెరిగిపోయింది. పర్యవసానంగానే పెద్దల ఎదిరించి పెళ్లిచేసుకోవడం జరుగుతోంది. ప్రేమ వివాహాలు తప్పు కాదు.కానీ తల్లిదండ్రులను ఒప్పించి పెళ్లిచేసుకుంటేనే మేలు. అందుకే మీ ప్రియుడు లేదా ప్రియురాలు పేరెంట్స్‌ను కలవడం తప్పని సరి. అలాగని ఒప్పుకుంటే సరేసరి లేదంటే మాదారి మాది అనే ధోరణిలో కాకుండా..వారిని ఒప్పించాలి, వారికి నచ్చేలా ఉండాలి అనే ధోరణిలో కలవాలి. అందుకే లవర్ పేరెంట్స్‌ను కలిసేప్పుడు ముందుగా వారి పేర్లు తెలుసుకోవడం ఉత్తమం. అలాగని వారిని పేరు పెట్టి సంబోధించడం సరైంది కాదు. అలా సంబోధించకూడదు కూడా. సంభాషణల్లో వారి పేర్లు అవసరం రావచ్చు.

☞ మరో విషయం మీ ప్రియుడు లేదా ప్రియురాలు వాళ్ల తల్లిదండ్రులకు మీ గురించి ఏమి చెప్పిందనేది కూడా మీకు తెలుసుండాలి. ఉదాహరణకు మీ అలవాట్ల విషయం తీసుకోండి.. మీరు నాకు ఫలానా అలవాటు ఉంది అని మీరు చెప్పారనుకోండి.అది పేరెంట్స్‌కు నచ్చనిది అయి ఉంటే..ప్రేమను పెళ్లిదాకా తీసుకెళ్లేందుకు అతడు లేదా ఆమె వాళ్ల పేరెంట్స్‌కు మీరు ఉందని చెప్పిన అలవాటు మీకు లేదని చెప్పి ఉండవచ్చు. అలా జరిగితే మీరు అలవాట్ల విషయంలో అబద్ధాలు ఆడారని భావించే ప్రమాదం ఉంది. అందుకే ముందుగానే మీ గురించి ఏమి చెప్పారో తెలుసుకొని మీ లవర్ పేరెంట్‌ను కలుసుకోవడం మంచిది.

☞ ఏ తల్లిదండ్రులకైనా తమ పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వాలనుకుంటారు. పెళ్లి విషయంలోనూ అంతే జాగ్రత్త పడతారు. మీది ఆకర్షణో ..ప్రేమో తెలుసుకునే ప్రయత్నం చేస్తారు. ప్రేమ మోజులో పడి భవిష్యత్తు గురించి ఆలోచించారో లేదో అనే బెంగ వారిలో ఉంటుంది. పైగా ప్రేమ గుడ్డిదన్న ప్రచారం ఉండనే ఉంది. అందుకే మీరు అతని లేదా ఆమె తల్లిదండ్రులను కలిసినప్పుడు..ప్రేమించి పెళ్లిచేసుకుని ఎలా బతుకుతారనే ప్రశ్న ఉత్పన్నం అవుతుంది., అందుకే ముందుగానే మీరు మీ ఫ్యూచర్ ప్లాన్స్ గురించి చర్చించుకోండి. వాళ్లు అడిగినప్పుడు చెప్పండి. ఏ విషయంలోనూ ఇద్దరు చెప్పేది ఒకటిగానే ఉండాలి. లేదంటే కొత్త సమస్య ఉత్పన్నం అవుతుంది. అందుకే ముందుగానే ఫ్యూచర్ ప్లాన్స్ విషయంలో చర్చించుకోవడం మంచిది.

☞ మీ లవర్ పేరెంట్స్ ను కలిసేప్పుడు వారి అలవాట్లు, చేసే ఉద్యోగాల గురించి తెలిసి ఉండడం చాలా మంచిది. మీ లవర్ మిమ్ములను పరిచయం చేసినప్పుడు మీ మధ్య సంభాషణ జరుగుతుంది. ఆసందర్భంగా వారి అలవాట్లు, వృత్తి గురించి ప్రస్తావన వస్తే మీరు..చాలా ఈజీగా స్పందించవచ్చు. వారి వృత్తిపట్ల, లేదంటే అలవాట్ల పట్ల మీకున్న గౌరవం..లేదా మంచి అభిప్రాయం చర్చలో షేర్ చేసుకుంటే మీపట్ల వారికి మంచి భావన కల్గుతుంది. అది మీప్రేమ వివాహానికి మార్గం సుగమం చేస్తుంది.

☞ మీ ప్రియుడు లేదా ప్రియురాలి తల్లిదండ్రుల ఇష్టాలను తెలుసుకోవడం చాలామంచిది. వాళ్ల ఇష్టాలు తెలుసుకుంటే.. వారిని కలిసేందుకు వెళ్ళేప్పుడు దానికి అనుకూలంగా ఏదో ఒకటి తీసుకెళ్లి వారికి అందించవచ్చు. దేవుడు, పెద్దలు,చిన్నపిల్లల దగ్గరకు వెళ్లినప్పుడు ఉత్తచేతులతో వెళ్లవద్దంటారు. ఇక్కడ అదే సూత్రం వర్తిస్తుంది. మీ పట్ల వారికి సదభిప్రాయం కల్గిస్తుంది.

మలిసంధ్యలోనూ సంసార జంఝాటమేనా?

వయసు మళ్లినాక అనవసర లంపటాలను తొలగించుకోవాలి. ఏ మూల మలుపులో మన జీవితం ముగిసిపోతుందో మనకు బొత్తిగా తెలియదు. యౌవనం నుంచే వివేకంగా ఆలోచించి విలువైన మార్గాన్ని అనుసరించాలి. భగవంతుని మీద అనురాగం పెరుగుతున్న కొద్దీ కర్మలు తగ్గుతూ వస్తాయి. భగవల్లబ్ధి పొందినాక కర్మలు పూర్తిగా తొలగిపోతాయని రామకృష్ణ పరమహంస అంటారు.



యథాగారం దృఢ స్థూణం జీర్ణం భూత్వోపసీదతి
తథావసీదంతి నరాజరామృత్యువశం గతాః

ఎన్ని పెద్ద స్తంభాలున్నా, ఇల్లు పాతది గాక మానదు. స్తంభాలు చివికి ఇల్లు కూలక మానదు. అలాగే మనుషులు నిండు యౌవనంతో ఎంత మిడిసిపడ్డా వారికి ముసలితనమూ తప్పదు. మరణమూ తప్పదు. కొందరికి ముసలితనం వచ్చినా, ఎన్ని కష్టాలు దాపురించినా జీవితం మీద ఆశ చావదు. సుఖంగా జీవించాలను కోవడంలో తప్పులేదు. ఆప్తులకు కష్టాలు వచ్చినప్పుడు శక్తి కొద్దీ సాయం చేయడంలో తప్పులేదు. వయసు మళ్ళినా, బాధ్యతలు తీరినా ఇంకా డబ్బు సంపాదన, ఆస్తులు పెంచాలి అంటూ వెంపర్లాడే వారు కొందరుంటారు. వీరిని చూస్తే 'చచ్చే వరకూ చేపల మోతేనా' అన్న నానుడి గుర్తుకు వస్తుంది. ఆ వయస్సులో వైరాగ్య ఛాయలు నామమాత్రమైనా కనిపించకపోతే ఎలా అనిపిస్తుంది. ఈ వయస్సులో మనస్సు జీవితం మీద కాక భగవద్ధ్యానం మీద ఎందుకు లేదు? అయితే చావును ఎవరూ కోరి తెచ్చుకోలేరు. ఈ భూమి మీద నూకలు న్నంతకాలం బతకవలసిందే! ఇంకా సంసార యాతన లలో తలమునకలు కావాలా? బాధ్యత లను తన తర్వాతి తరంవారైన కొడుకు కోడళ్ళకు అప్పగించి కృష్ణా, రామా అనుకుంటూ భగవంతుని మీద దృష్టి మరల్చరాదా! ఒక యజమానురాలు తన కుటుంబం మీద అజమాయిషీ చేయాలనుకుంటుంది. ఇంటి వ్యవహారాలలో కొడుకు, కోడళ్లకు స్వేచ్ఛనివ్వదు. బిచ్చగాడికి పట్టెడన్నం పెట్టదు. కష్టాలు, దుఃఖాలు ఉన్నా అల్లాడిపోదు, ఈ డబ్బు, సంపదలు ఆమె భర్త పట్టుకుపోయాడా? తాను మూట కట్టుకుపోతుందా?

చాలా మంది జీవితంలోని దశలను యదార్థంగా అర్థం చేసుకోలేక అవస్థల పాలవుతుంటారు. ఏ దశలో ఎలా ప్రవర్తించాలో తెలియదు. ఫలితంగానే కర్మ సన్యాసులుగా విరామంలో విడిది చేయాల్సిన వార్ధక్యంలోనూ లేనిపోని వ్యాపకాలతో పొద్దు గడుపుతున్నారు. వయసుకు తగ్గట్టు హుందాగా మసులుకోకుండా పూర్వపు వాసనల ఛాయలను వ్యాపింపజేస్తున్నారు. ముసలితనంలో సైతం ఇంకా ఇంటికి తామే యజమానులమే, సర్వాధికారులమే అన్న భ్రమలో ఉంటారు. నిజానికది వానప్రస్థాశ్రమ సమయం. పిల్లలు ప్రాజ్ఞులైనా వారికేం తెలుసునని వారిపై కర్ర పెత్తనం చేయరాదు. పదవీ విరమణ వయసుకు వచ్చిన ఉద్యోగిని ఇంకా దేహదారుఢ్యం ఉన్నా ప్రభుత్వం సేవా వృత్తి నుంచి విరమింపజేస్తుంది. అలాగే గృహ బాధ్యతలనుంచి విరమించుకుని భగవద్ధ్యానంలో కాలం గడపాలి. చనిపోయే వరకూ భవబంధాలలో చిక్కుకుని ఉంటే ఇక భగవంతుడిని తలచేదెప్పుడు? మనిషి మేలుకుని ఈ బంధాలలో చిక్కుకోకుండా ఉండడానికి ప్రయత్నించాలి. ప్రాపంచిక విషయాలలో తగులుకుని ఉండడం ఏ విధంగా ఉంటుందో తెలిపే ఒక ఉదాహరణ చూద్దాం.

ఒక పౌరాణికుడు ఒక ఊరిలోని మందిరంలో రోజూ భగవత్కథలు చెప్పేవాడు. రోజూ క్రమం తప్పకుండా 60 ఏళ్లు దాటిన ఒక వృద్ధుడు ఆ ప్రవచనాలు వినడానికి వచ్చేవాడు. ఒకనాడు పౌరాణికుడు, ఆ వృద్ధుడితో 'అయ్యా! నేను ఒక భగవత్కార్యక్రమంలో పాల్గొనడానికి పక్క ఊరు వెళుతున్నాను. మీరూ నాతో పాటు రండి' అని ఆ వృద్ధుడితో అన్నాడు. దానికి ఆ వృద్ధుడు 'అయ్యా! ఉన్న ఊరు అయినందున, పైగా ఆ సమయంలో నాకు పని లేదు కాబట్టి వస్తున్నాను. పక్క గ్రామం వెళ్లి రావాలంటే నాలుగు గంటలు పడుతుంది. నా పనులు వదలి రాలేను' అన్నాడు. దానికి ఆ పౌరాణికుడు, 'అంతగా వాటిని పట్టుకుని ఎందుకు ఉంటారు. దైవ కార్యానికి ఒక్క రోజులో నాలుగు గంటలైనా ఇవ్వలేరా? అన్నాడు. దానికి వృద్ధుడు 'నేను పట్టుకోవటం ఏమిటి? అవే నన్ను వదలడం లేదు' అన్నాడు. దానితో పౌరాణికుడు దగ్గరలోని ఒక స్తంభాన్ని పట్టుకుని 'నన్ను వదులు, నన్ను వదులు' అని అరవ సాగాడు. దానితో ఆ వృద్ధుడు, 'అయ్యా మీరు స్తంభాన్ని పట్టుకున్నారు కాని ఆ స్తంభం మిమ్మల్ని ఎక్కడ పట్టుకుంది? అన్నాడు. వెంటనే ఆ పౌరాణికుడు 'నువ్వు ఆ పనులను వదలక పట్టుకుంటున్నావు కదా!' అన్నాడు.

వయసు మళ్లినాక అనవసర లంపటాలను తొలగించుకోవాలి. ఏ మూల మలుపులో మన జీవితం ముగిసిపోతుందో మనకు బొత్తిగా తెలియదు. యౌవనం నుంచే వివేకంగా ఆలోచించి విలువైన మార్గాన్ని అనుసరించాలి. భగవంతుని మీద అనురాగం పెరుగుతున్న కొద్దీ కర్మలు తగ్గుతూ వస్తాయి. భగవల్లబ్ధి పొందినాక కర్మలు పూర్తిగా తొలగిపోతాయని రామకృష్ణపరమహంస అంటారు.

జీవితంలో భగవంతునికి చివరి ప్రాధాన్యత ఇవ్వడం సమంజసం కాదు. లౌకిక బాధ్యతలను ఎంత తొందరగా వదలి ఆ శ్రీహరి పాదాలను అందుకోగలమా అని తపనపడాలి. జీవితాన్ని ఆ పరమాత్ముని పాదకమలాలకు సమర్పించుకోవాలనే సత్సంకల్పంతో సాగితే ఆయనే తనంత తానుగా మనలను తన వాడిగా చేసుకుంటాడు.

- గుమ్మా ప్రసాదరావు
(భిలాయ్)
09755110398

విధి నిషేధాలు

మన శాస్త్రాలు, పురాణాలు నిత్య జీవితంలో మనిషి నడవడికకు సంబంధించి పలు విధి నిషేధాలు నిర్దేశించాయి. నిత్య జీవితంలో ఏ పనులు చేయాలో, ఏవి చేయకూడదో పేర్కొన్నాయి. శాస్త్రకారులు ఆరోగ్య పరంగా, ఔషధపరంగా, సామాజిక పరంగా, సంస్కృతీ సంప్రదాయాలపరంగా విలువలపరంగా, వైద్య శాస్త్ర పరంగా నడవడిక సూత్రాల పరంగా ఆలోచించి చెడు నుంచి మనల్ని తప్పించడం కోసం వీటిని అందించారు. వీటన్నిటి వెనుక బలమైన కారణం, నేపథ్యం ఉంటుంది.

ముందుగా చేయకూడని పనులను తెలుసుకుందాం.

✣ గురువుకు సనాతన సంస్కృతిలో ప్రముఖ స్థానం ఉంది. కనుక ఎంత కోపం వచ్చినా గురువును కొట్టకూడదు. వారిపై చేయి ఎత్తకూడదు. వారికి పెట్టకుండా ఏదీ తినరాదు. ఇంటి నుంచి గెంటి వేయరాదు.

✣ స్థూలంగా చెప్పాలంటే మంత్రోపదేశం చేసిన వారే గురువు. అటువంటి గురువుకు ఎదురుగా కాళ్లు చాపి కూర్చోకూడదు, అతనిని నిందించకూడదు.

✣ పండితులకు, గురువుకు, తల్లిదండ్రులకు తల వెంట్రుకలతో ఉన్న భోజనం పెట్టరాదు. ఏ కారణం చేతనైనా అన్నంలో వెంట్రుకలు వస్తే ఆ అన్నాన్ని తీసివేసి మళ్లీ వడ్డించాలి. వడ్డించిన అన్నంలో నేయి వేయాలి.

✣ నీరుని, నిప్పుని ఒకేసారి ఒకే చేతితో గాని రెండు చేతులతో గాని పట్టుకుని వెళ్లరాదు.

✣ భోజనం చేసిన వస్త్రాలతో, ఉతికినా శుభ్రం కాని వాటితో దేవతా పూజ చేయకూడదు.

✣ ప్రతి రోజు మనం వాడుతున్న పాత్రలతో పండితులకు ఆహారం పెట్టకూడదు.

✣ శివుని ఆలయంలేని ఊరిలో భోజనం చేయరాదు.

✣ భోజనం చేస్తున్నపుడు మాట్లాడకూడదు, నవ్వరాదు.

✣ కడుక్కున్న కాళ్లను తుడుచుకోకుండా తడికాళ్లతో భోజనం చేయరాదు.

✣ శుచిగా లేకుండా, స్నానం చేయకుండా అన్నం వండరాదు. అలా వండిన అన్నం తినకూడదు.

✣ అన్నం తిన్న కంచంలో చేయి కడగకూడదు.

✣ అన్నం తిన్నాక కడుక్కున్న చేతిని విదల్చకూడదు.

✣ భుజాల మీద వస్త్రం లేకుండా పూజ, భోజనం చేయరాదు.

✣ నిలబడి, అటూ ఇటూ తిరుగుతూ అన్నం తినకూడదు.

✣ పుష్కర స్నానాన్ని చొక్కా ధరించి చేయరాదు. కండువా మాత్రమే ఉంచుకుని స్నానం చేయాలి.

✣ కంచాలు ఒడిలో పెట్టుకుని ఏ పదార్థాలు తినకూడదు.

✣ శివాలయంలో నందీశ్వరునికి దగ్గరగా దీపారాధన చేయరాదు. కొంచెం దూరం ఉండేలా చూసుకోవాలి.


✣ అన్నం తింటున్న వారిని దూషించకూడదు.

✣ పాపాత్ముల ఇంట బోజనం చేయరాదు.

✣ మంత్రోపదేశం చేసిన గురువు భోజనానికి పిలిస్తే వెళ్ళకుండా ఉండకూడదు.

✣ జపం చేసే మాలను మెడన ధరించకూడదు.

✣ మెడన ధరించిన మాలతో జపం చేయరాదు.



✣ సర్వ శాస్త్ర ఇతిహాస పురాణ కోవిదుడు కాని వారి వద్ద మంత్రోపదేశం పొందరాదు.

✣ ఇంటికి గురువు వస్తే వెంటనే లేచి నిలబడి లోపలికి గౌరవంగా తీసుకుని వచ్చి సకల ఉపచారాలు చేసి తగిన ఆసనంలో కూర్చుండబెట్టాలి. గురువు వెళ్లిపోయేటప్పుడు కొద్దిదూరం అనుసరించకుండా సాగనంపకూడదు.

✣ చిన్న పిల్లల్ని, వృద్ధులని, అనారోగ్యవంతుల్ని, గుడిని, గురువుని దర్శించేందుకు, పురాణశ్రవణానికి వెళ్ళేటప్పుడు ఖాళీ చేతులతో వెళ్లరాదు. ఏదో ఒకటి సమర్పించకుండా వచ్చేయరాదు.

✣ పురాణ శ్రవణం చేసే వారు ఉత్తమోత్తములు అయినందున వారిని దూషించ కూడదు.

✣ ఎంగిలి నోటితో గురువుతో మాట్లాడరాదు, ఎంగిలి చేత్తో ఏ పదార్థాన్నీ గురువుకు చూపరాదు.

✣ గురువులకు, పురోహితులకు, పురాణం చెప్పేవారికి సరైన బహుమానాలు ఇవ్వకుండా పంపివారికి రుణపడకూడదు.

✣ దేవాలయాలలోను, ఇంటిలోను ప్రదక్షిణలు చేసేటపుడు, మంత్ర పుష్పం చదివేటపుడు ఆసనంపై నిలబడకూడదు.

✣ పూజ చేస్తున్న సమయంలో చాపలు వంటివి పాడుచేయడం, దర్భాసనాలు చించివేయడం వంటివి చేయరాదు.

✣ మహనీయులను, మహాత్ములను, విశిష్ట వ్యక్తులను ఎట్టి పరిస్థితిలోను అగౌరవపరచకూడదు.

✣ వాగ్దానం ఇచ్చి దానం ఇవ్వకుండా మానకూడదు. వాగ్దాన భంగం మహాదోషం.

✣ ఉత్తర, పశ్చి మాల వైపు తలపెట్టుకుని నిద్రపోకూడదు.

'రమ'ణీయం

✣ ఉపవాస సమయంలోను, జాగరణ సమయంలోను ఇతరుల దోషాలను తలవకూడదు.

✣ ఏడుస్తూ అన్నం తినరాదు.

✣ వండిన గిన్నెలో మొత్తం అన్నాన్ని ఊడ్చుకుని తినకూడదు.

✣ వేదాలు, మంత్రాలు చదువుతూ భోజనం చేయరాదు.

✣ యజ్ఞం చేస్తున్న వారి నీడను, గో బ్రాహ్మణుల నీడను, దేవతా విగ్రహాల నీడను, దేవాలయాల నీడను దాటకూడదు.

✣ తడి బట్ట నీళ్ళు ఇతరులపై పడేలాగ విదిలించకూడదు.

✣ చీటికీ మాటికీ వేళ్లు నోట్లో పెట్టుకోకూడదు.

✣ గోళ్లను నోటితో కొరుక్కోకూడదు.

✣ చీకటిపడ్డాక చెట్ల నుంచి పువ్వులు, ఆకులు కోయరాదు. దీపాలు పెట్టేవేళ తలదువ్వుకోకూడదు.

✣ ఒకరు కట్టుకున్న బట్టలను, జందేన్ని, చెప్పులను మరొకరు ధరించకూడదు.

✣ రెండు చేతులు ఒకేసారి తలమీద పెట్టుకోకూడదు.

✣ కూచుని తొడలు, కాళ్లు ఊపరాదు.

✣ రెండు చేతులతో ఎప్పుడూ తల గోక్కోరాదు.

✣ నోటితో అగ్నిని ఊదరాదు, ఆర్పరాదు. దీపాలను, కొవ్వొత్తులను నోటితో ఊది ఆర్పకూడదు.

✣ ఎవరిపైనా అభాండాలు వేయరాదు.

✣ నిద్రపోతున్న వారిని అనవసరంగా లేపకూడదు.

✣ పురాణ కథలు చెబుతున్నపుడు అనవసరంగా విఘ్నాలు కలిగించరాదు.

✣ భార్యాభర్తలను, తల్లీబిడ్డలను విడదీయరాదు.

✣ ఉమ్మితో వేళ్ళు తడిచేసుకుని పుస్తకంలోని పుటలను తిప్పరాదు.

✣ చీటికీ మాటికీ తనను తాను నిందించుకోవడం, అవమానించుకోవడం చేసుకోరాదు.

✣ ముఖం కడుక్కోకుండా అద్దంలో చూసుకోరాదు.

✣ తీర్థం తీసుకున్న అనంతరం చేతిని కడుక్కోవాలి. తలకి రాసుకోకూడదు.

✣ కొబ్బరికాయను నీటితో కడిగి దేవునికి కొట్టరాదు. పీచు ఒలిచేసిన కొబ్బరికాయను నీళ్లతో కడగరాదు.

✣ తలకు నూనె రాసుకుని చేతికి మిగిలి ఉన్న దానిని పాదాలకు రాసుకోకూడదు.

✣ యజ్ఞోపవీతాన్ని, తాళిని తీసి పక్కన పెట్టరాదు.

✣ చేయవలసిన పనులను వాయిదా వేయకూడదు.

✣ గణపతికి సాధారణ రోజుల్లో తులసితో పూజ చేయరాదు.

✣ దేవతా విగ్రహాలు, చెట్లు ఇంటి ఈశాన్య భాగంలోఉంటే, వాటిని బరువుగా భావించి తీసివేయరాదు. తీసివేయమని సలహా ఇవ్వకూడదు.

✣ బంగారం దొరికితే ఇంటికి తెచ్చుకోకూడదు, దానిని దానం చేయటంగాని, ఆలయానికి ఇవ్వటం కాని చేయాలి.

✣ ఏ కారణం చేతనైనా వెలుగుతున్న వత్తి కొండెక్కితే ఆ పాత వత్తిని మళ్ళీ వెలిగించరాదు.

✣ ఎటువంటి పరిస్థితుల్లోను ఆత్మహత్య చేసుకోకూడదు.

✣ శత్రువుతో, అసత్యాలు పలికే వాడితో, పిసినిగొట్టుతో కలిసి భోజనం చేయరాదు.

✣ పుణ్య కార్యాలలో, పుణ్య దినాలలో ఉల్లి, వెల్లుల్లి, చోళ్లు, జొన్నలు, చద్ది పదార్థాలు ఉపయోగించకూడదు.


✣ ఆది, శుక్ర, మంగళవారాలు తులసి ఆకులు కోయకూడదు.

✣ తాళి తీసి భర్త చేతిలో పెట్టకూడదు.

✣ సంకల్పం చేయకుండా చేసిన నదీ స్నానం నిష్ఫలం.

✣ మూర్ఖులతోను, వ్యసన పరులతోను వాదన చేయరాదు. ఎక్కువ వేడిగా ఉన్న, ఎక్కువ చల్లగా ఉన్న పదార్థాలు తినకూడదు.

ఇవి టూకీగా శాస్త్రాలు చెప్పిన కొన్ని చేయకూడని పనులు. శాస్త్రకారులు ఆరోగ్య పరంగా, ఔషధపరంగా, సామాజిక పరంగా, సంస్కృతీ సంప్రదాయాలపరంగా, విలువలపరంగా, వైద్యశాస్త్ర పరంగా, నడవడిక సూత్రాల పరంగా ఆలోచించి చెడు నుంచి మనల్ని తప్పించడం కోసం వీటిని అందించారు. వీటి వెనుక బలమైన కారణం, నేపథ్యం ఉంటుంది.



- రమాప్రసాద్ ఆదిభట్ల
9348006669

అవతరణిక


(గత సంచిక తరువాయి భాగం)

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

జ్ఞాని అన్ని భూతాలకూ నెచ్చెలి అని అంటారు. 'సర్వ భూతసఖః' ఈ లేఖలలో సమానభుక్తి, సర్వబంధువు, కుచేలుని అటుకులు, వెలగల కూరలు, నిరాడంబరం, సాష్టాంగ నమస్కారం అనేవిన్నీ, ముఖ్యంగా 42. లేఖా చూచేది. పరమహంస, కరపాత్ర స్వామిజీ, గాంధీ, శ్రీరాధాకృష్ణన్ మొదలగు వారిని గురించి ఎంత జాగ్రత్తతో మాట్లాడుతారో ఆయా లేఖలలో తెలుస్తుంది. దీపదర్శన దృశ్యం, ప్రకృతి దృశ్యం మొదలగు లేఖలు చదివి ఇక్కడుండియే అరుణాచలాన్నీ మహర్షినీ చూడగలం. మహర్షి కూచుని ఉంటారు. కొన్నాళ్లపాటు ఉండి, శాంతి పొంది పోవాలి అని అనుకునేవారు సన్నిధిలో కూర్చుని ఉంటారు. భవతప్తులు పిన్నల నుండి పెద్దల వరకూ నానా దేశాల నుండీ నానా ద్వీపాల నుండీ పలువురు వస్తూ వుంటారు. ఎవరి కిష్టం వచ్చిన ప్రశ్న వారు వేస్తూ ఉంటారు. నడుమ కొందరందుకొని ఆ ప్రశ్నలను సాగనీయడమో రూపాంతరం పొందించడమో చేస్తుంటాం. అల్లరి పిల్లకాయలు అపుడపుడు పిచ్చి ప్రశ్నలు వేయడం కద్దు. అమాయకులు కొందరు మోటుతనంగా అడగడమూ, దబాయించడమూ ఉన్నది. ఇట్టి ప్రశ్నలకు సరియైన వానికి సూటిగానూ, వింత వానికి వ్యంగ్యమైన పరిహాసంతో కలిసిపోయిన్నీ చక్కని ప్రతివచనం, రావడం మనకు చమత్కారంగా కనిపిస్తుంది. ఇందులకు 'ఉన్నచోటనే ఉండమను' అను 4 లేఖా, 'కైలాసం' అనే 36 లేఖా మొ॥చూచేది. ఈ రీతి చమత్కారాల వైవిధ్యంతోనూ, కొన్ని ఆధ్యాత్మిక కథలతోనూ ఈ సంపుటి ఒక చిన్న కబ్బమా అని తోచడానికి సందేహం లేదు. ఈ రీతిగా తన కబ్బము ద్వారా తన శ్రవణఫలమునూ, మనన ఫలమునూ మనకు పంచిపెట్టి నిదిధ్యాసనం లోకి తీసికొని పోవ డంలో ఏమాత్రమూ లోభం చూపని శ్రీనాగమ్మ గారికి శ్రీరమణమహర్షి ఆశీర్వాదం ఉండనే ఉంది. దానిని పురస్కరించుకొని నా ధన్యవాదం.

చిరివాడ
5-8-58

వేలూరి శివరామశాస్త్రి



శ్రీరమణాశ్రమభక్తురాలగు సూరినాగమ్మ గారిచే వ్రాయబడిన శ్రీరమణాశ్రమలేఖలలో ఈపుస్తకము నాల్గవభాగము. ఈమె రమణ మహర్షుల సన్నిధిలో నుండిన పది సంవత్సరముల కాలములో అచ్చటికి వచ్చిన భక్తులు, సాధకులు, జిజ్ఞాసువులు మహర్షులనడిగిన ప్రశ్నల జవాబులే ఈ లేఖలు. శ్రీరమణ మహర్షి బాల్యము నందే జ్ఞానమును బొంది అరుణాచల క్షేత్రమునకేగి యచ్చటనే జీవన్ముక్తులుగ నుండిపోయిరి. వారిది అవధూత స్థితి. శ్రీమహర్షి సహజముగ, మౌనముగ నుండెడివారు. తమకు తాముగా ఎవరి కిని బోధించు అలవాటు లేదు. జిజ్ఞాసువులకు గల సందేహములను ప్రశ్న రూపములో అడిగినప్పుడు మాత్రము వారు వానికి సమాధానముల నిచ్చెడివారు. భక్తులకు జిజ్ఞాసువులకును మహర్షి నడవడియే ఉపదేశముగా నుండెడిది. "నీవెవరో తెలుసు కొనుము" అనునదియే వారి సిద్ధాంత వాక్యము.

(తరువాయి భాగం వచ్చే సంచికలో)

- సూరి నాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

చింతన

సుఖదుఃఖానుభవాలకు జీవుడే కారణం



అధ్యాయం 13, శ్లోకం - 21

కార్యకరణకర్తృత్వే
హేతుః ప్రకృతిరుచ్యతే।
పురుషః సుఖదుఃఖానాం
భోక్తృత్వే హేతురుచ్యతే॥

తాత్పర్యం

భౌతిక, కార్య, కారణములన్నింటికి ప్రకృతియే హేతు వని , జగమునందలి పలు సుఖదుఃఖానుభవములకు జీవుడే కారణమని చెప్పబడుచున్నది.

భాష్యం

పూర్వపు కోరికలను కర్మలను బట్టి భౌతిక ప్రకృతి జీవరాశులకు తగిన శరీరములను, ఇంద్రియములను ప్రసాదించును. జీవుడు తనకు ఇచ్చిన శరీరముతో, ఈ భౌతిక ప్రకృతితో నిర్వహించే తీరును బట్టి సుఖదుఃఖాలను పొందుతూ ఉంటాడు. జీవుడు భౌతిక ప్రకృతిని తన ఆధీనములోనికి తీసుకోవాలని ప్రయత్నించుట వలన ప్రకృతి నియమాలు అతనిపై ప్రభావము చూపుట మొదలుపెడతాయి. ఉదాహరణకు పంది శరీరము ఇవ్వబడినట్లయితే మలము భుజింపక తప్పదు. అలాగే దేవతా శరీరము ఇవ్వబడినట్లయితే ఆ శరీరమునకు తగినట్లు సదుపాయాలు కూడా ఇవ్వబడతాయి. అయితే పరమాత్మ మాత్రము ఎంత కరుణను కలిగి ఉంటాడంటే అన్ని సందర్భాలలోనూ, జన్మలలోనూ ఆత్మవెంబడే ఉండి, ఎప్పుడు తనను గుర్తించి తనవైపుకు తిరుగుతాడా అని ఎదురుచూస్తూ ఉంటాడు.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యథాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

దిన ఫలాలు

మేష రాశి: కుటుంబ సఖ్యత పెరుగుతుంది. విద్యాప్రయత్నాలు లాభిస్తాయి. అధికారులతో సంబంధ, బాంధవ్యాలు మెరుగవుతాయి. ఆధ్యాత్మికకార్యాలలో పాల్గొంటారు. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి వ్యవహారాల్లో శుభ పరిణామాలు చోటు చేసుకొంటాయి. ఆదాయంలో మెరుగైన వాతావరణం ప్రారంభమవుతుంది.

వృషభ రాశి: ఆరోగ్య పరీక్షలు మేలును కలిగిస్తాయి. కోర్టు వ్యవహారాల్లో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్యంలో ఖర్చులు పెరుగుతాయి. రాజకీయ వత్తిడులు పెరుగుతాయి. ఆదాయంలో ఇబ్బందులను నెట్టుకురాగలుగుతారు.

మిథున రాశి: గృహకార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. అసహన పరిస్థితులు ఆర్థికంగా కొనసాగుతాయి. ఆరోగ్యం పర్వాలేదు. శ్రమతో కూడిన కార్యాలు, అసంతృప్తి ఉంటాయి. ఆదాయంలో గట్టి ప్రయత్నాలు తప్పనిసరి.

కర్కాటక రాశి: ఆరోగ్య పరీక్షలు ఉపశమనం కలిగిస్తాయి. స్థిరాస్తి విషయాలు అనుకూలం. మానసికధైర్యం పెరుగుతుంది. నిర్ణయాలు అమలు పరచగలుగు తారు. రాజకీయ వ్యవహారాల్లో చుక్కెదురు ఉంటుంది. పనులపై ఒత్తిడి అధిగమించగలుగుతారు. ఆదాయంలో అనుకూలత పెరుగుతుంది.

సింహ రాశి: ఆర్థిక లావాదేవీలు ఊరట కలిగిస్తాయి. స్థిరాస్తి విక్రయాలు/ వాహన విక్రయాలు లాభిస్తాయి. రుణ ఒత్తిడులు కొనసాగుతాయి. ఆరోగ్యం విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆందోళన పరిస్థితులను అధిగమించలేకపోతారు. ఆదాయం లో అయోమయ పరిస్థితులున్నా అధిగమించగలుగుతారు.

కన్యా రాశి: సాహస నిర్ణయాలు లాభిస్తాయి. వాహన విషయాల్లో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. ఆదాయంలో ఆశించిన ఫలితాలు పొందగలుగుతారు.

తులా రాశి: స్థిరాస్తి కొనుగోళ్లు ఉపకరిస్తాయి. ఆరోగ్య పరీక్షలు ఉపకరిస్తాయి. విదేశీ లావాదేవీలు లాభిస్తాయి. వేగవంతమయిన నిర్ణయాలు తీసుకోలేకపోతారు. ఆరోగ్యం ప్రతికూలత తగ్గుతుంది. పొరపాట్లను విస్మరించటం ద్వారా సమస్యలు ఎదురవుతాయి. ఆదాయంలో ప్రోత్సాహక పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.


వృశ్చిక రాశి: రాజకీయ నిర్ణయాలు అనుకూలం. నూతన ఒప్పందాలు కలసి వస్తాయి. పరీక్షలు ఆరోగ్యపరంగా ఉపకరిస్తాయి. శ్రమ అధికమవుతుంది. ఆరోగ్యంలో జాగ్రత్తలు పాటించాలి. పనులలో ఆలస్యం ఉంటుంది. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి: విదేశీ సంభాషణలు/ లావాదేవీలు లాభిస్తాయి. ఒత్తిడులని వేగవంతంగా ఎదుర్కోలేకపోతారు. ఆరోగ్యంలో అనుకూలత పెరుగుతుంది. వృత్తిలో పోటీ పెరుగుతుంది. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

మకర రాశి: వ్యాపార ఒప్పందాలు ఊరట కలిగిస్తాయి. అవమానకర పరిస్థితుల్ని ఎదుర్కోలేక పోతారు. ఆరోగ్యం ప్రతికూలత ఉంటుంది. మంచి కార్యాలలో కూడా విమర్శలకు గురవుతారు. ఆదాయంలో ఆటంకాలని చవి చూస్తారు.

కుంభరాశి: విదేశీ లావాదేవీలు ఉపకరిస్తాయి. ఆనందకర సంఘటనలు గృహంలో ఏర్పడతాయి. శ్రమ అధికంగా ఉన్నా, విజయాలు సాధ్యపడతాయి. ఆరోగ్యంలో శ్రద్ధ పెరుగుతుంది. స్థిరాస్తి విషయాల్లో శ్రద్ధ తప్పనిసరి. నూతన ప్రణాళికలు వృత్తిలో లాభిస్తాయి. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.

మీనరాశి: విదేశీ ప్రయాణాలు కలసివస్తాయి. శుభవార్తలు వింటారు. అవకాశాలను సద్వినియోగపరచుకోగలుగుతారు. ఆరోగ్యం ప్రతికూలత ఉంటుంది. ఉద్యోగ వ్యవహారాల్లో అనుకూల పరిస్థితులు ఉంటాయి. ఆదాయంలో అనుకూల మార్పులు గోచరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com

బాలల రాగ రామాయణం!

పిల్లలూ.. రామాయణాన్ని రాగయుక్తంగా పాడి ఆనందించాలనుకుంటున్నారా... మీ గళంలో దాన్ని అందరికీ వినిపించాలనుకుంటున్నారా? మీ కోసమే ఈ ప్రయత్నం. రామాయణాన్ని ప్రత్యేకించి బాలలకోసం .. రాగయుక్తంగా పాడుకునేందుకు వీలుగా .. సరళపదాలతో గేయరూపంలో అందిస్తున్నాం. ఆస్వాదించండి.



రాగభరితము
రమ్య చరితము
త్యాగసహితము రామ
కథనము!
నిఖిల జగము నివాళులెత్తే
సకల ధర్మ సంశోభితం!

'రామ రామా!' యన్న
రాగాలు ఉదయించు!
రామ రామాయన్న
రోమాలు పులకించు!

వ్యాధుని వాల్మీకిగా
మార్చిన తారకమంత్రం!

శోకము శ్లోకమ్ముగా
తీర్చిన అద్భుత మంత్రం!

పోతన్నను పసిడి కవిత
పోతలతో ముంచెత్తిన
త్యాగరాజునే సుమధుర
రాగరాజుగా మలిచిన
గోపన్నను పరమభక్త
రామదాసుగా మార్చిన

'రామా!' యను ఒక శబ్దం
మోక్షానికి ప్రత్యర్థం!
రామనామ సంస్మరణం
స్వర్గమార్గ సోపానం!

రాక్షస సంహారమే
రామాయణమైనది!
అనేకానురాగాల
అమరకావ్యమైనది!
పితృ, భ్రాతృ, గురుభక్తికి
ప్రియవేదిక యైనది


★ ★ ★



వడ్డేపల్లి కృష్ణ
సెల్ :9246541699



సఖ్యత



ఒక అడవిలో రాహువు, కేతువు అనే రెండు సర్పాలు ఉండేవి. అవి రెండు వేరు వేరు పుట్టలలో ప్రక్కనే నివాసముంటున్నాయి. ఒకసారి విపరీతమైన వర్షం కారణంగా రాహువు నివసిస్తున్న పుట్ట కరిగిపోయింది. ఏం చేయాలో పాలుపోక కేతువు పుట్టలో చేరాడు. ఇది కేతువుకు నచ్చలేదు.

"మిత్రమా! నా నివాసంలో నువ్వు చేరడం సమంజసం కాదు. వెళ్లిపో" అని చెప్పాడు కేతువు.

నీ నివాసమేంటి? ఇది మా పూర్వీకులు నివసించిన పుట్ట. స్థలం మార్పుకోసం నేను ఇంకో పుట్టలో నివసిస్తున్నాను. ఈలోగా నువ్వే వచ్చి నా పుట్టలో చేరావు. ఉంటే ఇద్దరం ఈ పుట్టలో ఉందాం? లేదా నువ్వు ఖాళీ చేసి వెళ్లిపో అని ఖరాఖండిగా చెప్పాడు రాహువు.

ఇద్దరు బుసలు కొడుతూ తగాదా పడ్డారు. ఇంతలో ఒక ముని ఆ వైపుగా వెళుతున్నాడు. పాములు రెండు మునికి తమ సమస్యను చెప్పి పరిష్కారాన్ని చెప్పమన్నాయి.

ఈ సృష్టిలో ప్రాణమనేది నీటి బుడగ లాంటిది. అది ఏ క్షణానైనా గాలిలో కలిసిపోవచ్చు. ఈ మాత్రం దానికి మీరు సఖ్యతను వీడి ఈ విధంగా కయ్యానికి కాలు దువ్వడం సమంజసం కాదు. నిజం చెప్పవలసి వస్తే మీరు నివసిస్తున్న పుట్టలను మీ జాతి వారు తయారు చేయలేదు. చీమలు ఈ పుట్టలను తయారు చేస్తే మీ జాతి వచ్చి ఆక్రమించుకుని నివసిస్తున్నాయి. మీది కాని నివాసం కోసం ఇలా తగాదా పడటం సమంజసం కాదు. సఖ్యతగా ఇద్దరు నివసించండి. మీరు ఒకరిని ఒకరు సహాయం చేసుకుంటూ ఐకమత్యంగా ఉంటే హాయిగా జీవించవచ్చు. ఈ

విధంగా బుసలు కొడుతూ తగాదా పడుతుంటే శత్రువుల నుండి మీకు ప్రాణానికి ముప్పుకలగవచ్చు అన్నాడు మునీశ్వరుడు.

అయినా పాములు రెండు వినలేదు. ఇష్టానుసారంగా తగాదాపడ్డాయి. పడగవిప్పి బుసలు కొడుతూ భయానక వాతావరణాన్ని సృష్టించాయి. ఇంతలో ఆకాశం నుండి ఒక గరుడపక్షి వచ్చి ఆ రెండు సర్పాలను తన కాళ్లతో పట్టి కొండపైకి తీసుకుని వెళ్లింది. మునీశ్వరుడు చెప్పిన మాట వినకపోవడం వల్ల తమ ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. సర్పాలు బాధపడ్డాయి. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఏం ప్రయోజనం? అని పాములు అనుకున్నాయి. చూస్తుండగానే గరుడపక్షి పాములను చంపేసి తినేసింది.

- షేక్ అబ్దుల్ హకీం జానీ

ఎర్రకోటలో తెల్లరాళ్లు

రెడ్ ఫోర్ట్‌ను సందర్శించడానికి సోమవారం తప్ప అన్ని రోజులు తెరిచే ఉంటుంది. ఉదయం తొమ్మి దిన్నరగంటలనుంచి సాయంత్రం నాలుగున్నరగంటలవరకు సందర్శకులు చూడొచ్చు. అక్టోబర్ నుంచి ఫిబ్రవరి వరకు అనుకూలమైన సమయం అని చెప్పొచ్చు. సాయంత్రం ఆరు గంటలనుంచి ఇంగ్లీషు, హింధీభాషల్లో లైట్ అండ్ సౌండ్ షో ఉంటుంది.



పిల్లలూ మనం ఎన్నో పర్యాటక ప్రాంతాలను చూశాం. కానీ ఢిల్లీలోని రెడ్‌ఫోర్ట్ అతి ముఖ్యమైన టూరిస్ట్ డెస్టినేషన్ అని చెప్పొచ్చు. మీరు మొదటిసారిగా ఢిల్లీ వెళ్లినట్లయితే రెడ్ ఫోర్ట్‌ను చూడటం మరవొద్దు. ఈ సారి ఢిల్లీ పర్యటనలో రెడ్‌ఫోర్ట్ పర్యటించే జాబితాలో ఉండేవిధంగా జాగ్రత్తపడండి.

మరెమో ఢిల్లీలో తిరగడానికి అనేక ప్రదేశాలున్నాయి. కానీ రెడ్‌ఫోర్ట మాటేవేరు.

చారిత్రాత్మకం

చారిత్రాత్మకంగా చూస్తే రెడ్‌ఫోర్ట్ గూర్చి చాలా విషయాలు ఉన్నాయి. ఇందులో దీవాన్-ఎ-ఆమ్, దీవాన్-ఎ-ఖాస్, రంగ్ మహల్, ఖాస్ మహల్, హమామ్, నౌభత్‌ఖానా, హీరా మహల్, షాహీ బుర్జ్ యాద్‌గార్ వంటి భవనాలు ఉన్నాయి. దీన్ని నిర్మించడానికి దాదాపు పదేళ్ల సమయం పట్టింది.

రెడ్ ఫోర్ట్ లేదా ఎర్రకోటను 1638 నుంచి 1648 మధ్యలో మొగల్ చక్రవర్తి షా జహాన్ చక్రవర్తి నిర్మించారు. అప్పట్లో దీన్ని ఖిలా - ఎ- ముబారక్ ఉండేది. దీన్ని పూర్తిగా రాతితో నిర్మించారు. మొఘల్ చక్రవర్తి షా జహాన్ అక్బర్ చక్రవర్తి మనవడు. తాజ్ మహల్ కూడా ఆయనే నిర్మించారు. ప్రపంచంలో మొగల్ ఆర్కిటెక్చర్ ప్రసిద్దిగాంచింది.

ప్రఖ్యాతిగాంచింది

మొగల్ రాజధాని ఆగ్రా నుంచి షాజహానాబాద్‌కి మారిన తర్వాత రెడ్ ఫోర్ట్‌ని కట్టారు. రెడ్ సాండ్‌స్టోన్‌తో తయారు చేశారు. కాబట్టే దీనికాపేరు వచ్చింది. దీన్ని నిర్మించడానికి దాదాపు దశాబ్దకాలం పట్టింది. మొగల్ చక్రవర్తి గతంలో నిర్మించిన ఆగ్రాఫోర్ట్ కంటే రెడ్‌ఫోర్ట్‌ని ప్రణాళికాబద్దంగా నిర్మించారు. చివరి మొఘల్ చక్రవర్తి బహదూర్ షా జఫర్ ఇక్కడే పుట్టాడు. ఆయన మరణానంతరం రెడ్ ఫోర్ట్‌ను బ్రిటీషువాళ్లు స్వాధీనం చేసుకున్నారు.

స్వాతంత్ర్యం సిద్దించిన తర్వాత ప్రతి సంవత్సరం ఆగస్టు 15వ తేదీన ప్రధానమంత్రి జాతినుద్దేశించి ప్రసంగించడం ఆనవాయితీగా వస్తుంది.

మీకు తెలుసా?


- షా జహాన్‌కు ఇష్టమైన రంగు తెలుపు, ఎరుపు. అయితే బ్రిటీషువాళ్లు మాత్రం ఆ రంగును మార్చేసి ఎరుపువర్ణంలోకి మార్చారు. బ్రిటీషువాళ్ల నిర్లక్ష్యం మూలంగా తెలుపువర్ణంలో ఉండే రాయి పెచ్చులూడిపోవడం ప్రారంభమైంది.
- మొగల్ సామ్రాజ్య చివరిచక్రవర్తి బహదూర్ షా జఫర్

రెడ్‌ఫోర్ట్‌కి మార్గం

రెడ్‌ఫోర్ట్ చేరుకోవడానికి దగ్గర్లో చాందినీ చౌక్ మెట్రోస్టేషన్ ఉంది. ఒక కిలోమీటర్ దూరంలో రెడ్‌ఫోర్ట్ ఉంటుంది కాబట్టి ఆటోలో వెళ్లిపోవచ్చు.

రంగేద్దామా!

పిల్లల్లారా! సముద్రఅంతర్భాగం ఎప్పుడైనా చూశారా? ఈ అంతర్భాగాన్ని అందమైన రంగులతో ముస్తాబు చేద్దాం రండి. మీరూ ఓ చేయేయండి.



అర సెకనులో ఆహారం



వర్షాలు పడ్డ తర్వాత కప్పలు బెకబెకమంటూ చప్పుడు చేస్తాయి. వర్షాకాలం అంటే కప్పలకు చాలా ఇష్టం. మనం చేతుల ద్వారా ఆహారాన్ని తీసుకుంటాం. ఆహారం తీసుకునే సమయంలో కప్ప నాలుక చేయి మాదిరిగా పనిచేస్తుంది. కీటకాలు ఉన్న ప్రదేశానికి చేరుకున్న కప్ప నాలుక ఒక్కసారిగా వాటిమీదికి చాచుతుంది. అంతే వేగంగా ఆహారం నోట్లోకి వెళ్లిపోతుంది. అంటే అరసెకను కంటే ఎక్కువ సమయం తీసుకోదు. పెద్ద కప్పలు చిట్టెలుకలను కూడా తింటాయి. నాలుక మీద జిగురువంటి పదార్థం ఉండటం వల్ల అవి కీటకాలను పట్టుకోగలుగుతాయి.

కొన్ని కప్పలకు నాలుక ఉండదట. ఇవి నేరుగా నోటిద్వారా కీటకాలను లాగేసుకుంటాయి.

పక పక

గొంగళి కప్పుకుని పడుకున్నాడు



సన్నీ: ఇవ్వాళ ఇంత చలిగా ఉందెందుకు?

సాయిభూషణ్: సూర్యుడి బయటకు రాలేదు కదా

సన్నీ: ఎందుకు రాలేదు?

సాయిభూషణ్: వాళ్ల మమ్మీ బయటకు రానీయలేదు. ఇంత చలిలో బయటకు ఎందుకు వెళతావు అంది. దీంతో గొంగళి కప్పుకుని పడుకున్నాడు.

సురేష్ తన గర్భిణీ భార్యను ఆస్పత్రికి తీసుకెళ్లాడు. ఆపరేషన్ థియేటర్‌లోకి వెళ్లే ముందు నర్సుతో ఇలా అంటాడు

అబ్బాయి పుడితే టమాట అని.. అదే అమ్మాయి పుడితే ఉల్లిగడ్డ అని కోడ్ భాషలో చెప్పాలి అని నర్సుతో అంటాడు



అనుకోకుండా అమ్మాయి అబ్బాయి కవలలు పుడతారు.

నర్సు కన్ఫ్యూజన్‌లో ఆపరేషన్ థియేటర్ నుంచి బయటికొచ్చేసింది. కంగ్రాట్స్ మీకు "సలాడ్" అని అంది

ఇష్టమొచ్చినట్టు ఖర్చు చేస్తా



డుంబు: అరే భయ్యా, కొంచెం ఒక రూపాయి పెట్రోల్ పోయరాదు!

సేల్స్‌మెన్: భయ్యా, ఇంత పెట్రోల్‌తో ఎంత దూరం వెళతావు?

డుంబు: భయ్యా, నేను ఎక్కడికి వెళ్లను. నేనెప్పుడు అంతే డబ్బులను ఇష్టమొచ్చినట్టు ఖర్చు చేస్తా

ఇద్దరి అలవాట్లు ఒకటే



కామేష్ విమానం ఎక్కాడు. ఎయిర్‌హోస్టెస్‌తో ఇలా అన్నాడు

కామేష్: మీ ముఖ కవళికలు నా భార్యతో కలిసాయి

ఎయిర్‌హోస్టెస్ కామేష్ చెంప చెల్లుమనిపించింది

కామేష్: కమాల్ ఉంది ఇది. ఇద్దరి అలవాట్లు కూడా ఒకటే

సిటీ లైఫ్

ఈ బొమ్మలోని చతురస్రాలు, సున్నాలు, త్రిభుజాలను వెతకండి.





చొరవ చూపితే చురకలే...!

సెలబ్రిటీల జీవితాల్లో వృత్తిపరమైన, వ్యక్తిగత జీవితాల మధ్య తేడా స్వల్పం. వెలుగుల ప్రపంచంలో ప్రజల ముందు ఉన్నారు కాబట్టి వాళ్లను తమ సొత్తుగా భావిస్తుంటారు చాలా మంది. తారల జీవితంలోని ప్రతి విషయంలో చొరవగా స్పందిస్తుంటారు. ఇలాంటి సందర్భాల్లో కొన్ని హేయమైనవీ ఉంటున్నాయి. నాయికలు ఎలా ఉండాలో, ఏ దుస్తులు వేసుకోవాలో, ఎక్కడ ఎలా మాట్లాడాలో అంతా తామే నిర్ణ యిస్తామన్నట్లుగా ఉంటోంది కొందరు ప్రేక్షకుల ధోరణి. సామాజిక మాధ్యమాలలో తారల ఖాతాల్లో అభ్యంతరకర వ్యాఖ్యలు పోస్టులు చేస్తున్నారు. గతంలో తన దుస్తుల విషయంలో సమంత, తాప్సీ ధీటుగా సమాధానం ఇస్తే.....తాజాగా రకుల్ ప్రీత్ సింగ్ ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది.


రకుల్ ప్రీత్ సింగ్

చిత్రరంగంలోని తారల విషయంలో. సామాజిక మాధ్యమాలు వచ్చేశాక....దాపరికం అనే సందర్భాలు అరుదయ్యాయి. ఒక విషయాన్ని కోట్లాది మందితో పంచుకునే సామాజిక మాధ్యమాల్లో....ఇది నా వ్యక్తిగతం అనేందుకు అవకాశమే ఉండదు. అందులో నటీనటులకు అసలుండదు. తమను ఆదరిస్తున్న వాళ్లతో విషయాలు పంచుకోవాలని ఆరాటపడుతున్నారు తారలు. ఈ సందర్భాల్లో పొగిడే వాళ్లతో పాటు విమర్శలు చేసే వాళ్లూ పెరుగుతున్నారు.

తీరిక లేని నేటి జీవితాల్లో వ్యక్తిగతంగా కలిసేది కొందరినే. సామాజిక మాధ్యమాలు ఎక్కడెక్కడో ఉన్న మిత్రులందరినీ కలిపేస్తున్నాయి. మనకు నచ్చిన తారలతోనూ కలిసుండేలా చేస్తున్నాయి. ట్విట్టర్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ అనేవి నేటి ప్రముఖుల జీవితాల్లో భాగమయ్యాయి. ఒక నాయిక తన ఫొటో పెట్టగానే ఎక్కువమంది ప్రశంసిస్తారు. కొందరు విమర్శిస్తారు. ఆ విమర్శల్లో వేసుకున్న దుస్తుల నుంచి, శరీరాకృతి, హావభావాలు లాంటి అంశాలన్నీ వస్తుంటాయి. మా జీవితంలో విమర్శలు భాగమే అని తేలిగ్గా తీసుకునేవాళ్లున్నారు. తిరిగి ఘాటుగా విమర్శించేవాళ్లున్నారు.

సమంత నాగచైతన్యను పెళ్లి చేసుకున్నాక...నాయికగా తన నట జీవితాన్ని కొనసాగిస్తోంది. గతంలో సాగరతీరంలో సేదతీరుతూ ఓ ఛాయా చిత్రాన్ని సామాజిక మాధ్యమాల్లో పెట్టుకుంది. ఈ ఫొటో చూసిన చాలా మంది నీకు పెళ్లయిందని మర్చిపోయావా...ఇలాంటి ఫొటోలు పెడితే మా అభిమానుల మనసు నొచ్చుకోదా...అంటూ విమర్శించారు. దానికి సమంత ధీటైన సమాధానమిచ్చింది. మీరు మీ జీవితం చూసుకోండి...నా జీవితం ఎలా ఉండాలో చెప్పే హక్కు మీకు లేదు. ఒక ధీరత్వం గల మహిళ తనకు నచ్చినట్లు ప్రవర్తిస్తుంది. అంటూ పోస్టు చేసింది.

తాజాగా రకుల్ ప్రీత్ సింగ్ వేసుకున్న దుస్తులు పొట్టిగా ఉన్నాయంటూ కొందరు సామాజిక మాధ్యమాలలో ఆమెను విమర్శించారు. రకుల్ ప్రతిగా స్పందిస్తూ...మీ అమ్మ నేర్పిన సంస్కారం ఇదేనా. కొన్ని మంచి విషయాలు కూడా నేర్పించమని అడుగు. మీలాంటి వాళ్లతో ఆడవాళ్లకు రక్షణే లేకుండా పోతోంది. సామాజిక మాధ్యమాలలో కూడా మా స్వేచ్ఛకు అడ్డుపడుతున్నారు. ఓ మహిళను కించపరిచేలా మాట్లాడినందుకు అతనికి బుద్ధి చెప్పాలి. మీకో కుటుంబం ఉంటుందని తెలుసుకోండి. మీ ఇంట్లో వాళ్లను ఇలాగే కించపరిస్తే ఊరుకుంటారా. అని నిలదీసింది.

బాలీవుడ్ తారలు సోనమ్ కపూర్ సామాజిక మాధ్యమాలలో విమర్శించే వారిపై ఆగ్రహిస్తూ...మమ్మల్ని విమర్శించే వాళ్లు ఒక్క విషయం గుర్తుంచుకోవాలి. ఏ నటి తెరపై కనిపించినట్లు బయట ఉండదు. మాకో వ్యక్తిగత జీవితం ఉంటుంది.అని చెప్పింది.

సోనాక్షి మాటల్లో...విమర్శించేవాళ్లకు సరైన కారణమంటూ ఏదీ ఉండదు. విమర్శించాలి అనుకుంటారు అంతే. విమర్శకులు అన్నంత మాత్రాన మా శరీరాన్ని వాళ్లకు నచ్చినట్లు మార్చుకుంటూ వెళ్లలేం కదా. ఈ మార్పుల్లో వల్ల ఆరోగ్య సమస్యలు వస్తే ఇబ్బంది ఎవరికి...అంటూ నిలదీసింది. పరిణీతి చోప్రా గతంలో విమర్శిస్తూ..నా జీవితం నాకు నచ్చినట్లు ఉందా లేదా చూసుకుంటాను. నాకు అసౌకర్యంగా ఉంటే మార్చుకుంటా లేకుంటే లేదు. విమర్శలను మనసు దాకా రానీయను. అని విమర్శలు తిప్పి కొట్టింది.

మరో నాయిక తాప్సీ మాట్లాడుతూ...సామాజిక మాధ్యమాలు వచ్చాక ఎవరి జీవితాల్లోకైనా వెళ్లడం సులువైంది. మేము అమ్మాయిలం కాబట్టి ఇలాగే ఉండాలని చెప్పడం సరికాదు. కొందరు చేస్తున్న వ్యాఖ్యలు చూస్తుంటే మాలో ఆత్మవిశ్వాసం పూర్తిగా సన్నగిల్లుతుంటుంది. అసలు సినిమాల్లోకి ఎందుకు వచ్చామా అనిపిస్తుంటుంది. ఇలాంటి చర్యలు అమానవీయమైనవి. అంది.

తనకు క్రికెటర్ జస్‌ప్రీత్ బూమ్రాకు మధ్య వచ్చిన ప్రేమాయణం వార్తలను కొట్టి పారేసింది రాశీ ఖన్నా. ఈ నాయిక స్పందిస్తూ...అతనొక క్రికెటర్‌గా మాత్రమే నాకు తెలుసు. మా మధ్య ఎలాంటి అనుబంధం లేదు. ఎలాంటి ఆధారం లేకుండా ఒక అమ్మాయి గురించి ఇలా సామాజిక మాధ్యమాలలో వ్యాఖ్యలు చేయడం బాధాకరం. అని చెప్పింది.


తాప్సీ


సమంత


రాశీ ఖన్నా


సోనాక్షి


పరిణీతి చోప్రా


సోనమ్ కపూర్

ఫిబ్రవరి 14న మహానాయకుడు?


బాలకృష్ణ

ఎన్.టి.ఆర్. మహానాయకుడు చిత్రం విడుదల వారం రోజులు వెనక్కి జరిగినట్లు తెలిసింది. ఎన్.టి.రామారావు జీవిత చరిత్ర ఆధారంగా ఆయన తనయుడు బాలకృష్ణ టైటిల్ పాత్ర పోషిస్తూ,,,క్రిష్ దర్శకత్వంలో నిర్మిస్తున్న రెండు భాగాలలో మొదటిభాగం ఎన్.టి.ఆర్. కథానాయకుడు ఇటీవల విడుదలైన సంగతి తెలిసిందే. కాగా ఎన్.టి.ఆర్. రాజకీయ జీవితానికి సంబంధించిన అంశాలతో తెరకెక్కిస్తున్న రెండో భాగం మహానాయకుడు చిత్రాన్ని ఫిబ్రవరి 7న విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. అయితే ఇప్పటివరకు మొదటిభాగం ప్రమోషన్‌కే సమయం సరిపోయింది. అదీకాకుండా రెండోభాగం షూటింగ్ పదిరోజుల పాటు మిగిలివుండటం తదితర కారణాలతో ఫిబ్రవరి 14న మహానాయకుడు చిత్రాన్ని విడుదల చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఎన్.టి.ఆర్. రాజకీయకోణంలో రెండోభాగం రూపుదిద్దుకోవడంతో దానిపై ప్రేక్షకాభిమానులు ఎన్నో అంచనాలతో ఉన్నారు.

మరణం లేని జననం

తెలుగు ప్రజల ఆరాధ్య నాయకుడిగా తన తండ్రి ఎన్.టి.రామారావుకు ఓ ప్రత్యేక గుర్తింపు ఉందని ప్రముఖ నటుడు బాలకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం ఎన్.టి.ఆర్. వర్ధంతి సందర్భంగా బాలకృష్ణ స్పందిస్తూ వెల్లడించిన అభిప్రాయాలను ఎన్.బి.కె. నిర్మాణసంస్థ సోషల్‌మీడియాలో పోస్ట్ చేసింది...సమాజమే దేవాలయం...ప్రజలే దేవుళ్ళు అంటూ నినదించిన మీరే నాకు దైవం. గురువు, స్ఫూర్తి. ప్రతీ జన్మలోను మీ బిడ్డగానే పుట్టాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నా అని అన్నారు. ఇంకొందరు సినీ ప్రముఖులు కూడా ఎన్.టి.ఆర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయనను జ్ఞాపకం చేసుకున్నారు. మహానాయకుడికి మహానివాళి అంటూ దర్శకుడు హరీష్‌శంకర్ ట్వీట్ చేయగా...మరణం లేని జననం...జోహార్ ఎన్.టి.ఆర్. అంటూ వైజయంతీ మూవీస్ సంస్థ పేర్కొంది.


కంగనారనౌత్

నేను మీలాగే ప్రవర్తించాల్సి ఉంటుంది

ఆందోళనకారులకు కంగన హెచ్చరిక

మణికర్ణిక చిత్రం చుట్టూ వివాదం అలుముకుంటోంది. బాలీవుడ్ నటి కంగనారనౌత్ టైటిల్ పాత్రలో తెరకెక్కిన ఈ చారిత్రక చిత్రం ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. క్రిష్, కంగనారనౌత్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం భారీ బడ్జెట్‌తో రూపుదిద్దుకుంది. చిత్రీకరణలో గాయాలు అయినప్పటికీ వాటిని లెక్కచేయకుండా కంగనా ఎంతో ఆత్మస్థైర్యంతో ఈ చిత్రాన్ని పూర్తిచేశారు. అయితే అన్నీ ఒక కొలిక్కి వచ్చాయని ఊపిరి పీల్చుకుంటున్న సమయంలో ఆందోళనకారుల నుంచి మరోసారి వ్యతిరేకత వ్యక్తమౌతోంది. గతంలో పద్మావత్ చిత్రం విషయంలో కూడా వివాదం ఏర్పడింది. అయితే సుప్రీంకోర్టు జోక్యంతో విడుదలకు మార్గం సుగమమై...ఆ చిత్రం విజయం సాధించింది. మణికర్ణిక విషయంలో కూడా ఎప్పట్నుంచో మహారాష్ట్రకు చెందిన కర్ణిసేన కార్యకర్తలు చిత్రాన్ని ఆపేయమంటూ ఆందోళన చేస్తున్నారు. ఈ చిత్రంలో లక్ష్మీబాయి ఓ బ్రిటీష్ వ్యక్తితో ప్రేమలో పడినట్లు చూపించడమే తన ఆందోళనకు కారణమని...ఆ సన్నివేశాలను వెంటనే తొలగించకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి ఉంటుంది అని కర్ణిసేన హెచ్చరిస్తోంది. ఈ క్రమంలో ఈ చిత్రం విడుదల తేదీకి కౌంట్‌డౌన్ మొదలుకావడంతో కర్ణిసేన ఆందోళన మరింత ఉధృతమైంది. ఈ నేపథ్యంలో దీనిపై కంగనా స్పందిస్తూ...ఈ సినిమాకు నలుగురు చరిత్రకారులు ఆమోదం తెలిపారు. మరోవైపు సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ లభించింది. ఈ విషయాలను పరిగణలోనికి తీసుకుని కర్ణిసేన కార్యకర్తలు తమ ఆందోళనను విరమించకపోతే నేను కూడా మీలాగే ప్రవర్తించాల్సి ఉంటుంది. నేను రాజ్‌పుట్‌ను...నాశనం చేయడానికైనా సిద్ధమే అంటూ హెచ్చరించారు.

అమ్మాయిల ఫాస్ట్ కల్చర్‌తో కె.ఎస్.100

సమీర్‌ఖాన్, శైలజ, సునీత పాండే, ఆశిరాయ్, శ్రద్ధ, అక్షత ప్రధాన పాత్రలలో తెరకెక్కుతున్న చిత్రం కె.ఎస్.100. షేర్ దర్శకత్వంలో చంద్రశేఖర్ మూవీస్ పతాకంపై కె.వెంకట్‌రామ్‌రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం ట్రైలర్ హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో విడుదలైంది. అతిథులుగా విచ్చేసిన సాయివెంకట్, మల్టీడైమన్షన్ వాసు, అట్లూరి రామకృష్ణలు ట్రైలర్‌ను ఆవిష్కరించారు చిత్ర నిర్మాత వెంకట్‌రామ్‌రెడ్డి మాట్లాడుతూ, మంచి హారర్ థ్రిల్లర్ రొమాంటిక్ చిత్రమిది. సినిమా అందరికీ నచ్చి తీరుతుందని ఆశిస్తున్నాం అని అన్నారు. దర్శకుడు షేర్ మాట్లాడుతూ, ఈ కథకు సరిపోయే నలుగురు అమ్మాయిల కోసం ఎంతో అన్వేషించి మరీ ఎంపికచేశాం. ఎవరివీ పాత్రలు కాదు. అందరూ హీరోయిన్లే. వీరి నటన చాలా హైలైట్‌గా ఉంటుంది. హీరో సమీర్‌ఖాన్ పరిణతి చెందిన నటుడిగా నటించారు. ఈ చిత్రం కథ విషయానికి వస్తే...ఈ తరం అమ్మాయిలు ఏ విధంగా ఫాస్ట్ కల్చర్‌ను అలవరచుకున్నారు అనే అంశాన్ని తెరకెక్కించాం. కె.ఎస్. అంటే హీరో పాత్ర పేరు కుమార్ స్వామి. ఇక 100 అంటే వాళ్ల వందరోజుల స్నేహమే. సందేశం కూడా ఉంటుంది. సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందించడం వల్ల ప్రేక్షకులు థియేటర్ నుంచి బయటకు పోకుండా మరీ చూస్తారు అని అన్నారు. సాయివెంకట్ మాట్లాడుతూ, షేర్‌కు సినిమా తీయడమే కాకుండా ఎలా ప్రమోట్ చేయాలో బాగా తెలిసిన వ్యక్తి. హీరోగా పరిచయమై దర్శకుడిగా కూడా మంచి ప్రతిభను కనబరుస్తున్నారు అని అన్నారు. హీరో సమీర్‌ఖాన్ మాట్లాడుతూ, నటుడు కావాలనే నా కల ఈ చిత్రంతో నెరవేరిందని అన్నారు. నిరూపించుకునే పాత్ర నాకు లభించడం మరింత ఆనందంగా ఉందన్నారు. నలుగురు హీరోయిన్లతో పాటు పలువురు చిత్రబృందం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



సుమన్‌కు శోభన్‌బాబు పురస్కారం...



అలనాటి అందాల నటుడు శోభన్ బాబు పురస్కారాన్ని నటుడు సుమన్ అందుకోనున్నారు. శోభన్ బాబు 83వ జయంతి ఉత్సవాలను తెలంగాణ శోభన్‌బాబు సేవా సమితి ఈ నెల 20న హైదరాబాద్ రవీంద్ర భారతిలో నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా సుమన్‌కు రజత కిరీటాన్ని అలంకరించనున్నారు. నటి గీతాంజలికి శోభన్ బాబు ఆత్మీయ పురస్కారం అందిస్తారు. నటి జయసుధ ఈ ఉత్సవాలను ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో మా అధ్యక్షుడు శివాజీ రాజా, దర్శకుడు రేలంగి నరసింహారావు, నటి కవిత తదితరులు పాల్గొంటారు. ఈ ఉత్సవాల్లో ఎవరీ చక్కనివాడు పేరుతో శోభన్‌బాబు సంగీత విభావరి జరగనుంది.